# జీవించే కళ ఎలా ? (ఉపోద్ఘాతము)

జీవించే కళ ఎలా? అనే ఈ విలువైన మాటలు కలిగిన పుస్తకమును మీ ముందుకు తీసుకొని వచ్చుటలో ఒక బలమైన కారణముంది! ఏదైనా ఒక బృహత్తరమైన ప్రణాళిక రచించాలంటే దానికి ముందు ఏదో ఒక కార్యక్రమము దానికి స్ఫూర్తినివ్వాలి! ఉదాహరణకు: అన్యాయముపై పోరాడాలి అంటే, ముందుగా ఆ అన్యాయము ఎక్కడో ఒక చోట జరిగి ఉండాలి. శత్రువుతో యుద్ధం చేయాలి అంటే, ముందుగా ఆ శత్రువు చెడు కార్యక్రమాలు చేసి ఉండాలి. ఆకలితో ఉన్న వారికి ఆహారమును పెట్టాలి అంటే, ముందుగా వారు ఆకలితో బాధపడడాన్ని మనము చూచి ఉండాలి. యేసుక్రీస్తు ప్రభువు చెప్పినట్టుగా, రోగము కలిగినవారికే గాని, ఆరోగ్యము కలిగినవారికి వైద్యుడక్కరలేదు కదా! **(మత్తయి సువార్త 9 : 12, మార్కు సువార్త 2 : 17, లూకా సువార్త 5 : 31)**. 2016వ సంవత్సరం జూన్ నెలలో మొదటి ఐదు రోజులపాటు నేను జరిగించిన **'జీవించే కళ ఎలా?'** అను దేవుని సాంస్కృతిక సభలకును, ఆ తరువాత రచిస్తున్న ఈ పుస్తకమునకును స్ఫూర్తినిచ్చిన ముఖ్యకారణములలో మొదటిది మనుష్యులకు జీవించే కళ ఎలాగో తెలియకపోవడం, మరియు రెండవది జీవించే కళ ఎలాగో తెలుసనే భ్రమలో, సంగతులను పైపైన మాత్రమే చూచి, ప్రేత కళలో జీవిస్తూ, అందరికీ దానినే జీవించే కళ అని ప్రకటిస్తూ, మోసగిస్తున్న వారు ఈ సమాజములో ఉండటం!

2016వ సంవత్సరం మార్చ్ నెలలో, భారతదేశానికి ముఖ్య పట్టణమైన ఢిల్లీలో యమునా నది తీరమున జరిగిన ఒక సాంస్కృతిక సభను గూర్చి మీరు వినుండాలి. అప్పట్లో జాతీయ మరియు అంతర్జాతీయ వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా దీనిని గూర్చి ప్రచురించి, ప్రజలకు ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారముగా కూడా చూపింది. దీనిని గూర్చి అప్పట్లో చాలామంది మాట్లాడుకున్నారు. ఆ సాంస్కృతిక సభకు అనేక దేశాల నుండి లక్షల మంది ప్రముఖులను భారతదేశానికి ఆహ్వానించి, ఆ వేదికపై కూర్చోబెట్టారు. ఈ సభ మూడురోజుల పాటు అనగా, 11/03/2016 శుక్రవారముతో ప్రారంభమై, 13/03/2016 ఆదివారము వరకు నిర్వహించబడింది. దీనిని గూర్చి నేను ఎందుకు ప్రస్తావించాను? దీనికి - నాకు సంబంధం ఏమిటి? అని ఒకవేళ మీకు సందేహం కలుగవచ్చు. భూమి మీద మనుష్యుల మధ్యలో జరుగుతున్నటువంటి దేనిని గూర్చైనా ఒక మనిషిగా, క్రైస్తవునిగా, దేవుని జ్ఞానము తెలిసినవానిగా నేను మాట్లాడగలను. ఎందుకంటే అదేమీ సామాన్యమైన ఒక చిన్న కార్యక్రమమేమీ కాదు. దాని వెనుక ఎంతో కష్టం ఉంది. దాని వెనుక ఎన్నో గొడవలు జరిగాయి. అలాగే, ఈ సభలో పాల్గొంటున్నవారు వందమందో, వెయ్యిమందో కాదు. లక్షలమంది ప్రముఖులు మరియు లోక సంబంధమైన కళాకారులు. ఆనాడు యావత్తు ప్రపంచం దానిని గూర్చి ఆశక్తిగా మాట్లాడింది అంటే, ఖచ్చితంగా దానిని గూర్చి దేవుడు ఏమి చెప్పాడో నేను తెలియజేయాలి. ఆ కార్యక్రమము వలన ఈ మానవ సమాజానికి మేలు జరిగిందో లేక కీడు జరిగిందో దైవ జ్ఞానమును బట్టి నేను చెప్పాలి. ఒకవేళ దాని వలన మేలు జరిగితే అది అందరికీ మంచిదే! అది లోక కళ్యాణమే. కానీ, కీడు జరిగితే మాత్రం దానికి నేను ఈ రచన ద్వారా తరతరాలలోని మనుష్యులందరికీ వైద్యం చేయాలి. ఇంతకీ, ఆనాడు ఆ సభలు నిర్వహించినది ఎవరంటే, 'శ్రీశ్రీ రవిశంకర్' అనే వ్యక్తి! బెంగళూరులో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అనే ఒక సంస్థను దాదాపు 35 సం॥ల క్రితం అనగా, సుమారు 1981 సం॥లో ఇతడు ప్రారంభించాడు. ఈయన తమిళనాడులో 1956వ సం॥ మే 13న జన్మించాడు. నాటి భారతదేశ ప్రధానమంత్రి అయిన 'నరేంద్ర మోడీ', అలాగే వివిధ శాఖల మంత్రులు, వివిధ దేశాల ప్రతినిధులు అతని కార్యక్రమాన్ని గూర్చి మాట్లాడుతూ, రవిశంకర్ ఈ కార్యక్రమాన్ని బ్రహ్మాండమైనటువంటి రీతిలో నిర్వహించాడని, ఇది చాలా గొప్ప సంగతని, ఇది భారతదేశానికే గర్వకారణమని తమ తమ ప్రకటనలలో అతనిని గూర్చి గొప్ప గొప్ప వ్యాఖ్యలు చేసారు. ఈయనను పొగడ్తలతో ముంచెత్తారు. ఈయన ఒక మంచి సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించాడని, ప్రపంచ దేశాల సంస్కృతులన్నింటిని ఒకే వేదికపై కలుపుతున్నాడని ఆ మూడు రోజుల సభలను తిలకించినవారు దానిని గూర్చి చాలా గొప్పగా మాట్లాడారు. అయితే ఇందులో నిజమెంతో దేవుడే చెప్పాలి. మనిషి మాట గడ్డి పరక వంటిది. దేవుని మాట నిత్యమూ నిలిచేది!

అందుకే, ఇంతకీ ఈ వ్యక్తి ఎవరు? ఈ వ్యక్తి చేస్తున్నది ఏమిటి? ఈ వ్యక్తి తన కార్యక్రమము ద్వారా ప్రపంచానికి చెప్పాలనుకున్నది ఏమిటి? అనే దానిని 'బైబిల్' అనే దైవ గ్రంథమును బట్టి మిమ్మును ఆలోచింపచేస్తాను. ఎందుకంటే, ప్రపంచమంతా అతనివైపు చూస్తున్నప్పుడు, అతడు నిర్వహించిన సభలవైపు పరుగులు తీస్తున్నప్పుడు అతని కార్యక్రమమును దేవుని జ్ఞానమును బట్టి పరిశీలన చేయాలి. ఒకవేళ అతడు చేస్తున్నది దేవుడు ఆమోదించినట్టయితే అందరూ దానితో ఏకీభవించాలి, దాని వెంబడి అందరూ వెళ్లాలి. పత్రికలలో ఆయనను గూర్చి వ్రాసిన దానిని బట్టి, ఎలక్ట్రానిక్ మీడియాలో చూపినదానిని బట్టి ఆలోచిస్తే, ఆయన సభలో ముఖ్యమైనటువంటి వాటిని కొన్నింటిని ప్రస్తావించారు. మూడురోజులుగా జరిగినటువంటి ఆ సభలలో ముఖ్యంగా కనిపించినవి ఏమిటంటే, 'యోగా', 'ధ్యానం', 'సంప్రదాయ నృత్యాలు', 'గీతాలాపన' వంటివి కనిపిస్తున్నాయి. భరతనాట్యం, కథకళి, కూచిపూడి వంటివన్నీ దర్శనమిస్తున్నాయి. అంటే రవిశంకర్ గారు నిర్వహించినటువంటి సభలలో మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన వారందరూ చేస్తున్నది ఏమిటంటే, యోగా, ధ్యానం, నాట్యం మరియు గీతాలాపనే అన్నమాట! రవిశంకర్ గారు ఆ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ఇవి మాత్రమే చూపిస్తున్నారు. దీనికి రవిశంకర్ గారు పెట్టిన పేరు ఏమిటంటే, 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంటే, తెలుగులో జీవించే కళ అని అర్థం. అంటే, మనిషి జీవించడానికి ఒక కళ ఉంటుంది. ఆ కళకు అనుగుణంగానే మనిషి జీవించాలి. అదే ఆర్ట్ ఆఫ్ లివింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం. 2016వ సం॥ మార్చ్ నెలలో ప్రపంచ దేశాలలో ఉన్న ప్రముఖులందరూ ఇండియాకు ఫ్లైట్ టికెట్ కొనుక్కుని ఢిల్లీలో కాలు మోపడానికి కారణం ఏమిటంటే, ఈ రవిశంకర్ గారు మాకు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అంటే ఎలాగో చెబుతాడనే ఆశ! ఎందుకంటే, ఈరోజు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రపంచ ప్రజల మధ్య కరువైనది' అనేది వారందరి భావన. రచయితగా నేను కూడా దానితో ఏకీభవిస్తాను. నిజంగా, మనుష్యులలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కొరవడింది. ఎలా జీవించాలో ఏ మనిషికీ సరిగ్గా తెలియదు. ఉదాహరణకు, అప్పుడప్పుడు నేను అలా ఊరి వీధులలో పనిమీద వెళుతున్నప్పుడు బస్టాండ్‌లో మార్కెట్‌లో కొంతమంది మద్యపానము చేసిన వ్యక్తులు తమకు మత్తెక్కి అలాగే రోడ్డు ప్రక్కన చిందరవందరైన బట్టలతో పడిపోవడం చూస్తున్నాను. అంటే, వారికి 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' తెలియదు. అవును, జీవించే కళ తెలియక పోవడం వల్లనే వారి దుస్థితి ఆ విధంగా ఉంది. చక్కగా జీవించవలసిన వ్యక్తి, రోడ్డు మీద దొరలడమా? ఇదేనా జీవించే కళ? నిజానికి ఒక పంది రోడ్డు మీద దొర్లుతుంది. అలా దొర్లడం పంది యొక్క జీవించే కళ. పందికి కూడా ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది. కుక్కకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది, గేదెకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది, చెట్లకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది, పక్షికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది. ఈ ప్రకృతిలో సకల జీవులకూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంటుంది. ఈ జీవులలో ఏ జీవీ, తమయొక్క జీవించే కళను ఇప్పటి వరకు ఏనాడూ అతిక్రమించలేదు. చేపలు నీటిలో ఈదాలి, నీటిలో దొరికే ఆహారాన్ని భుజించాలి. వల వేసినప్పుడు ఆ వలలో పడాలి, తద్వారా మనిషికి ఆహారంగా మారాలి. చేపలకు నిర్ణయింపబడిన జీవించే కళ అదే. అయితే, మనిషెందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడు? రోడ్డు మీద దొర్లేవాడు ఒకానొక ఉదాహరణ మాత్రమే. ఇంకా ఎన్నో పరిస్థితులలో ఎందరో మనుష్యులు తమ బ్రతుకు పరమార్థం తెలియక ఈ జీవిత చక్రంలో జీవించే కళను కోల్పోయి జీవిస్తున్నారు. అందుకే, బైబిల్‌లో దేవుడు మనిషికి తెలియవలసిన చక్కని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్రాయించాడు. దానిని ఈ పుస్తకములో ఆద్యంతం నేను వివరించడం జరిగింది.

ప్రియులారా! ప్రకృతిలో ఉన్న ప్రతి జీవియు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను కలిగియుంది. ఏదియు దానిని అతిక్రమించుట లేదు. పక్షి అక్రమానికి పాల్పడటం లేదు. జంతువు అక్రమానికి పాల్పడటం లేదు. పురుగు అక్రమానికి పాల్పడటం లేదు. కానీ, మనిషికి మాత్రమే ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలియక, అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఒకడు పదునైన కత్తిని తయారు చేసుకొంటున్నాడు. ఆ కత్తితో వెళ్లి తాను పగ పట్టిన మరొక వ్యక్తిని నరికి చంపుతున్నాడు. ఒకడు తన దేహాన్ని ఒకసారి పైనుండి క్రింది వరకు చూసుకుంటున్నాడు. ఆ దేహముయొక్క కోరికలను తీర్చుకోవడానికి పోయి వ్యభిచారం చేస్తున్నాడు, ఆగలేక అబలలపై అత్యాచారం చేస్తున్నాడు. ఒకడు రంగు నోటును చూస్తున్నాడు. ఆ ధనమును ఎలా సంపాదించాలి? తాను దానిని ఆస్తిగా పోగు ఎలా చేసుకోవాలి? అనుకుంటున్నాడు. మరొకడు తన చుట్టూ ఉన్న భూమిని చూస్తున్నాడు. ఆ భూమిని స్వంతం చేసుకోవాలనే పిచ్చితో వాడికి ఉన్నదంతా ఖర్చు చేసి

భూమిని సంపాదించుకుంటున్నాడు. ఒకడికి షేర్ మార్కెట్ పిచ్చి; మరొకడికి బంగారం పిచ్చి ఉంటుంది. ఇలాంటి వారికి ఈ లోకంలో ఇక ఏమీ కనిపించదు. ఒకడికి తిండి పిచ్చి, మరొకడికి బట్టల పిచ్చి! వాడి ఇంటి నిండా బట్టలే, బీరువాల నిండా గుట్టలు గుట్టలుగా బట్టలే ఉంటాయి. ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ఫ్యాషన్ బట్టలు వేసుకోవటమే తన జీవితమనుకుంటాడు. క్రొత్త బట్ట మార్కెట్‌లోనికి రాగానే దానిని కొనుక్కొని, ధరించుకోవడమే జీవించే కళ అనుకొంటున్నాడు. మరొకడు క్రొత్తగా బైక్ కొనుక్కుంటాడు. ఆ బైక్‌తో తన ఇష్టానుసారముగా చక్కర్లు కొడతాడు. బైక్ తయారు చేసింది చక్కర్లు కొట్టడానికి కాదుగా! ప్రయాణము ఉంటే దానిని పూర్తి చేసుకోవడానికే కదా. వారు ఎందుకు వాహనమును నడుపుతున్నారో చాలా మందికి తెలియదు. ఇలాంటి వారికి జీవించే కళ తెలియదన్నమాట. జీవించే కళ దేనికీ అతీతం కాదు. అది ప్రతి దానిలోనికి వెళ్ళిపోతుంది. ద్విచక్ర వాహనమును నడుపుతున్నప్పుడు హెల్‌మెట్ పెట్టుకుంటే అది జీవించే కళ, నా ఫ్యాషన్ నాది, నా యిష్టం నాది, పెట్టుకోనంటే అది ప్రేత కళ. జీవించే కళ కలిగి లేకపోతే అది మనిషిని ఎక్కడికి తీసుకువెళుతుంది? సరాసరి శ్మశానానికే సుమా! ఈరోజు చాలా మంది మనుష్యులకు జీవించే కళ తెలియదు. అలాగని దురదృష్టవసాత్తు, ఈ జీవించే కళను ప్రతి ఒక్కరికీ వివరించి చెప్పే అవకాశం, దానిని సరిగ్గా చెప్పే నాలాంటి వారికి ఇంకా దొరకలేదు. జీవించే కళను ఈ లోకానికి తెలియజెప్పే అవకాశం, ప్రపంచ వేదిక మీద దీనిని గూర్చి మాట్లాడే అవకాశం, ఇంకా నాలాంటి వారికి దక్కలేదు. ఏనాటికైనా దక్కుతుందనే ఆశ మాత్రం ఉంది. నేను మరణించకముందు, ఏరోజుకైనా నేను దానిని దక్కించుకోవాలి. అదే నా బ్రతుకు పరమార్థం! కానీ, నాకంటే ముందు రవిశంకర్ అనే ఒక వ్యక్తికి అలాంటి అవకాశం వచ్చింది. కానీ అతడు మనిషికి జీవించే కళను సరిగ్గా చెప్పలేనివాడు. ఎవరూ లేరనుకుని ఈరోజు అతడే జీవించే కళను చెబుతాడు అనుకుంటున్నారందరూ. ఇతనిని గూర్చి ఆనాటి ప్రధానమంత్రి వ్యాఖ్యలు చూస్తే అలాగే ఉన్నాయి. గత 35 యేళ్ళుగా ఈ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ చెబుతున్నాడు. చెప్పాలనుకోవడం మంచిదే! కానీ ఇన్నేళ్ళుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ చెబుతున్నటువంటి ఇతడు, ఈ ప్రపంచాన్ని ఎంతవరకూ ఉద్ధరించాడు? ప్రపంచంలో ఉన్న మనుష్యులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలా చెప్పాడు? ఎలా ఉండాలని మనుష్యులకు నేర్పించాడు? అసలు ఈ రవిశంకర్ గారికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనేటువంటి కార్యక్రమం తలపెట్టాలనేటువంటి ఆలోచన, ఆ బీజం ఎక్కడ పడిందో తెలుసా? ఈయన భారతదేశంలో తమిళనాడు రాష్ట్రంలో పుట్టాడు. ఆ తరువాత బెంగళూరు వెళ్ళి అక్కడే ఒక కళాశాలలో చదివాడు. ఆ కళాశాల పేరు ''సెయింట్ జోసఫ్ కాలేజ్''. అది బెంగుళూరులో ఒక క్రిస్టియన్ మిషనరీ కాలేజ్. అందులో చదివి ఆయన పట్టా పుచ్చుకున్నాడు. అంటే, ఒక క్రైస్తవ కళాశాలలో అతడు చదివినప్పుడు ఖచ్చితంగా బైబిల్ యొక్క మూలాలు సదరు వ్యక్తికి అందుబాటులోనికి వస్తాయి. దానినిబట్టి అతడు ప్రపంచ శాంతిని కోరుకుంటున్నట్టుగా కనిపిస్తుంది. ప్రపంచంలో జీవిస్తున్న వారంతా ఆనందంగా ఉండాలని అతడు కోరుకుంటున్నాడు. దీనిని బట్టి అతడు అందరికీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ నేర్పించాలని కోరుకుంటున్నాడు. అంటే, ఏదో ఒక మూల ఇతడు బైబిల్‌ను చూసాడు, చదివాడు, విన్నాడు. దానిని బట్టి ఇతనికి ఈ బీజం పడింది. కానీ, బైబిల్‌లో ఉన్న దానిని బట్టి కాక, ఈయన తాను నమ్మిన సిద్ధాంతాల ద్వారా మాత్రమే ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రపంచానికి నేర్పించాలనుకొన్నాడు. అందుకే ఆ సిద్ధాంతాలలో ఒకటి యోగా; ఆ సిద్ధాంతాలలో ఒకటి ధ్యానం; ఆ సిద్ధాంతాలలో ఒకటి నాట్యం; మరియు సంగీతాలాపన. వీటిని బట్టి మనిషికి జీవించే కళను నేర్పగలమా? అది ఎన్నటికీ జరగని పని! అందుకే నేటికీ జరగలేదు. ఈయనలా కాకుండా, నేను దేవుని మహా జ్ఞానముతో ఈ దేశానికి, దేశాన్ని బట్టి ప్రపంచానికి అసలైన జీవించే కళను నేర్పించగలగాలి. సత్య స్థాపన కొరకు నావంతు కృషిని నేను చేయాలి. ఇప్పటికే నేను దానిని ప్రారంభించాను. నేను చేసేటటువంటి కార్యక్రమాలు ఇప్పటికి చిన్నవి, పరిమితి కలిగినవి అయినా ఒకానొక రోజున ఈ ప్రపంచం వాటిని తెలుసుకుంటుంది. మనిషిని బ్రతికించడానికి, జీవించే కళను నేర్పిండానికి నా జీవితమంతా నేను కష్టపడాలి. అసత్యం ప్రపంచానికి అంతగా చేరువవుతుంటే, సత్యమును ఎప్పటికైనా చేరువ చేయాలి. ఎల్లప్పుడూ నూతనముగా ఆలోచించి అంతమందిలో కొందరినైనా బ్రతికించాలి. అందుకే, ఆ మహా దేవుని కృపనుబట్టి, నేను నిర్ణయించే అంశములు కూడా చాలా క్రొత్తగా ఉంటాయి. యేసుక్రీస్తు అనే పేరు వినగానే, అమ్మో! ఇదొక విదేశీ మతం, పరాయి మతం అని భ్రమపడి దూరంగా పరుగులుతీసే, ద్వేషించే ఈ నర సమాజానికి జీవించే కళను ఎలాగైనా నేర్పించాలి. అందుకే ఆ యేసుక్రీస్తే స్వయంగా

యేమన్నాడో తెలుసా? మీరు వాక్య ప్రకటన చేసేటప్పుడు 'పాముల వలె వివేకులై, పావురముల వలె నిష్కపటులుగా' ఉండమన్నాడు. అంటే దాని అర్థం ఇదే. యే విధముగానైననూ అనేకులను రక్షించుటకు అందరికీ అన్ని విధములవాడనై నేనుండాలి, మీరుండాలి! ఈ పుస్తకాన్ని చదువుతున్న మీరు ఈ విధంగా ఆలోచించాలి, దేవుని కొరకు పురికొల్పబడాలి. మీరు దేవుని కొరకు ఈ విధంగా ఆలోచిస్తే, మిమ్మల్ని ఆయన గొప్ప స్థాయిలోనికి తీసికొని వెళతాడు. తన పిల్లలందరినీ, తన కొరకు బ్రతుకుచున్నవారందరినీ ఈ ప్రపంచంలో ఒక మంచి స్థాయిలో ఆయన నిలువబెట్టాలనుకుంటున్నాడు. అధికార దాహంతో, పీఠముమీద కూర్చోవాలనుకునే వారికి ఇలాంటి అవకాశం దొరకదు. ఆయన దగ్గర వినమ్రులై, తమ్మును తాము తగ్గించుకుని, దేవుని సేవే పరమావధిగా జీవించేవారికి మాత్రమే ఈ అవకాశం! దేవున్ని అడ్డుపెట్టుకుని, లోకసంబంధమైన మిగిలినవాటినన్నీ కోరుకొనే వారిని దేవుడు నిలువబెట్టడు. ఎల్లప్పుడూ దేవుని పాదాల దగ్గర సేవచేయాలి అనుకున్న వారిని దేవుడే చెయ్యి పట్టుకుని నిలువబెడతాడు. వారిని ఆయన ఇచ్చిన సింహాసనముపై కూర్చోబెడతాడు. ఇదే దేవుని ఆలోచన. ఇదే దేవుని విధానం. ఎవరైతే దేవుని సంఘములో జీవిస్తారో, ఎవరైతే ఆయన కొరకు నిజముగా పని చేస్తారో వారికి మాత్రమే జీవించే కళ అర్థమవుతుంది.

ఇక రవిశంకర్ గారి కార్యక్రమము దగ్గరకు వస్తే, ఆనాడు యమునా నది తీరాన ఆయన నిర్వహించిన మూడు రోజుల సాంస్కృతిక సభల వెనుక ప్రభుత్వపరంగా కూడా ఎన్నో లోటుపాట్లున్నాయి. నాటి వార్తాపత్రికలు చదివిన వారికి, మీడియాలో వార్తలు విన్నవారికీ ఈ విషయం అర్థమవుతుంది. రవిశంకర్ గారు ఈ సభను సరిగ్గా యమునా నది తీరంలో వారు నిర్వహించారు కదా. ఆ నదీ తీరంలో వాటిని నిర్వహించేటప్పుడు సభకు వీరు ఎన్నుకొన్న ప్రాంతం ఒక వెయ్యి ఎకరాల భూమికి సంబంధించింది. ఈ వెయ్యి ఎకరాలలో ఏడు ఎకరాల స్థలములో వారు సభకు సంబంధించిన ఏర్పాట్లు చేసారు. అనగా, సభా వేదికను, ఆహ్వానితులందరూ కూర్చోడానికి స్థలాన్ని ఏర్పాటు చేసారు. వచ్చినవారంతా తిరగడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ఆ మూడురోజుల పాటు అక్కడ ఉండటానికి, మిగిలినటువంటి 993 ఎకరాలను వారు నిర్ణయించుకున్నారు. నిర్ణయించిన ఆ ఏడు ఎకరాల ప్రాంతంలో మాత్రం వీరు భారీ వేదికను యేర్పాటుచేసారు. ఆ వేదిక పొడవు 1200 అడుగులు, వెడల్పు 200 అడుగులు, ఎత్తు 40 అడుగులు. ఇది ఒక భారీ స్టేజ్. ఆ వేదికపైనే జీవించే కళ చెప్పబోయే ఈ రవిశంకర్ గారు కూర్చున్నారు. ఆ వేదిక మీదకే అప్పటి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు అతిథిగా వచ్చారు. మిగిలినటువంటి మంత్రులందరూ, ప్రపంచ దేశాల ప్రముఖ వ్యక్తులందరూ ఆ వేదిక మీదనే ఆసీనులయ్యారు. మరి అంతటి భారీ సభను నిర్వహించాలంటే, ముందుగా ఆ ప్రదేశమంతటినీ చక్కపరుచుకోవాలి కదా. ఆ వెయ్యి ఎకరాలను పరిశుభ్రం చేయాలి కదా. సభకు ఆ స్థలాన్ని అనుకూలముగా చేయటానికి వీరేమి చేసారంటే, అక్కడున్న పచ్చని చెట్లను నరికేసారన్నది 'జాతీయ హరిత ట్రిబ్యునల్' ('నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్') చేసిన అభియోగం. వారికి కావలిసిన స్థలాన్ని శుభ్రం చేసుకోవాలనే నెపంతో అక్కడున్న వందల, వేల పచ్చని చెట్లను నరికేసారని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' నేరారోపణ చేసింది. ఈ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనేది మన ప్రభుత్వం ఆమోదించిన, నిర్ణయించిన ఒక చట్టపరమైన కార్యాలయం. దేశంలో పర్యావరణానికి ఏ విధమైన హాని జరిగినా వెంటనే చట్టపరంగా స్పందించి, చర్యలు చేపట్టే సంస్థ అది! అది ఒక స్టాటుట్యరీ బాడీ. అది పర్యావరణ పరిరక్షణ కొరకు భారతదేశములో నిర్ణయింపబడిన ఒక రాజ్యాంగ బద్ధమయిన సమితి! ఈ జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్‌లో సమితికి చెందిన భారతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు ఏమి చెప్పారంటే, రవిశంకర్ గారు 2016 మార్చ్ నెలలో మూడు రోజులపాటు తలపెట్టిన ఈ సాంస్కృతిక సభ నిమిత్తం ముందస్తు కార్యక్రమాల సిద్ధపాటు కొరకు చెట్లను నరకడం వలన, యమునా నది తీరంలో ఈ వెయ్యి ఎకరాలలో పర్యావరణానికి ముప్పు వాటిల్లిందని చెప్పారు. అందుకుగాను, ఈ రవిశంకర్ గారిని జరిమానాగా ఐదు కోట్ల రూపాయలను 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్'కు జమ చేయమన్నారు. ఆ ధనముతో వారు తిరిగి అక్కడ మొక్కలు నాటి, రవిశంకర్ గారి బృందముయొక్క చర్యల వల్ల జరిగిన నష్టాన్ని పూడుస్తారు. దానికి ఈ రవిశంకర్ గారు ఏమి చెప్పారో తెలుసా? నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన ఐదు కోట్ల రూపాయల పరిహారాన్ని తాను కట్టను అన్నాడు. ఈ రవిశంకర్ గారికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలుసు కదా! మరి మనము నిర్ణయించుకున్న, మనము గౌరవించవలసిన రాజ్యాంగ బద్ధమయిన మన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కి మనము

భయపడవద్దా? నిజానికి ఈ రవిశంకర్ గారు ఏమన్నారో తెలుసా? ఈ ప్రపంచానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ నేర్పించాలనుకొనే వ్యక్తి ఏమన్నాడో తెలుసా? నేను 5 కోట్ల రూపాయల పరిహారాన్ని కట్టను; మేము కేవలం చెట్ల కొమ్మలను మాత్రమే నరికాము, చెట్లను నరకలేదు; అక్కడున్న పర్యావరణానికి ఏ హానీ చేయలేదు అన్నాడు. 5 కోట్ల రూపాయలు కట్టను సరికదా, అవసరమైతే ఈ విషయమై జైలుకు కూడా వెళ్లడానికి సిద్ధం అన్నాడు. అలాగని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఈయనంటే గిట్టనివారో, వేరే మతస్థులో, వేరే దేశస్థులో లేరు. ఈయనంటే అభిమానమున్నవారే, చట్టపరంగా తాము చెప్పవలసిన దానిని వారు చెప్పారు. అందుకుతోడు ఈ రవిశంకర్ గారు మామూలు వ్యక్తి కాదు కదా! అప్పటికే ప్రపంచ ప్రఖ్యాతినొందిన వ్యక్తి, మరియు నాటి భారతదేశ ప్రధానమంత్రి గారికి కూడా ఇష్టమైన వ్యక్తి. ఆయనగారి మొదటిరోజు సభకు ప్రధానమంత్రే స్వయంగా వచ్చారు కదా. రాజు తలచుకొంటే జరిమానా, జైలు, కేసులు... అన్నీ ఎగిరిపోతాయి కదా! కానీ, దీని వెనుక దేవుని ప్రణాళిక ఉంటుంది. జరిగిన వాస్తవాలను దేవుడు మనకు తెలియచేయాలనుకున్నాడు. అది దేవుని ఉద్దేశ్యం. ప్రభుత్వం వారి చేతుల్లోనిదే, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి చేతుల్లోనిదే అయినప్పుడు ఇలాంటి గోప్యమైన సమాచారము మన వరకు వస్తుందంటారా? అలాగని ఆయన శత్రువులేమీ ఆ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూర్చోలేదు. అందులో పరాయి మనుష్యులెవరూ లేరు. అంతా వారి వారే. వారే వీరికి ఏమి చెప్పారంటే, శ్రీశ్రీ రవిశంకర్ గారూ, మీరు చేసింది తప్పు! అన్నారు. ఒక సాంస్కృతిక సభను నిర్వహించడానికి అక్కడి పర్యావరణాన్ని అంతగా పాడుచేయవలసిన అవసరత లేదన్నారు. అందువల్లనే జరిగిన నష్టానికి పరిహారమును చెల్లించమన్నారు. ఆ ధనముతో వారేమీ సుఖపడాలని కాదు. అక్కడ పాడైన పర్యావరణాన్ని మరల బాగు చేయాలనే ఆలోచనతో వారు పరిహారాన్ని కోరుతున్నారు. ఆ యమునా నది తీరాన ఈ సాంస్కృతిక సభలు పూర్తయ్యాక తిరిగి మొక్కలు నాటాలి, పరిహారమును చెల్లించండి అని వారు అడిగారు. ఎందుకంటే, ఆ సాంస్కృతిక సభలలో చివరి రోజైన ఆదివారం చివరి సభ ముగింపబడుతుంది. సభలు ముగింపబడిన తరువాత వారంతా ఆ ప్రాంగణాన్ని ఖాళీ చేసి వెళ్లిపోతారు. మరి ఆ స్థలాన్ని ఎవరు తిరిగి బాగుచేస్తారు? బాగుచేయకపోతే యమునా నదికి ప్రమాదం, అక్కడి పర్యావరణానికి ప్రమాదం. ఆ యమునా నది తీరాన్ని మరల చక్కగా తయారుచేసే బాధ్యతను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారు తీసుకోవాలనుకున్నారు. దానికి 5 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని నిపుణులచేత అంచనా వేయించారు. దానిని మాత్రమే ఇవ్వండి అంటే, ఈయన 'నేను ఇవ్వను' అన్నాడు. ఒకవేళ అతడు ఆ పరిహారమును చెల్లిస్తే తాను తప్పు చేసినట్టు ఒప్పుకున్నట్టే అనుకున్నాడో ఏమో! ససేమి ఇవ్వనన్నాడు, అవసరమైతే జైలుకి వెళతాను అన్నాడు. భారతదేశంలో జీవించే కళ నేర్పించే వ్యక్తిని జైలుకి పంపిస్తారా? అస్సలు పంపించరు. అదే ఇతని బలం. అందుకే ఆ కేసు అక్కడితో ముగిసిపోయింది. అక్కడి పర్యావరణం మాత్రం ఈ రవిశంకర్ గారి సాంస్కృతిక సభల దయవల్ల పాడైపోయింది.

ప్రియులారా! నేను కూడా దేవుని పేరిట క్రీస్తు సువార్త ప్రకటన కొరకు ఇప్పటికే చాలా సభలు నిర్వహించాను. నేను వెళ్లిన ప్రతీచోట ముందుగా ఆ సభా స్థలాన్ని శుభ్రపరుస్తాను, దానిని ఆద్యంతం పరిరక్షిస్తాను. అంతెందుకు, నేను నా దగ్గర నేర్చుకుంటున్న విద్యార్థులకు అభ్యసింపచేసే ప్రతిజ్ఞలో ఒకానొక వాక్యము ఏమిటో తెలుసా? 'పర్యావరణాన్ని కాపాడుతూ పశుపక్ష్యాదుల యెడల దయ కలిగి ఉంటాను' అనే వాక్యము! చిన్ననాట నుండి బాలబాలికలకు తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యాన్ని కలిగిస్తాను. ఇది దేవుని మనస్సు! నేను ఎక్కడ దేవుని కార్యక్రమాలను నిర్వహించినా ఆ ప్రాంగణము యొక్క పరిసరాలను శుభ్రపరుస్తాను. అక్కడి మొక్కలను, చెట్లను కాపాడతాను. దాని నిమిత్తము దేవుని జ్ఞానము కలిగిన నా తోడి పనివారు చాలా శ్రద్ధ చూపుతారు. అందుకే ఆ ప్రాంగణము యొక్క యాజమాన్యము వారు మేము ఎప్పుడు వారి దగ్గరకు అనుమతి కొరకు వెళ్లినా అడ్డుచెప్పరు సరికదా, సంతోషముతో వారి భవన, మైదానములను మాకు కార్యక్రమము జరిగినంత కాలము అప్పగిస్తారు. మనమెక్కడికి వెళ్లినా, మన స్వార్థం కోసం, మన పని జరిగించుకోవడం కోసం అక్కడి పర్యావరణాన్ని పాడు చేయటానికి వీలులేదు. పర్యావరణాన్ని క్రమంలో ఉంచటానికే మనము ఎల్లప్పుడూ ఆలోచించాలి. ఎందుకంటే, అది మన దేవుని సృష్టి. అందులో రవ్వంతైననూ సృష్టించలేని మనకు దానిని పాడుచేసే హక్కు లేదు. అందుకే నేను ఎక్కడ కార్యక్రమాలు నిర్వహించినా, వాటిని ముగించినప్పుడు అక్కడి వారంతా సంతోషపడాలి. పైగా, నేను నిర్వహించే కార్యక్రమాల యొక్క

లక్ష్యం ఎలా ఉంటుందో తెలుసా? ఆహ్వానమందుకుని వచ్చిన వారందరికీ నేను యోగా నేర్పించను, ధ్యానమును నేర్పించను, నాట్యాలు వేయించను, సంగీతాలాపాన చేయించను. నాయొద్దకు వచ్చిన వారందరికి దేవుని చక్కని జ్ఞానపు సంగతులు మాత్రమే తెలియజేస్తాను. నేను ఎక్కడ కార్యక్రమాలను నిర్వహించినా, నేనక్కడికి వచ్చి, అక్కడ అడుగు పెట్టినందుకు వారి ప్రాంగణమంతా కళ కళలాడుతోంది అంటారు.

మీకూ, రవిశంకర్ గారికీ పోలిక యేమిటి? లక్షల మందెక్కడ? వందల మందెక్కడ? అనుకుంటున్నారా? దేవుని మహా ప్రభంజనమెప్పుడూ అతి చిన్నగా ప్రారంభమవుతుంది. దేవుని గొప్ప సంకల్పములోని క్రైస్తవ్యం కూడా ఒకనాడు చిన్నగానే ప్రారంభమయింది. కానీ, దాని లక్ష్యం చాలా గొప్పది. ఒక చిన్న రాయి సర్వభూతలమంత మహాపర్వతంగా మారిపోబోతుంది. కానీ, ఈ విప్లవానికి నమ్మకస్తులు కావాలి. ఇందులో చెడు, చీడపురుగులు ఉండకూడదు. అందుకే దేవుని సంఘము విషయంలో నేను చాలా జాగ్రత్త తీసుకుంటాను. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో మానవజాతిని బ్రతికింపజేయటమనేది ఒక మహావిప్లవం. ఈ ప్రపంచానికి ఎప్పటికైనా జీవించే కళను నిజక్రైస్తవుడే చెప్పాలి. నిజమైన జీవించే కళ అనగా అది ధ్యానం కాదు, యోగా కాదు, గీతాలాపన కాదు, నృత్యాలు కాదు, కృత్రిమంగా సంతోషించడం కాదు. నిజంగా సమాజానికి అవసరమైన సంగతులేమిటో అవి చెప్పాలి. ఇది తెలియక, రవిశంకర్ యొక్క సాంస్కృతిక సభలలో ప్రధాని మోడీగారు మాట్లాడుతూ ఏమన్నారో తెలుసా? దేశవిదేశాలనుంచి వచ్చినటువంటి వారినందరిని చూచి మురిసిపోయి, ఇది ‘కళాకారుల యొక్క కుంభమేళా’ అన్నారు. ఇక రవిశంకర్ గారు మూడురోజులుగా, ‘అందరి సంతోషమే ఈ ఉత్సవ నినాదం’ అని చెప్పారు. ఆ సాంస్కృతిక ఉత్సవం యొక్క నినాదం ఏమిటంటే, వచ్చిన వారందరి సంతోషం. అందులో హైందవుల సంతోషం, అందులో ఇస్లాంవారి సంతోషం, అందులో క్రైస్తవుల సంతోషం, అందులో బుద్ధుల సంతోషం, అందులో సిక్కుల సంతోషం, అందులో అందరి సంతోషం! అందరి సంతోషమే ఆ ఉత్సవ నినాదం. ఇదే ప్రపంచానికి రవిశంకర్ గారి యొక్క శాంతి సందేశం. ఆయన మాటలలో.. ‘స్పందించే హృదయమే దేవుని ఆలయం’, అని మాట్లాడుతూ, ఆ సభయొక్క ముఖ్య ఉద్దేశ్యం అందరి సంతోషమే అని చెబుతున్నారు. ఇప్పుడు నేను బైబిల్ దగ్గరకు మిమ్మును తీసుకు వెళతాను. ఆయనకు తెలిసిన జీవించే కళ ఆయన చెప్పాడు. నాకు తెలిసిన జీవించే కళ ఇప్పుడు నేను చెబుతాను. రాబోయే భాగాలలో మీరు అసలుసిసలైన జీవించే కళను చదువబోతున్నారు. నిజానికి చెప్పాలంటే, ఇదే ప్రపంచ వేదిక మీదకు వెళ్లాలి. ఇదే లోకమంతటికీ తెలియాలి. ఇదే అత్యవసరంగా అందరికీ చేరాలి. ఇంకా దీనిని గూర్చి తెలియని వారి దగ్గరకు దీనిని తీసుకుని వెళ్లాలి. దీనిని అందరికీ వినిపించాలి; అందరికీ నేర్పించాలి. మనము పుట్టినందుకు, మనము బ్రతుకుతున్నందుకు, మానవ బ్రతుకు పరమార్థమును మన తరము వారికి తెలియజేయాలి. ఇది రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్. నిజంగా ఒక మనిషి జీవించే కళ ఇలాగే ఉండాలి. ప్రతి మనిషి తన తల్లి ఒడిలోనుండి బయటకు అడుగుపెట్టినప్పటి నుండి ఇలాగే జీవించాలి. ఇలాంటి జీవనాన్ని మాత్రమే కలిగి ఉండాలి. దానినే మీరు తెలుసుకోబోవుచున్నారు. ఇంకా చెప్పాలంటే, ఈ నిజమైన జీవించే కళ ప్రపంచంలో అనేకమందికి తెలియాలి గనుక అవసరమైతే దానిని అనేక భాషలలోనికి తర్జుమా చేయాలి. ప్రధానంగా ఇంగ్లీషు భాషలోనికి అనువాదము చేయాలి. అలా చేసి ఈ ప్రపంచంలోని అనేకమంది దేశ ప్రతినిధులకు దీనిని పంపించాలని ఆశపడుతున్నాను. అసలు అందరికీ ప్రపంచ శాంతి అంటే ఏమిటో, దేని ద్వారా అది సాధ్యమో చెబుతాను. ఇప్పటికే మనకు ముందు ప్రపంచశాంతిని కోరుతూ చాలామంది శాంతిదూతలు వచ్చారు. కానీ, అది వారి వల్ల కాలేదు. శాంతి, శాంతి అని దేవునికి ప్రార్థన చేసి, పాటలు పాడితే శాంతిని నెలకొల్పలేము. దీనికి దేవుని దగ్గర ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉంది. అదే ఈ అసలైన జీవించే కళ నేర్పిస్తుంది. ప్రపంచ శాంతిని గూర్చి ఎందరో చెప్పినవాటిని ఇప్పటివరకు మీరు విన్నారు. అందుకే, నేను చెప్పేది కూడా ఈసారి వినండి. అప్పుడు ప్రపంచశాంతి ఎలా సాధ్యమో మీరు నిర్ణయించండి. చాలామంది శాంతి దూతలకు వారి ఇంటిలోనే శాంతి లేదు. ఇక ప్రపంచానికి వారు ఏమి నేర్పిస్తారు? దురదృష్టవశాత్తూ, అలాంటి వాళ్లనే అందరూ నమ్ముతారు. ప్రియులారా! దేవుడు చెప్పే ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలా ఉంటుందో మొదలుపెడతాను. రవిశంకర్ చెప్పినటువంటి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రకారం, ప్రపంచ మనుష్యులు అందరూ సంతోషంగా ఉండాలి అన్నాడు. అందరి సంతోషమే ఆయన ఉత్సవం యొక్క నినాదం అన్నాడు. ఇప్పుడు బైబిల్‌ను చూడండి.

**మత్తయి సువార్త 16 : 23 'అయితే ఆయన పేతురు వైపు తిరిగి, సాతానా! నా వెనుకకు పొమ్ము.'** ఇది యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యుడైన పేతురుతో చెబుతున్నటువంటి ఒక మంచి మాట. ఈ సందర్భంలో ప్రభువు, పేతురుకు అసలు సిసలైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ నేర్పిస్తున్నారు. అప్పటికే పేతురుకి ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంది. యేసుక్రీస్తుకు కూడా ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉంది. మత్తయి సువార్త 16వ అధ్యాయంలో పేతురు గారిది ఒక జీవించే కళ, యేసుక్రీస్తు వారిది మరొక జీవించే కళ. ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు పేతురు వైపు తిరిగి ఏమంటున్నారో చూడండి. సాతానా, నా వెనుకకు పొమ్ము అన్నారు. ఇంతకీ ఆయన పేతురుతో ఎందుకలా అన్నారు? పేతురును సాతాను అన్నారు. తన వెనుకకు పొమ్మన్నారు. ఎందుకన్నారంటే, పేతురు మనుష్యుల సంగతులనే తలంచుచున్నాడు కానీ, దేవుని సంగతులను తలంపకయున్నాడు. దీనినిబట్టి పేతురు యొక్క ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏమిటన్నమాట? మనుష్యులను సంతోషపెట్టడం. చూసారా! పేతురు యొక్క జీవించే కళ మనుష్యులను సంతోషపెట్టుట! అనగా, ఒక మనిషిగా యేసుక్రీస్తును సంతోషపెడదాం అనుకుంటున్నాడు. యేసుక్రీస్తు శ్రమ పడకూడదని, మరణించకూడదని అనుకుంటున్నాడు. అచ్చం ఈనాడు రవిశంకర్‌గారు కూడా అలాగే అనుకున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, చైనా, రష్యా,... ఇలా ఎన్నో దేశాలు! సుమారు 200 దేశాలు. పేతురువలె ఈయన కూడా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మనుష్యులందరినీ సంతోషపెట్టాలనుకుంటున్నాడు. అందుకే ఈయనది సాంస్కృతిక సభలను నిర్వహించే ఆర్ట్ ఆఫ్ లివింగ్. ఆరోజు పేతురు కూడా యేసుక్రీస్తును ఒక మానవునిగా చూస్తూ, మానవ పద్ధతిలో ఆయన్ను సంతోషపెడదాం అనుకుంటున్నాడు. అనుకుంటూ ఏమిచేస్తున్నాడో పై వచనములలో మీరు చూస్తే, **(మత్తయి సువార్త 16 : 22)** పేతురు ఆయన చేయి పట్టుకొని ప్రభువా అది నీకు ఎన్నడును కలుగకుండును, అది నీకు దూరమగును గాక అని ఆయనను గద్దింపసాగెను. ప్రధాన యాజకులచేతను, శాస్త్రులచేతను యేసుక్రీస్తు హింసింపబడి, చంపబడతాడు. ఆయన మూడవ దినమున తిరిగి లేచుట అగత్యము అని యేసుక్రీస్తు చెప్పినప్పుడు, దానికి ప్రతిస్పందనగా వెంటనే పేతురు ఆయన చేయి పట్టుకొని నేను నిన్ను బాధపడనివ్వను, నేను నిన్ను సంతోషపెట్టాలి, ఈ కష్టాలేమీ నీకు కలుగకూడదు, అవన్నీ నీకు దూరమగును గాక అని అంటున్నాడు. అప్పుడు యేసుక్రీస్తు వెనుకకు తిరిగి ఇది మంచి మాట, ఇదే నిజమైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ అన్నారా? సాతానా, నా వెనుకకు పొమ్ము అన్నారు. పేతురు యొక్క సొంత ఆర్ట్ ఆఫ్ లివింగ్ అక్కడ చెల్లదు. దేవుని ఆర్ట్ ఆఫ్ లివింగ్ మాత్రమే అక్కడ చెల్లుతుంది. అనగా అప్పటికి, పేతురుకు జీవించే కళ సరిగ్గా తెలియదు. ఇప్పుడు రవిశంకర్‌కు కూడా పేతురువలె జీవించే కళ సరిగ్గా తెలియదు. ఈ రోజు బైబిల్ పట్టుకున్న వారిలో కూడా చాలామందికి జీవించే కళ సరిగ్గా తెలియదు. యేసుక్రీస్తు పేతురుని ఈ విధంగా అనేసరికి పేతురు కోపగించుకొని, ఆ మరుక్షణం యేసుక్రీస్తు నుంచి పేతురు దూరమైపోయాడా? గలిలయ సముద్రము దగ్గరకు వెళ్లిపోయి మరల వలలు బాగు చేసుకొన్నాడా? మరల చేపలు పట్టుకొంటున్నాడా? లేదు. ఆనాడు పేతురు మంచివాడు; మార్పును ఆహ్వానించువాడు. తనకు తెలిసిన తన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను మార్చుకోవాలనుకున్నాడు. తాను కలిగియుండవలసిన అసలైన జీవించే కళ అది కాదన్నమాట. అందుకే సరి చేసుకున్నాడు, అసలైన జీవించే కళను యేసు బోధలలో మరల నేర్చుకున్నాడు. యేసుక్రీస్తు చెప్పిన ఆ మాటలకు పేతురు తన మనస్సును, తన ఆలోచనా విధానాన్ని మార్చుకొన్నాడు. ఆ తరువాత కొనసాగింపుగా యేసుక్రీస్తు వారు పేతురుతో ఏమంటున్నారో చూడండి. **మత్తయి సువార్త 16 : 23**వ వచనము ప్రకారం, **'నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులను తలంపకయున్నావని పేతురుతో చెప్పెను'**. అంటే ఇక్కడ రెండు సంగతులు మనకు కనిపిస్తున్నాయి. ఒకటి మనుష్యుల సంగతి, రెండవది దేవుని సంగతి. (ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎకార్డింగ్ టు హ్యూమన్ / ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎకార్డింగ్ టు గాడ్). రవిశంకర్ గారికి తెలిసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్, మనుష్యుల సంగతి. అది ఎకార్డింగ్ టు హ్యూమన్స్; అది మనుష్యులకు మాత్రమే సంబంధించింది. అందుకే ఆయన వ్రాసిన వ్రాతలు, ఆయన చేసిన ప్రకటనలు, మనుష్యులను మాత్రమే సంతోషింపజేస్తాయి. మనుష్యులందరి సంతోషమే ఆయన నిర్వహించిన ఉత్సవం యొక్క నినాదం. అంటే, దిస్ ఈజ్ రవిశంకర్స్ ఆర్ట్ ఆఫ్ లివింగ్. మరి ఈ పుస్తకము ద్వారా నేను ప్రకటించే నిజమైన జీవించే కళ ఏమని చెబుతుందో తెలుసా? దేవుని సంతోషమే నా కార్యక్రమాల నినాదం, దిస్ ఈజ్

మణికుమార్స్ ఆర్ట్ ఆఫ్ లివింగ్. నేను ప్రభువు కొరకు చేసే ప్రతి పనిలోను దాని ముఖ్యాంశము, దాని మూలాంశము అలాగే ఉంటుంది. ఈ నిజమైన జీవించే కళలో నేను అదే చెబుతాను. దేవుని ఆనందమే, దేవుని సంతోషమే నా ప్రతి కార్యక్రమము యొక్క నినాదం. ఇక్కడ మనష్యుల సంతోషం కాదు, మనుష్యుల ఆనందం కాదు. మనిషిని నవ్వించడం మాత్రమే నా అభిమతం కాదు. మనిషిని నవ్వించాలంటే ఆ పనిని ఒక గ్యాస్ కూడా చేస్తుంది! మీకు తెలుసా? నైట్రస్ ఆక్సైడ్ అనే ఒక వాయువు ఉంది. దీనిని లాఫింగ్ గ్యాస్ అని కూడ అంటారు. ఈ నైట్రస్ ఆక్సైడ్ గ్యాస్‌ను నేను మీ మధ్యకు తెచ్చి వదిలితే, ఇక మీరందరూ అలా పగలబడి నవ్వుతూనే ఉంటారు. మీకు ఈ నవ్వు ఎలా వస్తుంది? అది హృదయపూర్వకంగా వచ్చిన నవ్వు కాదు. హ, హ, హ అని అలా నవ్వుతూనే ఉంటారు. నవ్వుతూ, నవ్వుతూ ఆ నవ్వు ఆగక, ఏడుస్తూ నవ్వుతూనే ఉంటారు. ఇక ఆ గ్యాస్ యొక్క శృతిమించితే మీ శరీరం కూడా మీకు సహకరించదు. నవ్వటానికి అయినా సరే ఒక హద్దు ఉంటుంది కదా. నవ్వుతూ, నవ్వుతూ... పొట్ట చెక్కలయిపోయేలా నవ్వుతూ... ఓ ప్రక్కనుంచి మరల ఏడుస్తుంటారు. ఆ గ్యాస్ ఆపేయండి, ఆపేయండి అంటారు. ఇక నవ్వడం మీవల్ల కాదంటారు. అయినా ఓ ప్రక్కనుంచి నవ్వేస్తుంటారు. నేను ఒక మాస్క్ పెట్టుకుని, నవ్వుతున్నారు కదా అని నేను ఆపను అని ఇంకా మీవైపు ఆ గ్యాస్ వదులుతున్నాను అనుకోండి. ఇక అంతే సంగతులు. దీనిని బట్టి, ఒక గ్యాస్ కూడా ఏమి చేయగలదన్నమాట? అది మనుష్యులను నవ్వించగలదు. అందుకే దానిపేరు లాఫింగ్ గ్యాస్. ఇప్పుడు రవిశంకర్ గారు చేసేది ఏమిటి? ఒక గ్యాస్ చేసే పనినే ఆయన కూడా చేస్తే, ఆయన మాటలు గ్యాస్ మాటలులాగ ఉన్నాయని అర్థం. కానీ, నేను గ్యాస్ మాటలు చెప్పను. నేను దేవునిని సంతోషపెట్టాలి. మనుష్యుల మధ్య నైట్రస్ ఆక్సైడ్ విడుదుల చేస్తే దేవుడు సంతోషపడడు. మరి ఆయన ఎప్పుడు సంతోషపడతాడు? ఈ మానవ సమాజంలో ఒక పాపాత్ముడు, నీతిమంతునిగా మారితే పరలోకమందు దూతల యెదుట ఆయనకు సంతోషం కలుగుతుంది. దానిని నేను ఆయనకు ఇవ్వాలి. జీవించే కళ అని దేనినైతే ఈరోజు ఈ దేశము, ఈ ప్రపంచం అనుకుంటుందో అంతకు మించిన నిజమైన జీవించే కళను నేను చెబుతాను. అది కేవలం బైబిల్‌లో మాత్రమే ఉంది. అందుకే, మచ్చుకు ఒక ఉదాహరణగా యేసుక్రీస్తు, పేతురుల సంభాషనను మీకు పరిచయం చేసాను. ఆనాడు పేతురు మనుష్యుల సంగతులను కాక దేవుని సంగతులను నేర్చుకోవాలి. వాటిని అతడు ఆలోచించాలి, వాటిని తలంచాలి. దేవుని సంతోషపెట్టడం ఎలాగో పేతరు నేర్చుకుంటే, అదే రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ అవుతుంది.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 9- 'ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించువారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడియున్నది.'** దేవుడు తన్ను నమ్మిన వారికిచ్చే ఆశీర్వాదము ఇదే. మనము తండ్రిని కోరుకొనవలసిన ఆశీర్వాదము ఇదే. అదేమిటో తెలుసా? నిజమైన జీవించే కళ. ఈ ప్రపంచ మానవాళికి 'జీవించే కళను' దేవుని జ్ఞానముగా చెప్పాలి. ప్రపంచ వేదిక మీద దానిని చెప్పాలి! సామాన్యముగా ఆలోచించేవారికి ఎవ్వరికీ ఇవన్నీ అర్థంకావు, ఇవి కనిపించవు. దేవుని కుమారులుగా బ్రతికేవారికి మాత్రమే ఇవి వినిపిస్తాయి, కనిపిస్తాయి. రవిశంకర్ నిర్వహించిన ఆనాటి సాంస్కృతిక సభకు ప్రపంచంలో ఎంతోమంది శాస్త్రవేత్తలు, గొప్ప గొప్పవారు, అధికారులు, క్రీడాకారులు, అందచందాలు కలిగినవారు వచ్చారు. టిక్కెట్ల ద్వారా కోట్లరూపాయిలు ఆదాయం కూడా నిర్వాహకులకు వచ్చింది. వారందరూ ఇండియాలో జరుగుతున్న ఆ సభలో పాల్గొనడానికి వేగిరపడుతున్నారు. కానీ వారందరికి దేవుడు సిద్ధపరిచినవి కనిపించవు, వినిపించవు, గోచరము కావు. దేవుని కుమారులు వారందరికంటే తక్కువవారు, చిన్నవారు కావచ్చు. కానీ, ఆయన పిల్లలకు ఆయనిచ్చిన గొప్పతనం ఏమిటో తెలుసా? దేవుని కుమారులమైన మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలుపరచియున్నాడు. 2016వ సం॥ మార్చ్ నెలలో జరిగిన రవిశంకర్ సాంస్కృతిక సభను గూర్చి విన్న తరువాత దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఎవ్వరికీ ఇటువంటి ఆలోచన రాకపోవచ్చు. ఏ ఒక్కరికీ ఇటువంటి ఆలోచన తట్టకపోవచ్చు! కానీ, ఆయన ఆత్మ కలిగిన వానికి మాత్రం ఖచ్చితంగా, నిజమైన జీవించే కళను చెప్పాలనే ఆలోచన వస్తుంది. నాకైతే దేవుడు, ఆయన ఆత్మ వలన దీనిని బయలుపరచియున్నాడు. ఆ ఆత్మ అన్నింటినీ, దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. హోలీ స్పిరిట్(పరిశుద్ధాత్మ) అనుభవము అంటే ఇదే! రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను ప్రజలకు నేర్పించేదే హోలీ స్పిరిట్. ఆ

పరిశుద్ధాత్మ ఏమి చేస్తున్నాడో చూడండి. ఆయన అన్నిటిని, అనగా దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. ఒక మనుష్యుని సంగతులు అతనిలోని మనుష్య ఆత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? అనగా, ఒక మనుష్యునిలోని సంగతులు మరో మనిషికి తెలియవు. అందుకే రవిశంకర్ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆహ్వానించి అతని మనస్సులోని సంగతులను, మనష్యులందరికీ చెబుతున్నాడు. అవి కేవలం రవిశంకర్ మనస్సులో ఉన్న సంగతులు మాత్రమేనని మరచిపోవద్దు. ఒక మనుష్యుని సంగతులు ఆ మనుష్యునికే తెలియును. అందుకే అతని సంగతులుగా, మిగిలిన మనుష్యులకు అతడు నేర్పిస్తున్నాడు. అదే విధముగా, దేవుని సంగతులు కూడా ఉన్నాయి. మనిషి సంగతులయితే ఒక మనిషి మరో మనిషితో పంచుకుంటాడు, ఇలా వేదికలు నిర్వహిస్తాడు, సాంస్కృతిక సభలు నిర్వహిస్తాడు, అందరికీ చెబుతాడు. మరి దేవుని సంగతులను గూర్చి ఎవరు ఆలోచిస్తారు? ఆయన సంగతులను ఎవరు చెబుతారు? దేవుడు చెప్పిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను ఒక వేదిక ద్వారా ఎవరు చెబుతారు? ఇప్పుడు దేవుని సంగతులు కూడా దేవుని ఆత్మకే గాని మరి ఎవరికిని తెలియవు! మనుష్యుని సంగతులే ఆ మనిషికి తప్ప ఇక ఏ మనిషికీ తెలియనప్పుడు, దేవుని సంగతులు ఇంకెవరికి తెలుస్తాయి చెప్పండి? అందుకే ఆయన్ను నమ్మిన మనుష్యులకు ఆ దేవుని సంగతులను తన ఆత్మ ద్వారా తెలియజేయుచున్నాడు. అందుకే ఆ దేవుని ఆత్మను నాకు అనుగ్రహించి, నిజమైన జీవించే కళను ఆయన తరపున ఈ ప్రపంచానికి చెప్పమని ఆ బాధ్యతను నాకు అప్పగించాడు. ఈ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మనుష్యులందరికి తన అసలైన జీవించే కళను దేవుడు చెప్పాలనుకుంటున్నాడు. దానిని గ్రహించుటకు మనుష్యరీతిగా ఆలోచించే ఆత్మకు సామర్ధ్యం చాలదు. అందుకే ఆయన తన ఆత్మనిచ్చాడు. ఎవరైతే ఆయనకోసం బ్రతుకుతారో వారికి మాత్రమే ఆయన ఇస్తాడు. అందరికీ ఇంతటి మహాభాగ్యమును ఇస్తే వారు దానిని దుర్వినియోగం చేస్తారు. పరిశుద్ధాత్మను హీనపరుస్తారు, దు:ఖపరుస్తారు. అందుకే ఆ ఆత్మ అనుగ్రహింపబడినవారిని ఉద్దేసిస్తూ, 'ఆత్మను ఆర్పకుడి' అన్నాడు. ఈ భూమిమీద దేవుని నమ్మినవారిలో చాలా మందికి తన ఆత్మను ఇచ్చినా వారు ఆత్మను ఆర్పేసుకుంటారు. అంటే వారికేమి కావాలన్నమాట? దేవుడిచ్చేది కాక, వారికింకేదో కావాలి! మనుష్య సంబంధమైన సంగతులు వారికి కావాలి. భూసంబంధమైన ధనం, అధికారం, శరీర సుఖం అంటే వారికి మక్కువ. వాటిని గూర్చి మాత్రమే వారు ఆలోచన కలిగి ఉన్నారు. పరలోక సాధన వారి చేత కాదు. కానీ అదే ముఖ్యమైనదన్న సంగతిని వారు ఉద్ధేశ్యపూర్వకముగా మరచిపోతారు. దేవుని సంఘముతోపాటు ఉండి, దేవుని పనిని చేస్తూ, దేవునిలో పరిపూర్ణం చేయబడటానికి, ఈ భూమి మీద తనకివ్వబడిన ఈ కొద్దికాలమే సహించలేకపోతే, ఇక పరలోకంలో ఏమి సహిస్తారు? సహించలేరు. అందుకే దేవుడు ఈ భూమిమీద ఒక చిన్న పరీక్ష పెడుతున్నాడు. ముందుగా ఈ భూమిమీద దేవుని సంఘములో దేవుని ఆత్మతో కలిసి పరిశుద్ధముగా ఉండగలిగితే అప్పుడు పరలోకమందు ఆయనతో ఉంటామో లేదో ఆయన ఆలోచిస్తాడు. ఏదెను తోటలోనే జీవించలేకపోయిన ఆదాము, హవ్వలు ఇక పరలోకంలో ఏమి ఉంటారు చెప్పండి? అందుకే, ఏదెను వనము నుండి దేవునిచేత గెంటివేయబడ్డారు. పాపము చేసిన వారు అందులో ఉండకూడదు. మరల జీవవృక్షఫలాలు అందుకోవడానికి వస్తారేమోనని కాపలాగా దేవదూతలను పెట్టాడు. అగ్ని జ్వాలలతో వాటిని బంధించాడు. వారిని ఆ దరిని చేరకుండా దేవుడు వారిని వెలివేసాడు. దేవుడు పంపించేసాడంటే మరల తిరిగి రావటం ఎవ్వరి తరం కాదు. అందుకే ఆయన మన చెంత ఉన్నప్పుడే ఈ మహాభాగ్యాన్ని కాపాడుకోవాలి. ఆయన్ను విడిచిపోయిన తరువాత వారు మరల తిరిగి రాలేరు. రావడం చాలా కష్టం. ఈ కష్టం ఎవరు పెట్టిందో తెలుసా? దేవుడే. అది దేవుడు పెట్టిన నిర్బంధం. దేవుని ఆత్మ కలిగినవాడితో మీరు సహవాసమును కలిగి ఉండాలి. భూమిమీద జీవితకాలంలో దేవుని సేవను జరిగించటానికి ఆ సేవను ముగించడానికి ఇక్కడే దేవుని ఆత్మతో కలిసి ఉండలేనివారు, ఇక్కడే ఆయన ఆత్మను సహించలేనివారు, ఇక పరలోకములో ఏముంటారు? పరలోకంలో ఏమి సహిస్తారు? ఉండలేరు.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 11- 'ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని, మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగుతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు. దేవుని వలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక, దేవుని యొద్దనుండి వచ్చిన ఆత్మను పొందియున్నాము.'** అందుకే నేను దేవుడు చెప్పే ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను చెప్పాలనుకుంటున్నాను. జీవించే కళను

మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో కాక అనగా, యోగా, ధ్యానం, నాట్యం, తినడం, త్రాగడం, గెంతడం, కొనుక్కోవడం, అమ్ముకోవడం, నవ్వటం, నవ్వింప జేయటం,.. ఇవేవీ కాకుండా స్వచ్ఛమైన దేవుని మాటలతో నేర్పాలి. మనుష్య జ్ఞానము చెప్పే మాటలలో అవే ఉంటాయి. అదంతా మనుష్య సంతోషం, ఆనందంతో నిండిపోయి ఉంటుంది. మరి సుదూర దేశాల నుంచి ఇంతదూరం వచ్చారంటే, వచ్చినవాడిని నవ్వించి పంపించాలి కదా. మహా అయితే వచ్చినవాడు సభలో ఒక సెల్ఫీ ఫొటో తీసుకొంటాడు. ఇండియా వచ్చి నేను నవ్వాను, సంతోషించాను, ఎంజాయ్ చేసాను అనుకుంటాడు. వారు ఇండియా వచ్చినందుకు వారికి మిగిలిన ప్రతిఫలం అదే. రవిశంకర్ సభకు వచ్చినందుకు, ఆహ్వానితులందరూ ఏమి చేస్తున్నారని అడిగితే, వారు నవ్వి వెళ్లిపోతున్నారు, సంతోషించి వెళ్లిపోతున్నారనే సమాధానములే వినిపిస్తున్నాయి. ఇదే మనుష్యజ్ఞానము నేర్పు మాటలలో ఉంటుంది. నిజంగా రవిశంకర్ గారిని అడిగితే ఏమి చెబుతారు చెప్పండి? ఆయన చెప్పేదంతా ఎవరి జ్ఞానం అని అడిగితే ఆయన ఏమి చెబుతాడు? ఇదంతా నా స్వంత జ్ఞానం అని అంటాడు. అంతే తప్ప ఇది దేవుని జ్ఞానము అని అంటాడా? అక్కడే మీకు విషయం తెలిసిపోతుంది. అలాంటప్పుడు అది రవిశంకర్ యొక్క జీవించే కళ. కనుక అది ఖచ్చితంగా మనుష్యజ్ఞానమే కదా! అది దేవునిది అయితే దేవుని జ్ఞానమని చెప్పవచ్చు. కానీ అది రవిశంకర్ చెప్పే జీవించే కళ. దైవాత్మ ఉద్దేశ్యముతో నేను చెప్పబోయేది దేవుని జ్ఞానము. దేవుని జ్ఞానమును ఆయన తరపున చెప్పే మనుష్యులు ఆయనకు కావాలి. ఆయనకు స్వరాన్నిచ్చే మనుష్యులు ఆయనకు కావాలి. అలాంటి వారిని గూర్చే దేవునికి ఈ భూమిపై నిరీక్షణ ఉంది. దేవునికి మిగిలిన ఆశ అలాంటివారే కదా. ఆయన వ్రాయించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను ఈ భూమిమీద ఎవరు చెబుతారు? ఎవ్వరూ చెప్పరు. అందరూ వారి స్వార్థమే చూసుకుంటారు. ఇది నేను చెప్పే జ్ఞానము అంటారు. ఇది నేను వచ్చిన తరువాతే ప్రారంభమయింది అంటారు. ఇది నాతోనే అంతమైపోతుంది అంటారు. ఈ మానవాళికి నేనే దిక్కును అంటారు. కాదు, కాదు. అందుకే, ఇలాంటి వారుంటారనే దేవుడు ఒక మంచి నిర్ణయం తీసుకొన్నాడు. ఆయన పరిశుద్ధాత్మను ఎవరు కలిగి ఉంటారో వారిని దేవుడు నిర్ణయిస్తున్నాడు. పరలోకమందు ఆయన నిర్వహించే సభలో ఎప్పటికప్పుడు ఆయన ప్రణాళికను అనుసరించి సమీకరణాలు మారిపోతూ ఉంటాయి. తన జ్ఞానమును ఎవరికి ఇవ్వాలో ఆయన నిర్ణయిస్తాడు. ఒక వ్యక్తిని క్రీస్తులో పరలోకపు తండ్రి చూచినప్పుడు, ఆ వ్యక్తి దేవుని దృష్టికి క్రీస్తులా కనిపించినప్పుడు, ఈ జ్ఞానమును ఫలానా వ్యక్తికి ఇస్తేనే మంచిది, అతడైతేనే తండ్రిని గొప్పచేస్తాడు, అతడైతేనే ఆయన వాక్యాన్ని భూమిమీద ప్రచురిస్తాడు అని నమ్మితే, అలాంటి వారికి ఆయన అనుగ్రహిస్తాడు. జీవించే కళను కలిగిన వ్యక్తి తన గొప్పతనమో, తన ఇష్టాన్నో ప్రచురించకూడదు. ప్రగల్భాలు పలుకకుండా, దేవుని బలిష్ఠమైన చేతి క్రింద దీన మనస్కులైన వారిని ఆయన దృష్టిస్తున్నాడు. అలాంటి వారికి మాత్రమే దేవుడు తనదైన జీవించే కళను అనుగ్రహించి వారి ద్వారా ప్రకటింపజేస్తాడు. ఈ దేవుని జ్ఞానము మనుష్యుల మధ్య నిలబడాలి అంటే, తండ్రి సరిగ్గా ఇలాంటి వారికే తన జ్ఞానసంపదను ఇవ్వాలి కదా. అలాగని వీరు ఈ లోకములో గొప్పవారు కారు, అధికారము కలిగినవారు కారు. వీరు ఈ లోకములో చిన్నవారు; కానీ, దేవునిలో బలవంతులు. అలాంటివారిలో నేను ఒకడనైనందుకు, నాకు ఆ మహాభాగ్యము దక్కినందుకు, తండ్రియైన దేవునికి సదాకాలము కృతజ్ఞున్ని.

ప్రియులారా! నేను చెప్పబోవుచున్న ఈ అసలైన జీవించే కళ, మనుష్యజ్ఞానముతో చెప్పే మాటలు కావు. అవి నేను తయారు చేసుకొని వచ్చి చెప్పే మాటలు కావు. దేవుడు నాకు అనుగ్రహించిన మాటలే మీకు నేను చెప్పే మాటలు. నా ద్వారా ఆయన చెప్పిన మాటలు మీకు కూడా ఆయనే చెబుతున్నాడని మీరు గ్రహించాలి. కొరింథీయులకు పత్రికను వ్రాయిస్తూ ఆయన ఏమంటున్నాడో చూడండి. దేవుని ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే వారు మొదటి శతాబ్ధములో బోధించుచున్నారు. **కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 14**వ వచనము ప్రకారము, '**ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు**' అని వ్రాయబడినది. కనుక, దేవుని ఆత్మ వలన నేను చెప్పే మాటలు ప్రకృతి సంబంధియైనవాడు అంగీకరింపడు. కానీ, కొంతమంది దైవసంబంధులు, పరలోక సంబంధులు ఈ లోకములో దేవుని సంఖ్యగా జీవిస్తున్న వారుంటారు. వారి కోసమైనా నేను ఈ అసలైన జీవించే కళను చెప్పాలి. అందరికీ ఈ సంగతులను ప్రకటించినప్పుడు, విన్న వారిలో కొందరినైనా నేను రక్షించాలి.

తద్వారా ఆ దేవునికి నేను సంతోషాన్ని ఇవ్వాలి. లోకసంబంధికి మాత్రం ఇవి వెర్రితనముగా ఉంటాయి. ఇవి సామాన్యముగా కాక ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు. ఆత్మసంబంధియైన వాడైతే అతడు అన్నిటిని వివేచించును. కానీ, అతడు ఎవని చేతను వివేచింపబడడు. అందుకే, శ్రీశ్రీ రవిశంకర్ నాచేత వివేచింపబడ్డాడు. నన్ను వివేచించడానికి అతడు సరిపోడు. ఇదే దేవుని మాటలలోని పరమార్థం. దేవుని కుమారునిగా నేను ఎవరినైనా వివేచించగలను. ఎందుకంటే వారు చెప్పేది దేవుని జ్ఞానము కాదు, అవి మనుష్య సంబంధమైన మాటలు. నేను దేవుని సంబంధమైన జ్ఞానము చెబుతున్నాను. దేవుని మాటలనే చెబుతున్నాను. నేను దేవుని తరపున చెబుతున్నాను. 'దిస్ ఈజ్ గాడ్స్ ఆర్ట్ ఆఫ్ లివింగ్'. ఉదాహరణకు మనిషి యొక్క ఆర్ట్ ఆఫ్ లివింగ్ కలిగి ఉన్నవాడు బైబిల్‌లో ఒకడున్నాడు. అంటే, తన బ్రతుకు కాలంలో ప్రతి రోజు నవ్వుకునే వాడన్నమాట. రవిశంకర్ సభలలాంటి సభలకు హాజరయ్యేవాడిలాంటి వాడన్నమాట. ఈ భూమిమీద వాడికి నవ్వే నవ్వు, జీవితమంతా నవ్వు; సంతోషమే సంతోషం, జీవిమంతా సంతోషం. ఇంటినిండా రోజా తోరణాలే, ఇంటినిండా రోజా బంధువులే. ఇలాంటి జీవించే కళను కలిగిన ఒక మనిషి బైబిల్‌లో కనిపిస్తున్నాడు. అతడే ఒక ధనవంతుడు!

**లూకా సువార్త 16 : 25- 'అందుకు అబ్రాహాము - కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి'** అన్నాడు. ఇప్పుడు రవిశంకర్ గారు ఏమి చెబుతున్నారు? ఈయన కూడా దానినే చెబుతున్నారు. ఆయన ఉత్సవం యొక్క నినాదం ఏమిటీ? 'అందరి సంతోషమే ఆయన ఉత్సవ నినాదం'. ఆనాడు అబ్రాహాము మృతుల లోకములో ఇదే మాటను, వేదన అనుభవిస్తున్న ధనవంతునితో చెప్పినట్టుగా వ్రాయబడింది. అందుకు అబ్రాహాము, కుమారుడా! నీవు నీ జీవితకాలమందు నీకు ఇష్టమైనట్టుగా సుఖము అనుభవించితివి. నీవు నీ జీవిత కాలమందు నీవు బహుగా ఏడ్చావు అనలేదు. ధనవంతునికి భూజీవిత కాలములో సుఖమే సుఖము! ఆ ధనవంతునికి ఈ భూమిమీద ఎవరో చెప్పి ఉంటారు. అది మనిషి యొక్క ఆర్ట్ ఆఫ్ లివింగ్! జీవిత కాలమంతా ఎల్లప్పుడూ సంతోషించు, సంతోషించు అని చెప్పేది మనిషి యొక్క జీవించే కళ. అందుకే ఆ ధనవంతుడు తన జీవితమంతా సుఖమును అనుభవించాడు. ధనవంతుడు భూమిమీద జీవించిన కాలములో, తనతోపాటు మరొక వ్యక్తి దీనికి భిన్నంగా, దేవుడు అనుగ్రహించిన అసలైన జీవించే కళను ఆత్మ ద్వారా గ్రహించి రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను కలిగి జీవించాడు. అతని పేరు లాజరు! అతడు దేవుని ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను పాటించాడు. అది దేవుని యొక్క జీవించే కళ. అందుకే అబ్రాహాము, ఈ లాజరును గూర్చి **'ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసుకొనుము'** అన్నాడు. 60, 70 యేళ్ల ఈ జీవితకాలము చాలా చిన్నది. ఈ చిన్న జీవితకాలములో లాజరు దేవుడు చెప్పిన జీవించే కళను పాటించి కష్టపడ్డాడు. ధనవంతుడైతే, ఈ భూమిమీద ప్రకృతి సంబంధియైన మనిషి చెప్పిన జీవించే కళను పాటించి సుఖపడ్డాడు. **లూకా సువార్త 16 : 25, 'ఇప్పుడైతే వాడు(లాజరు) ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు'.** అంటే, భూమి మీద దేవుడు చెప్పిన జీవించే కళ కలిగి జీవించినవారు పరదైసుకు వెళ్లిన తరువాత విశ్రాంతిని పొందుతారని అర్థం. అందుకే **'ఇప్పుడైతే వాడు(లాజరు) ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు. నీవు(ధనవంతుడు) యాతన పడుచున్నావు'** అన్నాడు. అంటే, ఈ భూమిమీద మనిషి చెప్పే జీవించే కళను వింటూ, దానినే నేర్చుకుంటూ, దానినే పాటిస్తూ జీవిస్తున్న కోటానుకోట్లమంది ప్రజలు దేనికి సిద్ధంగా ఉన్నారన్నమాట? దైవగ్రంథమైన బైబిల్‌ను బట్టి, నరక యాతనకు సిద్ధంగా ఉన్నారు. భూమిమీద ఎవరైతే తమ ఇష్టాన్ని నెరవేర్చుకొంటూ, సుఖిస్తూ, ఆనందిస్తూ, నవ్వుతూ మనుష్యులు చెప్పే జీవించే కళను కలిగి ఉంటారో, వారు యాతనకు సిద్ధపడాలి. శ్రీశ్రీ రవిశంకర్‌కు పరిచయమున్న బైబిలే ఈ విషయాన్ని చెప్పింది. ఇతడు చదివింది బెంగళూరు 'సెయింట్ జోసెఫ్ కాలేజ్'లో కాబట్టి ఖచ్చితంగా ఇతనికి బైబిల్ పరిచయమై ఉండాలి. ఆ బైబిల్ ఏమి చెప్పిందో తెలుసా? మనిషికి అసలైన జీవించే కళ ఎలాగో నేర్పింది. కానీ, అతనికి ఎవ్వరూ నేర్పించి ఉండరు. ఎందుకంటే, దేవుడు చెప్పిన జీవించే కళ చాలామంది క్రైస్తవులకు కూడా తెలియదు. వారు పేరుకే క్రైస్తవులు. కానీ, వారు కూడా జీవించే కళను కోల్పోయి జీవిస్తున్నారు. అందుకే వారు చర్చ్‌కి రాగానే ఏమి అడుగుతున్నారు? ఆశీర్వాదాలు, స్వస్థతలు మాత్రమే అడుగుతున్నారు! దేవుని దగ్గరకు రాగానే వారి రోగం మానిపోవాలి, శరీరానికున్న పుండు తగ్గిపోవాలి, ఒంట్లో నొప్పి పోవాలి! భూమి మీద మనుష్యుల సంగతులను ఆలోచించే వీరు, జీవించే కళ ఎలాగో అని దేవున్ని

అడుగుతున్నారంటారా? దేవుడు చెప్పిన జీవించే కళ ఒకటి ఉంది. దానిని పాటించకపోతే మహాయాతనకు సిద్ధపడాలి. ఆనాటి ఇశ్రాయేలీయులు కూడా దేవుడు చెప్పిన జీవించే కళను కాదనుకొన్నారు.

**కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 10 : 5 'అయితే వారిలో ఎక్కువ మంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి గనుక అరణ్యములో సంహరింపబడిరి'.** అంటే ఇశ్రాయేలీయులు ఎవరికి ఇష్టులుగా ఉన్నారన్నమాట? మనుష్యులకు ఇష్టులుగా, వారి ఇష్టమును నెరవేర్చేవారుగా ఉన్నారు. అది మనుష్యుల యొక్క జీవించే కళ. అది దేవుని యొక్క జీవించే కళ కాదు. అది దేవుడు జీవించమన్న జీవించే కళ కాదు. అందుకే ఇశ్రాయేలీయులలో ఎక్కువమంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి. గనుక అరణ్యములో సంహరింపబడ్డారు. అంటే అది నేరమా, కాదా? చెప్పండి! దేవుని చట్టం ప్రకారము, భూమిమీద దేవునికి ఇష్టులు కాకపోతే వారు సంహరింపబడతారు. దేవునిచేత సంహరింపబడటానికా శ్రీశ్రీరవిశంకర్ లక్షల మందిని ఆహ్వానించింది? ఆయనచేత సంహరింపబడటానికా ఆ సాంస్కృతిక సభ నిమిత్తం పర్యావరణాన్ని పాడుచేసింది? ఆయన చేత సంహరింపబడటానికా అందరిచేత నాట్యమాడించినది, యోగ చేయించినది, ధ్యానం చేయించినది?? అందుకే.. దేవుని దగ్గరకు రండి, నేను అసలైన జీవించే కళను చెబుతాను. దేవుని చేత సంహరింపబడకుండా ఉండాలి అంటే దేవుడు చెప్పిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను కలిగి ఉండాలి. నా దగ్గరకు రండి అంటే ఎవ్వరూ రారు. ఎందుకంటే ఇది దేవుని అసలుసిసలైన జ్ఞానము. అనుగ్రహము పొందిన వారికే ఇది దొరుకుతుంది. ఆయన లెక్కలలో ఉన్నవారు మాత్రమే ఈ జ్ఞానమును నేర్చుకోగలరు. మిగిలినవారు నేర్చుకోలేరు. మిగిలినవారి హృదయాలకు ఇది ఎక్కదు. ఇది అంత శక్తివంతమైన జీవించే కళ!

**యెషయా 53 : 6 'మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను'.** దేవుడు ఏమని చెబుతున్నాడో చూడండి. ఈ ప్రపంచ ప్రజలకు వారి ఇష్టం వారిది. మా ఇష్టం మాది అనే జనులున్నారని దేవుడు చెబుతున్నాడు. పరలోకపు దేవునియొక్క చట్టం ఏమిటి? నీతో, నాతో దేవుడు చెప్పినది ఏమిటి? మనుష్యులందరికీ ఒకే ఒక్క తండ్రియైన ఆ దేవుడు చెప్పినది ఏమిటి? ఆయన ఏమంటున్నాడో తెలుసా? మనుష్యులందరూ తమకిష్టమైన త్రోవలకు తప్పిపోయిరి అంటున్నాడు. కాపరి లేకపోతే ఒక గొఱ్ఱె ఎలా దారి తప్పిపోతుందో, అలా మనుష్యులు దారి తప్పుతున్నారు. గొఱ్ఱెల మందను రోడ్డుమీద ఒక్కసారి విడిచిపెడితే, అవి ఒక క్రమంలో వెళతాయా? వాటికి నిరంతరము ఒక కాపరి ఉండాలి. కఱ్ఱ పట్టుకొన్న కాపరి ఉంటే తప్ప, అవి క్రమంలో వెళ్లవు. ప్రతి క్షణం మందను సరైన క్రమంలో పెడితే తప్ప ఆ గొఱ్ఱె బయటకు రాకుండా ఒక క్రమంలో వెళ్లదు. దేవుడు మనుష్యులను గొఱ్ఱెలతో పోల్చుతున్నాడు. అలా పోల్చి, మీరు మీకు ఇష్టమైన త్రోవలకు వెళ్లిపోయారు అంటున్నాడు. అంటే, ఒక్కొక్కడిది ఒక్కొక్క జీవించే కళ అన్నమాట! అందుకే దేవుడు చెప్పే ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలుసుకోండి అన్నాడు. అప్పుడు జనులు బ్రతుకుతారు. అప్పుడు వారు నిత్యత్వంలోనికి అడుగు పెడతారు. మరణించిన తరువాత నిత్య జీవితంలో నరక యాతన ఇక ఉండదు. అందుకే దానిని ప్రకటించడానికే, దానిని నేర్పించడానికే యేసుక్రీస్తు వచ్చాడు. ఆయన ఏదో ఒక అన్యమత వ్యాప్తి చేయటానికి రాలేదు. ఆయన క్రొత్త మతాన్ని ప్రారంభించడానికి రాలేదు. దేవుని అసలైన జీవించే కళను చెప్పడానికి క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. ఆయన ఈ భూమిపై ఎలా మాట్లాడుతున్నాడో, ఎలాంటి జీవించే కళను కలిగియున్నాడో చూద్దాం.

**యోహాను సువార్త 6 : 38 'యేసుక్రీస్తు – నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు'.** ప్రపంచమంతా ఈరోజు నేర్పించేదేమిటంటే, 'ఎవరి ఇష్టమును వారు నెరవేర్చుకోవటం, సంతోషించడం, ఆనందించడమే' మనిషికుండవలసిన జీవించే కళ అని చెప్పింది. కానీ దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఏమంటున్నాడో తెలుసా? అయన తన ఇష్టమును నెరవేర్చుకొనుటకు ఈ భూమిమీదకు రాలేదు. మరి ఆయన ఎందుకు వచ్చాడో చూడండి. ఏమి చేయటానికి వచ్చాడో చూడండి. **ఆయన తన్ను పంపినవాని చిత్తమును నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చాడు.** ఇదే దేవుని ఆర్ట్ ఆఫ్ లివింగ్! తన్ను పంపినవాడు పరలోకంలో ఉన్నాడు, ఆయనే మనందరి కన్న తండ్రియైన దేవుడు. ప్రతి ఒక్కడూ తన్ను పంపినవాని చిత్తమును నెరవేర్చుటకు వచ్చానని తెలుసుకొని, ఆ దేవుని ఆజ్ఞానుసారముగా

జీవించుటయే, మనిషి నెరవేర్చవలసిన జీవించే కళ. దేవుడు ఇచ్చిన ఆజ్ఞ ప్రకారం, ఆయన చిత్తమును నెరవేర్చుటకే ఈ భూమిమీదకు వచ్చాము. దీనిని మనుష్యులంతా నేర్చుకోవాలి. ఎవరైతే దేవుని కుమారుని ఆత్మగా మారాలి అనుకుంటున్నారో, ఎవరైతే ఆ నరకయాతనను తప్పించుకోవాలనుకుంటున్నారో వారు ఈ మాటలను అంగీకరిస్తారు! తదుపరి పాఠాలలో దేవుడు చెప్పబోవుచున్న అసలైన జీవించే కళలోనికి అడుగుపెడదాం. సిద్ధపడండి.

-------×-------

## ప్రశ్నలు

1. జీవించే కళ అంటే ఏమిటి? అది ఎవరిలో ఉంటుంది?
2. ప్రకృతిలోని జీవరాశులకున్న జీవించే కళను గూర్చి చర్చించండి.
3. శ్రీశ్రీ రవిశంకర్ ఎవరు? అతడు నేర్పించాలనుకున్న జీవించే కళ ఏమిటి?
4. మనిషి జీవించే కళను కోల్పోయాడు - వివరించండి.
5. ఆత్మ సంబంధియైనవాడు దేవుని సంగతులను ఏలాగు గ్రహిస్తాడు? వివరించండి.
6. దేవుడు చెప్పిన జీవించే కళను కోల్పోయి జీవిస్తే కలిగే పరిణామమేమిటి? వివరించండి.
7. యేసుక్రీస్తు ఈ లోకములోనికి జీవించే కళ కలిగినవానిగా ఎలా వచ్చాడో తెలియజేయండి.

-------×-------

ప్రియ పాఠకులారా! జీవించే కళ ఎలా? ఉపోద్ఘాతమును చదివిన మీకు ఇప్పటికే ఒక మంచి అవగాహన వచ్చిందని భావిస్తున్నాను. మిగిలిన ఐదు భాగములు మరియు ముగింపులోని ముప్పై భాగములను మీరు పూర్తిగా చదివిన తరువాత మీకు నిజమైన జీవించే కళ ఎలా ఉంటుందో అర్థమవుతుంది. నిజమైన జీవించే కళ ఈ ప్రపంచంలో అందరికీ అవసరం. ఇదంతా మీరు చదివితే ఈ లోకంలో ఎంతమంది జీవించే కళతో ఉన్నారో, ఎంతమంది నశింపచేసే కళలోనికి వెళ్లిపోతున్నారో మీరే ఒక నిర్ధారణకు వస్తారు. నిజంగా ఈ లోకంలో ఉన్నదంతా ప్రేత కళ; అది వారిని నిత్యాగ్నికి చేరువచేసే కళ! అది ఈ లోకమందున్న పాపమనే ఆత్మరోగమును కలిగిన రోగగ్రస్తులకు అర్థంకావడం లేదు. దేవుడు తన గ్రంథములో చాలా సంగతులను నిక్షిప్తపరిచి, వాటిని మనకు అందించాడు. అందులోని ప్రతి అంశమును మనము పరిశోధనాత్మకముగా నేర్చుకోవాలి. వాటిలోని పరమార్థము ద్వారా మన బ్రతుకును మార్చుకోవాలి, జీవించే కళను నేర్చుకోవాలి! మనుష్యులందరికి జీవించే కళ తెలియాలని దేవుడు అంటున్నాడు. ఇది దేవుడు చెప్పే పాఠం. ఒక మనిషిగా నేను చెప్పే పాఠం అయితే అది వేరేలా ఉంటుంది. అది నా మనస్సులో పుట్టినదై, అందరినీ ఆహ్వానించేదై, అందరికీ నచ్చేదై ఉంటుంది. కానీ ఇది అచ్చంగా దేవుని మదిలో పుట్టిన పాఠం. ఇది దేవుడు చెప్పాలనుకున్న పాఠం.

'జీవించే కళ' ఈ భూమిమీద పుట్టిన ప్రతి ఒక్కరికి అత్యవసరం! ఇప్పుడు మనం ఉన్నటువంటి ఈ తరంలో, ప్రస్తుతానికి భూమిమీద ఉన్న మనుష్యుల సంఖ్య సుమారు 800 కోట్లు. అందులో మనము ఒకరము. భూమిమీద ఉన్న ఏడు ఖండాలలో విస్తరించియున్న రెండు వందల దేశాలలో ఎంతో మంది ప్రజలు వివిధ మానవ జాతులుగా విభాగింపబడి బ్రతుకుతున్నారు. ఈ 800 కోట్లమందికీ తెలియవలసినదే జీవించే కళ. ఇది మనిషికి తెలియాలంటే ప్రకృతిలో మనతోపాటు ఎన్నో జీవులు జీవనాన్ని కలిగి ఉన్నాయి గనుక వాటిని గమనిస్తే అర్థమవుతుంది. మనతోపాటు ఎన్నో జీవరాసులు ఈ ప్రకృతిలో జీవిస్తున్నాయి కదా, వాటికి కూడా జీవించే కళ తెలియాలా? లేక మనిషికి మాత్రమే తెలియాలా? ఎందుకంటే ఇది జీవించే కళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) కదా. జీవులలో ప్రతీదీ జీవిస్తున్నది గనుక జీవించే ప్రతీదీ జీవించే కళకు సంబంధితమే! ఆవు జీవిస్తుంది, మేక జీవిస్తుంది, కోడి జీవిస్తుంది, పక్షులు జీవిస్తున్నాయి, పురుగులు జీవిస్తున్నాయి, సముద్రంలో చేపలు జీవిస్తున్నాయి, ఈ ప్రకృతిలో ఎన్నో జీవులు జీవిస్తున్నాయి. మనుష్యుల సంఖ్య 800 కోట్లయితే, జీవరాశుల సంఖ్య కోటానుకోట్లు. అందులో మన కంటికి కనిపించని సూక్ష్మ ఆకారంలో ఉన్న జీవులు కూడా ఉన్నాయి. సూక్ష్మదర్శినితో చూస్తే తప్ప కంటికి కనిపించని జీవులు కూడా ఉన్నాయి. ఇన్ని కోటానుకోట్ల జీవరాసులలో ఒక్కొక్కదానికి ఇలా పుస్తకాలను వ్రాసి జీవించే కళను నేర్పనక్కరలేదు. ఎందుకంటే, వాటికి ఎలా జీవించాలో ముందుగానే తెలుసు. కానీ, మనిషికి మాత్రమే జీవించే కళ ఎలాగో తెలియదన్నాడు దేవుడు. అందుకే ఈ 'జీవించే కళ ఎలా?' అనే పుస్తకమును జంతువులకొరకు వ్రాయలేదు; పక్షులకొరకు వ్రాయలేదు; పురుగులకొరకు వ్రాయలేదు; గాని, మనుష్యులకొరకు మాత్రమే వ్రాయబడింది. అయినా, అందులో కూడా చాలా మంది దీనిని చేజిక్కించుకోలేకపోతున్నారు. ఇది మీచేతికి రావడం చాలా మంచిది. జీవించే కళ ఎలా? అన్నప్పుడు జీవులన్నిటికి ఇది అక్కరలేకుండా, అది కేవలం మనిషికి ఒక్కడికే ఎందుకు చెబుతున్నారు? జీవులన్నిటికి కూడా తెలియాలి కదా అని మీరడిగితే, సకల జీవులకు జీవించే కళ చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే అవి పుట్టీ పుట్టగానే జీవించే కళను తెలుసుకొని జీవిస్తున్నాయి. జీవించే కళను తు.చ. తప్పకుండా పాటిస్తున్నాయి. అవునండీ! ఈ సకల జీవరాసులలో ప్రతి జీవికి (మనిషికి తప్ప) జీవించే కళ తెలుసు! అవునంటారా, కాదంటారా? తెలుసంటారా? తెలియదంటారా? ఖచ్చితంగా తెలుసు! రెండు రెక్కలు కలిగిన పక్షి ఎలాంటి జీవనమును కలిగి ఉంటుందో చూడండి. తన జీవిత కాలమంతా ఎల్లప్పుడూ జీవించే కళ తెలిసినదిగా ఆకాశంలోనే ప్రయాణిస్తుంది, చెట్లమీదే నివశిస్తుంది, తనకు నిర్ణయింపబడిన ఆహారమును తింటుంది, తన జాతి ఉనికిని కాపాడుకోవడంలో కీలక పాత్ర వహిస్తుంది. ఆ

జాతి పక్షి ఏమి తినాలో, ఏ జాతి పక్షి ఎలా గూడు కట్టుకోవాలో, ఏ జాతి పక్షి ఎలా నివశించాలో, ఎలా దేవునికి భయభక్తులు కలిగి ఉండాలో.. ఇదంతా ఒక చిన్న పక్షికి తెలుసు. పక్షికి జీవించే కళను మనము నేర్పించవలసిన అవసరత లేదు. అలాగే, జీవించే కళను ఒక ఆవుకు నేర్పించవలసిన అవసరం లేదు. ప్రతి ఆవు తన యజమాని పెట్టిన గడ్డిని తినాలి. తన యజమానికి పాలునివ్వాలి, పేడనివ్వాలి, తన యజమాని కట్టిన చోటే తానుండాలి. అది ఆవు జీవించే కళ. అది ఆవుకు పూర్తిగా తెలుసు. అంతేకానీ, ఏ ఆవూ ఏరోజూ తన యజమానికి పాలునివ్వకుండా మొరాయించిందా? లేదు. పోనీ, యజమానిని తన రెండు కొమ్ములతో పొడిచి చంపి, మర్డర్ చేసేసిందా? ఎప్పుడైనా ధర్నా చేసిందా? ఎర్రజెండా పట్టుకుందా? తన శ్రామిక శక్తికి తగిన ఫలితాన్ని అడిగిందా? లేదు. మీరు ప్రకృతిలో ఏ జీవరాశిని చూచినా అవన్నీ చక్కగా బ్రతుకుతున్నాయి. సముద్రములో జీవిస్తున్న చేపలను చూస్తే అవి విస్తారమైన సంఖ్యలో ఉంటాయి. వాటి సంఖ్య ముందు మన సంఖ్యెంత చెప్పండి! ఈ జీవకోటి ముందు మన సంఖ్య ఎంత చెప్పండి? మన తండ్రియైన దేవుడు మనకు ఆధిక్యతనిచ్చాడు గనుక బ్రతికి బట్టకట్టగలుగుతున్నాము తప్ప, అసలు ఈ జీవరాసుల ముందు మనమెందుకూ సరిపోము. గుర్రం వేగం ముందు మనిషి వేగం సరిపోతుందా? దానితో సమానంగా పరిగెడితే మన కీళ్లు వదిలేస్తాయి. ఏనుగు ముందు బాగా కండలు పెంచిన వాడి బలం సరిపోతుందా? తొండంతో కొట్టిందంటే మరల ఇరుపంచలా కనిపించడు. ప్రకృతిలో ఉన్న జీవుల బలం ముందు మనిషి బలం ఎందుకూ సరిపోదు. పాముకున్న విషం చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. తన కోరల్లోని విషం మనిషికి ఎక్కించిందంటే, అక్కడికక్కడే నురుగ కక్కుకుంటూ చావాలి. పులి బలం ముందు మనిషి బలం సరిపోదు. సింహం ముందు మనిషి సరిపోడు. అంతెందుకు? చిన్న చీమ ముందు, దోమముందు కూడా మనిషి సరిపోడు. దోమలకు మనిషి భయపడిపోతాడు. చీకటి పడిందంటే ఇంటిలోకి ఆల్ అవుట్ తెచ్చుకోవాల్సిందే. ఎందుకంటే, ఒక్క దోమ కూడా మిగలకూడదు. లేదంటే దోమలతో ఆ గదిలో ఉన్న మనుష్యులంతా అవుట్ అయిపోతారు. అందుకే దోమంటే మనిషికి భయం. ఈ ప్రకృతిలో ఏది తన విశ్వరూపాన్ని చూపించినా మనిషి దానిముందు ఎందుకూ పనికిరాడని గుర్తు చేయడానికా అన్నట్లు, ఒక్కొక్కసారి ఏనుగులు మనుష్యులపై దాడి చేస్తుంటాయి, కుక్కలు మనుష్యులను కరిచేస్తుంటాయి, గేదెలు మనుష్యులను పొడిచేస్తుంటాయి, పాములు మనిషిని కాటేస్తుంటాయి. జీవరాసులలో దేని ముందూ మన బలం సరిపోదు; కానీ, దేవుడు మనిషికి ఆధిక్యతనిచ్చాడు కనుక విస్తారమైన వాటి మధ్య హాయిగా జీవిస్తున్నాడు. కానీ ఏ మనిషీ పుట్టినప్పటినుండి చచ్చేవరకు దేవుడు ఈ ఆధిక్యతనిచ్చాడని గుర్తు చేసుకోడు, జ్ఞాపకంలో ఉంచుకోడు. ఇలా జీవుల మధ్య ఇంత హుందాగా, గొప్పగా జీవించడం కేవలం నా బాహుబలమే అనుకుంటాడు. 'జూ'లో కొన్ని జంతువులను పెట్టగలుగుతున్నానంటే అది కేవలం నా గొప్పతనమే అనుకుంటున్నాడు మనిషి. కాదు! దేవుడు మనిషి చేతికి వీటన్నింటినీ అప్పగించాడు కనుక అవన్నీ మనిషికి లోబడి బ్రతుకుతున్నాయి. అలా లోబడి బ్రతకడంలోనే అవి వాటియొక్క జీవించే కళను కలిగి ఉన్నాయి. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో ఆదికాండము దగ్గరనుండి ప్రకటన గ్రంథము వరకు పాత నిబంధన, మరియు క్రొత్త నిబంధనలలో గల 66 పుస్తకాలలో ఈ జీవులను గూర్చి దేవుడు ఏ మాట వ్రాయించాడో ఆ మాటలలో ప్రతిదానిని, అనగా పొల్లు కానీ, సున్నా కానీ తప్పిపోకుండా అవి పాటిస్తున్నాయి. బైబిల్‌ను గూర్చి చాలామంది ఒక తప్పుడు ఆలోచన కలిగి ఉంటారు. అదేమిటంటే, దేవుడు తన గ్రంథములో చాలా వ్రాయిస్తాడండీ, కానీ, అవన్నీ మేము పాటించగలమా? అబద్ధం ఆడతాం, దొంగతనం చేస్తాం, వ్యభిచారం చేస్తాం.. దేవుడైతే ఎన్నో వ్రాయించుకొంటాడు. కానీ అవన్నీ మావల్ల కాదు అంటుంటారు. ఏమి? నీకంటే ఆకారంలో చిన్నదైన ఒక చీమ దేవుడు వ్రాయించిన దానినంతటినీ పాటిస్తుంది మరి! ఇప్పుడేమంటారు? అందరికొరకు, అన్నింటికొరకు దేవుడు తన గ్రంథములో జీవించే కళను వ్రాయించాడు. మన చుట్టూ ఉన్న జీవరాసులన్నీ దానిని తు.చ. తప్పకుండా పాటిస్తున్నాయి కానీ, మనిషే ఎందుకని పాటించడం లేదు?

ఇంకా మీరు నమ్మకపోతే మీకు ఒక మంచి ఉదాహరణ చెబుతాను. ఈ రోజు మన మధ్య ఎన్నో న్యాయస్థానాలున్నాయి. ఆ కోర్టులలో న్యాయవాదులున్నారు, న్యాయమూర్తులున్నారు. ఈ న్యాయస్థానాలన్నీ తప్పుచేసిన వారికి శిక్ష విధిస్తాయి. అటువంటప్పుడు, మీరు పుట్టినప్పటినుండి ఇప్పటి వరకు ఏ న్యాయస్థానములోనైనా ఒక దోషిగా

ఒక గేదె నిలబడిందా చెప్పండి? లేదు. ఒక ఆవును నేరస్థునిగా నిలబెట్టారా? ఈ కోడి దోషం చేసింది, దీనికి ఫలానా ఐ.పి.సి. సెక్షన్ ప్రకారం శిక్ష విధించండి అని ఏ న్యాయవాది అయినా వాదించాడా? ఏ న్యాయమూర్తి అయినా శిక్ష విధించగలిగాడా? లేదు. ఈ సృష్టిలో ఏ జీవికీ, ఏ శక్తికీ అనగా భూమికి గాని, సూర్యునికి గాని, గాలికి గాని, నీటికి గాని, జీవరాశులలో దేనికీ ఇప్పటివరకూ మనిషి నేరాన్ని ఆపాదించలేక పోయాడు. మన మధ్యనే మనుగడ కొనసాగిస్తున్న ఏ జీవి మీదా దోషాన్ని మోపలేకపోయారు. ఎందుకంటే, దీనికంతటికీ ఒకే ఒక్క కారణం ఉంది. అదేమిటంటే, అవన్నీ జీవించే కళను కలిగివున్నాయి. అవి ఎలా జీవించాలో వాటికి చాలా చక్కగా తెలుసు. అందుకే అవి ఏనాడూ దోషులు కాలేదు. చీమ దోషి కాదు, దోమ దోషి కాదు. పశువు దోషి కాదు, పక్షి  దోషికాదు. వాటికి ఎవ్వరూ శిక్ష విధించలేరు, వాటికి ప్రతిగా ఏ మాటనూ చెప్పలేరు. కానీ నేడున్న న్యాయస్థానాలు వేటితో నిండిపోతున్నాయి? పోలీస్‌స్టేషన్‌లు, జైలులన్నీ ఎవరితో రద్దీగా ఉన్నాయి? కేవలం మనుష్యులతో మాత్రమే కదా. ఇప్పుడు నేను చెప్పేది అబద్ధం కాదు. ఇది మనము అంగీకరించవలసిన పచ్చి నిజం. మన భారతదేశపు అత్యున్నత న్యాయస్థానానికి ప్రస్తుతమున్న మన సుప్రీంకోర్టు న్యాయమూర్తి గారు(జస్టిస్ టి. ఎస్. ఠాకూర్, 01-05-2016 నాటికి) చాలామందికి తెలుసుండాలి. ఈ ఠాకూర్ గారు ఏమంటున్నారో తెలుసా? 'న్యాయవిలాపం' అనే శీర్షికతో ఈనాడు దినపత్రికలో ఒక వార్త ప్రచురమైనది. న్యాయ విలాపం అనగా, న్యాయం ఏడుస్తుందట. ఆ సందర్భంలో ఠాకూర్‌గారు, ప్రధానమంత్రి సమక్షంలో కంటతడి పెట్టుకున్నారు. జస్టిస్ ఠాకూర్‌గారికి కన్నీరు ఎందుకంటే, న్యాయవ్యవస్థపై తలకు మించిన భారం పడుతుందట. ప్రభుత్వం న్యాయమూర్తుల సంఖ్యను పెంచడంలేదు. ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయమూర్తుల సంఖ్యను ఎందుకు పెంచాలి? నేరాలు పెరిగిపోయాయి. అందుకే ఆయన ఆనాడు కన్నీళ్లు పెట్టుకున్నారు. నేరస్థులకోసం న్యాయస్థానాలు సరిపోవడంలేదు, న్యాయవాదులు సరిపోవడం లేదు, న్యాయమూర్తులు సరిపోవడం లేదు. కోర్టులకు తలకు మించిన భారం అవుతోంది అంటున్నారాయన. ఆయన ఇంతకీ కంటతడి పెట్టుకోవలసిన అవసరమేమిటి? జస్టిస్ ఠాకూర్‌గారు ఈ మాటలు చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటి? అసలేం జరుగుతోంది? భారతదేశంలో ఈ విషయమై వాస్తవ పరిస్థితులెలా ఉన్నాయంటే - అది చాలా భయంకరమైన పరిస్థితి.  01-05-2016 నాటికి ఆ పరిస్థితిని చదవండి.

ఆయన కన్నీళ్లు పెట్టుకొన్న నాటికి కేసులు ఎన్నో తెలుసా? దేశంలో కేసుల భారమును ఈనాడు పేపర్‌లో వ్రాస్తున్నారు చూడండి. *'భారతదేశంలో కేసుల భారం' ఇలా..! సబార్డినేట్ న్యాయస్థానంలో పెండింగ్ కేసులు 2,68,51,766 కేసులు. ఈ కేసులన్నీ ఎవరిమీద అనుకుంటున్నారు? చీమల మీదో, దోమలమీదో కాదు. మనుష్యుల మీద! ఇంకా, హైకోర్టులలో పెండింగ్ కేసులు 38,00,000. ఇంకా వీటికి తీర్పులనివ్వలేదు. అప్పటికే తీర్పునిచ్చేసినవి ఇంకా లక్షలలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టులలో తీర్పునివ్వకుండా ఇంకా ఎన్ని కేసులుండిపోయినవో తెలుసా? 38,00,000 కేసులు. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసులు 60,260.* కోర్టులన్ని దాటుకొంటూ వెళతారు గనుక, సుప్రీంకోర్టులో కాస్త తక్కువగా ఉన్నాయి. కానీ సుప్రీంకోర్టుకు అది కూడా చాలా ఎక్కువే. అక్కడ సుప్రీంకోర్టులో ఈ కేసుల సంఖ్య చూసుకుని, ఆ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగారు ఒక సభలో అందరిముందూ కన్నీళ్లు పెట్టుకొంటున్నారు. ఇది వారికి తలకు మించిన భారం అవుతోంది. భారతదేశములోని మనుష్యులు చేసే అకృత్యాల వల్ల, అక్రమాల వల్ల వీరి యొక్క కేసులను పరిష్కరించడం వారివల్ల కావడం లేదు. అందుకే న్యాయస్థానాలు పెంచండి, న్యాయవాదులను పెంచండి, న్యాయమూర్తులను పెంచండి అని ఒక ప్రక్కన ఠాకూర్ గారు ఏడ్చేస్తున్నారు. అప్పుడు ఆనాటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీగారు ఏమన్నారంటే, మీరేం బాధపడకండి. భవిష్యత్తులో మేము న్యాయస్థానాలు పెంచుతాం, మేం న్యాయవాదులను పెంచుతాం, మేము న్యాయమూర్తులను పెంచుతాం అని అప్పటికి హామీ ఇచ్చారు. అంతేకానీ, భారతదేశపు ప్రజలకు జీవించే కళను నేర్పుదాం అని మాత్రం అనలేదండి. అలా అనలేరు కూడా. నిజానికైతే అన్నిటికంటె ముందుగా ప్రజలకు ఈ జీవించే కళను మాత్రమే నేర్పించాలి. సకలకోటి జీవరాశిలో లేని ఈ దౌర్జన్యం మనుష్యులలో ఎందుకొచ్చింది? ఎందుకంటే మనిషికి జీవించేకళ తెలియదు. మనిషి ఎలా జీవించాలో మనిషికి తెలియదు. అందుకే ఈ రోజు న్యాయస్థానాలలో మనిషికి సంబంధించిన కేసులు ఎన్నెన్నో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వానికి తలకు మించిన భారం అవుతోంది. దీనికి ఆదిలోనే మంచి వైద్యం చేయకూడదా?

రోగం ముదరకుండా ప్రారంభంలోనే మంచి నిర్ణయం తీసుకోవద్దా? మనిషి నేరం చేసిన తరువాత, ఆ నేరస్తులను పోలీసులు పట్టుకొని, సాక్ష్యాధారాలతో సహా వారిని న్యాయస్థానానికి తీసుకొని వెళ్లి, శిక్షలను విధించి, మరల బయటకి వదలడం ఎందుకు? అసలు మనిషి నేరమే చేయకుండా, ప్రతి మనిషికీ మంచి జీవించే కళను నేర్పించవచ్చు కదా. అలా నేర్పించరు, నేర్పించలేరు. ఇది దేవుడు చెప్పే పాఠం. ఇది దేవుని పుస్తకం. దేవుని మాటలు ఈలాగే ఉంటాయి. దేవుడైతే ఎక్కడ సరిచేయాలో చెబుతాడు. ఎక్కడ వైద్యం చేయాలో నేర్పిస్తాడు. ఒక వైద్యుడు రోగికి ఎలా చెబుతాడో ఆయన కూడా అలాగే చెబుతాడు. వైద్యుని మాటలు వినకపోతే రోగికే రిస్క్. అందుకే ద్వేషంతో కాకుండా ఆలోచనాత్మకంగా చదవండి. ఇదేమిటో ఈ పుస్తకములోని మాటలు క్రొత్తగా ఉన్నాయి అని ఆలోచించాలి, పరిశోధించాలి. ఇది నిజమా, కాదా? అవును. పరిశోధనాత్మకంగా, హేతుబద్ధంగా చదివితేనే ఏదైనా మనకు అర్థమౌతుంది. ఏదో నేను చెప్పానని నామీద ప్రేమతో మీరు నమ్మవద్దు. మీ తండ్రియైన దేవుని మీద భక్తితో, మిమ్మును మీరు రక్షించుకోవాలనే ఆశతో చదవండి. కానీ నేడు మనం నివసిస్తున్నటువంటి ప్రజల మధ్య అలాంటి ఆలోచనలు లేవు. భూమిమీద మనుష్యులుగా ఉన్న ఏ ఒక్కరికీ జీవించే కళ తెలియదు. ప్రకృతిలో నివసిస్తున్న ప్రతి జీవికీ ఖచ్చితంగా జీవించేకళ తెలుసు. దేవుడు వ్రాయించిన ఒక మంచి మాటను ఇప్పుడు మనము పరిశీలన చేద్దాం.

**యెషయా 48 : 13 'నా హస్తము భూమికి పునాది వేసెను. నా కుడి చెయ్యి ఆకాశవైశాల్యములను వ్యాపింపచేసెను. నేను వాటిని పిలువగా ఒకటి తప్పకుండా అవన్నియు నిలుచును.'** అన్నాడు దేవుడు. చూశారా! ఆయన భూమిని కలుగజేసాడు, ఆకాశాన్ని కలుగజేసాడు. ఆయన పిలువగా అనగా, వాటిని ఒక్కసారి రమ్మంటున్నాడు. ఆయన కలిగించిన వాటిని రమ్మనగానే అన్నీ వచ్చేయాలి. అలాగే వస్తున్నాయి చూడండి. ఆయన వాటిని పిలువగా ఒకటి కూడా తప్పిపోకుండా అవన్నియు నిలుచును. ఇంకా **యెషయా 48 : 14** లో ఏమంటున్నాడో చూడండి. **'మీరందరూ కూడి వచ్చి ఆలకించుడి.'** దేవుడు పిలిస్తే భూమ్యాకాశాలు వస్తాయి కానీ, మనుష్యులు రారు. మనుష్యులకు జీవించే కళ తెలిస్తేకదా రావటానికి! ఆయన పిలిస్తే ఆకాశం వచ్చేసింది, ఆయన పిలిస్తే భూమండలము వచ్చేసింది. ఆయన పిలిస్తే వర్షము, హిమము, మేఘములు, ప్రకృతిలో ఎన్ని శక్తులు ఉంటే అన్ని శక్తులు, ఆయన చేత సృష్టింపబడిన జీవరాసులన్నీ ఒకటి కూడా తప్పకుండా వస్తున్నాయి. అవన్నీ ఆయన ఆజ్ఞలకు లోబడి బ్రతుకుతున్నాయి. ఆయన పిలువగా ఒక్కటికూడా తప్పిపోలేదు. కానీ ఈ రోజు మనుష్యులు ఎంతమంది తప్పిపోయారో చూడండి. జనులారా, నా మాటల యొద్దకు రండి అని దేవుడు పిలుస్తున్నాడు. అలాగని దేవుని యొద్దకు రానివారిలో ఎవరికైనా ఒకవేళ జీవించే కళ తెలుసా అంటే, అదీ లేదు. భూనివాసులకు జీవించే కళ తెలుసా? చెప్పండి. పోని తెలిస్తే చెప్పమనండి చూద్దాం. ఈ రోజు సమాజంలో జీవించే కళను చెప్పాలంటే దేవుడే చెప్పాలి. ఆయన వ్రాయించిన మాటలలోనే మనము దానిని చూడాలి. దానికి మించినది ఎవ్వరూ చెప్పరు, చెప్పలేరు. దేవుని జ్ఞానమెరుగని కొందరు జీవించే కళను చెబుదాం అనుకున్నారు. చెబుతున్నాము అనుకుంటున్నారు. అలా అనుకొని ఏం చెబుతున్నారో తెలుసా? మనుష్యులందరూ సంతోషంగా ఉండడమే జీవించేకళ అన్నాడు ఒకాయన. మీరందరూ యోగా చేయడమే జీవించే కళ అన్నాడు మరొకాయన. మీరందరూ ధనాన్ని బాగా సంపాదించడమే జీవించే కళ అన్నాడు మరొకాయన. ఎవ్వరూ సరైన సమాధానమును చెప్పలేదు. ఒకవేళ చెప్పి ఉంటే ఈ రోజు సమాజం ఇలా ఉండదు. సమాజం చక్కగా ఉంటే నేను జీవించే కళను చెప్పవలసిన అవసరతే లేదు. మనము నివశిస్తున్న ఈ సమాజం బాగోలేదు. ఉదాహరణకు ఒక మెయిన్‌రోడ్‌కి వెళ్ళిచూస్తే ఈ సమాజం ఎలా ఉందో అర్థమౌతుంది. ఒక దుకాణంలో వ్యాపారి దగ్గరకు వెళ్లి చూస్తే ఈ సమాజం ఎలా ఉందో అప్పుడు అర్థమౌతుంది. ఏ మనిషితో మాట్లాడినా ఈ సమాజం ఎలా ఉందో అర్థమౌతుంది. ఆ మనిషి మాటలలో, ప్రవర్తనలో సమాజపు దుస్థితి మనకర్థమౌతుంది. ఈ మనుష్య సమాజములో ఏ ఒక్కరికీ జీవించే కళ తెలియదని అర్థమౌతుంది. దాదాపుగా ఈ మనుష్యులందరూ స్వార్థపరులు. మీ దగ్గరనుండి వారికి ఏదైనా లాభం వస్తుందేమో చూసుకొంటారు. అంతే! మిమ్మును ఎలా మోసం చేయాలా అని ఆలోచిస్తుంటారు. ఒక వ్యాపారి కావచ్చు, ఒక ఉద్యోగి కావచ్చు, ఒక ఉపాధ్యాయుడు కావచ్చు. రక్తసంబంధీకులు కావచ్చు, పరాయివారు కావచ్చు. ఎవరైనా సరే. ఇంటిలో సహోదరుల మధ్య కూడా సఖ్యత లేదు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేదు. భార్యభర్తల మధ్య సఖ్యత లేదు. ఒకరిని ఒకరు చంపుకోవాలనే

ఆలోచనతో రగిలిపోతున్నారు. పగ, ద్వేషాలతో నిండిపోతున్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం ఒక్కటే! వారికి జీవించే కళ తెలియదు. ఈ భూమిమీద దేవుడిచ్చిన ఆయుష్కాలములో ఎలా జీవించాలో తెలియదు. ఉదయం నిద్రలేచిన దగ్గరనుండి రాత్రి నిద్రపోయేవరకు, ఒక వ్యక్తి ఎలా బ్రతకాలి? ఎలా మాట్లాడాలి? ఎలాంటి చూపును కలిగి ఉండాలి? ఎలాంటి అడుగులు వెయ్యాలి? ఏ పనులు చెయ్యాలి? ఇవేవీ మనిషికి తెలియదు. సరిగ్గా నేను ఈ 5 భాగాలలో అదే నేర్పిస్తాను, మీరు జాగ్రత్తగా పూర్తిగా చదివి అర్థంచేసుకుంటే దానినే నేర్చుకొంటారు. మిమ్మల్ని నవ్వించి పంపించడానికి ఇక్కడ నేను బఫూన్‌ని కాదు. ఎందుకంటే, చాలామంది ఇలాగే అనుకుంటున్నారు. జీవించే కళ అంటే ఏమిటంటే అందరిని నవ్వించటమే అంటున్నారు కొందరు. నవ్వించడం ఎవరు చేస్తారు? ఒక బఫూన్ చేస్తాడు, ఒక మెజీషియన్ చేస్తాడు, ఒక గ్యాస్ కూడా ఆ పని చేస్తుంది. నైట్రస్ ఆక్సైడ్ అనే వాయువు పేరు మీరు వినుండాలి. నైట్రస్ ఆక్సైడ్ మీ మధ్యలోనికి విడిచి పెట్టాననుకోండి, మీరందరూ పగులబడి నవ్వుతూనే ఉంటారిక. హృదయంలో నుండి వచ్చిన నవ్వు కాదది. అది కృత్రిమమైన నవ్వు. అలాంటి నవ్వు మీ శరీరానికి, మీ ఆరోగ్యానికి మంచిది కాదు. ఈ సమాజం మోసపోయింది. ఏదో విధంగా నవ్వాలని ఆలోచిస్తుంది. అందుకే జబర్దస్త్, టపాస్ వంటి కామెడీ కార్యక్రమాలు పుట్టుకొచ్చాయి. వాటిలో మీకు లభించేది కేవలం కృత్రిమమైన నవ్వు. మీరు సోఫాలో కూర్చుని రిమోట్‌లో బటన్ నొక్కితే, ఏదో ఒక ప్రోగ్రామ్ చూస్తే మీకు నవ్వు వచ్చేసింది. దానికి, నైట్రస్ ఆక్సైడ్ గ్యాస్‌కి పెద్ద తేడా లేదు. మనుష్యులేమో ఒక ప్రక్క విచారంలో ఉన్నారు. తీరని బాధలలో ఉన్నారు. తమ కుటుంబాన్ని ముందుకు ఎలా నడిపించాలో ఆలోచిస్తున్నారు. అలాంటి పరిస్థితులలో ఉన్నప్పుడు ఒక కుర్చీలో కూర్చుంటే, బుల్లితెరలో మీకు ఏదో కనిపిస్తే, మీరు ఏదో ఒక జోకు వింటే, ఫక్కున నవ్వేస్తున్నారంటే అది నిజమైన ఆనందమంటారా? అది నిజమైన నవ్వు కాదు. ఇది మన దేశములోని పరిస్థితి మాత్రమే కాదు. ప్రపంచ నలుమూలలా అన్ని దేశాలలో, అన్ని ప్రాంతాలలో మనుష్యులు మోసపోతున్నారు. నవ్వంటే ఒక నవ్వుల పుస్తకం కొనుక్కొని, దానిని చదువుకొని పగలబడి నవ్వడం కాదు. అది కాదు నవ్వంటే. అది కాదు సంతోషమంటే. ఈ నా 5 భాగాలలో మీకు నిజమైన సంతోషము ఎలా ఉంటుందో చెబుతాను. 'జీవించే కళ ఎలా?' అనే ఈ పుస్తకమును పూర్తి చేసినప్పటికి మీరు నిజమైన సంతోషం అంటే ఏమిటో ఖచ్చితంగా తెలుసుకుంటారు. నిజంగా మీరు ఎలా సంతోషించాలి? నిజంగా మీరు జీవించే కళను ఎలా కలిగిఉండాలి? అనే దానిని మీరు తెలుసుకోవాలి. ఈ ప్రకృతిలో ప్రతి జీవరాశి దానిని తెలుసుకున్నది గనుక వాటిలో దేనికీ కన్నీరు లేదు. వాటిలో దేనికీ వేదనలేదు. ఏదీ ఏనాడూ మనిషిలా ఆత్మహత్య చేసుకోవాలనుకోలేదు. వాటికి జీవించే కళ తెలుసు. అలాగని అవేమైనా రోజూ కామెడీ కార్యక్రమాలను చూస్తున్నాయా? అవేమైనా జోకుల పుస్తకాలను చదువుకుంటున్నాయా? లేదు, లేదు. ఒక పక్షి ఎంత ఆనందంగా గాలిలో ఎగురుతూ ఉంటుందో చూసారా! ఒక చేప సముద్రంలో ఎంత సంతోషంగా ఈదుతుందో గమనించారా? వాటిని మనిషి ముట్టుకోనంత వరకు, వాటి జీవనాన్ని మనిషి పాడుచేయనంతవరకు వాటికి ఎంత ఆనందమండీ! కృత్రిమం లేదక్కడ. ఏ జీవినైనా చూడండి, అన్నీ సంతోషంతో ఉన్నాయి. నవ్వితేనే సంతోషమా? నవ్విన ప్రతివాడు సంతోషపడినట్టుకాదు. నవ్వని వారు దు:ఖంలో ఉన్నట్టూ కాదు. మనిషి పైకి తనను తాను మోసగించుకొంటున్నాడు. ఏదో నేను నవ్వుతున్నాను అని చూపించుకోవటానికి పళ్ళు ఇకిలిస్తున్నాడు, అంతే గాని అది నిజమైన నవ్వుకాదు. మనిషి దగ్గర నిజమైన జీవించే కళ లేదు. మీరు ఇలాంటి ధోరణితో బైబిల్‌ను ఎప్పుడూ విని ఉండరు. బైబిలంటే చాలా గొప్పది. బైబిలంటే ఏమనుకున్నారు? క్రైస్తవులు వారి చంకలో పెట్టుకొని ఆదివారం వారి ఆరాధన తరగతి ఎప్పుడో చూసుకొని, నాలుగుగోడల మధ్యలోనికి వెళ్ళిపోయి, 2 గం॥ పాటు భజన, ధ్యానం చేసేది అనుకున్నారా బైబిలంటే? నిజంగా బైబిల్ అంటే ఏంటో తెలుసా? ఈ ప్రపంచమంతటికి జీవించే కళను(ఆర్ట్ ఆఫ్ లివింగ్) నేర్పించేది. బైబిలంటే మతపుస్తకం కాదు. క్రైస్తవ్యమంటే ఒక మతం కాదు. మత పుస్తకంలో లేక ఒక మతంలో ఏముంటాయి చెప్పండి? కొన్ని ఆచారాలుంటాయి. కొన్ని పద్ధతులుంటాయి. కానీ, బైబిల్‌లో అవేమీ లేవు. బైబిల్‌లో అలాంటి సంగతులు లేవు. తలకు మించిన భారాన్ని దేవుడు మనుష్యుల మీద పెట్టలేదు. మిమ్మల్ని ఫలానాది చేయమని, ఫలానాది తినవద్దని, ఫలానాది ఇవ్వమని దేవుడు చెప్పాలనుకోలేదు. దేవుడు మనుష్యులకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. ఎందుకంటే ఆయన మనకు జీవించే కళను నేర్పించాలనుకొంటున్నాడు. ఆయన సృష్టించిన

ఈ భూమిమీద ఆయన ప్రజలైనవారు ఎలా జీవించాలో ఆయన చెప్పాలనుకోవడం తప్పా? ఆయన మాటలు ఎవ్వరూ పట్టించుకోలేనప్పుడు మనుష్యులకు బుద్ధి చెప్పాలనుకోవడం తప్పా? ఒక కుటుంబ యజమాని చెప్పిన మాట కుటుంబంలో ఉన్నవారందరూ వినాలి అనేది న్యాయం. ఎందుకంటే, ఆ కుటుంబ యజమాని ఆ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ కుటుంబములో యజమాని చెప్పిందే జరగాలి. సర్వలోకానికి కర్తయైన దేవుడు చెప్పిన ప్రతి మాట ఈ సర్వలోకములో జరగాలి. కానీ ఎక్కడ జరుగుతుంది చెప్పండి? పైకి మాత్రం మన మాటలలో దేవునికి ప్రార్థనలు చేసేస్తాం. పరలోకమందు నీ చిత్తము నెరవేరునట్లు భూమిమీద కూడా నీ చిత్తము నెరవేరునుగాక అని పలుకుతాము. ఏది? ఎక్కడ? నెరవేర్చేవారేరి? దేవుని కోరిక ఎక్కడ ఎవరిలో జరుగుతుంది చెప్పండి? పరలోకంలో ఆయన అనుకున్నది చక్కగా జరుగుతుంది. కానీ, భూమిమీద మనుష్యుల మధ్య మాత్రం ఆయన అనుకున్నది ఎక్కడ జరుగుతుంది చెప్పండి? ఎక్కడా జరగడంలేదు. భూమిమీద మనము పుట్టినందుకు మనం చచ్చేలోపు దేవుడు అనుకున్నది భూమిమీద మన ద్వారా జరిగించాలి. అందుకేనండి! జీవించే కళ ఎలా? అనే అంశమును పరలోకపు దేవుడు చెప్పాలనుకొన్నాడు. దేవుడు భూమిమీద ఉన్న మనుష్యుల మధ్య ఇలాంటి మాటలే ప్రకటింపబడాలి అనుకున్నాడు. ఆయన పుస్తకం పుస్తకంగానే ఉండిపోయింది. ఆయన మాటలు మాటలుగానే ఉండిపోయాయి. ఆ దేవుని మాటలు మనుష్యులందరి దగ్గరకు వెళ్లి జీవించే కళను రాబట్టలేకపోతున్నాయి. సమాజాన్ని మార్చలేకపోతున్నాయి. ఈ విషయంలో పరలోకమందు ఆయన చాలా వేదనతో ఉన్నాడు. మనిషికి జీవించే కళ చెప్పాలని దేవుడు చాలా ఆతురపడుతున్నాడు. ఆయన మాటలు మనుష్యుల మార్పు కొరకు ఎదురుచూస్తున్నాయి.

**కీర్తనలు 148 : 1 - 4 'యెహోవాను స్తుతించుడి. ఆకాశవాసులారా, యెహోవాను స్తుతించుడి. ఉన్నతస్థలముల నివాసులారా, ఆయనను స్తుతించుడి. ఆయన దూతలారా, మీరందరు ఆయనను స్తుతించుడి. ఆయన సైన్యములారా, మీరందరు ఆయనను స్తుతించుడి. సూర్యచంద్రులారా, ఆయనను స్తుతించుడి. కాంతిగల నక్షత్రములారా, మీరందరు ఆయనను స్తుతించుడి. పరమాకాశములారా, ఆకాశముపైనున్న జలములారా ఆయనను స్తుతించుడి.'** ఈ పుస్తకమును చదువుచున్న క్రైస్తవులారా, క్రైస్తవేతరులారా! మంచి విషయాన్ని మీరిక్కడ తెలుసుకుంటారు. దేవుని స్తుతించడం అంటే ఏమిటి? ఇప్పటి వరకు సాధారణంగా మనం నేర్చుకొన్నదేమిటి? స్తుతి, స్తుతి, స్తుతి, స్తుతి, ... ... అని నోటితో చెప్పడమే దేవున్ని స్తుతించడం అనుకొని ఉంటారు. దేవున్ని కీర్తిస్తూ భజనలు చేయడమే దేవున్ని స్తుతించడం అని నేర్చుకుని ఉంటారు. ఇదే ప్రపంచానికి తెలిసిన దైవస్తుతి. కానీ ఆ స్తుతి నిజమైనది కాదు. అసలు అది దేవునికి స్తుతే కాదు. జీవించే కళ తెలిసిన దూతలు, దేవుని సైన్యములు, సూర్య చంద్ర నక్షత్రములు, ఆకాశములు, జలములు, ఈ సర్వ సృష్టి దైవస్తుతి ఎలా చేస్తున్నాయో జాగ్రత్తగా గమనించండి. యెహోవాను స్తుతియించుడి అన్నప్పుడు, ఆ స్తుతించేవారిలో ఎవరెవరున్నారో చెబుతున్నాడు చూడండి. **కీర్తనలు 148 : 1** వ వచనంలో **ఆకాశవాసులారా...** అన్నాడు. అంటే, ఆకాశంలో నివసించే ఆయనకు సంబంధించినవారు, ఆయనను స్తుతించే వారు కొంతమంది ఉన్నారు. ఆ తరువాత **ఉన్నత స్థలముల నివాసులారా... ఆయనను స్తుతియించుడి** అన్నాడు. అంటే, గొప్ప స్థలములలో ఉన్నవారలారా ఆయనను స్తుతియించుడి అని అర్థము. ఆదాము మొదలుకొని ఇప్పటివరకు నీతిమంతులైనవారు జీవించే కళ ఎలాగో తెలిసినవారుగా జీవించి, చనిపోయారు. వాళ్ళందరూ ఇప్పుడు ఉన్నత స్థలములలో ఉన్నారు. వారందరూ దేవుని స్తుతించాలి. ఆ తరువాత **ఆయన దూతలారా, ఆయన సైన్యములారా, సూర్యచంద్రులారా, కాంతిగల నక్షత్రములారా, పరమాకాశములారా, ఆకాశముపైనున్న జలములారా ఆయనను స్తుతియించుడి** అంటున్నాడు. ఆయనను స్తుతించుటకు ఇప్పుడు ఎంతమంది వచ్చారో చూడండి. ఇంతకీ ఆయన సైన్యములు ఎవరనుకొంటున్నారు? దూతలు అనగానే రెండు రెక్కలుండి, రెండు చేతులుండి, రెండు కాళ్లుండి, ముఖము, విరబూసుకున్న జుట్టుండి, ఒక వెలుగుతో ఉండేది అనుకుంటున్నారా? ఇవన్నీ మీకు తెలియడానికి రూపకాలంకారములో వ్రాయబడినవే తప్ప, నిజానికి దేవదూతలు అచ్చం అలాగే ఉంటాయని మాత్రం కాదు. మనుష్యులకు ఒకనాడు దర్శనాలలో కనిపించడానికి దేవదూతలు ఆ విధంగా వచ్చారు. కానీ వీరందరూ ఎవరో తెలుసా? దూతలనగానే, పరమాకాశంలో ఉన్నవారనగానే, సైన్యములనగానే ఎవరో తెలుసా? వీరందరూ దేవునికి సేవకులు, దేవుని ఆజ్ఞానుసారముగా జీవించే కళను కలిగియున్నవారు. ఆకాశంలో నివసిస్తున్న సూర్యుడు, చంద్రుడు,

నక్షత్రాలు, ఈ వాతావరణమంతా ఎవరనుకుంటున్నారు వీరందరూ దేవుని యొక్క దూతలు, వీరే దేవుని యొక్క సైన్యములు, వీరే దేవునియొక్క సేవకులు. అందుకే సూర్యుడు ప్రతిరోజు తూర్పున ఉదయిస్తున్నాడు, ప్రతి ఒక్కరికి వెలుగునిస్తున్నాడు, వేడిమినిస్తున్నాడు. తరువాత పడమట దిక్కున అస్తమిస్తున్నాడు. మరల ఉదయాన్నే తూర్పున బయలుదేరుతున్నాడు. ఇది శాస్త్రవేత్త పెట్టిన నియమం కాదు. శాస్త్రవేత్త పెట్టినదే అయి ఉంటే, ప్రతి రోజూ సూర్యునిలో ఎన్నో సాంకేతిక లోపాలు వచ్చి ఉండేవి. ఏ రోజూ ఉదయానికి సరైన సమయానికి సూర్యుడు వచ్చి ఉండేవాడు కాదు. మన శాస్త్రవేత్తలు కనిపెట్టిన రైలు బండిని చూస్తున్నాము కదా. ఏ ఎక్స్‌ప్రెస్ అయినా, ఏ పాసింజర్ అయినా, ప్రతి రోజూ టైమ్‌కి వస్తుందా? అది మనిషి నియమించుకున్నది, మనిషి చేత నడుపబడుచున్నది గనుక సమయానికి రాదు, ప్రమాదం జరుగకుండా ఉండదు. దేవుడు నియమించినవి, దేవుడు నిర్ణయించినవే ఆయన దూతలు. ఆయన సైన్యములు ఎంత చక్కగా పనిచేస్తున్నారో చూడండి. వాటిని గూర్చి దేవుడు ఏమని వ్రాయించాడో తెలుసా? ఇవన్నీ ఆయన్ను స్తుతిస్తున్నాయి. సూర్యచంద్రులారా, కాంతిగల నక్షత్రములారా, పరమాకాశములారా, ఆకాశము పైనున్న జలములారా ఆయనను స్తుతియించుడి. సృష్టిలో ఉన్న ప్రతి శక్తి పరలోకమందున్న దేవున్ని ఎలా స్తుతించగలుగుతుంది? ఇవి ఎప్పుడూ స్తుతి, స్తుతి, స్తుతి, ... అని స్తుతులు చెప్పినట్టుగా మనకు కనపించడం లేదే. సూర్యుడు స్తుతి, స్తుతి, స్తుతి అన్నట్టుగా ఎక్కడైనా విన్నారా? నక్షత్రాలు స్తుతి, స్తుతి, స్తుతి అన్నట్టుగా ఎప్పుడైనా విన్నారా? మన మధ్యనున్న గాలి అలా స్తుతించినట్టుగా ఎన్నడైనా విన్నారా? మనము త్రాగుచున్న నీరు అన్నట్టుగా విన్నారా? లేదు లేదు. దీనినిబట్టి, దేవుని స్తుతించడమంటే, ఇవన్నీ జీవించే కళను కలిగి ఉండటమే దేవుని స్తుతించడం. నిజంగా దేవుని కీర్తించడం ఎలాగో తెలుసా? మీరు జీవించే కళను కలిగి ఉండటమే దేవుని కీర్తించడం. ఆకాశములో సూర్యునికి దేవుడు ఒక పనిని అప్పగించాడు. చంద్రునికి దేవుడు ఒక పనిని అప్పగించాడు. నక్షత్రములకు దేవుడు ఒక పనిని అప్పగించాడు. ఆదికాండము 1వ అధ్యాయంలో సృష్టించాడు, వాటన్నింటికీ పనిని అప్పగించాడు. పగటిని ఏలుటకు సూర్యుడు, రాత్రినేలుటకు చంద్రుడు, కాంతిగల నక్షత్రములు ఆకాశంలో ఉండాలి. అవన్నీ మంచివైనట్టు దేవుడు చూచెను అన్నాడు. ఆనాడు సూర్యునికి, చంద్రునికి, నక్షత్రములకు, భూమికి, జంతువులకు, చెట్లకు జీవరాసులన్నిటికి దేవుని చేత పని అప్పగింపబడింది. ప్రతిపనిని ప్రతి జీవరాశి నెరవేరుస్తున్నది గనుక అలా నెరవేర్చడంలో జీవించే కళను కలిగి ఉన్నాయి. గనుక ఇవన్నీ పరలోకమందున్న దేవున్ని స్తుతిస్తున్నాయి. నోటితో చెబితేనే దేవునికి స్తుతి అనుకొంటున్నారా? దీర్ఘం పాడితే స్తుతి అనుకొంటున్నారా? గొంతుతడి ఆరిపోయేలా స్తుతులు చెల్లించడంవల్ల అది దేవునికి స్తుతి అనుకొంటున్నారు. కాదు కాదు అలా అనుకుంటే మీరు మోసపోతున్నారు. మీకు జీవించే కళ తెలిస్తే దేవుని ఎలా స్తుతించాలో, ఆయన్ను ఎలా సంతోషపరచాలో మీకు అర్థమౌతుంది. అప్పుడు మాత్రమే దేవుడు ఆనందపడతాడు. కానీ మనిషి ఇదంతా తెలిసికోకుండా ఏదో మ్రొక్కుబడిగా దేవునికి స్తుతి చెల్లిస్తున్నాడు. దీనివలన దేవునికి ఏమి ఉపయోగం చెప్పండి? ఎవరైనా మన కొరకు పనిచేస్తేనే మనము సంతోషిస్తాం. మనకు ఎవరివలన అయినా లాభం కలిగితేనే మనము ఆనందిస్తాం. ఏదో మాట వరసకు మనలను స్తుతిస్తే, పొగిడితే మనము దానినిబట్టి సంతోషిస్తామా? సంతోషించము, సంతోషించలేము. దేవుని సేవకులన్నీ దేవుని కొరకు నిరంతరాయముగా పని చేస్తున్నాయి. ఇంకా వాటిని గూర్చి దేవుడు ఏమంటున్నాడో చూడండి.

**కీర్తనలు 148 : 5 'యెహోవా ఆజ్ఞ ఇయ్యగా అవి పుట్టెను. అవి యెహోవా నామమును స్తుతించును గాక. ఆయన వాటిని నిత్యస్థాయువులుగా స్థిరపరచియున్నాడు. ఆయన వాటికి కట్టడ నియమించెను. ఏదియు దానిని అతిక్రమింపదు.'** అని వ్రాయబడింది. ఇదే వాటి జీవించే కళ. దానినే దేవుడు చెబుతున్నాడు. మనిషి మొట్టమొదట తన జీవించే కళను తెలుసుకోవాలనుకుంటే, ప్రకృతిలో ఉన్న ప్రతి జీవరాశిని, వస్తువులను చూడమంటున్నాడు. ఇవన్నీ సరైన జీవించే కళను కలిగి, దేవుని స్తుతిస్తున్నాయి. కనుక దేవుని ఆజ్ఞ వలన పుట్టిన ఈ పదార్థాలన్నీ, వాటికి నియమింపబడిన కట్టడ ప్రకారము పనిచేస్తూ, మంచి జీవకళను కలిగియున్నాయి. అందులో ఏదియు ఆయన కట్టడను అతిక్రమించదు. దేవుని సృష్టిలో ఆయన కట్టడలను అతిక్రమించేది ఎవరు అంటే, నిస్సందేహముగా మనిషే! అందుకే పైన చెప్పబడిన జాబితాలో, దేవుని స్తుతించేవాటిలో మనిషిని గూర్చి వ్రాయబడలేదు. ఆకాశాలను గూర్చి, ఆకాశ నివాసులను గూర్చి,

సూర్యచంద్ర నక్షత్రాలను గూర్చి వ్రాయబడింది తప్ప మనిషి పేరు అందులో లేదు. ఎందుకంటే మనిషి దేవుడు నియమించిన కట్టడలను ఖచ్చితంగా తప్పుతాడు. జీవించే కళను మనిషి కోల్పోతాడు. అలా కోల్పోయిన వేళ మనిషి దేవున్ని స్తుతించలేడు. జీవించే కళను తెలుసుకొనకపోతే మనిషి దేవున్ని కీర్తంచలేడు. మీరు దేవునికి ఎన్నో కానుకలు ఇవ్వచ్చు, ఆయన కొరకు ఎన్నో ఉపవాసాలు చెయ్యొచ్చు. దేవునికి ఎన్నో భక్తి ప్రార్ధనలు చెయ్యొచ్చు. కానీ, మీకు జీవించే కళ తెలియక పోతే ఇవేమి దేవుని లెక్కల లోనికి రావు. ఏదో మీ ఆనందం కోసం మీరు ఉపవాసం చేసుండొచ్చు. ఏదో మీ ఆనందం మీరు దేవునికి కానుకలు ఇచ్చి ఉండొచ్చు. మీరు జీవించే కళను కలిగిలేని పక్షంలో దేవుడు వాటిని స్వీకరించడు. ఏదో అందరూ ఇస్తున్నారు గనుక, అందరూ చేస్తున్నారు గనుక మీరూ ఇచ్చేస్తున్నారంతే తప్ప ఎప్పుడైనా ఈ కోణంలో మీరు ఆలోచించారా? మీరు ప్రదర్శిస్తున్న భక్తిని దేవుడు స్వీకరిస్తున్నాడో లేదో అని ఎప్పుడైనా పరిశోధన చేసారా? పరలోకమందున్న దేవుడు మనలను, మన ప్రార్ధనలను స్వీకరించాలి అంటే, మొదట మనకు జీవించే కళ తెలియాలి. మనము ఎలా జీవించాలో మనకు అర్ధం కావాలి.

**యోబు 28 : 23 - 27 'దేవుడే దాని మార్గమును గ్రహించును. దాని స్థలము ఆయనకే తెలియును. ఆయన భూమ్యంతముల వరకు చూచుచున్నాడు. ఆకాశము క్రింది దానినంతటిని తెలిసికొనుచున్నాడు. గాలికి ఇంత బరువు ఉండవలెనని ఆయన నియమించినప్పుడు, ప్రమాణమునుబట్టి జలములకు ఇంత కొలతయని ఆయన వాటిని కొలిచి చూచినప్పుడు, వర్షమునకు కట్టడ నియమించినప్పుడు, ఉరుముతోకూడిన మెరుపునకు మార్గము ఏర్పరచినప్పుడు, ఆయన దానిని చూచి బయలుపరచెను. దానిని స్థాపన చేసి దానిని పరిశోధించెను.'** ఆకాశము క్రింద ఉన్న దానినంతటిని దేవుడు తెలుసుకొంటున్నాడు. అందులో ఎవరు జీవించే కళను కలిగియున్నారు, ఎవరు జీవించే కళను కలిగిలేరు అని దేవుడు పరిశీలిస్తున్నాడు. ఆయన సృష్టించిన ప్రతిదానికి దేవుడు కట్టడలను నియమించాడు. ప్రతిదానికి ఇంత కొలత ఉండాలని దేవుడు నియమించాడు. అవన్నీ దేవుడు నియమించిన లెక్కల ప్రకారం బ్రతుకుతున్నాయి. ఇదంతా దేవుడు మనకు ఎందుకు చెబుతున్నాడంటే, మనకుండవలసిన జీవించే కళను గూర్చి ఆయన నేర్పించాలనుకుంటున్నాడు. గాలికి ఇంత బరువు ఉండవలెనని ఆయన నియమించినప్పుడు గాలి అంత బరువునే కలిగి ఉంది. సముద్రపు పొంగు అక్కడ వరకు రావాలని దేవుడు ఇసుకను సరిహద్దుగా నియమించినప్పుడు అక్కడ వరకే సముద్రపు పొంగు వస్తుంది. ఇవన్నీ దేవుని మాటలు పాటిస్తున్నపుడు, ఓ మనిషీ! నీవెందుకయ్యా జీవించే కళను కలిగి లేవు? పోనీ నీకు తెలియకపోతే, నీ దేవున్ని ఎందుకయ్యా అడగలేదు? నేను ఈ భూమిమీద ఎలా జీవించాలి? నేను ఎందుకు వచ్చాను? నా బ్రతుకెందుకు? వీటిని గూర్చి మీ తండ్రిని మీరెప్పుడైన అడిగారా? మీ దేవుని మీరు తెలుసుకోవాలి! పరలోక మందున్న దేవుడు ప్రకృతిలో ఉన్న ప్రతిదానికి లెక్క, కట్టడ, నియమం, జీవించే కళను నిర్దేశించినప్పుడు మనుష్యులుగా ప్రతి ఒక్కరు ఎందుకు ఫెయిల్ అయిపోయారు చెప్పండి. ఒకడు తప్పతాగుతాడు, రోడ్డుమీద పడిపోతాడు. అంటే వాడికి జీవించే కళ తెలియదు. అలా మనం రోడ్డు మీద వెళుతున్నప్పుడు అందరూ వారి వారి వాహనాలపై వెళుతుంటే వీడెందుకండీ క్రుళ్లికాలువ ప్రక్కన పడుకున్నాడు? మత్తులో వాడు ఎక్కడ ఉన్నాడో తెలియని పరిస్థితులలోకి దిగజారిపోయాడు. తన ఒంటిమీద బట్టలు ఉన్నాయో లేదో, తన జేబులో డబ్బులు ఉన్నాయో లేదో, తాను ఎక్కడికి వెళ్లాలో ఏమీ తెలియకుండా దయనీయ పరిస్థితులలో ఎందుకు పడి ఉన్నాడు చెప్పండి? వాడు కూడా మనలాంటి వాడేకదా. ఒక తల్లి కడుపున పుట్టిన వాడే కదా. కానీ ఎందుకు అలా అయిపోయాడు? వాడికి జీవించే కళ తెలియదు. ఒకడు పగ పెంచుకుని మరొకన్ని చంపేస్తున్నాడు. పోలీసులకు దొరికిపోయి, చేతులకు బేడీలు వేయించుకొంటున్నాడు. మనతో పాటే జీవించినవాడే ఇప్పుడు జైలులోనికి వెళ్లిపోతున్నాడు. వాడికి కూడా జీవించే కళ తెలియలేదు. ఎలా బ్రతకాలో అర్ధంకావడం లేదు. అందుకే పట్టుబడ్డాడు. నేరస్తునిగా మారి బేడీలు వేయించుకొన్నాడు. నేరం నిరూపించబడిన తరువాత జైలులోనికి వెళ్లిపోతున్నారు. శిక్షను అనుభవిస్తున్నారు. జీవించే కళ దాదాపుగా ఏ ఒక్కరికీ తెలియదు. మనుష్యులందరూ నటనలో ఉన్నారు. వారు మోసపోతున్నారు. నిజంగా మీరు జీవించే కళను తెలుసుకోవాలి. ప్రకృతిలో ఉన్న ప్రతి జీవరాశి జీవించే కళను తెలుసుకున్నప్పుడు మనము కూడా దానిని తెలుసుకొన్నప్పుడే మన బ్రతుకు పండుతుంది. మన బ్రతుకెందుకో మనకు అర్ధమౌతుంది.

యిర్మీయా 6 : 19 'భూలోకమా, వినుము. ఈ జనులు నా మాటలు వినకున్నారు, నా ధర్మశాస్త్రమును విసర్జించుచున్నారు గనుక తమ ఆలోచనలకు ఫలితమైన కీడు నేను వారిమీదికి రప్పించుచున్నాను.' పరలోకమందున్న దేవుడు ఎవరితో మాట్లాడుతున్నాడో చూడండి. ఆయన భూలోకము అనే ఒక దేవదూతతో మాట్లాడుతున్నాడు. భూమి ఒక చౌడు నేల అనుకోకండి. మనము నివశిస్తున్నటువంటి భూమి ఎందుకూ పనికి రాదనుకోకండి. ఆ భూమే మనకు కడుపు నింపుతుంది. ఆ భూమిని దున్ని దానిని తడిపి అందులో విత్తనాలను వేస్తే ఆ భూమి మన పంట పండించి మన కడుపు నింపుతుంది. దాని వలనే మనము బ్రతుకుతున్నాము. మనము నివశిస్తున్న ఈ భూమిలో జీవముంది. గంటకు 1,11,600 కిలోమీటర్ల వేగంతో శూన్యంలో తిరుగుతున్న ఈ భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతుంది. ఈ భూమికి జీవించే కళ బాగా తెలుసు. భూమి తన చుట్టూ తాను తిరగడానికి ఒక రోజు పడుతుందని, భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజులు పడుతుందని మన చిన్ననాడు మనము పాఠమును నేర్చుకున్నాము. కానీ ఆనాడు ఉపాధ్యాయుడు ఇదేనయ్యా భూమి యొక్క జీవించే కళ అనే విషయం చెప్పలేదు. కేవలం భూమి యొక్క వివరాలు చెప్పాడంతే. భూమి తన చుట్టూ తాను తిరగడానికి 24 గం॥లని, భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజులని, కేవలం ఇది మాత్రమే చెప్పారు. కానీ ఇలా తిరగడం ఎందుకంటే, ఇది భూమి యొక్క జీవించే కళ అని లోకానికి తెలియదు. భూమికి జీవించే కళ బాగా తెలుసు. అందుకే ఒక్క క్షణం కూడా తన దారి తప్పిపోలేదు. ఏ రోజూ దేవుని మాటను అతిక్రమించలేదు. దేవుడు ఈ భూమిని సృష్టించినప్పుడు దీనికి ఒక కట్టడ నియమించాడు. ఆ జీవించే కళ కలిగిన భూమికి పరలోకమందున్న దేవుడు ఒక మాట చెబుతున్నాడు. భూమిమీద నివసిస్తున్నవన్నీ దేవుని మాటను వింటున్నాయి కానీ అదే భూమి మీదనున్న మనుష్యులు మాత్రం దేవుని మాట ఎందుకు వినడంలేదు? ఇదే మాట దేవుడు భూమిని అడుగుతున్నాడు. భూమితోనే తన గోడు చెప్పుకొంటున్నాడు. మనుష్యులు ఆయన మాట వినరు కదా. మనుష్యుల ఇష్టం మనుష్యులది. మనుష్యులు తమ కొరకు ఒక ఇష్టాన్ని ఏర్పరుచుకొన్నారు. అందుకే ఈ సమాజం ఎలా ఉందో చూడండి. అస్తవ్యస్తంగా మారిపోయింది. ఇది మన రాష్ట్రంలోనే కాదు, ఇది మన భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతా ఇలానే ఉంది. కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్నారు. పగ, ద్వేషాలతో రగిలిపోతున్నారు. యుద్ధాలకోసం కయ్యానికి కాలు దువ్వుతున్నారు. దేశాలు ఉగ్రవాదపు ఛాయలో ఉన్నాయి. ఏ సందులో ఏ బాంబు పేలుతుందో ఎవ్వరికీ తెలియదు. ఆఫ్ఘనిస్తాన్, సిరియా, ఇరాక్, సౌది అరేబియా, కువైట్, ఈజిప్ట్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాలలోని దేశాలన్నీ ఈ రోజు ఉగ్రవాదంతో గడగడలాడుతున్నాయి. ఇలా ఎందుకు అవుతుందో, జీవించే కళను కోల్పోయిన మనిషి పతనావస్థకు ఎలా జారిపోతున్నాడో, ఈ రహస్యాలన్నీ ఈ పుస్తకంలో మీకు చెబుతాను. ఇవి కేవలం మీకు మాత్రమే కాదు. ఇవి ప్రపంచానికే దేవుని పాఠాలు. ఇక్కడ మీకొక చిన్ననిజం చెప్పాలి. ఈ రోజు తెలుగు భాషలో మీరు చదువుచున్న ఈ పాఠాలు ప్రపంచాన్ని చుట్టాలి. ప్రపంచ రాజ్యాధినేతలందరి దగ్గరికి పంపించాలి. అందుకే ఈ రోజు మీరు చదువుచున్న ఈ పుస్తకము ఆంగ్లములోనికి తర్జుమా చేయబడుతుంది. దేశాధినేతల దగ్గరకు పంపబడుతుంది. మీరు చదివిన ఈ మాటలు అన్ని దేశాల ప్రెసిడెంట్‌లు, రాజులు, ప్రధానులు నేర్చుకోవాలి; అభ్యాసం చేయాలి. నా ప్రయత్నంతో ఏ ఒక్క దేశమైనా మారకపోతుందా? ఏ ఒక్క ప్రధానికైనా, ఏ ఒక్క రాజుకైనా మనసు చలించకపోతుందా? అప్పుడు తమ దేశాన్ని మార్చుకోవాలనే ఆలోచన వారికి రాకపోతుందా? అందుకే కనీసం ఆంగ్లభాషలోనికి దీనినంతటిని తర్జుమా చేసి వారి దగ్గరకు జీవించే కళను పంపిస్తాను. వారు చదవాలి, వారందరు నేర్చుకోవాలి. ఇది మనకు మాత్రమే సంబంధించిన సంగతులు కాదు. ప్రపంచ దేశాలకు మార్గదర్శకాలు!

దేవుడు ఈ భూమితో ఏమంటున్నాడో చూడండి. ఆయన ఆవేదన చూడండి. మనుష్యుల నిమిత్తం ఆయన ఎంత బాధపడుతున్నాడో చూడండి. భూలోకమా వినుము, ఈ జనులు నా మాటలను వినకున్నారు. నా ధర్మశాస్త్రమును విసర్జించుచున్నారు. గనుక వారి ఆలోచనలకు ఫలితమైన కీడును నేను వారి మీదకు రప్పించుచున్నాను అన్నాడు. అవును! ఈ మనుష్యులమీదికి దేవుడు కీడు రప్పింపబోవుచున్నాడు, ఇప్పటికే రప్పిస్తున్నాడు. అందుకే మీరు ఎప్పుడూ చూడని ఎండలు మీకు కాస్తున్నాయి. ప్రతి ఎండాకాలములో ఈ భూమిమీద ఉష్ణోగ్రత చూశారా! $40^0$, $42^0$, $45^0$, $47^0$... ప్రతి యేడూ 2 డిగ్రీ సెంటీగ్రేడుల ఉష్ణోగ్రతను దేవుడు పెంచుతున్నాడు. థర్మామీటర్

పెంచుతుందనుకుంటున్నారా? కాదు కాదు. పరలోకంలో ఉన్న దేవుడు పెంచుతున్నాడు. అవివేకులకు, మూర్ఖులకు ఈ సంగతి అర్థంకాక సూర్యుడు పెంచుతున్నాడు అనుకుంటున్నారు. భానుడు కాదు బిడ్డా, భగవానుడు పెంచుతున్నాడు. భానుడికి ఏం తెలుసు? దేవుడు చెప్పిన దానిని నెరవేర్చడం తప్ప? అలా అనుకుంటే, పూర్వము ఇదే భానుడు తన తీవ్రతను ఎందుకు పెంచలేదు? మనిషి జీవించే కళ అధ్వాన స్థితికి చేరుకునేకొద్దీ, భూమిమీద మనిషి బ్రతుకు భారమౌతోంది. సూర్యుడు ఒక మండే గోళము మాత్రమే. అందులో ఒక రసాయన చర్య జరుగుతుంది. కేంద్రక సంలోనము అనే ఒక రసాయన చర్య జరుగుతుంది. అందుకే ఉష్ణోగ్రత, కాంతి ఆ సూర్యమండలము నుండి సరాసరి సౌర కుటుంబములో మూడవ గ్రహమైన భూమండలం మీదకు వస్తున్నాయి. ఈ సూర్యకుటుంబంలో భూమిమీద జీవరాశుల కొరకు ఎంత వేడిమి, కాంతి ఉండాలో దేవుడు ముందే నిర్ణయించాడు గనుక సూర్యుడు ఎంతదూరంలో ఉండి తన శక్తిని ఈ భూమికి ఇవ్వాలో అంత దూరములో ఉంచాడు. కానీ దేవుడు ఇప్పుడు ఆ తీవ్రతను పెంచుతున్నాడు. సూర్యున్ని భూమికి కొంచెం దగ్గర చేస్తున్నాడు. ఎంతోకాదు, కేవలం 2 సెంటీగ్రేడు డిగ్రీల పెరుగుదలకే మనుష్యులు పిట్టల్లా రాలిపోతున్నారు. అందుకే దేవుడు ఈ భూమితో, భూలోకమా వినుము. ఈ జనులు జీవించే కళను తెలుసుకోకుండా, నా మాటలు వినకుండా, ధర్మశాస్త్రములో వ్రాయబడిన మంచి సంగతులను నేర్చుకోకుండా జీవించాలనుకుంటున్నారు. వీరు ఎలా బ్రతకాలో వీరికి అక్కరలేదు. అందుకే వీరి మీదకు దేవుడు కీడు రప్పించుచున్నాడు. కేవలం ఉష్ణోగ్రత మాత్రమే అనుకుంటున్నారా? దేవుడు కీడు రప్పిస్తాను అన్నాడంటే, అది చాలా రకాలుగా ఉంటుంది. ఎండాకాలం ముగింపబడుతుంది, ఆ తరువాత వచ్చేది వర్షాకాలం. మంచి వర్షాలు వస్తాయనుకుంటారు. కానీ రావు. మనిషి మారితే వస్తాయి. ఈ భూమి మీద ఉన్న మనిషి జీవించే కళను తెలుసుకుంటే మంచి వర్షాలే వస్తాయి. మంచి ఎండ కాస్తుంది. భూమి మంచి పంటనిస్తుంది. కానీ, మన చుట్టూ ఉన్న ప్రకృతి ఎందుకు ఉగ్రరూపం దాల్చుతుందో తెలుసా? మనపై ప్రతికారం తీర్చుకోవటానికి మన శత్రువుగా ఎందుకు మారిపోయిందో తెలుసా? మనము జీవించే కళను కలిగిలేము. ఎలా జీవించాలో మనకు తెలియదు. అందుకే దేవుడు భూమితో చెప్పాడు, అందుకే దేవుడు సూర్యునితో చెప్పాడు, అందుకే దేవుడు తన సైన్యమంతటితో చెబుతున్నాడు, చెప్పిన తన మాటలన్నింటినీ తన గ్రంథములో మన కొరకు వ్రాయించాడు. ఈ జనులు దేవుని మాటలు గ్రహింపకున్నారు గనుక వీరి మీదకు కీడు రప్పించాలి. ఆ కీడును తప్పించాలి అంటే, జీవించే కళను మనుష్యులకు నేర్పించాలి.

మనుష్యులంతా దేవుడు నేర్పిస్తున్న జీవించే కళను నేర్చుకోవాలి. యేసుక్రీస్తు సుమారు 2 వేల సం॥ల క్రితం ఈ భూమిమీదకు వచ్చాడు. ఆయన వచ్చి మనుష్యులకు ఏం చెప్పాడో తెలుసా? జీవించే కళను చెప్పాడు. యేసుక్రీస్తు విషయంలో చాలామంది తప్పుడు అభిప్రాయంతో ఉన్నారు. యేసుక్రీస్తంటే ఎవరో తెలుసా? ఆయన పరిపూర్ణమైన జీవించే కళను కలిగినవాడు. ఆయన మనిషికి జీవించే కళను నేర్పించాడు. తన బోధలన్నీ జీవించే కళతోనే నిండి ఉన్నాయి. ఆయన రాకలో ముఖ్యోద్దేశ్యము కుంటివారికి కాళ్ళు ఇవ్వడమో, గ్రుడ్డివారికి కళ్ళు ఇవ్వడమో కాదు. ఈ రోజు ఎల్.వి.ప్రసాద్ హాస్పటల్ కూడా గ్రుడ్డివారికి కన్నులిస్తుంది. అలాగని ఎల్.వి.ప్రసాద్ హాస్పటల్, యేసుక్రీస్తు సమానమా? ఆయన అందుకు మాత్రమే రాలేదు. యేసుక్రీస్తు వచ్చిన రహస్యమేమిటో తెలుసా? ఆయన పరలోకమును విడిచి ఈ భూమిమీదకు ఎందుకు రావలసి వచ్చిందో తెలుసా? ఆయన మనుష్యులకు జీవించే కళను నేర్పించాలి. దానిని నేర్పించే క్రమంలో తనకు ఎదురైన మనుష్యులకు చిన్న చిన్న ప్రయోజనాలను చేసాడు. దానిలో భాగముగా, కుంటివారికి కాళ్ళు ఇచ్చాడు, గ్రుడ్డివారికి కన్నులిచ్చాడు, చనిపోయిన వారిని తిరిగి లేపాడు. ఆయన దేవుని కుమారుడు, ఆయన మాటలు ప్రతి ఒక్కరు వినాలి గనుక దానికి ఆధారం ఉండాలి గనుక, అక్కడక్కడ అద్భుతాలు, సూచకక్రియలు చేసాడు తప్ప, ఆయన వచ్చిన రాక యొక్క పరమార్థం ఏమిటో తెలుసా? ఆయనలోని రహస్యం ఏమిటో తెలుసా? ఆయన మనిషికి జీవించేకళను నేర్పించాలి! అందుకే, యేసుక్రీస్తువారే స్వయంగా ఏమన్నారో చూడండి.

**మత్తయి సువార్త 6 : 26 'ఆకాశ పక్షులను చూడుడి. అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటికంటె బహు శ్రేష్ఠులు కారా?'** మనిషికి జీవించే కళను నేర్పించే క్రమంలో ఆయన వేటిని చూపిస్తున్నాడో చూడండి. ఆకాశ పక్షులను చూపిస్తున్నాడు. జీవించే కళ నేర్పించాలంటే

ప్రకృతిలో ఉన్న ప్రతిదానిని చూపించాలన్నమాట! ఈ సృష్టిలో జీవించే కళను పాటిస్తున్నవాటిని చూపించాలన్నమాట. అందుకే యేసు భూమిమీదకు వచ్చి, శిష్యులతోను జనసమూహాలతోను ఏమంటున్నాడో తెలుసా? మీరు జీవించే కళను కలిగిన ఆకాశ పక్షులను చూడండి. అవి ఏమి చేస్తున్నాయి? అవి దేవున్ని స్తుతిస్తున్నాయి. ఎలా స్తుతిస్తున్నాయి? తమకు దేవుడు అప్పగించిన పనిని నెరవేరుస్తున్నాయి. అవి దేవున్ని ఎలా కీర్తిస్తున్నాయి? అవి జీవించే కళను కలిగివున్నాయి. అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకమందున్న తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటికంటే శ్రేష్టులు. నిజానికి చెప్పాలంటే మనుష్యులే అన్నిటికంటే శ్రేష్టులు. ఒక పక్షికంటే మీరు శ్రేష్టులు కారా? ఒక చేపకంటే మీరు శ్రేష్టులు కారా? దాని జీవితం ఎంత మన జీవితం ఎంత చెప్పండి? అల్ప జీవితం దానిది. ఒక గడ్డి పువ్వుది అల్ప జీవితం. ఒక మేకది అల్పజీవితం. మీకు కావాలనుకుంటే మీరు వాటిని చంపగలుగుతున్నారు. మీ కోరిక తీర్చుకోవడానికి, మీ ఆకలిని తీర్చుకోవడానికి కావాలనుకుంటే ఈ ప్రకృతిలోని వస్తువులన్నింటిని, జీవులన్నింటిని మీరు బలి తీసుకోగలుగుతున్నారు. కానీ, అవన్నీ జీవించే కళను కలిగి ఉన్నాయి. జీవించే కళను మనుష్యులకు నేర్పిస్తున్నాయి. దీనినే యేసుక్రీస్తు చెప్పాడు. ఆకాశ పక్షులను చూడుడి, అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు. వాటికి ధనాశ లేదు. ఎలా కడుపు నింపుకోవాలా అని రేపటిని గూర్చిన చింత వాటికి లేదు. వాటిని గూర్చి అవి ఆలోచించుకోవడం లేదు. అవి కేవలం దేవుడు తమకు అప్పగించిన పనిని నెరవేరుస్తున్నాయి, జీవించేకళను కలిగివున్నాయి. అందుకే మీరు వాటిని చూడండి. వాటి ద్వారా జీవించే కళను గ్రహించండి అన్నాడు యేసుక్రీస్తు!

**యోబు 12 : 7 - 9 'అయినను మృగములను విచారించుము. అవి నీకు బోధించును. ఆకాశపక్షులను విచారించుము. అవి నీకు తెలియజేయును. భూమిని గూర్చి ధ్యానించిన యెడల అది నీకు బోధించును. సముద్రములోని చేపలును నీకు దానిని వివరించును. వీటన్నింటిని బట్టి యోచించుకొనినయెడల యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేనివాడెవడు?'** మృగములు, ఆకాశపక్షులు, భూమి, సముద్రములోని చేపలు మనకు ఏమి బోధిస్తాయి? ఏమి తెలియజేస్తాయి? ఏమి వివరిస్తాయి? ఇవన్నీ జీవించే కళను బోధిస్తాయి. జీవించే కళను తెలియజేస్తాయి. జీవించే కళను వివరిస్తాయి. యోబు గ్రంథంలో ఈ విషయాన్ని దేవుడు సుమారు 5000 సం॥ల క్రితమే చెప్పాడు. వీటన్నిటిని బట్టి యోచించినయెడల దేవుని హస్తము వీటిని కలుగజేసెనని తెలుసుకొన లేనివాడెవడు? అందరూ అలాంటివారే కదా. దేవుని వలననే ఈ సృష్టి ఇలా ఉనికి కలిగి ఉంది. దేవుడు నిర్ధేశించిన జీవించే కళను ఇవన్నీ పాటిస్తున్నాయని ఈ ప్రపంచంలో ఎవ్వరూ చెప్పరు. ప్రియులారా! మన చుట్టూ ఉన్న ప్రకృతంతా జీవించే కళను కలిగి ఉంది. అందుకే ఏ దోషమూ దానిలో లేదు. ఏ నేరమూ అది చేయడం లేదు. కానీ మనిషే దోషి అయ్యాడు, మనిషే నేరస్తుడయ్యాడు. ఇప్పుడు మనిషి తిరిగి మరల దేవుని కళ లోనికి రావాలి. మంచి జీవించే కళను మనిషి అలవర్చుకోవాలి. అసలు మనిషి ఎలా బ్రతకాలో మనిషికి తెలియాలి. అలా తెలియాలంటే ఈ భూమిమీద ఒకే ఒక మార్గం దేవుని వాక్యం! అది గనుక సమాజంలో ప్రకటింపబడితే, అది గనుక సమాజంలో ఉన్న మనుష్యులకు వివరింపబడితే ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ జీవించే కళను తెలుసుకుంటారు. ఇప్పటి వరకు ఎంతోమంది బైబిల్‌ను నేర్పించారు. ఎంతోమంది బైబిల్‌ను బోధించారు. ఎంతో మంది తెలియజేశారు. మీరు కూడా విని ఉండవచ్చు. కానీ ఇప్పటికీ మార్పులేదు. ఇప్పటికీ జీవించే కళ తెలియదు అంటే, నిజంగా ఇప్పటివరకు మీరు విన్నది డూప్లికేట్ వాక్యమే. పైకి పేరుకి దేవుని వాక్యమే కానీ, లోపలున్న సరుకు మంచిది కాదు. ఈ జీవించే కళ ద్వారా లోనున్న సరకు కూడా మంచిదిగా ఇవ్వాలనుకున్నాను. నిజంగా దేవుని వాక్యమే ఉన్నది ఉన్నట్టుగా ప్రకటింపబడితే ప్రతి ఒక్కరూ మారాలి. అలాగని ఈ రోజు మన కంటికి ఎన్నో చర్చ్‌లు కనిపిస్తున్నాయి. కనీసం వీధికి ఒక చర్చి ఉంటుంది. క్రైస్తవులలోప్రతి 100మందిలో ఒకరు పాస్టర్ ఉంటాడు. మరి జీవించే కళ ఎక్కడ? పాస్టర్స్‌లోనే జీవించే కళ లేదు. ఉందంటారా? ఇటీవల ఒక వార్త వచ్చింది. ఒక పాస్టరమ్మ పాస్టరయ్యగారిని చంపేసింది. దేనికి అంటే, అక్రమ సంబంధం! ఆమెకు జీవించే కళ తెలియదు. చంపేస్తే చంపేసింది, ఎక్కడ పాతిపెట్టిందో తెలుసా? పవిత్రమైన చర్చ్‌లోనే గొయ్యి తీసి పాతిపెట్టింది. మీకు నేను అవాస్తవాలు చెప్పడంలేదు. పాస్టరమ్మ గారు పాస్టర్‌గారిని చంపేసి గొయ్యి తీసి చర్చిలోనే పాతిపెట్టేసింది. అక్కడే భజనలు, అక్కడే ప్రార్థనలు, అక్కడే స్తుతులు... అప్పుడు పోలీసువారు ఈ కేసును ఛేదించి పోలీసు జాగిలాలను తీసుకొని వెళితే, అవి సరాసరి

చర్చిలోనికి వెళ్ళి నిలువబడుతున్నాయి. వాసన చూపించి పోలీసు కుక్కలను వదిలితే అవి చర్చ్ లోనికి వెళ్ళి కరెక్ట్‌గా ఫ్యాన్ క్రింద కూర్చున్నాయి. పోలీసు వారందరూ చాలా ఆశ్చర్యపడ్డారు. వారు అవాక్కయ్యారు. పాస్టర్‌గారి శవం అక్కడే ఉంది. అప్పుడు త్రవ్విస్తే, అందులోనుండి ఆ పాస్టర్ గారి శవం బయటపడింది. అప్పుడు పాస్టరమ్మగారి దగ్గర నుండి విషయం రాబడితే, తనకు ఒక అక్రమ సంబంధం ఉందని, అందుకే తన భర్తను చంపేశానని తెలిపింది. అందరూ ఇలాగే ఉంటారని నేను అనడం లేదు కానీ, బైబిల్ చెప్పే వారికి, బైబిల్ వినే వారికి చాలా మందికి జీవించే కళ తెలియదు. అంటే, బైబిల్‌లో తప్పు లేదు. అ బైబిల్‌ను అర్థం చేసుకునేవారు తప్పుచేస్తున్నారు. ప్రపంచానికి జీవించే కళను నేర్పించవలసిన మార్గదర్శకులకే జీవించే కళ తెలియక పోతే ప్రపంచం ఎలా మారుతుంది చెప్పండి? మనుష్యులలో మార్పును ఎలా తీసుకువస్తాం చెప్పండి? బైబిల్ తెలిసిన వారిలోనే చాలామంది జీవించే కళను కలిగిలేరు. ఇక బైబిల్ తెలియని వారి సంగతి చెప్పనక్కరలేదు. దేవుని కుమారునిగా వచ్చిన యేసుక్రీస్తు ఇలాంటి వాడు కాదే. తనకున్నదంతా అర్పించాడు. ఎవరి దగ్గర ఏదీ తీసుకోలేదు. పరిచారము చేసాడు, ప్రతి ఒక్కరికి జీవవాక్యాన్ని ప్రకటించాడు. అలాగని ఈ సమాజం యేసును ప్రేమించిందా? యేసును చంపే వరకు ఊరుకోలేదు. జీవించే కళను నేర్పించాలనుకుంటున్న నన్ను కూడా ద్వేషిస్తారు, నన్ను కూడా పొమ్మంటారు, చివరకు నన్ను కూడా చంపేస్తారు. అవును. సత్యాన్ని ప్రతి ఒక్కరూ ద్వేషిస్తారు. సత్యాన్ని ప్రతి ఒక్కరూ సమాధి చేయాలని చూస్తారు. కానీ నేను అలాంటి వారికి బెదరను. దేవుని కోసం బ్రతకాలనుకున్న వాడు మొట్టమొదట నిర్ణయించుకోవలసిందేంటో తెలుసా? చావైనా రేవైనా ఈ సమాజాన్ని మార్చి తీరాలంతే! చచ్చిపోతానని భయపడితే ఈ సమాజం ఎప్పటికి మారుతుంది చెప్పండి? నన్ను హింసిస్తారని నేను భయపడి అబద్ధాన్ని చెప్పమంటారా? మిమ్మల్ని అందరిని దోచుకోమంటారా? లేని దానిని ప్రకటించమంటారా? జీవించే కళను బైబిల్‌లో దేవుని కృప వలన నేను ముందుగా తెలుసుకున్నందుకు, దేవుని వలన ఈ బ్రతుకును తెచ్చుకున్నందుకు, నేనైనా జీవించే కళను కలిగి బ్రతకాలి. నా చుట్టూ ఉన్న ప్రకృతి జీవించే కళను కలిగి బ్రతుకుతున్నప్పుడు నేను అలా బ్రతుకకపోతే ఎందుకు చెప్పండి? అందుకే దేవుడు తన శ్రేష్టమైన వాక్యాన్ని నాచేతికిచ్చాడు. ఆయన మాటలను, ఆయన జ్ఞానాన్ని నాకు అనుగ్రహించాడు. నేను సగర్వంగా అందుకే ఈ మాటలు మీకు చెబుతున్నాను. దేవుడు నాకు ధనాన్ని, ఐశ్వర్యాన్ని, పదవిని ఇవ్వలేదు. అవి ఇచ్చినా నాకొద్దు. దేవుడు నాకు శ్రమలను, ఇబ్బందులనే ఇచ్చాడు. నా వెనుక ఉన్నవారు నన్ను వెన్నుపోటు పొడిచినా, ఆయన కృప వలన నేను దేవుని కొరకు నిలువబడ్డాను. నాకు ఆయన ఇచ్చిన గొప్ప ఆస్తి ఏమిటో తెలుసా? ఆయన వాక్యమే! వాక్యము అనగానే బైబిల్ అనే పుస్తకములో ఆయన వ్రాయించిన తన మాటలకు అర్థాన్ని అనుగ్రహించాడు. అదే దేవుని జ్ఞానము! అదే జీవించే కళను నేర్పిస్తుంది. ఇది ప్రపంచంలో అన్నిటికంటే చాలా విలువైనది, వెలకట్టలేనిది. ఆయన మాటలు ఎంత గొప్పవో తెలుసా? ఆయన మాటల గొప్పతనాన్ని ఒక్క మాటలో క్రింద చదవండి.

**యెషయా 26 : 9 'రాత్రివేళ నా ప్రాణము నిన్ను ఆశించుచున్నది. నాలోనున్న ఆత్మ ఆసక్తితో నిన్ను ఆశ్రయించుచున్నది. నీ తీర్పులు లోకమునకు రాగా లోకనివాసులు నీతిని నేర్చుకొందురు.'** చూసారా, ఏమని వ్రాయబడిందో! దేవుని తీర్పులు లోకము లోనికి వచ్చినప్పుడు జనులకు నీతి అలవడుతుంది. పరలోకమందున్న దేవుని వాక్కులు, ఆయన తీర్పులు మనలను మార్చడానికి ప్రయత్నిస్తున్నాయి. దేవుడంటే, మనకేదో వరాలు ఇవ్వడానికి కాదు, మనలను సుఖపెట్టడానికి కాదు, సోమరులుగా మార్చడానికి కాదు. దేవుని ప్రతిమాట మనిషికి గొడ్డలిపెట్టు వంటిది. మారకపోతే గొడ్డలి పెట్టు, మారితే నిత్యజీవానికి మిమ్మును తీసుకొని వెళ్ళే మెట్టు. మిమ్మును రక్షించే సాధనమే దేవుని వాక్యం. మనిషి మారకపోతే వాక్యము శిక్షించే ఆయుధమే. ఆయన తీర్పులు లోకములోనికి రాగా లోకములోని జనులందరూ, జీవించే కళ తెలియని వారందరూ నీతిని నేర్చుకొందురు. ఈ నీతిని నేర్పించడానికే ఈ పుస్తకాన్ని వ్రాస్తున్నాను. నా పుస్తకాన్ని చదివిన సమాజానికి జీవించే కళను నేర్పించడానికే కంకణం కట్టుకున్నాను. ఆయన నీతి ఇప్పటి వరకు మీరు అనుకున్నట్టుగా, అందరూ చెప్పినట్టుగా ఉండదు. ఇది దేవుని తీర్పు. ఈ దేవుని తీర్పులు ఎప్పుడైతే లోకమందున్న జనులలోనికి వస్తాయో లోకనివాసులందరూ ఖచ్చితంగా దేవుని నీతిని నేర్చుకోవలసిందే. జీవించే కళను తెలుసుకోవలసిందే! మిగిలిన భాగాలలో జనులు జీవించే కళను ఎలా తప్పిపోతున్నారో, వారు ఎలా సరిదిద్దుకోవాలో నేర్పిస్తాను. ఆ రాబోవు భాగాలకు ఆహ్వానాన్ని పలుకుతూ, ఈ నా మొదటి భాగమును ఇంతటితో ముగిస్తున్నాను.

## ప్రశ్నలు

1. జీవించే కళ అనగానేమి? వివరించండి?

2. దేవుని కట్టడలు పాటించుటలో సఫలులెవరు? విఫలులెవరు? వివరించండి.

3. మనుష్యులకు లేని జీవించే కళ, జీవులన్నింటికీ ఉన్న జీవించే కళ - చర్చించండి.

4. యేసుక్రీస్తు సమాజానికి జీవించే కళను నేర్పించిన విధానమును తెలియజేయండి.

5. దేవుని స్తుతించాలంటే ఏమి చేయాలి? దేవునికి నచ్చే స్తుతిని సవివరముగా తెలియజేయండి.

6. జీవించే కళ తెలియుట వలన కలిగే లాభమేమిటి? తెలియక పోతే జరిగే నష్టమేమిటి? వివరించండి.

7. బైబిల్ అందరి చెంత ఉన్నా, అందులోని జీవించే కళ ఏ ఒక్కరికీ తెలియకపోవడాన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

------x-----

జీవించే కళలో ప్రారంభమును గూర్చి నా మొదటి భాగమునందు తెలియజేసాను. ఈ రెండవ భాగములో మరిన్ని ఆలోచనాత్మకమైన సంగతులను తెలుసుకుందాము. జీవించే కళ అనేది ఒక సంస్కృతి. ఇది దేవుని సంస్కృతి. దేవుని గ్రంధములో వ్రాయబడిన సంగతులను పాటించేవారందరూ దేవుని సంస్కృతిని కలిగినవారే. దేవుని సంస్కృతిని తమ జీవిత కాలములో లోకానికి చూపించే వారందరూ మంచి కళాకారులు. ఈ ప్రపంచం కళాకారులు అనగానే ఎవరిని గుర్తిస్తుందంటే, ఒక కూచిపూడి నాట్యం చేస్తే ఆమె ఒక కళాకారిణి. ఒక భరతనాట్యం చేస్తే అతడు ఒక కళాకారుడు. ఒక సంగీతం వాయిస్తే అతడు ఒక కళాకారుడు. ఒక క్రీడ ఆడితే అతడు ఒక కళాకారుడు. ఒక వేషం వేసి నటనలో ఒక పాత్రను పోషిస్తే ఆమె ఒక కళాకారిణి. ఈ విషయంలో లోకం చాలా చిన్నగా ఆలోచించింది. జనులు చాలా అమాయకంగా ఆలోచిస్తున్నారు. సాటి మనిషి కోసం అవసరమైతే తన జీవితాన్నే పణంగా పెట్టినవాడే నిజమైన కళాకారుడు. తాత్కాలికంగా ఒక గంట, రెండు గంటలపాటు తన ప్రదర్శనతో సంతోషాన్నిచ్చేవాడు కళాకారుడు కాదు. పరిపూర్ణమైన ఆనందాన్ని, నిజమైన సంతోషాన్ని తన జీవిత కాలమంతా ఇచ్చేవాడే జీవించే కళ కలిగిన కళాకారుడు. ఆ కళాకారుడు తన జీవితాన్ని దేవుని పక్షాన ఈ ప్రపంచ మానవాళి కొరకు తన జీవితాన్ని పణంగా పెడతాడు. అలాంటి కళాకారుడు మనుష్యుల కొరకు ఆలోచిస్తాడు. నిజమైన కళాకారుడు తన అహాన్ని వదిలి, తన కోసమే బ్రతకకుండా, దేవుని కొరకే బ్రతుకుతాడు. మామూలు కళాకారుడైతే తన ముఖానికి రంగు పూసుకుంటాడు. ఆ రంగు ఎక్కువ సేపు ఉండదు. తన ఒంటికి కోటింగ్ వేసుకుంటాడు. ఆ కోటింగ్ ఎక్కువ సేపు ఉండదు. చిత్ర విచిత్రమైన వేషధారణతో కనిపిస్తాడు. అవి కొద్ది నిమిషములు మాత్రమే తన శరీరం మీద మెరుస్తూ ఉంటాయి. గంట, రెండు గంటలు, మూడు గంటలు మాత్రమే ఒక చిన్న కళను ప్రదర్శించి, ఆ తరువాత అలిసిపోయి మరలా వెనుకకు తన గదిలోనికి వెళ్లిపోతాడు. తనకున్న కోటింగ్ అంతా చెరిపేస్తాడు. తన బట్టలన్నీ మామూలు బట్టలుగా మారుస్తాడు. అతడు నిజమైన కళాకారుడు కానే కాదు. అతడు ఒక డమ్మీ కళాకారుడు. నిజమైన కళాకారుడు ఎవరంటే, తన చుట్టూ ఉన్న మనుష్యులను చూచి, అయ్యో ఈ మానవ జాతిని రక్షించడానికి, జీవించే కళను వారికి నేర్పించటానికి ఎంతకష్టమైనా అనుభవించి, తన బ్రతుకును మార్చుకుని, దేవుని వాక్యానుసారముగా, నిజంగా తన జీవితంలో మార్పును చూపిస్తున్నవాడే అసలైన కళాకారుడు. ఆ విషయానికొస్తే, నా పుస్తకము ద్వారా నా తరములో పుట్టిన వారందరికీ జీవించే కళను నేర్పించాలనుకున్న నేను ఒక కళాకారుడినే. అందులో నా చుట్టూ ఉన్న నా విద్యార్థులందరూ కళాకారులే. దేవుని ఆలోచనల చెంతకు వస్తే, మన మట్టి మెదడు నుండి పుట్టిన ఆలోచనలు ఎందుకూ పనికిరావు. మనిషి తలంపులు, దేవుని తలంపులు చాలా వ్యత్యాసమైనవి. అందుకే ఈ లోకం నా మాటలను అంత సులువుగా అంగీకరించదు. పగటి వేషగాన్ని కళాకారుడు అంటుంది, నిజమైన కళాకారున్ని ద్వేషిస్తుంది. దేవుడు మనిషిలో చూడాలనుకున్నది పగటి వేషగాన్ని కాదు. తన జీవితంలో నిజంగా మార్పును చూపించినవాడే అసలైన కళాకారుడు. అతనిలోనే అసలైన కళ ఉంటుంది. ఆ కళ మనుష్యులను బ్రతికిస్తుంది. అలాంటి కళాకారులు ఈ భూమిమీద ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు. ప్రకృతిలో ప్రతిదానిలో నెరవేరుతున్న ఆయన కోరికలు, ఆయన ఆజ్ఞలు మనిషిలో నెరవేరకపోవటాన్ని చూచి ఆయన బాధనొందుతున్నాడు. దీనినిబట్టి భూనివాసులందరికీ ఆయన తన తీర్పులను అమలు చేస్తున్నాడు. మనలను ప్రత్యక్షంగా చూస్తున్న ఈ భూమికి తన జీవించే కళ చాలా చక్కగా తెలుసు. ఎంత తెలియకపోతే, సృష్టి ఆరంభం మొదలుకొని ఇప్పటి వరకూ భూమి దేవుని యొక్క ఆజ్ఞలను నెరవేరుస్తుందో ఆలోచించండి. దేవుని ఆజ్ఞలను తూ.చ. తప్పకుండా పాటిస్తూ, ప్రతి దానిని నెరవేరుస్తుంది. కేవలం తన చుట్టూ తాను తిరగడం, సూర్యుని చుట్టూ తిరగడం, మనుష్యులకు పంటనివ్వడమే అనుకుంటున్నారా! మనుష్యుల ప్రవర్తననుబట్టి ఏ సమయంలో అయితే దేవుడు పరలోకంలో కోపోద్రిక్తుడవుతున్నాడో, అలాంటప్పుడు ఈ భూమి మనిషిని అదుపుచేయడానికి దేవుని తరపున శిక్షను అమలుచేస్తుంది.

మనిషికి జీవించేకళ తెలియనప్పుడు వాడిని ఈ భూమిమీద నుండి తీసెయ్యాలి అంటున్నాడు దేవుడు. మన పెరట్లో ఒక మొక్కను వేసుకుంటాము. దానికి మడి కట్టి, నీరు పోసి, ఎరువు వేసి అది మంచిగా ఫలించాలని మనం కోరుకుంటాము. ఫలించడానికి దానికి కొంత సమయం ఇస్తాము. రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్లు ఎదురు చూచిన తరువాత చెట్టైతే ఏపుగా పెరిగింది కానీ దానికి ఫలములు లేవనుకోండి. ఆకులు, కొమ్మలు తప్ప దానినుండి ఫలములు రావడంలేదని మీరు నిర్ణయించుకున్నప్పుడు మీరు వెంటనే గొడ్డలిని తెస్తారు. వెంటనే కత్తి ఎక్కడ ఉందో చూస్తారు. ఆ కత్తికి పదును పెడతారు. ఇప్పటి వరకు మూలన ఎక్కడో ఉన్న ఆ కత్తికి పనిలేదు. ఇప్పుడు ఆ కత్తి అవసరం మీకు ఏర్పడింది. గొడ్డలి అవసరం మీకు ఏర్పడింది. ఫలములు ఇవ్వని ఆ చెట్టును మీరు నరికేస్తారు. ఎందుకో తెలుసా? తొలగించబడిన ఆ స్థానంలో ఫలములిచ్చే మరొక క్రొత్త చెట్టును నాటాలని అనుకుంటారు. ఇది నిజం. ఇందులో వాస్తవం ఉంది. ఇందులో ధర్మం ఉంది. దేవుడు కూడా ఇలాంటి నిర్ణయానికి వచ్చేసాడు. భూమిమీద ఉన్న మనుష్యులు ఆయన వలన సారాన్ని అనుభవిస్తూ ఆయనను గూర్చి పట్టించుకోకపోతే ఆయన భూమిమీద మనుష్యులను ఎందుకు ఉంచుతాడు చెప్పండి? అందుకే జీవించే కళ తెలియని ప్రతి ఒక్కరూ జీవించే కళ నేర్చుకోవాలని ఆయన హెచ్చరిస్తున్నాడు.

ఈ రోజు మనుష్యులకున్న ఆలోచన ఏమిటి చెప్పండి. డబ్బు సంపాదించాలి, ఒక స్థలం కొనుక్కోవాలి, ఒక ఇల్లు కట్టుకోవాలి. బంగారం కొనుక్కోవాలి, వస్త్రాలు కొనుక్కోవాలి. ఎవడైనా డబ్బు సంపాదించిన తరువాత నేను ఈ ధనాన్ని నా దేవుని కొరకు ఖర్చుచేయాలి అని అనుకుంటాడా? నా చుట్టూ ఉన్న సమాజాన్ని బాగుచేయటానికి ఈ ధనాన్ని వ్యయపరచాలని అనుకుంటాడా? అలాంటి ఆలోచన ఎవ్వడికీ ఉండదు. డబ్బు సంపాదన మంచిది కాదు అని నేను అనను. కానీ దాని వలన దేవునికి లాభం లేకపోతే ఆ సంపాదన మంచిది కాదు. ఒక వెయ్యి రూపాయిలు సంపాదిస్తే ఆ ధనంతో తన శరీరాన్ని ఎలా సుఖపెట్టుకోవాలి అని ఆలోచిస్తాడు. ఒకవేళ భక్తిపరుడుగా లోకానికి చూపించుకున్నవాడైతే అందులో ఒక పది రూపాయలు దేవునికి చందా వేస్తాడు. అది దేవునికి అక్కరలేదు. దేవుడు నీ ధనాన్ని కోరుకోలేదు. దేవుడు నీ జీవితాన్ని కోరుకున్నాడు. దేవునికి మన ధనమెందుకు? మనలో జీవించే కళ దేవునికి కావాలి. మన పైసలు కావాలని అడుక్కునేవాడా దేవుడు? ఈ విషయంలో ఆయన ఏమన్నాడో తెలుసా? వేయికొండలమీద పశువులన్నీ నావే కదా అన్నాడు. ఆకాశంలో ఎగురుతున్న పక్షులన్నీ  నావే కదా అన్నాడు. నాకు మీరేమి ఇవ్వగలరు? అని అడుగుతున్నాడు దేవుడు. చెట్లు ఆయనవే, చెట్లకు కాసే ఫలాలు ఆయనవే. అడవులన్నీ ఆయనవే, సముద్రంలో చేపలన్నీ ఆయనవే. గాలి ఆయనది, నేల ఆయనది, నీరు ఆయనది. మేఘములు ఆయనవి, ఆకాశములు ఆయనవి. ఆయనకు మీరేంటయ్యా ఇచ్చేది? చెట్టు నిండా జామకాయలు పండితే, ఒక్క జామకాయ దేవునికి ఇస్తారు. మనం భోజనం చేసేటప్పుడు ఒక ముద్ద దేవునికి పెడతారు. ఆ ముద్దతో దేవుని ఆకలి తీర్చేద్దాం అనుకుంటారు. మీకు కూడా దేవుడు ఒకే ఒక్క ముద్ద పెట్టి, మీ కంచం అంతా లాక్కుంటే ఊరుకుంటారా? అయ్యబాబోయ్! దేవునికి ఒక నమస్కారం, అని వెంటనే పారిపోతారు. అందుకే దేవుడు మన పైసల కొరకు ఆలోచించడు. ఆయన గొప్పవాడు, ఆయన సర్వోన్నతుడు. ఆయన సైన్యములకు అధిపతి. ఆయనకు మనం ఏమి ఇవ్వగలం చెప్పండి? అసలు దేవునికి మన నుండి ఏమి కావాలో ఆయన్ను ఎప్పుడైనా అడిగారా? ఆయన మనసు తెలుసుకున్నారా? ఒక అతిథి మీ ఇంటికి వస్తే, ఆ అతిథి మనసును మీరు తెలుసుకుంటారు. ఆ అతిథికి ఏమి ఇష్టమో అది వండి పెడతారు. అతిథికి చికెన్ బిర్యాని ఇష్టంలేదనుకోండి. ఆ రోజు అదే వండిపెడితే అతడు తినడు. అందుకనే అతిథులు మీ ఇంటికి రాగానే ఏం తింటారని, మీరేం తీసుకుంటారని అడిగి, వారికి నచ్చినది వారు కోరుకున్నది తయారుచేసి వారికి పెడతారు. ఒక రోజుండి వెళ్లిపోయే అతిథి విషయంలో ఎంత చక్కగా ఆలోచించాడు మనిషి? దేవుని విషయంలో ఇలా ఆలోచించాడా? మనిషి దేవుని మీద పరిశోధన చేసాడా? దేవునికి ఏమి కావాలో మనిషి తెలుసుకున్నాడా? నేను మాత్రం అదే పరిశోధన చేసాను. అందరికీ అన్నీ ఇచ్చే దేవునికి నేను ఏమి ఇవ్వాలి? నేను సరైన జీవించే కళను ఇవ్వాలి. ఒక మంచి జీవించే కళను నా జీవిత కాలములో నేను దేవునికి చూపించాలి. ఇది మనకు అర్థమైననాడు అనేకమంది సహోదరులకు దానిని వివరించి, వారిని కూడా ఆ కళలో జీవింపచేయాలి. అది నా కర్తవ్యం. ప్రపంచవ్యాప్తంగా ఏ మనిషికీ ఈ జ్ఞానము లేదు. దీనిని ఎవ్వరూ  తెలుసుకోరు.

ఇప్పుడు నేను మీకు ఒక వార్త చెబుతాను. అదేమిటో తెలుసా? భూమి కంపించి వణికిపోయింది. మన ఆసియా ప్రాంతంలోనే 2016 ఏప్రిల్ మాసంలో, 16రోజుల్లో సుమారు 22 భూకంపాలు వచ్చాయి. 2015వ సంవత్సరంలో నేపాల్ భూకంపం మీ అందరికీ విదితమే. ఆ భూకంపము నేపాల్‌లోని ప్రతి భవనాన్ని నేలమట్టం చేసింది. ఇంతకీ ఈ భూకంపాలు ఎందుకొస్తున్నాయి? ఎవరి వలన వస్తున్నాయి? ఏ ఒక్కడూ ఈ విధంగా పరిశోధించలేదు. ఒకవేళ పరిశోధనలు చేసినా, భూమిలో పలకలు సర్దుకుంటున్నాయని, వాతావరణ మార్పులే దీనికి కారణమనే తప్పుడు వార్తలు చెబుతారు. అసలు నిజమేమిటో చెబుతాను వినండి. ఈ భూమిమీద దేవుడు కొన్ని ప్రాంతాలను ఎన్నుకుంటాడు. అందులో జపాన్, నేపాల్, ఇండియా, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్, మెక్సికో, టర్కీ, ఇండోనేషియా లాంటి దేశాలు తరచూ మనకు వినిపిస్తుంటాయి. 2016 ఏప్రిల్ మాసంలో వరుసగా 5వ తేదీ నుండి 16వ తేదీ వరకు అనేక దేశాలను ఈ భూకంపములు కుదిపేసాయి. దీనికి సరైన కారణమేమిటో ప్రపంచ వేదిక మీద ఏ ఒక్కరూ చెప్పలేకపోయారు. శాస్త్రవేత్తలను అడిగితే భూమిలోపలి పొరలలో ఉన్న పలకలు సర్దుకోవడం వల్లే ఈ భూకంపాలు వస్తున్నాయని చెబుతున్నారు. మరి అలాగైతే, పలకలు సర్దుకోకుండా చెయ్యమనండి చూద్దాం. అది వారి తరం కాదు. ఎందుకంటే, ఈ భూమిని సృష్టించింది వారు కాదు. ఈ భూమిని నడిపిస్తున్నది కూడా వారు కాదు. ఈ భూకంపాలు రావటానికి నిజమైన కారణం ఏమిటో తెలుసా? ఆయా దేశాలలో, ఆయాకాలాలలో సంభవిస్తున్న ప్రతి భూకంపానికీ మూలకారణం ఏమిటో తెలుసా? దేవుడు తాను సృష్టించిన ఈ భూమితో మాట్లాడుతున్నాడు . ఈ భూమి చెవి యొగ్గి ఆలకిస్తుంది. భూమి మనలాంటిది కాదు. భూమి జీవించే కళ తెలిసినది. భూమి తాను ఎవరికి లోబడి జీవించాలో తెలుసు. మనము నివశిస్తున్న ఈ భూమి దేవుని యొక్క స్వరాన్ని ఆలకిస్తుంది. భూలోకమా వినుము! నా పిల్లలకు జీవించే కళ తెలియదు గనుక వారిని నీవు శిక్షించాలి అని సర్వోన్నతుడు, సైన్యములకు అధిపతి అయిన ప్రభువు చెబుతున్నాడు. ఏ దేశంలో, ఏ వీధిలో, ఏ ఇంటికి భూకంప తాకిడిని ఇవ్వాలో దేవుడు భూమికి ఆజ్ఞ ఇస్తాడు. దాని ప్రకారము, ఏ తేదీన ఏ ప్రాంతంలో భూకంపం రావాలో భూమికి ముందుగా దేవుని నుండి సమాచారం అందుతుంది. అందుకే దానినిబట్టి ఆ భూమి అక్కడ కంపిస్తోంది. ఎందుకు అక్కడే కంపిస్తోందంటే, ఆ ప్రాంతంలో ఉన్నవారికి జీవించేకళ తెలియదన్నమాట! ఈ పుస్తకాన్ని జపాన్ ప్రెసిడెంట్‌కు పంపిస్తాను. జపాన్ ప్రధాని, ఆ దేశ ప్రజలు వింటారేమో చూద్దాం. వినాలి, మారాలి, జీవించే కళ తెలుసుకోవాలి. వినకపోతే మరిన్ని భూకంపాలు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కేవలం జపాన్ మాత్రమే కాదు. కేవలం భూకంపాలు మాత్రమే కాదు. ఇవి కేవలం ఉదాహరణకు మాత్రమే నేను ప్రస్తావించాను. భూకంపంతో పాటుగా, దేవుని ఉగ్రత కరువు రూపంలో, రోగాల రూపంలో, సునామీ రూపంలో, ప్రళయాల రూపంలో, ఇంకా మరెన్నో రూపాలలో మానవ జీవితాలను అతలాకుతలం చేస్తూనే ఉంది. గాలికి, వర్షానికి, సముద్రానికి, సూర్యునికి, వృక్ష పక్షి జంతు జల చరాలకు దేవుడు తన ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. అందుకే ఈరోజు ప్రజల బ్రతుకుయొక్క అంతు చూస్తున్నాయి. అలాగే, జపాన్ దేశమొక్కటే కాదు. ప్రపంచంలో సుమారు 200 దేశాలు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కోవాలి. అన్ని దేశాల ప్రతినిధులు ఈ నా జీవించే కళ పుస్తకాన్ని చదవాలి. ప్రపంచ నరజాతికి దేవుడు నిర్ణయించిన జీవించే కళ తెలియాలి. ఈ ప్రకృతిలో దేవుని శక్తులైన ప్రతి దానికి ఆయన ఆజ్ఞలు ఇస్తున్నాడు. మరి ఇప్పుడు పరిష్కారం ఏమిటి? జీవించే ప్రతి ఒక్కరూ జీవించే కళను నేర్చుకోవాలి. అప్పుడు దేవుడు ఈ భూమండలాన్ని ఇక కంపించవద్దని ఆజ్ఞనిస్తాడు. ఎందుకంటే, తన ప్రజలు జీవించే కళను తెలుసుకున్నారు అంటాడు దేవుడు. వీటన్నింటికీ పరిష్కారం అదొక్కటే. పరిష్కారం అదేనని మీరెలా చెప్పగలరండి అని మీరు నన్ను అడగవచ్చు. మేము నిజంగా దేవుని వైపు తిరిగితే, మేము నిజంగా జీవించే కళను నేర్చుకుంటే భూకంపాలు ఆగిపోతాయా? ప్రకృతి వైపరీత్యాలు ఆగిపోతాయా? మేము చక్కగా బ్రతుకగలమా? ఇలా ఎక్కడ ఉందండి? అని నన్ను మీరు ప్రశ్నించవచ్చు. ఆ వాస్తవాన్ని, యదార్థ సంగతిని దేవుడు తన గ్రంథంలో వ్రాయించాడు.

**దినవృత్తాంతములు మొదటి గ్రంథము 16 : 29- 'పరిశుద్ధాలంకారములగు ఆభరణములను ధరించుకొని ఆయన యెదుట సాగిలపడుడి. భూజనులారా, ఆయన సన్నిధిని వణకుడి. అప్పుడు భూలోకము కదలకుండును. అప్పుడది స్థిరపరచబడును.'** దేవుని దృష్టిలో నీతి ఒక ఆభరణం, ప్రేమ ఒక ఆభరణం, దయ ఒక ఆభరణం. ఇలాంటి దేవునికి నచ్చిన ఆభరణములను కలిగియుండి, ఆయన ఎదుట సాగిలపడాలి. ప్రభువా ఏమిచేయమంటావో చెప్పు అని దేవునిని

అడగండి. భూమి మీద ఉన్న మనుష్యులారా, చీమలకు ఈ పరిస్థితి లేదు. కుందేళ్ళకు ఈ భయం లేదు. పులులకు ఈ ఆజ్ఞలు లేవు. అవన్నీ చక్కని జీవించే కళతో బ్రతుకుతున్నాయి. భూజనులారా ఆయన సన్నిధిని మీరు వణకాలి. మనిషికి దేవుడంటే వణుకు రావాలి. మనిషి దేవునిని పట్టించుకుంటున్నాడా? ఇంతకీ వణకడం అంటే ఏమిటనుకున్నారు? ఏదో పైకి వేషధారణతో గడగడ వణకడం కాదు. చలికి వణికినట్టుగా దేవుని ముందుకెళ్లి వణకడం కాదు. మనిషికి దేవుని భాష అర్థం కావాలి. భూమికి, సకల చరాచర సృష్టికి ఆయన భాష అర్థమవుతుంది. ఆయన భాష నాకు అర్థమవుతుంది. ఆయన భాష మనుష్యులకే అర్థం కావడం లేదు. నామకార్థ క్రైస్తవులకు అస్సలు అర్థం కావడం లేదు. పరిశుద్ధాలంకారములగు ఆభరణాలను ధరించుకోమంటే జ్యూవెలర్స్ షాపుకు వెళ్లి ఆభరణాలను కొని తెచ్చుకొని వాటిని ధరించుకుంటున్నారు. ఒకవేళ దేవునికి కూడా అవే అవసరమేమో అనుకుని వాటిలో కొన్నింటిని దేవునికి ఇస్తున్నారు. పరిశుద్ధాలంకారములగు ఆభరణములంటే అవి కాదు. జ్యూవెలర్స్ షాపుకు వెళ్ళి పరిశుద్ధాలంకారములగు ఆభరణములు అని అడగండి, ఇస్తాడేమో చూద్దాం. దేవుడు చెప్పిన ఆభరణములు అంటే 22 క్యారెట్ల బంగారమో, 24 క్యారెట్ల బంగారమో కాదు. అవి జ్యూవెలర్స్ షాపులో దొరకవు. అవి మార్కెట్‌లో దొరకేవి కావు. మరి ఎక్కడ దొరుకుతాయి? దేవుని పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో తప్ప ఇంకెక్కడా దొరకవు. బైబిల్‌లోని ఆ పరిశుద్ధాలంకారములగు ఆభరణములు ధరించుకొని దేవుని దగ్గరకు వెళ్లాలి. ఆయన ముందు సాగిలపడాలి. అనగా దేవునికి లోబడాలి అని అర్థం. భూజనులారా, ఇటువంటి కళను మీ జీవితంలో పాటిస్తున్నప్పుడు ఏం జరుగుతుందో తెలుసా? అప్పుడు భూలోకము కదలకుండును. అప్పుడు అది స్థిరపరచబడును. జపాన్‌కి తెలుసా ఈ సంగతి? ఫిలిప్పీన్స్‌కి తెలుసా ఈ సంగతి? తెలియదు. మేడ్ ఇన్ జపాన్ అంటూ ఒక చిన్న బ్యాటరీ, మేడ్ ఇన్ జపాన్ అంటూ ఒక చిన్న కెమెరా, మేడిన్ జపాన్ అంటూ ఒక చిన్న వాక్‌మెన్ లాంటివి తయారుచేస్తూ కూర్చున్నారు తప్ప, వారియొద్ద జీవించే కళ లేదు. వాళ్లు ప్రపంచానికి పరిచయం చేసిందేమిటో తెలుసా? ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని మాత్రమే పరిచయం చేసారు. ఏ దేశమూ మిగిలిన దేశాలకు దేవున్ని పరిచయం చేయలేదు. అందుకే దేశాలమీద దేవునికి కోపం ఉంది! జపాన్ అంటే ప్రతి ఒక్కడికి గుర్తుకొచ్చేది ఏమిటి? ఒక వాక్‌మెన్. గ్రీస్ అంటే జనులకు గుర్తొచ్చేది ఏమిటి? ఒలింపిక్స్ ఆటలు. చైనా అంటే ప్రపంచానికి గుర్తుకొచ్చేది ఏమిటి? మొబైల్ ఫోన్‌లు. ఒక దేశం పేరు చెప్పగానే దేవుడు గుర్తుకు రావాలి! అలా ఏ దేశమైనా ఉందా? పోని మనదేశం ఉందా? దేశాల పేర్లు గుర్తొస్తే ఈ రోజు స్కామ్‌లు గుర్తుకొస్తున్నాయి. నల్లధనం గుర్తొస్తుంది. హత్యలు గుర్తొస్తున్నాయి. మానభంగాలు గుర్తొస్తున్నాయి. ఉగ్రవాద దాడులు గుర్తొస్తున్నాయి. కరువుకాటకాలు గుర్తొస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 200 దేశాలలో ఏ దేశం పేరు చెప్పినా జీవించేకళ గుర్తుకురావడం లేదు. ఎందుకంటే, ఏ దేశంలోనైనా ఇది మాత్రమే లేదు. దేశాలకు ఇది చేతకాదు. అందుకే భూకంపాలకు గురైన దేశాల వరుసలో ఎన్ని దేశాలు ఉన్నాయో చూడండి. ఇక్కడే ఉందండి అసలు సంగతి. మీరు నిజంగా మీ తండ్రి యొక్క మనసును గ్రహించి మీరు జీవించే కళను తెలుసుకుంటే అప్పుడు భూమి కదలకుండా ఉంటుంది. ఆ భూమి స్థిరపరచబడును. మీరు బ్రతికి ఉన్నంతకాలం మీరు జీవించే కళను కలిగి ఉంటే, మీరు నిలబడిన చోట, మీరు నివసించే ప్రాంతం ఎప్పుడూ కదలడానికి వీలు లేదు. ఈ రహస్యం తెలుసా మీకు? దేవుని సంస్కృతిని చాటిచెప్పే కళాకారులు ఎక్కడ ఉంటారో, దేవుని సాంస్కృతిక కార్యక్రమాలు జరిపించే కళాకారులు ఎక్కడ ఉంటారో అక్కడ ప్రకృతి బాగుంటుంది. రంగులు, వేషాలు, విచిత్రమైన బట్టలు వేసుకొని వచ్చి నాట్యం చేసే వారు కళాకారులు కాదు. దేవుని కళాకారులు జీవించే కళను కలిగినవారు. అలాంటి వారు ఎక్కడ ఉంటారో అక్కడ భూమి స్థిరపరచబడుతుంది. అక్కడ భూమి కదలకుండా ఉంటుంది. లేదంటే భూమి కదులుతుంది. అలా కదిలినప్పుడు ఆ శిథిలాలలోనికి మనిషి వెళ్లిపోతాడు. మనిషి చావకుండా ఉండటానికే ఈ మాటలు వ్రాస్తున్నాను. మనిషి పాపాన్ని చూస్తున్న దేవుడు వానిని విడిచిపెట్టడు. ఏ ఒక్కడినీ దేవుడు ఊరుకోడు.

ప్రియులారా! చక్కని సంగతులను దేవుడు తన గ్రంథంలో వ్రాయించాడు. కానీ, ప్రతి ఒక్కరు ఏదో ఒక కారణాన్ని చూపించి ఆయన మాటలకు దూరమైపోతున్నారు. అందుకే మన చుట్టూ ఉన్న సమాజంలో ఎన్నో వర్గాల వారు నేటికీ జీవించే కళ తెలియక అర్థాంతరంగా చనిపోతున్నారు. తమకు తెలియకుండానే తమ బ్రతుకును

చేజార్చుకుంటున్నారు. ఇది నిజం! జీవించే కళ తెలియక, ఆయుష్షు తీరకుండానే మనిషి లోకాన్ని విడిచి వెళ్లిపోతున్నాడు. జీవించే కళ అర్థంకాకపోతే, తన ఆయుష్షు పూర్తికాకుండానే మనిషి బలవంతంగా మరణిస్తున్నాడు. జీవించే కళ తెలియక అకాలములో ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఉదాహరణకు, ఒక రైతు తనకున్న కొద్దిపాటి భూమిని దున్ని, అందులో విత్తనాలు జల్లి, ఎరువులు వేసి పంట పండిస్తున్నాడు. పంట పండించడానికి అతనికి పైకం అవసరం అవుతుంది. అందుకే అప్పుచేస్తాడు. అప్పు చేసినటువంటి రైతు, చివరకు తన పంట చేతికందక ఆ అప్పు తీర్చలేకపోతున్నాడు. అప్పుడు అప్పు ఇచ్చిన వారందరూ రైతును నిలదీస్తున్నారు. సదరు రైతు జీవించే కళ తెలియక, గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంటున్నాడు. తన జీవితాన్ని బలవంతంగా ముగించుకుంటున్నాడు. అప్పు తీర్చలేని రైతు బలవన్మరణం చెందుతున్నాడు. దీనికి పరిష్కారం ఏమిటి? ఎందరో రైతులు ఇలాగే బలైపోతున్నారు. ఒక్కరా, ఇద్దరా, ముగ్గురా... వందమంది, వేల కొలదిగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మనకు సుస్పష్టం. పంట పండకపోతే, చేసిన అప్పు తీర్చలేకపోతే ఆత్మహత్యే శరణ్యమా? అర్థాంతరంగా రైతు తన బ్రతుకును ముగించుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? అతను ఆత్మహత్య చేసుకుంటే పండని పంట పండుతుందా, తీరని అప్పు తీరుతుందా?? నా రైతు సోదరులందరూ దీనిని జాగ్రత్తగా గమనించాలి. మీరు జీవితాన్ని ఎదుర్కోవాలి. జీవించే కళను తెలుసుకోవాలి. మీరు చచ్చిపోవటానికి వీలులేదు. మీరు బ్రతకాలి. భూమి మీద బ్రతకాలి ప్రతి మనిషి తన పూర్తి ఆయుష్కాలమంతా బ్రతకాలి. దేవుడిచ్చిన ఆయుష్కాలమే చాలా తక్కువ. మనిషి సరాసరి జీవితకాలం 60 సంవత్సరాలు లేక 70 సంవత్సరాలు. ఇంకా ఎక్కువ బలం ఉంటే 80 సంవత్సరాలు బ్రతుకుతాడు. అక్కడితో ముగిసిపోతుంది. ఈ కొద్దిపాటి జీవితకాలాన్ని దేవుడు మనందరికీ ఎందుకిచ్చాడంటే, జీవించే కళను కలిగి ఉండటానికి మాత్రమే. అంతేగాని, మధ్యలో ఆపటానికి మాత్రం కాదు. మధ్యలోనే బలవంతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోవటానికి కానే కాదు. మనము పూర్తిగా జీవించాలి. ఆ జీవనమంతా జీవించే కళతో జీవించాలి. కానీ ఈ రహస్యాలు ఎవ్వరూ చెప్పరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనే విషయం ఎంతోమంది దృష్టికి వెళ్లింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వాధినేతలు, అధికారుల దృష్టికెళ్లింది. అందరూ నిమ్మకు నీరెత్తన్నట్లే ఉన్నారు. ఇంకా గట్టిగా నిలదీస్తే ఏదో సహాయం చేస్తామంటున్నారు. ఏదో కంటి తుడుపు సహాయాన్ని ప్యాకేజీల రూపంలో ప్రకటిస్తామంటున్నారు. ఒక రైతు ఆత్మహత్య చేసుకుని చనిపోతే, అది వారి దృష్టికి వెళితే అప్పుడు సహాయం చేస్తామంటున్నారు. కానీ, రైతులందరికీ జీవించే కళను మాత్రం నేర్పించలేరు. రైతులందరికి సహాయంతో పాటు జీవించే కళను నేర్పించాలి. అప్పు తీర్చలేకపోతే ఎందుకయ్యా నీ జీవితాన్ని బలవంతంగా ముగించుకుంటున్నావు? నీ మీద ఆధారపడిన కుటుంబం ఉంది కదా. దానిని పట్టించుకోవా? నీ భార్య, నీ పిల్లలు, నీ వారందరూ ఏమైపోతారు? నీవే వారికి దిక్కు అనుకుంటూ, నీ కుటుంబంలో నిన్ను చూసుకుని బ్రతుకుతున్నారే! వారికి పెద్దగా ఉన్న నీవు, అండగా ఉండవలసిన నీవు అంత పిరికి వాడవవుతున్నావా? అలా అవ్వటానికి వీలులేదు. ఈ మాటలను రైతుకు ప్రభుత్వం చెప్పదు. అందుకే నేను చెబుతున్నాను. నా రైతు సోదరులారా, ఇది మీకు దేవుడిచ్చిన జీవితం. దీనిని మీరు అర్థాంతరంగా ఎందుకు ముగించుకుంటున్నారు? ఏ పరిస్థితీ నీ జీవితాన్ని ముగించడానికి వీలులేదు. నీకు నువ్వు బ్రతికే హక్కుంది. ఈ భూమి మీద ప్రతి జీవికి, ప్రతి మనిషికి బ్రతికే హక్కుంది. చచ్చిపోవటానికి నువ్వు ఎవరు? చంపటానికి మరొకడెవరు? దేవుడు నీ ఆత్మను తీసుకుంటేనే తప్ప, అనగా భూమి మీద నీ ఆయుష్కాలాన్ని దేవుడు ముగిస్తే తప్ప నీవు వెళ్లకూడదు. ఆత్మహత్య అనేది దేవుని దృష్టిలో ఒక భయంకరమైన పాపం. జీవించే కళ తెలియక పోతేనే మనిషి ఆత్మహత్య చేసుకుంటాడు. జీవించే కళ రాకపోతే ఈ శరీరంలో ఉండలేడు. ఈ బ్రతుకును ముగించి వెళ్ళిపోవాలి అనుకుంటున్నాడు. ఇక మీదట ఏ మనిషిలోనూ అలా జరగటానికి వీలులేదనే, జీవించే కళలో ఈ రెండవ భాగమును మీముందు ఉంచుతున్నాను.

రైతులు మాత్రమే కాదు. పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయిపోయానని ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. నీ బ్రతుకును శాసించడానికి పరీక్షలెంతయ్యా? నీకు 3 యేళ్లప్పుడు చదువును ప్రారంభించావు. సుమారు 25 యేళ్లు వచ్చేసరికి ఆ చదువును ముగిస్తావు. చదువు నీ జీవితంలో ఒక భాగం మాత్రమే. ఆ చదువులో ఏదో ఒక పనికిమాలిన సబ్జక్ట్ ఉంటుంది. నీవు పరీక్ష పేపరులో వ్రాసిన సమాధానాలకు మార్కులు

వేయలేదని నీ వెందుకయ్యా ఆత్మహత్య చేసుకుంటున్నావు? ఓ విద్యార్థీ, నీకు జీవించే కళ తెలియదా? నీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులు, ప్రభుత్వాలు, అధికారులు, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో,.. ఎవ్వరూ జీవించే కళను నీకు నేర్పించలేదా? ఓ మై డియర్ స్టూడెంట్, నీవు చచ్చిపోకూడదు. లెక్కలలో మార్కులు తక్కువ వచ్చాయని, సైన్సులో మార్కులు రాలేదని చనిపోతారా? ర్యాంకులు రాలేదని చనిపోతారా? ఇలా ఎవ్వరూ చనిపోకూడదు. విద్యార్థిగా నీకు మంచి భవిష్యత్తు ఉంది. నీవు ర్యాంకు సాధించకపోతే దేవుడు ఏమీ అనడు. మిగిలిన వారి పిల్లలతో పోల్చుకుని తల్లిదండ్రులు తిడతారేమో! ఆ విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయి నీకెందుకు రాలేదని ఉపాధ్యాయులు దండిస్తారేమో కానీ, నీకు బ్రతుకునిచ్చిన దేవుడు ఏనాడూ బాధపడడు. ఎందుకంటే అది లోక విద్య. లోక విద్యలో గుండు సున్నా వచ్చినా, 100కి 100 వచ్చినా దేవునికి పట్టింపు లేదు. కానీ, దేవుని విద్యలో మాత్రం ప్రతి ఒక్కరికీ మార్కులు రావాలి. ఒక విద్యార్థికి జీవించే కళను మొదట నేర్పిస్తే, ఇక వాడు అన్నింటిలోను ఫస్టే వస్తాడు. జీవించే కళను బాగా తెలుసుకున్న వారు ఎన్నడూ ఆత్మహత్యలు చేసుకోరు. మార్కులు తక్కువయ్యాయని ఆత్మహత్య చేసుకోరు. ఈ రోజు భారతదేశంలో అత్యున్నతమైన ఇంజనీరింగ్ కళాశాలలైన ఐ.ఐ.టి.(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) వంటి కళాశాలల్లో ప్రవేశం పొందిన పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలలో చదుతున్నవారు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎందుకంటే, వారికి చదువు మాత్రమే వచ్చు. కానీ, జీవించటం ఎలాగో తెలియదు. దానిని ఎవ్వరూ వానికి నేర్పించలేదు. అందుకే క్షణికావేశంలో వారి బ్రతుకును ముగించుకుంటున్నారు.

నటనచేసే సినీనటులు తెరమీద మాత్రమే 'హీరో'లు. వారు తిరిగి ఇంటికి వెళితే 'జీరో'లు అయిపోతున్నారు సినీనటులలో ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సినీ అవకాశాలు దొరకక, వారు నటించిన సినిమాలు ప్రదర్శింపబడక, వారికి విలాసాలకు ధనం సరిపోక, ఒక సుఖవంతమైన జీవితానికి అలవాటు పడిన తరువాత వారి చేతిలో చిల్లిగవ్వకూడా లేకుండా పోయేసరికి వారు కూడా తమ బ్రతుకు ముగించుకోవాలనుకుంటున్నారు. ఇటీవల ఆ కోవకు చెందిన తెలుగు సినీ నటులు తమ బ్రతుకును బలవంతముగా ముగించుకున్నారు. ఉదయ్ కిరణ్, రంఘనాథ్, లేటెస్ట్‌గా 'చిన్నారి పెళ్ళికూతురు' ప్రత్యూష బెనర్జీల ఆత్మహత్యలు మీరు వార్తలలో విన్నారు. తమ బ్రతుకును తమకిష్టము వచ్చినప్పుడు ముగించుకోవడమంటే మనిషికి చాలా చులకన అయిపోయింది. వద్దు, నీవు అలా ముగించుకోవటానికి వీలులేదు. నీవు జీవించే కళను కలిగి భూమిమీద బ్రతకటానికి వచ్చావు. నిజంగానే ఈ భూమిపై ఒక్కోసారి మనము జీవించడానికి పరిస్థితులు అనుకూలించవు. ఎందుకంటే మనచుట్టూ ఉన్న సమాజం ఎలాంటిదో మీకు తెలియనిది కాదు. ఇది దుష్ట సమాజం! ఇది క్రూరమైన సమాజం. అందుకే అలాంటివారిని తప్పించుకుంటూ, వారిమధ్య పవిత్రముగా నీవు బ్రతికి తీరాలి. దేవుడు చెప్పిన జీవించే కళ నీకు అర్థమైతే ఎప్పటికీ నీకు ఆత్మహత్య చేసుకోవాలి అనే ఆలోచనే రాదు. మన బ్రతుకు కాలంలో కష్టాలు రావని, ఇబ్బందులు రావని, వచ్చినా అవి చాలా చిన్నవని నేను చెప్పటం లేదు. ఆత్మహత్యకు ఒక వ్యక్తిని ప్రేరేపించిన కష్టమంటే చాలా భయంకరమైన కష్టమే! నేను కూడా ఒప్పుకుంటాను. కానీ ఆ క్షణంలో ఒక్కసారి మీరు జీవించే కళను గుర్తు చేసుకోవాలి. మీ దేవున్ని మీరు జ్ఞాపకం చేసుకోవాలి. మీకు సంభవించిన కష్టం ఎంత పెద్దదైనా కానీ మీరు చచ్చిపోవటానికి అది ఒక కారణం కాకూడదు. భూమిమీద బ్రతుకంటే ఏమనుకుంటున్నారు? అది చాలా విలువైనది. ప్రతి క్షణం చక్కని జీవించే కళను మనము కలిగి ఉండాలి. అప్పుడు మనము ఖచ్చితంగా బ్రతికి తీరతాం. మనము ఎందుకు బ్రతుకుతున్నామో మనకు అర్థం అయిపోతుంది. ఈ రోజు నేను దేవుని కోసం బ్రతికాను. రేపటి దినాన నేను దేవునికోసం బ్రతుకబోతున్నాను. దేవుడిచ్చిన ఆయుష్కాలంలో చివరి వరకూ నేను ఆ పరలోకపు తండ్రి అభీష్టాన్ని నెరవేర్చబోతున్నాననే మంచి ధైర్యంతో బ్రతకాలి. అదే జీవించే కళ. ఇది తెలియని వారు ఎందరో చనిపోతున్నారు. అర్థాంతరంగా తమ బ్రతుకును ముగించుకుంటున్నారు.

కుటుంబ కలహాలతో కొంతమంది, ప్రేమ ఫలించలేదని మరికొంతమంది ప్రేమలో విఫలమై చనిపోతున్నారు. ఒక కుర్రాడికి అప్పుడప్పుడే మీసాలొస్తాయి. వాడికి అప్పుడే పరిచయం అవుతుంది ఆ ప్రేమ! లవ్ ఎట్ ఫస్ట్ సైట్. మన చుట్టూ ఉన్న సమాజం మంచిది కాదు. మన చుట్టూ ఉన్న మీడియా మంచిది కాదు. లవ్ ఎట్ ఫస్ట్

సైట్ అని యవ్వనస్థులకు నేర్పించేది ఈ మీడియానే! లోకానికి ఈ చెడిపోయిన సినీ మీడియా వీటినే నేర్పిస్తోంది. అందుకే ఈ రోజు పాఠశాలకు వెళ్ళేవాడికి కూడా లవ్ కావాలి. 5వ తరగతి చదవుతున్న వాడికి కూడా లవ్ అంటే ఏమిటో తెలుసు. హైస్కూల్‌లోనే ప్రేమలు మొదలవుతున్నాయి. సినీ మీడియా నేటి జనులను మోసం చేస్తోంది. వారు జీవించే కళను తెలుసుకోకుండా వారి కన్నులకు నిజము కాని రంగుల ప్రపంచాన్ని చూపిస్తోంది. 'గోల్కొండ హైస్కూల్' అనేది ఒక సినిమా పేరు. టెన్త్ క్లాస్ అనేది మరొక సినిమా పేరు. టెన్త్ క్లాసులోనే ప్రేమలో ఎలా పడాలో ఈ సినిమా నేర్పిస్తుందన్నమాట. చిన్ననాడే, ఇంకా బ్రతుకు లోతులకు వెళ్లకుండానే, ఎలా బ్రతకాలో తెలియని పరిస్థితులలో వారు ప్రేమలో పడుతున్నారు. వారి ప్రేమ ఫలించక పోయేసరికి తిన్నగా గోదావరి వంతెన మీదకు వెళ్లిపోతున్నారు, ఆత్మహత్య చేసుకుంటున్నారు. రైలు పట్టాలపై తల పెడుతున్నారు, జీవితాలను ముగించుకుంటున్నారు. చెట్టుకు ఉరి వేసుకుంటున్నారు, లోకాన్ని విడిచి వెళ్లిపోతున్నారు. విషం సేవిస్తున్నారు, కన్నవారికి కడుపుకోతను మిగుల్చుతున్నారు. వారు ఇంకా ముక్కు పచ్చలారని వయస్సులో ఉన్నారు. వారికొరకు ఇంకా ఎంతో విలువైన జీవితం ఎదురుచూస్తోంది. ప్రేమ ఫలించకపోతే జీవితం వద్దా? ఈ జీవితం పాడు ప్రేమ కోసమా? లేక దేవుని కోసమా? వీరికి ఖచ్చితంగా జీవించే కళ తెలియదు! ఈమె కాకపోతే మరొకామె నీ ప్రేమికురాలవుతుంది, నీకు వివాహమవుతుంది. దేవుడు నిర్ణయించిన ఏదో ఒక స్త్రీతో నీకు వివాహం జరుగుతుంది. ఈ పురుషుడు కాకపోతే మరొక పురుషునితో నీకు వివాహం అవుతుంది. నువ్వు తొందర పడకూడదు. జీవించే కళ నీకు తెలియదు గనుక నీవు తొందరపడుతున్నావు. కోపోద్రేకంతో రగిలిపోతున్నావు. కామాభిలాషలో ఆరాటపడుతున్నావు నీవు. ఈ చెత్త మీడియా మనుష్యులకు దానినే నేర్పించింది. మీ హీరోలు మీకు అదే నేర్పించారు. మీ హీరోయిన్ మీకు అదే నేర్పించింది. మీ దర్శకుడు మీకు దానినే చిత్రీకరించాడు. గనుక నీవు కూడా అదే పిచ్చి ప్రేమ భ్రమలో పడి నీ జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకుంటున్నావు. 20 యేళ్లకే నదిలో పడి చచ్చిన ప్రేమికులు ఏం సాధించారు చెప్పండి? 25 యేళ్లకే రైలు ట్రాక్ మీద పడి చచ్చిపోయిన ఆ యువతీయువకులు ఏమి సాధించారు చెప్పండి? విషం త్రాగుతున్నారు, ఉరి పోసుకుంటున్నారు. ఏమిటండి ఇది? ఏ మనిషి దగ్గరా జీవించే కళ లేదు! ఓ ప్రేయసీ ప్రియులారా, పరలోకమందున్న మీ తండ్రి ప్రేమ అర్థం కాని మీకు, ప్రేమంటే ఏం తెలుసు? నీ కొరకు ప్రాణం పెట్టిన యేసుక్రీస్తు ప్రేమను గ్రహించలేని నీకు, ప్రేమంటే ఏం తెలుసు? ఎవడో స్టైలిష్‌గా బైక్ మీద వచ్చాడని, వాడి వెనుక వెళ్లిపోయావు. ఎవరో ఒకామె స్టైల్‌గా బట్టలు వేసుకుందని, హీరోయిన్‌లా ఉందని, జడ విరబూసుకుందని, ఆమె వెనుక వెళ్లిపోయావు. ఛీ, సిగ్గులేదు. సభ్య సమాజానికి నిజంగానే సిగ్గులేదు. బ్రతుకు పరమార్థం తెలియని వీరు రోడ్డున పడి మగవారి వెనుక, ఆడవారి వెనుక సిగ్గు వదిలి పోతున్నారు. కాటికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నవాడికి కూడా ఈరోజు కామాభిలాషే. మనిషి తెలివిగా తన కామము తీర్చుకుంటున్నాడు. నీవు ఎప్పుడు మారతావయ్యా? అందుకే ఈ రోజు ప్రతి నిత్యం దీనిని గూర్చి ఎన్నో వార్తలు మనము వింటున్నాం. ఫలానా చోట అత్యాచారాలు, మానభంగాలు.. అంటూ దిన పత్రిక వారు వ్రాసుకుంటూ వెళ్లిపోతున్నారు తప్ప, దీనికి పరిష్కారం మాత్రం ఇప్పటి వరకు ఎవ్వడూ చెప్పలేదు. జీవించే కళ మాత్రమే దీనికి చక్కని పరిష్కారాన్ని చూపిస్తుంది. ఇది రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్. అందరూ సమాజాన్ని నశింపజేయాలని కోరుకుంటున్నారు. మనిషే మనిషి పతనాన్ని చూడాలని కోరుకుంటున్నాడు. ఆయా పరిస్థితులలో, ఏదో ఒక కారణం చేత ఎంతమంది బలవంతంగా చచ్చిపోతున్నారో చూడండి. వారికి జీవించే కళ తెలియదు. జీవించే కళ ద్వారా ఆత్మహత్యల నివారణకు దేవుడు చేయబోయే వైద్యాన్ని చదువుతూ ఆశ్వాదించండి. బైబిల్‌లో వ్రాయించిన చక్కని మధురమైన మాటలు ఇప్పుడు చూడండి. వేల సంవత్సరాల క్రితం ఆయన పొందుపరచిన మాటలివి.

ప్రసంగి 7 : 17 **'అధికముగా దుర్మార్గపు పనులు చేయకుము, బుద్ధిహీనముగా తిరుగవద్దు. నీ కాలమునకు ముందుగా నీవేల చనిపోదువు?'** ఇక్కడ దేవుడు చెప్పేశాడు చూసారా! అధికముగా దుర్మార్గపు పనులు చేయకుము అన్నాడంటే, ఆత్మహత్య చేసుకునేవారు ముందు ఏం చేస్తారో తెలుసా? పరమ దుర్మార్గపు పనులు చేస్తారు. ఇదే ఆత్మహత్యల వెనుక ఉన్న అసలు రహస్యం 'దిస్ ఈజ్ ది సీక్రెట్ బిహైండ్ ద సూసైడ్'. అలాగైతే మణికుమార్‌గా నేనెందుకు ఆత్మహత్య చేసుకోలేదు? నాతో పాటు ఉన్న దేవుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కళాకారులు

ఎందుకు ఆత్మహత్యలు చేసుకోలేదు? నిజానికి చెప్పాలంటే ఈ భూమిపై ఆత్మహత్యలు చేసుకునే వారికంటే భయంకరమైన కష్టాలు మాకే ఉన్నాయి. అలాగని మా మనసెప్పుడూ ఆత్మహత్య చేసుకోమని మమ్మును ప్రేరేపించలేదు. బాధలలో నీవున్నప్పుడు విరిగి నలిగిన మనసుతో దేవుని దగ్గరకు వస్తే, దేవునిని క్షమాభిక్ష అడిగితే తక్షణమే నిన్ను ఆదరించేదే దేవుని ప్రేమ! నీవు తప్పు చేసావని నిన్ను లాఠీతో దెబ్బలు కొట్టేది కాదు, నిన్ను జైలులో ఉంచేది కాదు నీ కన్న తండ్రి ప్రేమ! క్షమించేదే దేవుని వాక్యం, బ్రతుకునిచ్చేదే బైబిల్. ఆనాడు యేసుక్రీస్తును హింసించినప్పుడు, ఆయన ఏమంటున్నాడో తెలుసా? తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరు యెరుగరు గనుక వీరు మారినప్పుడు వీరిని క్షమించు అని వేడుకుంటున్నాడు. ఒక మహాశక్తిని హింసిస్తున్నారన్న సంగతి వారికి తెలియదు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తును రక్తము కారునంతగా హింసించారు. అలాగని ఆనాటి యూదులకు, రోమా ప్రభుత్వానికి, సామాన్య ప్రజలకు యేసుక్రీస్తు యెంత మాత్రము ద్రోహం చేయలేదు. ఆయన ఎవ్వరికీ కీడు తలపెట్టలేదు. తన బ్రతుకంతా మనష్యులకు సేవ చేసాడు. అయినా ఆయన్ను వారు హింసించారు. ఆయన చర్మాన్ని ఒలిచేస్తున్నారు. ఆయన రక్తాన్ని కళ్ళ చూస్తున్నారు. వారు యెరుగరు గనుక వారిని క్షమించు అన్నాడు యేసుక్రీస్తు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఆనాడు పలికిన చక్కని మాట అది. బైబిల్ అంతటిలో, దేవుని మనసంతా ఏమని చెబుతుందో తెలుసా? దేవునిలో క్షమాగుణం ఉంది. జీవించే కళ తెలియని ప్రతి ఒక్కరూ మొదట బైబిల్ దగ్గరకు రావాలి. కష్టాలలో ఉన్నాను కదా అని ఉరితాడు దగ్గరకు వెళితే అది వచ్చిన వారిని చంపేస్తుంది. విషపు సీసా దగ్గరకు వెళితే నీ ప్రాణమును హరించేస్తుంది. అధికంగా దుర్మార్గపు పనులు చెయ్యొద్దు. మీరు జీవించే కళ నేర్చుకుని, బైబిల్‌లో యేమి వ్రాయబడిందో దాని ప్రకారము మీరు బ్రతకండి. బుద్ధిహీనముగా తిరగొద్దన్నాడు. మీ పిల్లలు బయటికి వెళుతున్నప్పుడు ఎక్కడికి వెళుతున్నారో ఒక కన్ను వేసి ఉంచండి. వారి చేతికి మోటర్ బైక్ ఇచ్చారంటే, తాళాలు వారి చేతిలోపెట్టి ట్యాంకు ఫుల్‌గా కొట్టించి బయటకు వెళ్ళి తిరిగిరా నాయనా అని పంపిస్తున్నావేమో! జాగ్రత్త. వాడు బుద్ధిహీనముగా తిరగటానికి బయలుదేరుతున్నాడు. ఈ బైక్ మీద వాడు ఎలా తిరుగుతున్నాడో తెలుసా? రోడ్డు మీద అందరూ నిదానంగా వెళుతుంటే, వీడు పాములా మెళికలు తిరుగుతూ వెళుతున్నాడు. చాలా యాక్సిడెంట్లు వీళ్ల వల్లనే అవుతున్నాయి. అతి వేగం ప్రమాదకరమని చెబుతున్నా వినడు. హెల్మెట్ పెట్టుకోమని చెప్పినా పట్టించుకోడు. లైసెన్స్ తీసుకోమంటే తీసుకోడు. అందరూ చక్కగా సిగ్నల్స్ చూసుకుంటూ, రోడ్డుకు ఇరువైపులా గుర్తులు చూసుకుంటూ, 30కిమీ. స్పీడ్‌తో, 40 కి.మీ. స్పీడ్‌తో, 50 కి.మీ. స్పీడ్‌తో ఎవరి వేగంలో వారు వెళుతున్నారు. మధ్యలో వీడు వస్తాడు. వాడు చిక్కడు, దొరకడు. వాడి దగ్గర బండికి ఉండవలసిన సర్టిఫికెట్లు ఏమీ ఉండవు. వాడి దుస్తులే వింత వింతగా ఉంటాయి. వాడి రూపమే భయంకరంగా ఉంటుంది. భూమిమీద అపవాది అంటే ఎలా ఉంటాడో వాడే మనకు చూపించేస్తాడు. వాడి హెయిర్ కటింగ్, వాడి వేషధారణ చాలా భయంకరం. వాడు తన బైక్ ఎలా నడుపుతాడో తెలుసా? పాములా మెళికలు తిరుగుతూ తన బైక్ మీద వెళ్ళిపోతాడు. అందరిలో దూరిపోతాడు. సిగ్నల్స్ పాటించడు. నేరుగా లారీలోకి దూరిపోతాడు. ఇలాంటివాడికి జీవించే కళ తెలియదు. అలాంటివాడి చేతికి 200 సి.సి. బైక్, 2000 సి.సి. కారు పెట్రోల్ కొట్టించి ఇచ్చి, తన పర్సులో డబ్బులు దండిగా నింపితే వాడేమి చేస్తున్నాడో తెలుసా? వెళ్ళి బుద్ధిహీనముగా తిరుగుతున్నాడు. ఏ రోజైనా, ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను ఎక్కడికి వెళ్ళావు? ఏం చేస్తున్నావు అని అడిగారా? నీ వల్ల, నీ పిల్లల వల్ల ఈ సమాజం పాడైపోకూడదు. తల్లిదండ్రులకే జీవించే కళ తెలియదు. అలాంటప్పుడు తమ పిల్లలకు ఇంకేమి చెబుతారు? బిడ్డా, నువ్వు దేవుని గూర్చి తెలుసుకో. నువ్వు మంచిగా బ్రతుకు. నా కుమారుడా జీవించే కళను నేర్చుకో అని ఏనాడైనా ఏ తల్లిదండ్రులైనా చెప్పారా? లేదండి. తల్లిదండ్రులను ఇలా అడిగితే ఏమంటారో తెలుసా? మా పిల్లలకి స్వాతంత్ర్యం ఇచ్చేసామండి అంటారు. ఊరిమీద పడి తిరగమని, బుద్ధిహీనముగా పొమ్మని, ఆ తరువాత ఏదో ఒక నేరము చేయమని ఎలాంటి స్వాతంత్ర్యము ఇస్తున్నారో చూడండి. ఇలాంటి స్వేచ్ఛనిస్తే ఆ తరువాత వాడు పోలీస్‌స్టేషన్‌కి వెళతాడు. నీ ఇంటి మీదికి గొడవలు తీసుకొస్తాడు. అందుకే దేవుడు ఏమన్నాడో తెలుసా? భయంకరమైన కార్యక్రమాలు చేయకూడదు. బుద్ధిహీనముగా తిరగకూడదు. ఇలా జరిగితే తరువాత ఏం జరుగుతుందో తెలుసా? నీ కాలమునకు ముందే నీవే పోతావు. చూసారా! 60, 70 యేళ్ల జీవితం ఉన్నా, 20 యేళ్లకే లారీ క్రిందకు ఎందుకు వెళ్లిపోయాడు? తన కాలానికి ముందుగానే ఎందుకు పోయాడు?

ప్రేయసి, ప్రియులు, రైతులు, కష్టాలలో ఉన్నవారు, నటీనటులు,... వీరందరు తమ తమ కాలమునకు ముందుగా ఎందుకు వెళ్ళిపోతున్నారు. వారు అలా పోకూడదు. అది చాలా తప్పు. ప్రతి ఒక్కరూ జీవించే కళను అలవర్చుకోవాలి. ఎంత ధనమిచ్చినా ఈ మాటలు లోకంలో ఇంకెక్కడా మీకు దొరకవు. అది మీకు ఇప్పటికే అర్థమై ఉండాలి. మీకున్న ఆస్తినంతా ఇచ్చి, జీవించే కళకు సంబంధించిన ఇలాంటి మాటలు మాకు చెప్పు అని ఎవరిని అడిగినా, కల్లబొల్లి కబుర్లు చెప్పి మీ ధనాన్ని కాజేస్తారు తప్ప, ఎవ్వరూ మీకు జీవించే కళను చెప్పలేరు. వారి స్వార్థం వారిది. కానీ, నేను నా దేవుని ప్రేమించాను. నా దేవుడు చెప్పమన్నది నేను చెప్పాలి. నేను కూడా సమాజానికి, నా చుట్టూ ఉన్నవారికి అన్యాయం చేస్తే ఇక ఇలాంటి మాటలు ఎవరు చెబుతారు చెప్పండి? ఇంకెవరు ఈ సమాజాన్ని బాగుచేస్తారు చెప్పండి?

బైబిల్‌లో ఒక మంచి సందర్భంలో దేవుడు జీవించే కళను కోల్పోయిన ఒక వ్యక్తి ఎలా ఆత్మహత్య చేసుకున్నాడో అనే విషయాన్ని వ్రాయించాడు. చరిత్రలో అహీతోపెలు అనేటువంటి ఒక వ్యక్తి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు ఎందుకు అలా చేసాడో అన్న దానికి కారణాన్ని చెబుతూ, వాడికి జీవించే కళ తెలియదు గనుక మనమంతా జీవించే కళను కలిగి ఉండాలని దేవుడు మనకొరకు దీనిని వ్రాయించాడు. వాడే అహీతోపెలు అనేవాడు. రాజైన దావీదు ముసలి ప్రాయములో ఉన్నప్పుడు, ఆ దావీదునే చంపించడానికి అతని కుమారుడైన అబ్షాలోము ఆలోచన చేస్తున్నాడు. అప్పుడతడు తన దగ్గర ఉన్న వారందరి ఆలోచనలను తీసుకుంటున్నాడు. అప్పుడు అహీతోపెలు అనే వ్యక్తి అబ్షాలోము దగ్గరకు వచ్చి రాజైన దావీదును చంపించటానికి ఒక ఆలోచన చెప్పాడు. అబ్షాలోము అహీతోపెలు చెప్పిన దాని ప్రకారం చేద్దామనుకుంటాడు . కానీ, ఈలోపు అర్కీయుడగు హూషై అనే మరొకడు వస్తాడు. ఈ హూషై దావీదును చంపు నిమిత్తం అబ్షాలోముకు మరొక ఆలోచననిస్తాడు. అబ్షాలోముకు ముందు అహీతోపెలు ఇచ్చిన ఆలోచన కంటె, తరువాత హూషై ఇచ్చిన ఆలోచన నచ్చుతుంది. అందువల్ల అబ్షాలోము, హూషై ఆలోచననే నెరవేర్చాలనుకుంటాడు. అప్పుడు అహీతోపెలు అనే ఈ అమాయకుడు తాను ముందు చెప్పిన ఆలోచన అబ్షాలోముకు నచ్చలేదని తెలిసి పోయి ఉరుపోసుకున్నాడు. కానీ ఇది ఎంత చిన్న సంగతో ఆలోచించండి. రాజైన దావీదును చంపించడానికి ఆలోచన ఇవ్వడమే తప్పు. అది ఒక దుర్మార్గపు పని. అందులోనూ ఇచ్చిన ఆ చెడు ఆలోచన అబ్షాలోముకు నచ్చలేదని, మరొకడి ఆలోచన నచ్చినదని అహీతోపెలు ఉరి వేసుకుని అర్ధాంతరంగా చనిపోయాడంటే, ఎంత మూర్ఖుడో ఆలోచించండి. బైబిల్‌లో దేవుడు ఈ సందర్భాన్ని వ్రాయించాడు.

**సమూయేలు రెండవ గ్రంథము 17 : 23 'అహీతోపెలు తాను చెప్పిన ఆలోచన జరుగకపోవుట చూచి, గాడిదకు గంతకట్టి యెక్కి తన ఊరనున్న తన యింటికి పోయి, తన యిల్లు చక్కబెట్టుకుని ఉరిపోసికొని చనిపోయెను.'** అహీతోపెలు చెప్పిన ఆలోచనను అబ్షాలోము అంగీకరించలేదు. హూషై చెప్పిన ఆలోచననే మెచ్చుకున్నాడు. దానినే నెరవేర్చాలనుకున్నాడు. దీనివల్ల అహీతోపెలు మనసు నొచ్చుకుంది. తాను చెప్పిన ఆలోచన జరుగడం లేదు. గనుక ఉరిపోసుకుని చనిపోయెను. ఎంత చిన్న కారణమో చూడండి. అహీతోపెలు ఆనాడు ఈ చిన్న విషయానికే ఆత్మహత్య చేసుకున్నాడు. తాను చెప్పిన ఆలోచన జరుగక పోవుట చూచి క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దేవుడు ఈ సంగతిని మన కొరకు ఎందుకు వ్రాయించాడో తెలుసా? మీ జీవిత కాలములో మీరెప్పుడూ అలా చేసుకోకూడదు. జీవించే కళ మీకు తెలియాలి. ఇక్కడ మీకొక గొప్ప రహస్యం చెబుతాను. ఇప్పటివరకు ఈ భూమిమీద ఎందరైతే తమ్మును తాము హత్య చేసుకున్నారో వారందరూ చాలా చిన్న చిన్న సమస్యలకే ఆవేశాన్ని ఆపుకోలేక చనిపోయారు. దానికి కారణం వారు అంతకు ముందు చేసిన దుర్మార్గపు పని. దానికి కారణం వారు జీవించే కళను కలిగి లేకపోవడమే! ఈరోజు ఆత్మహత్య చేసుకుంటున్న ప్రతి ఒక్కరిదీ చాలా చిన్న కారణమే. అది పెద్ద కారణమేమీ కాదు, చనిపోవాల్సిన కారణమైతే అంతకంటే కాదు. 'చిన్నారి పెళ్లికూతురు' నాటికలో నటించిన ప్రత్యూష బెనర్జీ ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలుసా? తన ఆత్మహత్యకు ముందు ఆమె తన ప్రేమికునితో ఫోన్‌లో మాట్లాడింది. ఫోన్ సంభాషన ముగియగానే ఆత్మహత్య చేసుకుంది. అంటే, తన ప్రేమికునితో ఫోన్‌లో జరిగిన సంభాషణ ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిందన్నమాట. ఇది చిన్న సంగతే కదా. అసలు ఆ రాత్రి తన ప్రేమికునికి ఫోన్ చేయకపోయి ఉంటే, ఆత్మహత్యే

లేదు. నో సూసైడ్. ఎందుకు ఆమె ఈ తప్పు చేసింది? ఏదో చిరాకుగా మాట్లాడాడు. ఏదో తప్పుగా మాట్లాడాడు. తనను తిట్టాడు అనుకుందాం. అలాంటప్పుడు ఆమె వెంటనే ఫోన్ పెట్టేసి, మనస్సు బాగోలేనప్పుడు వెంటనే పరుగు పరుగున జీవించే కళ దగ్గరకు వచ్చేయాలి. మహాప్రభూ, నేను తప్పు చేసాను కనుక నన్ను క్షమించు అని దేవున్ని వేడుకోవాలి. అప్పుడు దేవుడు ఆమెకు జీవాన్నిస్తాడు. ఆమె కలకాలం బ్రతికి ఉండేది. కానీ, ఉరుతాడు ఎక్కడుందా అని వెతుక్కుంది, చచ్చిపోయింది. భారతదేశ ప్రజలకు తెలుసా, ప్రత్యూషా బెనర్జీ ఎందుకు చచ్చిపోయిందో? తెలియదు. మీడియాకు, పోలీసులకు తెలుసా, ప్రత్యూషా బెనర్జీ ఎందుకు చచ్చిపోయిందో? న్యాయశాస్త్రానికి తెలుసా, ప్రత్యూషా బెనర్జీ ఎందుకు చచ్చిపోయిందో? చిన్న చిన్న బలహీనమైన కారణాలు చెప్పకూడదు. ప్రేమికుడే కారణమని, డబ్బే కారణమని, మరింకేదో కారణమని చెప్పకూడదు. ఇవన్నీ అసలు కారణాలు కాదు. ఆమెకు  జీవించే కళ తెలియదు, అందుకే చచ్చిపోయింది. ఇప్పటి వరకు ఏ పత్రిక వారైనా, ఏ న్యూస్ మీడియా వారైనా, మేధావులెవరైనా ఇలా చెప్పారా? ఇది మాత్రం చెప్పరు. జీవించే కళ తెలియని వారందరూ అది తెలియనందుకే చనిపోతున్నారని ఎవ్వరూ చెప్పలేక పోయారు. ఎందుకంటే, వారికి కూడా తెలియదు గనుక! రంగనాథ్ ఎందుకు చనిపోయాడు? జీవించే కళ తెలియక అని ఎవరైనా చెప్పారా? ఉదయ్ కిరణ్ ఎందుకు చనిపోయాడు? జీవించే కళ తెలియక అని ఎవరైనా చెప్పగలిగారా? చచ్చిన వారెవరూ తిరిగి రాలేరు. అందుకే బ్రతికున్న మీరు ఆ పరిస్థితులలోనికి వెళ్ళకుండా ఉండాలంటే మీరు జీవించే కళను నేర్చుకోండి.

లోకజ్ఞానుల దగ్గర ఈ సబ్జెక్టు లేదు. నేరం జరిగిన తరువాత, ఆత్మహత్య జరిగిపోయిన తరువాత భూతద్దం పట్టుకుని ఇంటిలోనికి వెళ్లి ఎక్కడ ఏది దొరుకుతుందా అని చూస్తున్నారు. వీరంతా నా దృష్టిలో మేధావులు కారు, వీళ్లందరూ చిన్న చిన్నోళ్ళు, ఒకరకంగా పిచ్చోళ్లు. పరిశోధనలు చేసి ఏదో చిన్న కాగితం ముక్క దొరికింది, ఏదో చిన్న పెన్ను దొరికింది, ఏదో చిన్న చెప్పు దొరికింది అని చెబుతారు. అంతే తప్ప జ్ఞానాన్ని చెప్పలేరు. లోకానికి ఏదైనా చెప్పాలి అంటే, పరలోకమందున్న తండ్రియైన దేవుడు ఏమనుకుంటున్నాడో అనేది చెప్పాలి. మీడియాను ఉపయోగించి ఈ లోకానికి జీవించే కళను ఏ ఒక్కరైనా చెప్పగలరా? మంచిని చెప్పడానికి ఏ మీడియా అయినా ముందుకొస్తుందా? నిజానికి ఈ రోజు టి.వి. ఛానెల్స్ పుట్టగొడుగుల్లా ఉన్నాయి. ఒకప్పుడు ఒకే ఒక్క ఛానెల్ మన టి.వి.లో ఉండేది. ఇంటిపైన ఏంటెన్నా, టి.వి. లోపలికి దూరదర్శన్ ఛానెల్. అప్పుడు కాస్తో కూస్తో ప్రజలు మంచిగా ఉండేవారు. ఈ రోజు కేబుల్ ప్రసారాలు, డిష్ టి.వి. ప్రసారాలు వందల కొద్దీ చెత్త చెత్త ఛానెల్స్‌ని ఇంటిలోనికి ఒడిసిపట్టి, లోపలికి దించేస్తున్నాయి. ఈ ఛానెల్స్‌లో అన్నీ ఉన్నాయి, జీవించే కళ తప్ప! సకల కళలూ అందులో కనిపిస్తున్నాయి, దేవుని కళ తప్ప! నిజంగా ఏ ఛానెల్‌లోనైనా జీవించే కళ కనిపిస్తుందా చెప్పండి? నిజంగా ఇది ఇంత అవసరమైనప్పుడు, ఇందులో ఇంత సబ్జక్టు ఉన్నప్పుడు ప్రతి న్యూస్ మీడియా వారు నా దగ్గరకు వచ్చి ఒక వరుసలో నిలబడిపోవాలి. అందరూ నా మాటలను 'లైవ్' ఇచ్చేయాలి. దేవుని ముందు వీరంతా సాష్టాంగపడిపోవాలి. జీవించే కళను ఏ ఒక్కడైనా చెబుతారా? చెప్పడు. ఒకవేళ నేను వాడి దగ్గరకు వెళ్ళి ప్రపంచానికి ఉపయోగపడే జీవించే కళను చెబుతాను, ప్రసారం చేయమంటే ఒక్క అర్ధ గంటకు లక్షల రూపాయలు అడుగుతారు. 'లైవ్'లో ఇమ్మని అడిగితే కోట్ల రూపాయలు అడుగుతారు. అంత ధనము నా దగ్గర ఎక్కడుంది? నా దగ్గర ఉన్నది ఒకే ఒక్కటి. అదే జీవించే కళ! నేను ఎవ్వరి దగ్గరా పైసలు తీసుకోకుండా, నా కష్టార్జితంతో, దేవుని కళాకారుల కష్టార్జితంతో ఈ పుస్తకాలను వ్రాస్తున్నాను. దేవుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. కానీ, ఈ రోజు సమాజానికి నిజంగా అవసరమైన ఇలాంటి మాటలను తమ తమ ఛానెల్స్‌లో ప్రసారం చేస్తే ఎంతమంది మారిపోతారు చెప్పండి. కనీసం దిన పత్రికలో ఒక ముక్క కూడా వ్రాయరు. దానికి కూడా వారికి డబ్బు కావాలి. అలాగని ఇది న్యూస్ కాదా? లోకంలో ఎవడో ఏదో పనికిమాలిన పని చేస్తే వ్రాస్తారు కదా. ఎవడో ఏదో పనికిరాని మాట చెబితే పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాస్తారు కదా. ఎవడో ఎవరిమీదో చెప్పు విసిరేస్తే అది ఒక సెన్సేషనల్ న్యూస్. ఇలాంటివన్నీ న్యూస్ రూపంలో ప్రజలకు ఎప్పటికప్పుడు నిరంతరాయంగా చెబుతూనే ఉంటారు. మరి ఇది కూడా ఒక బ్రహ్మాండమైన న్యూస్. ఇది ఒక భయంకరమైన న్యూస్. ఇది దేవుని న్యూస్. మరి వ్రాస్తారా? వ్రాయరు. మనిషికి జీవించే కళ ఎలాగో వ్రాయరు. దానిని వ్రాయడానికి వీరికి కలం తిరగదు. వారి ప్రింటింగ్ మిషన్ పనిచేయదు. చెత్త చెత్త బొమ్మలు ప్రింట్ చేయటానికి ఎప్పుడూ తహతహలాడతారు. ఎందుకంటే ప్రజానాడిని గమనించారు. ప్రజలు

వాడి పేపర్ కొనాలంటే, వాడి ఛానెల్ చూడాలంటే ఆ మాత్రం మసాలా చూపించాలి అంటాడు. అందుకే, వీరు జీవించే కళను ఎన్నటికీ చెప్పలేరు. చెప్పటం వారి తరం కాదు. ఎందుకంటే దేవుడు వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. నాకు మాత్రమే జీవించే కళ ఎలాగో చెప్పే అవకాశమును దేవుడు ఇచ్చాడు. ఎప్పుడూ రాజు ఒక్కడే ఉంటాడు. ఎప్పుడూ నాయకుడు ఒక్కడే ఉంటాడు. పదిమంది నాయకులు ఉండరు. దేవుని తరుపున ఒక నాయకునిగా దేవుడు నన్ను నిలబెట్టాడు. అవును. ఇది నా అహం కాదు. ఇది వాస్తవం! నిజానికి ఇది దేవుడు నామీద ఉంచిన నమ్మకం. ఇది దేవుడు నాకు అప్పగించిన భాధ్యత. ఇంకెవరికీ ఈ జ్ఞానము లోపలికి వెళ్లదు, వారి బుర్ర వెలగదు.

యేసుక్రీస్తు పన్నెండు మంది శిష్యులను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ పన్నెండు మందీ చాలా గొప్పవారైపోయారు. అందులో పేతురు, అంద్రెయ, యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తొలొమయి, తోమా, మత్తయి, అల్ఫయి కుమారుడగు యాకోబు, లెబ్బయి, కనానీయుడైన సీమోను మరియు ఇస్కరియోతు యూదా ఉన్నారు. వీరందరూ పిలువబడినప్పటినుండి యేసుక్రీస్తు మాటలను స్వయంగా విన్నారు, యేసును వెంబడించారు. యేసు చేసిన ఎన్నో అద్భుతాలను, సూచక క్రియలను, మహాత్కార్యాలను తమ కళ్లారా చూసారు. వారందరికీ సువార్త ప్రకటన అనే గొప్ప బాధ్యతతో పాటు, గొప్ప గొప్ప అద్భుతములను చేసే శక్తి ఇవ్వబడినది. దేవుని జ్ఞానమును వారు నేర్చుకున్నారు, దానియందు ఆనందించారు. కానీ, ఆ పన్నెండుమందిలో ఒక్కడైన ఇస్కరియోతు యూదాకు జీవించే కళ తెలియక ఉరివేసుకుని చనిపోయాడు. యేసుక్రీస్తు తన శిష్యులకు నేర్పిన ప్రతిమాటను జీవించే కళగా నేర్పించాడు. శిష్యులందరితోపాటు జనసమూహములకు కూడా నేర్పించాడు. కానీ, పన్నెండుమందిలో ఒక్కడికి మాత్రం యేసుక్రీస్తు మాటలు ఎక్కలేదు. వాడే ఇస్కరియోతు యూదా! వాడి దగ్గర డబ్బు సంచి ఉంది. వాడు దేవుని యొక్క ధనమును దొంగిలిస్తూ వస్తున్నాడు. చిల్లర పైసలకు వాడు ఆశపడ్డాడు. 30 వెండి నాణెములకు వాడు కక్కుర్తిపడ్డాడు. నాయొద్దనున్న కళాకారులు దేవుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలనుకున్నప్పుడు మొట్టమొదట వారికి నేను అదే చెబుతాను. మీరు 30వెండి నాణెములకు ఇస్కరియోతు యూదా వలె ఆశ పడకండి. మీ దగ్గర ఉన్నదానిని ఖర్చుచేయండి. నా దగ్గర ఉన్నదానిని ఖర్చు చేస్తాను. ఎవరి దగ్గరా ఏదీ ఆశించకండి. మన దగ్గర డబ్బు సంచి వద్దు. ఎవరినీ ఏదీ అడుగవద్దు. ఆ చిల్లర పైసలు మనకొద్దు. ఆ డబ్బు మనల్ని పాడు చేస్తుంది. ఆ డబ్బు మనము దేవుని నుండి విడిపోవటానికి సహకరిస్తుంది. అందుకే డబ్బును మన దగ్గరకు రానివ్వకూడదు. చందా పట్టవద్దు. దేవుని సాంస్కృతిక సభలలో కానుకలు స్వీకరించబడవు. అందరికీ ఆహ్వానం తెలియజేయబడుతుంది, జీవించే కళ ఉచితముగా నేర్పించబడుతుంది. కానీ, అక్కడ కానుకలు స్వీకరించబడవు అని చెప్పమంటాను. ఆనాడు మహానుభావుడైన యేసుక్రీస్తు మాటలు విన్న వారిలో చాలా మందికి దేవుని కళ అర్ధం కాలేదు. పైగా ఆనాడు యూదులైనవారు తమ చేతులతో ఏమి పట్టుకున్నారో తెలుసా? జీవించే కళ కలిగిన, మోషే ఇచ్చిన ధర్మశాస్త్రం వారి దగ్గరే ఉంది. దేవుడు వారివాడని లోకానికి చెప్పుకుంటున్నారు. సమాజ మందిరములన్నీ వారివే, ఆస్తులన్నీ వారివే, అధికారమంతా వారిదే. కానీ, వారే యేసును సిలువ వేయించారు. ఆ రోజు ఇశ్రాయేలీయులలో ప్రధాన యాజకులు యేసును చంపించారు. ఇస్కరియోతు యూదాకు 30 వెండి నాణెములిచ్చి యేసును అప్పగించమన్నారు. ఇస్కరియోతు యూదా దానికి ఒప్పుకుని, సైనికులను తీసుకునిపోయి నిరపరాధియైన యేసును రోమా ప్రభుత్వానికి అప్పగించుటలో సహాయం చేసాడు. కానీ, అప్పుడు ఇస్కరియోతు యూదా తిరిగి ఆలోచించాడు. ఈ 30 వెండి నాణెములకు ఆశపడి నాకు, ఈ లోకానికి జీవించే కళను నేర్పించడానికి వచ్చిన యేసును అప్పగించానా? అనుకున్నాడు. కానీ, అక్కడే ఇస్కరియోతు యూదా ఒక భయంకరమైన తప్పు చేసాడు. అదేమిటంటే, పశ్చాత్తాపముతో కుమిలిపోతున్న యూదా, తీరని వేదనలో ఉన్న ఆ యూదా, తిరిగి ఆ 30 వెండి నాణెములు తీసుకుని ప్రధాన యాజకుల దగ్గరకు వచ్చి ఈ 30 వెండి నాణెములు నాకు వద్దు, మీరే వీటిని తీసుకోండి, అంటున్నాడు. అప్పుడు వారు సత్యవంతులైతే ఏమి చెప్పాలి? నిజంగా నీవు పశ్చాత్తాపపడ్డావు గనుక, నీవు వెళ్లి యేసు పాదాలమీద పడు. జీవించే కళను ఆ యేసుక్రీస్తు నీకు నేర్పిస్తాడు. నీవు వెళ్లి ఆ యేసును క్షమాభిక్ష అడుగు అని చెప్పాలి. కానీ వారేమంటున్నారో చూడండి. **మత్తయి సువార్త 27 : 3 - 5 'అప్పుడాయనను అప్పగించిన యూదా, ఆయనకు శిక్ష విధింపబడగా చూచి పశ్చాత్తాపపడి, ఆ ముప్పది వెండి నాణెములు ప్రధానయాజకులయొద్దకును పెద్దలయొద్దకును మరల**

**తెచ్చి, నేను నిరపరాధరక్తమును, నీతిమంతుని రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారు దానితో మాకేమి? నీవే చూచుకొనుమని చెప్పగా, అతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి, పోయి ఉరి పెట్టుకొనెను.'** చూసారా! ఇస్కరియోతు యూదా, తాను నిరపరాధ రక్తమును అప్పగించి పాపమును చేసితినని వారితో చెప్పినప్పుడు వారు దానితో మాకేమి? నీవే చూచుకొనుము అని చెప్పారు. ఒక ప్రధానయాజకుడు అలా చెప్పవచ్చా? దానితో మాకేమి నీవే చూచుకొనుము అన్నారంటే, పరోక్షంగా వారు ఏమి చెబుతున్నారంటే, నీవు పాపము చేసావు గనుక పోయి ఉరిపెట్టుకో అని చెబుతున్నట్టే కదా. నీవు వెళ్ళి, నీచావేదో నీవు చావు అని చెబుతున్నారు. అంటే, ఆనాడు ప్రధాన యాజకుల దగ్గర జీవించేకళ లేదు. అందుకే వారియొద్దకు వచ్చిన ఇస్కరియోతు యూదాను వారు బ్రతికించలేకపోయారు. నిజానికి వారు ఆత్మలను రక్షించాలి. కానీ, వారు నీవే చూచుకో, ఇక్కడినుండి పో అన్నారు. అప్పుడు ఇస్కరియోతు యూదా పోయి ఏం చేసుకున్నాడో చూడండి. ఇక ఆ యూదాకు దిక్కెవరూ కనిపించలేదు. అప్పుడతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి, పోయి ఉరి పెట్టుకున్నాడు. చివరకు ఆ 30 వెండి నాణెములను తాను తిన్నాడా? అనుభవించాడా? లేదు లేదు. చివరికి వాటిని దేవాలయంలో పారవేసి పోయి ఉరిపెట్టుకొనెను. చూసారా! జీవించే కళ తెలియక పోతే మనిషి ఎలా ఉరిపెట్టుకుంటున్నాడో? సరైన నిర్ణయం తీసుకోకపోతే అర్థాంతరంగా చచ్చిపోతున్నాడు. తన ఆయుష్కాలము తీరకముందే లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్నాడు. ఈ భూమిని విడిచి, శరీరాన్ని విడిచి, తన వారిని విడిచి, దేవునికి అన్యాయం చేసి, తనను తానే పొడుచుకుని మరణిస్తున్నాడు.

ప్రియులారా! మీరందరికి ఈ మాటలు ఎందుకు చెప్పానంటే మీరు ఆనాటి యూదులలాంటివారో, ప్రధాన యాజకుల లాంటివారో, ఇస్కరియోతు యూదా లాంటివారో కాకూడదు. ఎంత కష్టమొచ్చినా మీరు నిలబడాలి, మీరు ధైర్యవంతులు కావాలి. కష్టాలు అందరికీ సర్వసాధారణం. బాధలు, కన్నీళ్లు అందరికీ వస్తాయి. కానీ మీరు వాటిని తట్టుకోవాలి. మీ దేవుని కొరకు మీరు జీవించాలి. జీవించే కళను మీరు కలిగి ఉండాలి. 30 వెండి నాణెములు మనకెందుకండి? ఆ రోజు పేతురుకు అక్కర్లేదు, యాకోబుకు అక్కర్లేదు. మిగిలిన పదకొండుమంది శిష్యులలో ఎవ్వరికీ అక్కరలేదు కానీ, ఆ రోజు ఇస్కరియోతు యూదాకు మాత్రమే ఆ ధనం కావలసి వచ్చింది. ఆనాడు చందా సంచి యూదా దగ్గరే ఉండేది. వాడు ఆ సంచిలో నుండి డబ్బు దొంగిలించుచు వచ్చెను అని వ్రాయబడింది. అలాంటి యూదా చివరికి ఏమైపోయాడో తెలుసా? అర్థాంతరంగా తనువును ముగించాడు. పశ్చాత్తాపపడిన యూదా తిరిగి యేసు యొద్దకు, శిష్యుల యొద్దకు రాకపోవడం, జీవించే కళను తెలుసుకోకపోవడం అతడు చేసిన చివరి తప్పు. తప్పు ఎక్కడ జరిగిందో దానినే ఎత్తి చూపిస్తాడు మణికుమార్. ఇస్కరియోతు యూదా ముగింపును గూర్చి ఇప్పటివరకూ ఇలా మీకు ఎవ్వరూ చెప్పి ఉండరు. ఇస్కరియోతు యూదా ఎందుకు చనిపోయాడో తెలుసా? దానికి అసలు దోషులెవరో తెలుసా? ముఖ్యకారకులెవరో తెలుసా? ఆనాటి ప్రధానయాజకులు, పెద్దలు! ఇస్కరియోతు యూదా 30 వెండి నాణెములు తిరిగి ఇచ్చేయాలనుకున్నాడు. తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడ్డాడు. ఎంతైనా ఇస్కరియోతు యూదా యేసుక్రీస్తుతో తిరిగాడు, ఆయన మాటలు విన్నాడు. అందుకే తప్పుచేసిన వెంటనే తన మనస్సు చలించిపోయింది. తన మనస్సు పశ్చాత్తాపపడింది. ఈ ధనం నాకు వద్దు అనుకున్నాడు. ఆ 30 వెండి నాణెములు ఎవరు ఇచ్చారో వారి దగ్గరకు వెళ్లి తిరిగి ఇచ్చేస్తున్నాడు. ప్రధాన యాజకులంటే ఎవరు చెప్పండి? యాజకుడు దేవునికి, ఇశ్రాయేలీయులకు మధ్యవర్తి. పాస్టర్ లాంటివాడు, బోధకుని లాంటివాడు. ప్రధానయాజకులు దేవుని యొక్క అభీష్టాన్ని నెరవేర్చాలి. ప్రజలకు జీవించే కళను నేర్పించవలసినవారే జీవించే కళను కోల్పోతున్నారు. వారిలోనే జీవించే కళ లేదు.

**సామెతలు 12 : 13 'పెదవుల వలని దోషము అపాయకరమైన ఉరి. నీతిమంతుడు ఆపదను తప్పించుకొనును.'** అందుకే మీరు మీ పెదవులను తెరిచారంటే చాలా జాగ్రత్త! మీరు మాట్లాడరంటే జాగ్రత్తగా మాట్లాడాలి. ఒకవేళ అందులో దోషములు దొర్లితే అది ప్రమాదకరమైన ఉరి. సినీనటుడు ఉదయ్ కిరణ్ తాను చనిపోయేముందు ఫోన్ చేసాడు. ప్రత్యూషా బెనర్జీ కూడా చనిపోయేముందు ఫోన్ చేసింది. ఈ మాటలు చాలా ప్రమాదకరమైనవి. జీవించే కళ తెలియకపోతే ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియదు. తెలియకపోతే వెఱ్ఱిగా, పిచ్చిగా, మూర్ఖంగా మాట్లాడతారు. అందుకే ఆ మాటే వారికి ఉరిగా మారిపోతుంది. దేవుడు విశేషమైన సంగతులను వ్రాయించాడు. పెదవుల వలన పుట్టిన

దోషము అపాయకరమైన ఉరి. నీతి మంతులైతే ఆపదను తప్పించుకొనును. మనకు ముందున్నది ఆపద అయితే, మనం నీతిమంతులమైతే ఆ ఆపదను తప్పించుకుంటాము. ఇంతకీ నీతిమంతులు ఎవరు? జీవించే కళ తెలిసినవారే నీతిమంతులు. మిమ్మునందరిని నీతిమంతులుగా మార్చటానికే ఈ పుస్తకాన్ని వ్రాస్తున్నాను. చాలామంది దీనిని చదివినా, అందరికీ జీవించే కళ అబ్బదు. అది వారికి నచ్చదు. ఐదవ భాగమును ముగించేటప్పటికి మీరు పరిపూర్ణముగా నీతిమంతులవుతారు. చక్కగా ప్రతిమాటను అర్థం చేసుకుంటే, దేవుని మనస్సులోనికి మీరు వెళ్లిపోతే, మీరే నీతిమంతులవుతారు. ఇది ఖచ్చితం! నీతిమంతుడైతే ఏంచేస్తాడో తెలుసా? తన ముందున్న ఆపదను తప్పించుకుంటాడు. తన ముందున్న ఉరిని తప్పించుకుంటాడు.

**యెషయా 24 : 17 'భూనివాసీ, నీమీదికి భయము వచ్చెను. గుంటయు, ఉరియు నీకు తటస్థించెను.'** నీ మీదికి భయం వచ్చినప్పుడు, నీవు ధైర్యవంతుడివి కావాలి. జీవించే కళ తెలిసినవాడు మాత్రమే ధైర్యవంతుడవుతాడు. లేకపోతే భయస్తునిగానే ఉరివేసుకుంటాడు. రైతు అప్పు తీర్చలేకపోతే భయపడిపోతున్నాడు. ఈ భయం ఏం చేస్తుంది? ఉరికి తీసుకుని వెళ్లిపోతుంది. పరీక్ష తప్పాడంటే విద్యార్థి భయపడిపోతున్నాడు. ఆ భయం తనను ఎక్కడికి తీసుకుని వెళుతుంది? ఉరికి తీసుకుని వెళుతుంది. ఇది దేవుడు వ్రాయించిన మాట. భూనివాసులకు జీవించే కళ తెలియనప్పుడు వారి మీదికి భయము వచ్చెను. గుంటయు, ఉరియు వారికి తప్పక తటస్థించును అంటున్నాడాయన. ఉరి నీకు సిద్ధపరచబడింది. ఉరినీకు ఎదురుగా ఉంది. నీవు పాపం చేసావనే విషయాన్ని నీవు గుర్తెరిగి, దుర్మార్గపు పనులు చేసావనే విషయాన్ని జ్ఞాపకం చేసుకుని, నీవు భయపడుతున్నప్పుడు నీవు వెంటనే జీవించే కళ ఎలాగో తెలుసుకుని, ఆ కళకు అణుగుణంగా నీవు బ్రతకాలి. అప్పుడు నీకు ఉరి తటస్థించదు. అప్పుడు నీవు త్రవ్వుకున్న గోతిలో నీవు పడవు. అప్పుడు నీవు బలవంతంగా మరణము చెందవు. ఒక మనిషి, దేవుని కుమారునిగా జీవించాలంటే, తనకు జీవించే కళ తెలియాలి. లేకపోతే జీవించనే లేరు. జీవించే కళ తెలియని మిగిలిన వారందరూ బ్రతుకుతున్నారు కదా, అని మీరు అనుకోవచ్చు. ఆ బ్రతుకు దేవునికి అంగీకారయోగ్యం కాదు. వారు ప్రతి క్షణం భయంతో బ్రతుకుతున్నారు. ఎందుకు బ్రతుకుతున్నారో తెలియకుండానే బ్రతుకుతున్నారు. ఏ క్షణమైనా ఆ గాలి బుడగ పేలిపోతుంది. దానికి గ్యారంటీ లేదు. మనిషి బ్రతుకును గూర్చి దేవుడు, అది చేద నుండి జారే నీటి బిందువు వంటిది అన్నాడు. చేదనుండి జారిందంటే దానిని ఇక ఎవ్వరూ పట్టుకోలేరు. నీ టెక్నాలజీ దానిని పట్టుకోలేదు. ఇక ఆ నీటి బిందువు జారి, నీటిలో పడాల్సిందే. అలాంటి బ్రతుకును కలిగి వున్నారందరూ. మరొకచోట గాలిలో ఆవిరి వంటిది అన్నాడు. ఆవిరి ఇప్పుడు కనిపిస్తుంది. పాత్ర మీద మూత తీయగానే అందులో నుంచి ఆవిరి బయటకు కనిపిస్తుంది. అప్పటికప్పుడు ఆవిరి కనిపిస్తుంది. మీరు కన్నార్పి మరలా తెరిచేసరికి ఆవిరి అంతా మాయమైపోతుంది. అది గాలిలో కలిసిపోయింది. ఆవిరి తెల్లగా ఇప్పుడేగా కనిపించింది, అవును! ఆవిరికున్న లక్షణం అదే. ఇంతలో కనిపిస్తుంది, అంతలో మాయమైపోతుంది. మనిషికి ఉన్న లక్షణం కూడా అదే. ఇంతలో కనిపిస్తాడు, అంతలో మాయమైపోతాడు. ఈ రోజు సజీవంగా కనిపిస్తాడు. రేపటికి 'శ్రద్ధాంజలి' ఫ్లెక్స్ బోర్డులో కనిపించవచ్చు. అతని జీవితం ముగింపబడక ముందే జీవించే కళను తెలుసుకోవాలి. మరణించే లోపు మనము జీవించే కళను కలిగి ఉండాలి. ఆ జీవ కళతోనే జీవించాలి. లేదంటే, మనిషికి బలవన్మరణము తప్పదన్నాడు దేవుడు.

**సామెతలు 29 : 25 'భయపడుటవలన మనుష్యులకు ఉరి వచ్చును. యెహోవా యందు నమ్మిక యుంచువాడు సురక్షితముగా నుండును.'** చూసారా! భయపడుట వలన మనుష్యులకు ఉరి సంభవిస్తుంది. ఎందుకు భయపడుతున్నావు? పాపము చేసావు గనుక భయపడుతున్నావు. అప్పుడు జీవించే కళ దగ్గరకు రావాలి. ఓ రైతూ, అప్పు తీర్చలేదని భయపడుతున్నావా? జీవించేకళ దగ్గరకు రా, నీకు ధైర్యం చెబుతాడు దేవుడు. ఓ విద్యార్థీ, పరీక్షలో ఫెయిల్ అయిపోయానని భయపడిపోతున్నావా? జీవించే కళ దగ్గరకురా! దేవుడు నీకు ధైర్యం చెబుతాడు. ఓ ప్రేయసీ ప్రేమికులారా, మీ ప్రేమ ఫలించలేదని, పెద్దలు అంగీకరించడం లేదని భయపడుతున్నారా? జీవించే కళ దగ్గరకు రండి! దేవుడు మీకు నిజమైన ప్రేమను పరిచయం చేస్తాడు. ఓ నటుడా, సినిమాలలో అవకాశం దొరకటం లేదని భయపడుతున్నావా? నీవు నటించిన సినిమా ఆడటం లేదని భయపడుతున్నావా? జీవించే కళ దగ్గరకు వచ్చేయ్. దేవుడు తీసిన సినిమాను నీకు చూపించి,

నీవు ఈ భూమిమీద యే పాత్రలో ఎలా ఒదిగిపోవాలో నేర్పిస్తాడు. స్త్రీలారా, కుటుంబ కలహాలతో, ఆర్థిక సమస్యలతో భయపడుతున్నారా? జీవించే కళ దగ్గరకు రండి. ఆ సమస్యలను ఎదుర్కొని, మీరు ఒక కుటుంబములో ఎలా జీవించాలో దేవుడు తెలియజేస్తాడు. యే ఒక్కరూ, యేవేవో కారణాలచేత చావడానికి వీలులేదు. క్రైస్ట్ చర్చ్, స్క్రిప్చర్స్ యూనివర్సిటి సామర్లకోట వారిని సంప్రదించండి. భవిష్యత్తులో ఈ ప్రపంచానికి ఇది ఒక దిక్కు కాబోతుంది. ప్రతీ ఒక్కరికి ఇది జ్ఞానాన్ని నేర్పించబోతుంది. ఇది దేవుడు నాకు అనుగ్రహించిన జ్ఞానము. ఇక ఎవ్వరికీ ఇవ్వాలని ఆయన అనుకోలేదు. ఎవరి చేతులలో పెడితే న్యాయం జరుగుతుందో వారికే దేవుడు తన జ్ఞానమును ఇస్తాడు. దేవుని జ్ఞానాన్ని దొంగలకెందుకండీ ఇవ్వటం? దోపిడి గాళ్ళకు ఎందుకండి ఇవ్వటం? ఇవ్వడు. ఇచ్చినా ప్రయోజనం లేదు. పిచ్చోడి చేతిలో పిస్తోలు పెడితే ఉపయోగం ఉంటుందా? ఉండదు. అందరినీ కాల్చేస్తాడు. ఆ తరువాత వాడిని వాడే కాల్చుకుంటాడు. అది మంచివాడి చేతిలో ఉంటేనే ఉపయోగకరం. అందుకే పోలీస్‌వారి చేతిలో పిస్తోలు ఉండాలి. ఇప్పటికే ఎందరో క్రైస్తవ పాస్టర్లు మీకు పరిచయమే. వారు గెంతుతారు, అల్లరి చేస్తారు. చందా రూపంలో డబ్బును గుంజుతారు. మనుష్యులను మార్చకుండానే వెళ్ళిపోతారు. వారికి జీవించే కళ తెలియదు. అందుకే ఇప్పటివరకు ఎవ్వరూ ఇలాంటి మాటలు చెప్పలేకపోయారు. ఎందుకంటే, దేవుడు వారికి ఈ జ్ఞానాన్ని ఇవ్వలేదు. పిచ్చోడి చేతికి దేవుడు తన జ్ఞానాన్ని ఇవ్వడు. దానిని చక్కగా అమలు చేసేవాడికే ఇస్తాడు. మంచిగా మనిషిని మార్చేవాడికే ఇస్తాడు. జీవించే కళను దేవుడు ఈ రోజు నాకిచ్చినందుకు నేను గర్వపడకుండా దానిని నేర్పించగలుగుతున్నాను. అది దేవుడు నా మీద చూపిన జాలి, ఆయన నాకు అనుగ్రహించిన కృప. దానిని నేను కాపాడుకుంటాను. నా జీవితకాలంలో చివరిక్షణం వరకూ నేను దానిని కాపాడుకుంటాను. నాకు అధికారం వద్దు, అందలాలు వద్దు, డబ్బు వద్దు, పేరు ప్రఖ్యాతలు వద్దు. కానీ మనిషిలో మార్పు కావాలి. ఇదే దేవుని మనస్సు. ఆ దేవుని మనస్సు నేను అర్థం చేసుకున్నాను. ఆ దేవుని మనస్సులాంటి మనస్సుగా నా మనస్సును మార్చుకున్నాను. కష్టపడదాం, చెమటోడ్చి కష్టపడదాం, రాత్రి పగలు కష్టపడి జీవించే కళను మనము కలిగి ఉంటూ, అనేక మందికి దానిని తెలియజేద్దాం. అపొస్తలుడైన పౌలు జీవించే కళ కొరకు చాలా కష్టపడ్డాడు. ఆయన డేరాలు కుట్టాడు, రాత్రి పగలు కష్టపడి ఆ కష్టార్జితంతో దేవుని సేవ చేసాడు. సువార్త పనిని జరిగించాడు. ఆయన ఏనాడూ ఎవరి దగ్గరా యాచించలేదు. తాను జీవించే కళను ప్రకటిస్తున్నందుకు ఎవరి దగ్గరా ఒక్క పైసా కూడా తీసుకోలేదు. సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నా జీతం అన్నాడు. ఈ భూమి మీద నాకు జీతం వద్దన్నాడు. పరలోకంలోనే తనకు బహుమానము కావాలి అన్నాడు. ఎంత గొప్పవాడో చూడండి. ఈ రోజు దేవుని పేరిట అడుక్కుని, తమ ఆస్తులు పెంచుకుంటున్న ఈ దౌర్భాగ్యులు ఏమంటున్నారో తెలుసా? దున్నే ఎద్దు నోటికి చిక్కము పెట్టొద్దు అని వ్రాయబడింది కనుక, మేము చేసే సేవకు మాకు డబ్బు కావాలి అంటున్నారు. మరి వీరికున్న అతితెలివి ఆనాటి అపొస్తులులకు లేదా? పౌలు గారికి ఈ వాక్యం తెలియదా? అది వ్రాయబడిందే పౌలు చేత! భూమిమీద మనకు పైసలొద్దు. మరి దేవుని సాంస్కృతిక సభలు ఎలా జరుగుతాయండీ? అని మీరు నన్ను అడుగవచ్చు. దేవుడు జరిగిస్తాడు. దేవునిపై ఆ విశ్వాసం నాకుంది. నీవు నిజంగా జీవించే కళను పాటిస్తూ, దానిని ప్రకటించాలనుకున్నప్పుడు, ఆ సాంస్కృతిక సభలను నిర్వహించే కళాకారులను దేవుడు నిర్ణయిస్తాడు. వారి ద్వారా దేవుని సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తాడు. తప్పు చేసి భయపడుట వలన మనుష్యులకు ఉరి వచ్చును. యెహోవా యందు నమ్మికయుంచినవాడు సురక్షితముగా ఉండును. జీవించే కళ నీకు ఒక రక్షణ కవచం. అది నీకు ఒక కాపలా. అది నీకు దేవుడు ఇచ్చేటువంటి అనుగ్రహం. యెహోవాయందు భయభక్తులు గలిగి, ఆయన యందు నమ్మిక యుంచి, జీవించే కళను నేర్చుకున్నవాడు సురక్షితముగా ఉండును. అతడెప్పటికీ బలవన్మరణానికి పాల్పడడు. ఆమెప్పటికీ ఆత్మహత్య చేసుకోదు. ఎందుకంటే వారికి జీవించే కళ తెలుసు. ప్రతి మనిషికీ మొట్టమొదట తెలియవలసింది ఇదే. ప్రపంచంలో ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ జీవించే కళ తెలుసుకోవాలి. ఇదే అన్ని సమస్యలకూ పరిష్కారము.

--------x------

## ప్రశ్నలు

1. నిజమైన కళాకారులనగా ఎవరు? వివరించండి.

2. దేవునికి మనము ఇవ్వగలిగినదేమిటి? మనలో ఆయన కోరుకునేదేమిటి? చర్చించండి.

3. భూకంపములు, ప్రకృతి వైపరీత్యములకు గల ప్రధాన కారణమేమిటి? వాటినెలా నివారించవచ్చు?

4. పరిశుద్ధాలంకారములగు ఆభరణముల అవశ్యకతను తెలియజేయండి.

5. 'ఆత్మహత్య నేరము' - సహేతుకముగా చర్చించండి.

6. ఆత్మహత్యకు ప్రేరేపించే అంశములేమిటి? వాటిని ఎలా నివారించగలము? వివరించండి.

7. జీవించే కళ తెలిసినవాడు ఎలా జీవించాలి? వివరించండి.

-------×-------

నా ప్రియ సోదర సోదరీమణులారా! జీవించే కళ ఎలా? మూడవ భాగము లోనికి మనము వచ్చాము. గడచిన రెండు భాగాలలో జీవించే కళను దేవుని జ్ఞానానుసారముగా తెలుసుకున్నారని భావిస్తున్నాను. జీవించే కళ ఎలా? అనే దేవుని జ్ఞానముతో కూడిన మాటలను ప్రచురించడం, ఆరిన నేలమీద ఆదాము మొదలుకొని ఇప్పటి వరకు ఇదే తొలిసారి. ఇలాంటి అంశముతో ఇప్పటి వరకు ఎవ్వరూ ప్రజలలోనికి వెళ్ళలేదు. మనుష్యుల జీవించే కళ ఎలా? అని ఎవ్వరూ ఇప్పటి వరకు చెప్పలేదని మీ అందరికి తెలుసు. మనము జీవించే కళను బైబిల్ ద్వారా తెలుసుకోగలుగుతున్నామంటే దీనికి కారకుడు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. ఆ తరువాత అపొస్తలులు, ప్రారంభ శతాబ్దపు క్రైస్తవులు మంచి పునాదిని వేసారు. పరిశుద్ధాత్మని సహాయముతో ఇప్పటికీ క్రైస్తవ్యం ఈ భూమిపై మనకు కనిపిస్తుంది. దేవుని కాపుదల వలనే ఇప్పటికీ ఇంకా ఈ క్రైస్తవ్యం నిలబడిఉంది. నేడు మన మధ్య ఉన్న వారిలాంటి బోధకులు, నాయకులు ఆనాడు ఉంటే క్రైస్తవ్యం ఎప్పుడో సమాధి అయిపోవాలి. ఆనాడు ఉన్నవారు పరలోకమును తప్ప ఇక దేనినీ వారు ఆశించలేదు. మేడలు, మిద్దెలు, బంగారాలు, ఆస్తులు, అధికారాలు వారెన్నడూ కోరుకోలేదు. మొదటి శతాబ్ధంలో పేతురు, యోహానులు శృంగారమను దేవాలయములోనికి వెళ్ళినప్పుడు, మా యొద్ద వెండి, బంగారములు లేవు గాని 'దేవుని వాక్యము' మాత్రమే ఉంది అన్నారు. కానీ, ఈ రోజు వాక్యమును పట్టుకున్నవాడు వెండి కోసమో, బంగారం కోసమో ఆశిస్తున్నాడు. మార్పు రావాలి! అలాంటి వారు మారిపోవాలి! అలాంటివారు ఉన్న పక్షంలో ఈ సమాజం బాగుపడదు. ఒకవైపు అపవాది గర్జించు సింహమువలె మనుష్యుల బ్రతుకులను అతలాకుతలం చేస్తున్న వేళలో, ఆత్మలన్నీ అగ్నిలోనికి జారిపోతున్న సందర్భంలో, వారందరినీ రక్షించే దేవుని మార్గంలో మనుష్యులను పయనింపజేసేవారు ఎవరున్నారు చెప్పండి? అందుకే ఈ రోజు నేను మనుష్యులకు ఒక వింతగా కనిపిస్తున్నాను. నేను అందరికీ క్రొత్తగా కనిపిస్తున్నాను. అవును. ఎందుకంటే, సత్యవాది లోక విరోధి. సత్యం చెప్పేవాడు లోకములో ఉన్న జనులకు విరోధి అవుతాడు. నేను కూడా అందరివలె జీవించే కళ తెలియకుండా జీవించాలని, నేను కూడా వారిలాగే దేవుని పేరు చెప్పి దండుకోవాలని వారి అభిలాష. ఈ జీవగ్రంధాన్ని చేతపట్టినప్పుడు, క్రైస్తవ్యంలోనికి వచ్చినప్పుడు, దేవుని బోధ చేస్తున్నప్పుడు, ఇంత చక్కగా దేవుని కార్యక్రమాలలో ఉన్నప్పుడు నీవు చందా ఎందుకు తీసుకోవడం లేదు? అని నా మీద కక్షగడుతున్నారు. నీవు తీసుకోకపోతే మేమందరమూ దోషులం అవుతాము, నీవు తీసుకోకపోతే మేమందరం దొంగలమవుతాము అంటున్నారు. నీవు కూడా తీసుకో అని నన్ను బలవంతం చేస్తున్నారు. నేను తీసుకోనని చెప్పాను. నా స్వహస్తములతో నేను కష్టపడతాను, ఒక వేళ ఆకలి దప్పులుంటే పస్తులుంటాను తప్ప ఎవరి దగ్గరా ఆశించి నేను సువార్త ప్రకటన చెయ్యను అని వారికి చెప్పాను. వారు నా మీద కన్నెర్రజేస్తున్నారు. నాలాంటి వాడిని ప్రోత్సహించడానికి బదులు వారు నన్ను శపిస్తున్నారు. అయినా నా తండ్రియైన దేవునిమీద నేను ఆనుకున్నాను. నా వెనుక ఉన్నది ఒక మనిషి కాదు. నా వెనుక ఉన్నది భూమిమీద మట్టి బ్రతుకును కలిగిన 60, 70 యేళ్ళ జీవితాన్ని కలిగిన మనుషి కాదు. నా వెనుక నన్ను ప్రోత్సహించేది కేవలం పరలోకమందున్న దేవుడు. ఆయన నా తండ్రి, నాకు బ్రతుకునిచ్చినవాడు. నేను ఆయన మాట మాత్రమే వింటాను. ఇంకెవ్వరి మాటలూ నేను వినను. భూమిమీద మనుష్యులను సంతోషపెట్టగోరు వాడనైతినా? అలాగైతే నేనెప్పటికి క్రీస్తు దాసుడను కాకపోదునన్నాడు పౌలు. భూమి మీద మనుష్యుల సంతోషంతో నాకు పనిలేదు. అందుకే నేను వారి మాట వినను. అందుకే వారు నాకు శత్రువులవుతున్నారు. అందుకే వారు నాకు విరోధులవుతున్నారు. వారు దేవుని కళాకారులు కారు. నేను దేవుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పుడు, అందరికీ నా ఆహ్వానాన్ని తెలియజేసినప్పుడు పాస్టర్లు, సంఘ నాయకులు, కాపరులు నాకు ఫోన్ చేసి ఏమని అడుగుతారో తెలుసా? మా సంఘం అంతా మీ కార్యక్రమానికి వస్తే మాకు ఆటో ఛార్జీలు ఇస్తారా? అని అడుగుతారు. మా సంఘమంతా మీ దగ్గరకు తీసుకొస్తాం. మాకేమైనా పైసలిస్తారా? అని అడుగుతున్నారు. మాకు భోజనాలు పెడతారా?

మాకు వసతినిస్తారా? అని అడుగుతున్నారు. అప్పుడు వారితో మేమే ఎంతో కష్టపడి, అన్నీ అద్దెకు తీసుకుని, ఖర్చులన్నింటినీ మేమే భరించి, ఎవరి దగ్గరా ఏమీ తీసుకోకుండా, జీవించే కళను నేర్పుతున్నామయ్యా. మీకు ఏమి ఇవ్వగలము? అని చెబుతాను. మరి అలాగైతే మా సంఘం పేద సంఘమండీ అంటున్నారు వారు. పేద సంఘమైతే వారి వారి కార్యక్రమాలు నెరవేర్చుకోవడానికి ఆటో ఎక్కినప్పుడు పాస్టర్‌గారే డబ్బులిస్తున్నారా? చెప్పండి? సంఘస్తుల పెళ్లిళ్లకు, ఉద్యోగానికి, వారి వారి పనులకు వెళుతున్నప్పుడు వారి దారి ఖర్చులు సంఘ కాపరులే ఇస్తారా? ఇవ్వరు. అంతవరకు ఎందుకండీ? గర్భిణీకి నెలలు నిండాయి. ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలి. ఆ దారి ఖర్చులిస్తారా? ఆ ప్రసవానికి అయ్యే ఖర్చులు ఇస్తారా? ఇవ్వరు. మరి దేవుని దగ్గరకు రావాలి అంటే, జీవించే కళను నేర్చుకోవాలి అంటే వీరికి డబ్బులు కావాలట. నాకు ఇలాంటి వారిని గూర్చి అప్పుడర్థమైంది. అంటే మిగిలిన కార్యక్రమాల దగ్గరకు ఈ జనమంతా తండోపతండాలుగా ఎందుకు వెళ్ళుతున్నారంటే వారికి తలా ఒక పది రూపాయల నోటు ఇచ్చుంటారు. అదీ సంగతి! ఆటో ఛార్జీలు, బస్ ఛార్జీలు ఇచ్చుంటారు. నాలుగు మెతుకులు భోజనం పెట్టుంటారు. అందుకే వెళుతున్నారా జనులు? అవును అందుకే వెళ్ళామంటున్నారు. ఆ రోజు యేసుక్రీస్తును వెంబడించడానికి వచ్చిన జనసమూహములు కూడా యేసు మాటలు వినడానికి కాకుండా రొట్టెలు భుజించడానికే వచ్చారని బైబిల్‌లో వ్రాయబడింది. మీరు నా మాటలు వినడానికి వస్తున్నారా? రొట్టెలు భుజించడానికి వస్తున్నారా? అని యేసు అడుగుతున్నాడు. మీరు క్షయమైన రొట్టెలు భుజించడానికే వచ్చారు అన్నాడు యేసుక్రీస్తు. మంద ఎక్కువ లేకపోతే ఇబ్బంది ఏమీ లేదు. మనుష్యులు ఎక్కువగా లేకపోతే సమస్య ఏమీ లేదు. ఎందుకంటే, మంచి విప్లవం ఏదైనా ఒకనితోనే ప్రారంభం అవుతుంది. కొద్దిమందితోనే అది కొనసాగింపబడుతుంది. దేవుడు ఆదికాండములో మొదటి రోజులలో ఈ విశ్వమంతటిని కలుగజేసి భూమిమీద ఎంతమందిని ప్రవేశపెట్టాడో తెలుసా? ఆదాము ఒక్కడినే! కోటిమంది మనుష్యులను ఒకేసారి ఈ భూమిమీదకు దేవుడు దించలేదు. ఒక్కడినే ప్రవేశపెట్టాడు. అతడే ఆదాము. ఆ తరువాత ఆ ఆదాములో నుండి ఒక స్త్రీని తీసుకొచ్చాడు. ఆ తరువాత వారికి పిల్లలు పుట్టారు. ఇదిగో ఈ రోజు మనుష్యులు కోట్లమందిగా కనిపిస్తున్నారు. ప్రారంభానికి వెళితే ఒక్కడే ఉన్నాడు. అలాగే దేవుడు ఇశ్రాయేలీయులను ఏర్పాటు చేసుకోవాలనుకున్నాడు. భూమి మీద నాకు ఒక జనాంగము ఉండాలి అనుకున్నాడు. అప్పుడు ఎంతమందిని ఏర్పాటు చేసుకున్నాడు? అప్పటికే ఒక వంశముగా వేలకొలదిగా ఉన్నవారిని దేవుడు ఏర్పాటు చేసుకోలేదు. అబ్రాహాము అనే ఒక్క వ్యక్తినే దేవుడు పిలిచాడు. నా కుమారుడైన అబ్రాహామా, నేను చూపించు దేశానికి నీవు వెళ్లాలి. ఎందుకంటే, నిన్ను ఒక గొప్ప జనముగా ఆశీర్వదిస్తాను అన్నాడు. ఆ అబ్రాహాములో దేవుడు ఇశ్రాయేలీయులందరినీ చూసాడు. ఆ అబ్రాహాము కడుపున ఇస్సాకు, ఇస్సాకు కడుపున యాకోబు, ఆ యాకోబు కడుపున పన్నెండుమంది, ఆ పన్నెండుమంది నుండి అనేక మంది ఇశ్రాయేలీయులు రావాలనుకున్నాడు దేవుడు.

దేవుని దగ్గర ప్రారంభంలో ఏదైనా ఎప్పుడూ కొంచెమే ఉంటుంది. కానీ అది రాను రాను మహావిశ్వమంత పెద్దది అవుతుంది. మహా భూతలమంతా అది వ్యాప్తి చెందుతుంది. యేసుక్రీస్తు సువార్త ప్రకటించేటప్పుడు మొట్టమొదట ఆయన పన్నెండు మందిని మాత్రమే ఏర్పాటు చేసుకున్నాడు. ఒక వందమందినో, వెయ్యిమందినో, లక్షమందినో ఆయన పిలువలేదు. కేవలం పన్నెండు మంది. ఆ పన్నెండులో మరలా ఒకడు తప్పిపోయాడు. అతని స్థానాన్ని మరల మరొకరికి ఇచ్చారు. వారే అపొస్తలులు. దేవుని యొక్క విప్లవాలు ఏవైనా చూడండి. అవి కొద్దిగా ప్రారంభమవుతాయి. అవి మొదలైనప్పుడు చిన్నవిగా ఉంటాయి. అందుకే దేవుని సంస్కృతిని తెలుసుకునేవారు ఇప్పుడు సంఖ్యకు తక్కువగా ఉన్నా ఫరవాలేదు. కానీ, నేర్చుకున్నవారందరూ ఈ చక్కని వాక్యాన్ని పాటిస్తూ, ఈ లోకమందు తాము బ్రతికిన కాలమంతా జ్యోతులై వెలగాలి. మీ పేరు, మీరుండే ప్రాంతము పేరు చెప్పగానే ప్రపంచమంతటికి ఏమి గుర్తుకు రావాలో తెలుసా? జీవించే కళ గుర్తు రావాలి. మీరందరూ దేవుని జ్ఞానాన్ని నేర్చుకున్నవారై ఇక మీదట దేవుని కొరకు బ్రతికేవారుగా మారాలి. అది మీ బాధ్యత. నేను నా బాధ్యతను నెరవేరుస్తున్నాను. ఇకపై మిగిలి ఉన్నది మీ బాధ్యత. మీ చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాలన్నిటికీ మీరే జ్యోతులుగా మారాలి. ఈ పుస్తకము ద్వారా మిమ్మునందరిని వెలిగిస్తున్నాను. ఇంకా ఈ మూడు భాగాలలో మిమ్మునందరిని పూర్తిగా వెలిగిస్తాను. మీరు మిగిలిన వారినందరిని వెలిగించాలి.

మనిషికి తప్ప ఈ సృష్టిలో జీవరాసులన్నింటికి జీవించే కళ తెలుసు. అందుకే దేవుని ముందు ఏదీ దోషి కాలేదు. మనిషి ఒక్కడే నేరం చేస్తున్నాడు. మనిషి ఒక్కడే దోషి అవుతున్నాడు. ఎందుకంటే మనిషికి జీవించే కళ తెలియదు. జీవించే కళ తెలియని మనిషి, తానెలా జీవించాలో తెలియదు గనుక అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకుంటున్నాడు. పాపభీతితో ఆత్మహత్య చేసుకుంటున్నాడు. మనిషికి ఎలా జీవించాలో తెలియక, ఏది కోరుకోవాలో తెలియక అర్థాంతరంగా తన తనువును ముగించుకుంటున్నాడు. దేవుని యొద్దకు రాలేకపోతున్నాడు. అందుకే ఈ రోజు మనం ఆత్మహత్యలు వింటున్నాం. ప్రతీ చిన్న విషయానికి ఆత్మహత్య చేసుకుంటున్నారు. *03-05-2016 న్యూస్ పేపర్‌లో వార్త ఏమిటో తెలుసా?* అసలు జీవించే కళ ప్రతీ ఒక్కరికీ అవసరమో కాదో ఈ వార్త చదివి మీరే చెప్పాలి. *ఒక స్త్రీ ఫోను పోయిందని చచ్చిపోయింది. హైదరాబాద్ శాలిబండలో విషాదం నెలకొంది. సుల్తానా బేగం అనే మహిళ తన ఫోను పోయిందని ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా ఓ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తున్న సుల్తానా, గత నెలలో ఒక క్రొత్త ఫోను కొనుక్కుంది. అయితే అనుకోకుండా ఆమె తన ఫోను పోగొట్టుకుంది. ఇంటికి వచ్చాక సుల్తానా బేగంను ఆమె తల్లి నిర్లక్ష్యంగా ఎందుకున్నావని మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుల్తానా, ఫేనుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది డెక్కన్ క్రోనికల్ న్యూస్.* ఈ వార్త ఎలా ఉందో చూసారా? నిజంగా సుల్తానా ఈ జీవించే కళలోని రెండవ భాగమును చదివి, గ్రహించి, ఆత్మహత్యల పాఠం నేర్చుకుని ఉంటే ఒక చిన్న ఫోన్ కోసం చచ్చిపోతుందా? మొబైల్ ఫోన్ ఎంత చెప్పండి. ఒక చిన్న ఫోన్ నీ ప్రాణాన్ని తీసేసిందా? అవును. ఫోన్ పోగొట్టుకున్నందుకు ఆమె తల్లి ఆ మాత్రం తిట్టదా? కష్టపడిన ధనంతో కొనుక్కున్నావు కదమ్మా, అంత నిర్లక్ష్యంగా ఎందుకున్నావని తిట్టి ఉండవచ్చు. దానితో తీవ్ర మనస్తాపానికి గురై ఇక నాకీ బ్రతుకే వద్దు అనుకుంది. ఆమెకు జీవించే కళ తెలియదు. ఎలా జీవించాలో ఆమెకు అర్థంకాలేదు. అందుకే తాడు ఎక్కడుంది? ఫేను ఎక్కడుంది? ఉరి పోసుకోవాలి. చచ్చిపోవాలి అనుకుంది. ఆమె తన ఫోనుకోసం చచ్చిపోయింది కదా, పోనీ తన ఫోను తిరిగి వచ్చిందేంటి? అందుకే ఈ జీవించే కళను అందరినీ తెలుసుకోమంటున్నాను. అందరిదగ్గరా డబ్బులు గుంజడానికి కాదు. పబ్లిసిటీ కోసం కానే కాదు. మీరు చచ్చిపోకూడదని నా తపన. 02-05-2016 దినాన సుల్తానా ఉరి వేసుకుంది. ఈ రోజు మరెవరో? రేపటి దినాన మరొకరు! ఆ మరొకరు మన ఇంటిలోని వారు కాకూడదు. ఒకవేళ ఈ మాటలు నేర్చుకొనకపోతే వారు మన ఇంటిలోవారే కావచ్చు. మీరు గ్యారంటీ ఇవ్వలేరు. లేదండీ, మా కొడుకు అలా చేయడండి, మా కూతురు అలా చేయదండి, నేను అలా చేయనండి, నా భర్త అలా చేయడండి, నా భార్య అలా చేయదండి అని మీరు గ్యారంటీ ఇవ్వలేరు. ఎందుకంటే, ఈ సమాజం దుష్ట సమాజం. ఎప్పుడైనా ఎవరినైనా చెరిపేస్తుంది. దేవుని వాక్యమనే ఆ పరిరక్షణ లేకపోతే, నీతిమంతునివలె దేవుని మాటలచేత మనిషి తప్పించబడకపోతే ఈ దుష్టుడు ఎవరినైనా చంపేస్తాడు. అందుకేనండీ ఈ పుస్తకం! మనిషికి జీవించే కళను నేర్పించాలి. జీవించే కళ తెలియక ఎందరో చనిపోతున్నారు. ఈ మూడవ భాగములో మరి ప్రాముఖ్యమైనటువంటి మంచి సంగతిని ఆలోచన చేద్దాం. జీవించే కళ తెలియని మరో వర్గాన్ని గూర్చి నేర్చుకుందాం.

ధనాశ, లంచగొండితనం ఈ ప్రపంచ మానవాళికి పట్టిన ఒక చీడ. దానిని కలిగినవారు జీవించే కళను ఎలా కోల్పోతున్నారో ఈ భాగములో ఆలోచిద్దాం. దేవుని వాక్యమనే ఖడ్గంతో ఈ రుగ్మతపై దండెత్తుదాం. దీనిని అరికట్టడం ఎవరిచేత కాకపోయింది. ప్రపంచ దేశాలన్నింటికీ దాదాపుగా ఎవ్వరికీ దీనిని గూర్చి తెలియదు. ఆరిన నేల మీద 7 ఖండాలలో సుమారుగా 200 దేశాలున్నాయి. దాదాపుగా ప్రతి దేశం, ఇదిగో ఇప్పుడు నేను చెప్పబోయేటువంటి ఆ చీడకు లోనైపోయింది. అదే ధనాశ. ఇంతకీ ఎలా పుట్టింది ఈ ధనం? క్రీస్తుకు పూర్వం కొంతకాలం ముందుకు వెళితే చరిత్రను మనము ఆలోచిస్తే, అప్పటి మనుష్యులకు ఈ ధనం అంటే ఏమిటో తెలియదు. ఆ కాలంలో కేవలం వస్తు మార్పిడి ప్రక్రియ ఉండేది. దీనినే బార్టర్ సిస్టం అని కూడా అంటారు. అంటే, మీ దగ్గర కొన్ని వస్తువులుంటే, మరొకరి దగ్గర మీకు అవసరమైన వస్తువులుంటే, మీ దగ్గరున్న వస్తువులు ఆయనకిచ్చి, ఆయన వస్తువులు మీరు తీసుకొని వస్తు మార్పిడి చేసుకునేవారు. అప్పటిలో ఈ ధనం లేదు. ఆదాము పుట్టినప్పటినుండి చాలా రోజుల వరకు ఈ ధనం లేదు. పూర్వకాలపు మనుష్యులకు ధనం పరిచయం కాలేదు. వారికి రంగుకాగితాలు పరిచయం లేదు. పైసలు పరిచయం లేదు. ఎ.టి.ఎం. కార్డులు పరిచయం లేదు. కేవలం అప్పట్లో వస్తుమార్పిడి సిద్ధాంతం ఉండేది. వస్తు మార్పిడితోనే తమ

అవసరాలు తీర్చుకుంటూ జీవనాన్ని ముందుకు కొనసాగించారు. ఆ తరువాత ప్రజలలో ధనమనే ఈ మహమ్మారి పుట్టింది. మనిషికి జీవించే కళ తెలియదు గనుక, ధనాన్ని సృష్టించుకున్నాడు. కాలక్రమేణా మనిషి నాణెములను సృష్టించుకున్నాడు. ఆ తరువాత నిర్వహణ ఖర్చు ఎక్కువవుతుందని రంగు కాగితాలను ముద్రించుకున్నాడు. ఆ కాగితాల కోసమే కదా, ఈ రోజు మనిషి ఆలోచనంతా. జీవించే కళను నేర్చుకోండి అంటే రంగు కాగితాలు అడుగుతున్నారు. ఈ భాగములో ఆ కరెన్సీ కాగితాల భరతం పడతాను. ఇంతకీ ఏమిటి ఈ డబ్బు? ప్రపంచ దేశాలను కుదిపేస్తూ, మనుష్యుల చావుకు కారణమవుతూ, పేదవాడికి పట్టెడన్నం పెట్టలేక పోతూ, అందరికీ దైవంగా మారిపోతున్న ఈ ధనం గుట్టు ఏమిటి? లోకాన్ని చెరుపుతున్నది ఈ ధనమే. మనుష్యుల మధ్య మంచి సంబంధాన్ని పోగొడుతున్నదీ ఈ ధనమే. అందరూ ధనాశ పరులౌతున్నారు. అందరికీ ప్రధానంగా డబ్బు కావాలి. ఈ ధనము మనిషి నిర్ణయించుకున్నది, మనిషి సృష్టించుకున్నది. వస్తు మార్పిడికి బదులు ధనముండాలి అని ఒకప్పుడు మనిషే నిర్ణయించుకున్నాడు. ఈ రోజు మనిషికే దేవుడైపోయింది. మనిషినే శాశించగలుగుతున్నది. ఇప్పుడు పరలోకమందున్న దేవుడు వ్రాయించిన ఒక చక్కని మాటను మీకు చూపిస్తాను. మనిషి సృష్టించుకున్నది మనిషి పాలిట దైవముగా ఎలా మారిపోయిందో ఆయన మాటలలో మీరు చూడాలి. జీవించే కళను యేసుక్రీస్తు ఎలా నేర్పిస్తున్నాడో మీరు చదవాలి.

**మత్తయి సువార్త 6 : 24 'ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు. అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును. లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు.'** ఇక్కడ దేవుడు, ధనము అనే రెండు విషయములను గూర్చి తెలుపబడింది. ఈ ధనము దేవునితో పోటీలో నిలిచేలా చేసింది మనిషే! ఈ ధనము మన దగ్గరే ఉండాలి, పర్సులో ఉండాలి, జేబులో ఉండాలి, బ్యాంకులో ఉండాలి, ఇంటిలో ఉండాలి, లాకర్‌లో ఉండాలి, ఇది లేకపోతే జీవించలేము అనుకుంటున్నారు. జీవించే కళ తెలియాలంటే బ్యాంకులో బ్యాలెన్స్ ఉండాలి తప్ప ఇలాంటి పుస్తకాలెందుకు అంటారు చాలామంది. జీవించే కళ తెలియాలంటే ఎ.టి.ఎం.లో డబ్బులుండాలి తప్ప దేవుడేమి చెబుతాడండీ అంటారు మరికొంతమంది. ఇలాంటివారందరూ పిచ్చివారు, మూర్ఖులు. నీ డబ్బు నిన్ను రక్షిస్తుందనుకుంటున్నావా? నీ ఆస్తి నిన్ను కాపాడుతుందనుకుంటున్నావా? అది నీ పాలిట విషపూరితమైన పాము. అందుకే యేసుక్రీస్తు పలికిన మాట చూడండి. 'ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు.' ఒక దాసుడు తన ఇద్దరు యజమానులను ఒకేవిధంగా ప్రేమించలేడు అని అర్థం. అతడు ఒకని ద్వేషించి, ఒకని ప్రేమించును. ఇంతకీ ఎవరీ దాసుడు? ఎవరీ యజమానుడు? అని అడిగితే, ఆ ఇద్దరిలో ఒకరు దేవుడు, మరొకరు ధనం. మరి దాసుడెవడు? మనిషే దాసుడు. ఇది ఒక ఉపమానం. మనిషి ఇద్దరు యజమానులను కలిగి ఉంటున్నాడు. ఇప్పుడు చెప్పండి? దేవునికి, ధనానికి వైరం ఉందా, లేదా? దేవునికీ, ధనానికి పడుతుందా? పడదు. ఇప్పటి వరకు చాలామంది మీకు బైబిల్‌ను తప్పుగా బోధించి ఉండవచ్చు. రండి, మీకొరకు ప్రార్థనలు చేస్తాం, మీకు డబ్బు వచ్చేస్తుంది అంటారు కొంతమంది బోధకులు. మీకొరకు ప్రార్థన చేస్తే మీకు డబ్బు వచ్చేస్తుందా? అయితే నీ దగ్గరకి దేవుడు రాలేదన్నమాట. ఏమిటండి ఈ బోధ? ఎటువైపు వెళుతుందండీ ఈ క్రైస్తవ్యం? అక్షరాలా దేవుడు వ్రాయించిన మాటలను చూడండి. ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు. అతడు ఒకని ద్వేషించి, ఒకని ప్రేమించాలి. ఈ రోజున్న నామకార్థ క్రైస్తవులు ఎవరిని ప్రేమిస్తున్నారు? ఎవరిని ద్వేషిస్తున్నారు చెప్పండి? దేవుని ప్రేమించగలుగుతున్నారా? లేదండి ధనాన్ని ప్రేమిస్తున్నారు, సిరిసంపదలను ప్రేమిస్తున్నారు. అప్పుడు **మత్తయి సువార్త 6 : 24**వ వచనం, చివరి మాటలో ఆయన ఏమంటున్నాడో చూడండి. మాకు రెండూ కావాలి, ఈ రెండూ రెండు కళ్లలాంటివి అంటే ఆయన ఊరుకోడు. ఇక్కడ అలాంటి సాకు చెప్పాలనుకుంటున్నారా? అందుకే యేసుక్రీస్తు ఏమంటున్నాడో చూడండి. మీరు ఇద్దరికీ దాసులుగా ఉండనేరరు. అందులో మీరు ఒకరిని మాత్రమే ఎన్నుకోవాలి. మీరు పరలోకానికి వెళ్ళాలంటే మీరు ఒకరినే ఎన్నుకోవాలి. ఆయనే దేవుడు. పాతాళానికి వెళ్లాలంటే మరొకరిని వెతుక్కోవాలి, అతనిని యజమానుడుగా మీరు స్వీకరించాలి. అదే ధనము.

ప్రియులారా! బాగా ఆలోచించండి. 'ఈ రోజు సమాజం అస్తవ్యస్తం అవుతుందంటే, దేశాలన్నీ కంటిమీద కునుకులేకుండా ఉన్నాయంటే, ఖచ్చితంగా దానికి కారణం ఎవరో తెలుసా? ధనము. ఏ దేశానికీ యజమాని దేవుడు కాదు. ప్రతీ దేశానికి యజమాని ధనమే. దేశం ఈ రోజు ధనం మీదనే నడుస్తుంది. స్టాక్ ఎక్స్చేంజ్, షేర్ మార్కెట్ అంతా ఈ ధనము చుట్టూనే నడుస్తోంది. మీ ప్రాంతాలలో కూడా చాలామంది షేర్ల పిచ్చోళ్ళుంటారు. ఉదయం లేవగానే ఇంటర్‌నెట్ ఆన్ చేసి ఏ షేరు పైకి వెళ్ళింది? ఏ షేర్ పడిపోయింది? దీనితో మరల కొంతమందికి గుండెపోట్లు కూడా వచ్చేస్తాయి. సదరు వ్యక్తి కొనుగోలు చేసిన కొన్ని షేర్లు పడిపోతే, అతనికి అమాంతంగా గుండెపోటు వచ్చేసింది. ఎందుకు? ధనము అతని ప్రాణమును తీసేసింది. ధనమే మా యజమాని అనుకుంటున్నారు కదా? సంపదే నా దేవుడు అనుకుంటున్నారు కదా? అదే మీ ప్రాణం తీసేస్తుంది. ఆ యజమాని చివరకు ప్రాణం తీసేస్తున్నాడు. అందుకే నీ అసలైన యజమానియైన దేవుడు ఈ మాటలు మీకు చెప్పమన్నాడు. మీరు అన్నవస్త్రాలు కలిగినవారుగా ఉండండి. తప్పు లేదు. భూమిమీద జీవించే కళను కలిగి ఉండటానికి, బ్రతకటానికి, తినటానికి సరిపోయినంత కలిగి ఉండండి, తప్పు లేదు. కానీ, విస్తారమైనటువంటి సంపద మీకు అవసరం లేదు. నేటి సమాజంలో మన మధ్య ఎలాంటి వారున్నారో ఒక చిన్న ఉదాహరణను మీకు చూపిస్తాను. వాస్తవ పరిస్థితులు మీకు తెలియాలి. ఈయనేమిటి? ధనాన్ని ప్రేమించొద్దు అంటున్నాడు. ధనాన్ని యజమానిగా స్వీకరించవద్దు అంటున్నాడు? ధనమే కదా అన్నింటికీ మూలం. మనీ మేక్స్ మెనీ థింగ్స్ కదా అనుకుంటున్నారా? ఇలాంటి మాటలు పుస్తకరూపంలో రావాలన్నా, దాని వెనుక ధనము ఉండాలి కదా అనుకుంటున్నారా? అలా అయితే మీరందరూ పొరపాటు పడుతున్నారు. ఒక మనిషి బ్రతకాలన్నా, తాను భూమిమీద దేనిని జరిగించాలన్నా దాని వెనుక దేవుడుండాలి. ఆయన సెలవు లేక భోజనము చేసి తృప్తి పొందుట అసాధ్యము అన్నాడు దేవుడు. (**ప్రసంగి 2 : 25**) కోట్ల రూపాయల ఆస్తి మీకు ఉండొచ్చు. కానీ, నీవు ఒక ముద్ద భోజనం చెయ్యాలి అంటే దేవుని సెలవుండాలి. ఈ రోజు జనులు విస్తారమైన ఆస్తులు సంపాదించుకుంటున్నారు. అలాంటివారిలో ఒక వ్యక్తిని మీకు ఉదాహరణగా పరిచయం చేస్తాను.

*2016 ఏప్రిల్ 28వ తారీఖున న్యూస్:* అతడు ఒక గ్రూప్-1 అధికారి. భారతదేశములో అత్యున్నతమైన పరీక్ష వ్రాసి, అందులో అతడు ఉత్తీర్ణతను సాధించాడు. అందుకుగాను ఇతనికి గవర్నమెంటువారు ఒక ఉద్యోగం ఇచ్చారు. జీవించే కళ తెలియక పోయినా, గ్రూప్-1 పరీక్ష పాస్ అయిన ఇలాంటి వారందరికి గవర్నమెంటు ఉద్యోగాలు ఇచ్చేస్తుంది. నన్ను అడిగితే గవర్నమెంటు గ్రూప్స్ పరీక్షలలో నెగ్గిన వారందరికీ జీవించే కళ తెలుసో, లేదో టెస్ట్ చేయాలి. అప్పుడు వారికి తగిన ఉద్యోగం ఇవ్వాలి. అప్పుడు మన రాష్ట్రం బాగుపడుతుంది. మన దేశం బాగుపడుతుంది. మన ఉదాహరణలోని వ్యక్తి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ ఉద్యోగాన్ని చేస్తున్నాడు. రోడ్డెక్కే ప్రతీ వాహనానికి ఇతడే చెకింగ్ చేసి, సంతకం పెట్టాలి. ఆ వాహనం రోడ్డు మీద తిరగాలి అంటే, ట్రాన్స్‌పోర్టు వెహికల్ రోడ్డు ఎక్కాలి అంటే, ఈ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ సంతకం చేయాలి. ఇతడు అక్రమాస్తుల కేసులో రెడ్ హేండెడ్‌గా పట్టుబడ్డాడు. ఇతడు ఎంత సంపాదిస్తున్నాడో తెలుసా? ప్రభుత్వ ఎ.సి.బి.(యాంటి కరప్షన్ బోర్డు) అధికారులే ఇతనిని పట్టుకున్నారు. డి.ఎస్.పి. గారు వెళ్లి ఆ వివరాలన్నీ సేకరించి మీడియా ముందు ఉంచారు. ప్రభుత్వం అతనికిచ్చే జీతం వేల రూపాయల్లో ఉంటుంది. కనుక, అతడు అన్యాయంగా సంపాదించినది ఒక లక్ష రూపాయలే అనుకుంటున్నారా? పోని 10 లక్షలు అక్రమంగా సంపాదించాడు అనుకుంటున్నారా? పోనీ 50 లక్షలు అక్రమంగా సంపాదించాడనుకుంటున్నారా? పోనీ ఒక కోటి రూపాయలు అక్రమంగా సంపాదించాడు అనుకుంటున్నారా? ఆనాడు యేసు చెప్పిన ఈ రెండవ యజమానియైన ధనమును ఇతడు ఎంత సంపాదించాడో తెలుసా? సుమారు 800 కోట్ల రూపాయలు. అతని ఇంటిలోనికి వెళ్లి తనిఖీ చేస్తే ఆస్తులు గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. అలాగని ఇతడు అవినీతి రాజకీయ నాయకుడు కాదు, వ్యాపారవేత్త కాదు, దోచుకునే దొంగ కాదు. మరి ఇంతకీ ఎవరీయన? ఇతడు ఒక గవర్నమెంటు ఉద్యోగి, పైగా గెజిటెడ్ ఆఫీసర్. ఈ ఆఫీసర్‌ను గూర్చి ఏమి వ్రాయబడిందో తెలుసా? పేపరు వారు ఇతనిని గూర్చి 'ఎ.సి.బి. వలలో పడిన పెద్ద తిమింగిలం' అని వ్రాసారు. తిమింగలం ఒక్కటుంటే, మిగిలిన చిన్న చిన్న చేపలు ఎన్ని ఉంటాయి చెప్పండి? సముద్రంలో తిమింగలం ఒక్కటుంటే చేపలు ఎన్ని ఉంటాయి? వేలు, లక్షలుగా ఉంటాయి. అంటే ఎ.సి.బి. వలలో ఒక తిమింగలం

పడిందంటే బయట వలలో పడని చేపపిల్లలు ఇంకా చాలా ఉన్నారని అర్థం. ఈ చేప పిల్లలు తిన్నగా ఉంటాయా? ప్రతీ రోజు ధనమనే మేతమేస్తూ తమ పొట్ట బాగా పెంచుతాయి. వార్తా కథనాల ప్రకారం, ఎ.సి.బి. డి.ఎస్.పి. గారు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. *"అక్రమ ఆస్తుల కేసులో పట్టుబడ్డ ప్రభుత్వోద్యోగి. డి.టి.సి. అధికారి లీలలు చూసి ఎ.సి.బి. అధికారులే విస్తుపోతున్నారు. ఆయన తన కుమార్తె పేరుతో 10కి పైగా కంపెనీలు ప్రారంభించి, అమాయకులను బురిడీ కొట్టించే స్కెచ్ వేసాడు. ఇప్పటికే అతడు సంపాదించిన 500 కోట్ల రూపాయల అక్రమ ఆస్తులను గుర్తించిన అధికారులు, 3 రాష్ట్రాల్లో 13 చోట్ల సోదాలు చేపట్టారు. వరుసగా 3వ రోజు కూడా ఎ.సి.బి. అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇంకా అతడికి చెందిన మరో నాలుగు లాకర్లు తెరవాల్సి ఉంది. ఇదిలా ఉండగా అతడికి నెల్లూరులో పెద్ద ఎత్తున ఆస్తులున్నట్లు తెలుస్తోంది. ఇతడికి మరొక మద్యం వ్యాపారితో లావాదేవీలు ఉన్నట్లు గ్రహించిన ఎ.సి.బి. అధికారులు అతడిని కూడా విచారిస్తున్నారు. రవాణాశాఖ డిప్యూటి కమీషనరుగా పనిచేస్తున్న ఇతడికి ఎ.పి., తెలంగాణా, కర్ణాటకలో ఉన్న ఆస్తులపై అవినీతి నిరోధక అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇతడు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న సమాచారంతో ఈ దాడులు చేసామని ఎ.సి.బి. అధికారి చెప్పడం జరిగింది. దానిలో భారీగా బంగారం, వెండి వస్తువులు, నగదుతో పాటు, కోట్లు విలువచేసే పొలాలు బినామీ పేర్లతో ఉన్నాయి. అతడి కంపెనీలకు సంబంధించిన దస్తావేజులు, రెండు కార్లు కూడా ఇప్పటికే ఎ.సి.బి. వారు స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి నెల్లూరు, హైదరాబాదుల్లో పలు కంపెనీలు ఉన్నట్లు దాడుల్లో బయట పడింది. ఇతడు అక్రమాస్తులు కూడ బెట్టడంతో పాటు బంధువుల పేరుతో కూడా రకరకాల వ్యాపారులతో నల్లధనాన్ని తెలుపు చేసేందుకు ప్రయత్నాలు సాగించాడని కూడా ఎ.సి.బి. అధికారులు కనుగొన్నారు. ఎ.పి., తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం తొమ్మిది చోట్ల ఈ దాడులు కొనసాగుతున్నాయి. దాడిలో బయటపడ్డ అక్రమ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు 60 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. వాస్తవానికి ఈ ఆస్తుల విలువ సుమారు 150 నుంచి 200 కోట్ల రూపాయల వరకు ఉంటుందని ఎ.సి.బి. అధికారులు చెబుతున్నారు. కాకినాడతో పాటు హైదరాబాదు, అనంతపురం, విజయవాడ, కడప, ప్రొద్దుటూరు, నెల్లూరు, బళ్ళారిలో ఏక కాలంలో ఎ.సి.బి. అధికారులు దాడులు నిర్వహించారు. ఇతడికి హైదరాబాద్ కుంపెల్లిలో 8 ప్లాట్లు, మాదాపూర్‌లో 4 ప్లాట్లు పంజాగుట్టలో 2 ప్లాట్లు, జూబ్లీహిల్స్‌లో 699 గజాల్లో 4 అంతస్తుల అపార్ట్‌మెంట్ కూడా ఉన్నాయని ఎ.సి.బి. అధికారులు దాడుల్లో బయట పడింది."* నేను చెప్పింది అవాస్తవం కాదు. ఇప్పటికి అందిన సమాచారాన్ని బట్టి అతడు సంపాదించిన ఆస్తుల విలువ, పైకి పోలీసు వారు చెప్పింది 800 కోట్ల రూపాయలు! చూసారా? అంత భారీ ధనాన్ని సంపాదించాడంటే ఇప్పుడు ఆలోచించండి. ఒక డి.టి.సి. ఆఫీసరుకే 800 కోట్లు ఉంటే, ఇంకా మిగిలిన తిమింగలాలు 'వల'ను తప్పించుకుని తిరుగుతున్నాయి. మిగిలిన తిమింగలాలు గనుక వలలో పడితే కోట్ల, కోట్ల, కోట్ల రూపాయల అక్రమాస్తి బయటపడుతుంది. దీనినే నల్ల ధనం(బ్లాక్ మనీ) అంటారు. ఈ ధనం ఎవరిది? అది ప్రజలదే. మన చుట్టూ ఉన్న పేదవారిది. ప్రతి రోజు పట్టెడన్నం కూడా తినలేక పోతున్నవారిది. ఆకలి చావులు చస్తున్నవారిది. వీరందరి దగ్గర కడుపుకొట్టి, వాడొక్కడే 800 కోట్లు సంపాదించాడు. కూతురు పేరున 9 కంపెనీలు పెట్టాడు. చూసారా? అతని కుమార్తె అంటే అతనికి అంత ఇష్టమా? లోకంలో ఉన్న పిల్లలందరూ అతని కుమార్తెల లాంటివారు కాదా? ఇదే ధనం లేక తమ చదువులను మధ్యలో ఆపుతున్నారు కోకొల్లలు. ఇదే ధనం లేక పెళ్ళిళ్ళు చేసుకోలేకపోతున్నారు ఎందరో. ఇదే ధనం లేక తమ కుటుంబాన్ని గడపలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అనేకమంది. ఇదే ధనం లేక అప్పులు తీర్చలేని రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు. నిరుపేదలు వైద్యం అందక రోగాలతో చచ్చిపోతున్నారు. అందరూ కార్పొరేటు ఆసుపత్రికి వెళ్లలేరు. గవర్నమెంటు ఆసుపత్రులలోనికి వెళ్లి సరైన వైద్యం అందక, ఆ భయంకరమైన రోగానికి మందు వేసుకోలేక అక్కడికక్కడే మరణశయ్య మీద తమ ప్రాణాలను వదులుతున్నారు. వారందరి ఉసురు ఇలాంటివారికి తగలదంటారా? అలాగని అతడు చివరకు ఏమి సాధించాడు చెప్పండి? ఒక గ్రూప్1 ఆఫీసర్‌గా ఏమి సాధించాడు? చివరకు పోలీసులకు పట్టుబడ్డాడు. అందరిచేత 'ఛీ' అనిపించుకున్నాడు. దీనినిబట్టి అతడు చదివిన చదువుకు కూడా కళంకం అంటుకుంది. అతడు చదవిన చదువు గొప్పదనుకున్నాము. కానీ, ఆ చదువు చదివిన వారు కూడా ఇలాంటి వారవుతారని ఇప్పుడు జీవించే కళలో తెలుసుకుంటున్నాము.

అవును ప్రియులారా! జీవించే కళ తెలియకపోతే ఎంతటి చదువు చదివిన వాడైనా వాడు శూన్యం. వాడు ఇక దేవునికి పనికిరాడు. వాడు ఎంత గొప్పవాడైనా సరే దేవుని ముందు వాడు దోషి. ఇలాంటివాడు ఒక్కడే అనుకుంటున్నారా? మన భారతదేశంలో ఈ మధ్య వచ్చినటువంటి మరొక న్యూస్‌కూడా ఉంది. అవే 'పనామా పత్రాలు విడుదల'. అంటే ఇంటర్నేషనల్ జర్నలిస్ట్ సమాఖ్యకు చెందిన పత్రికా విలేఖరులందరూ సమైక్యంగా ఏర్పడి, ప్రపంచ వ్యాప్తంగా ఎవరెవరైతే నల్లధనాన్ని కూర్చుకున్నారో, వారందరి వివరాలు ఇంటర్‌నెట్‌లో పెట్టారు. ఆన్‌లైన్‌లో బహిర్గతం చేసారు. వారు ఆ పరిశోధన చేసి, ఆన్‌లైన్‌లో ఉంచిన తరువాత ఆ వివరాలను విన్న ప్రతీ దేశం ఆశ్చర్యపోయింది. ఆ వివరాలలో మన భారతదేశానికి చెందిన నల్లకుబేరులు ఎంతమంది ఉన్నారు అని అడిగితే, సుమారు 500 మంది ఉన్నారు. ఈ నల్ల కుబేరులు వివరాలను పనామాపత్రాలు లీక్ చేసాయి. అందులో ప్రఖ్యాతిగాంచిన సినీనటులు, క్రికెటర్లు, వ్యాపార దిగ్గజాలు, ప్రజా ప్రతినిధులు, అధికారము కలిగినవారు చాలామంది ఉన్నారు. వీరందరూ నల్లధనాన్ని జాగ్రత్తగా దాచుకున్నారు. ఇక అంతకు ముందు స్విస్ బ్యాంకులో ఎక్కౌంట్లను గూర్చి మీ అందరికీ తెలుసు. భారతదేశమే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి దేశం ధన పిచ్చిలో పడింది. ఇది చిన్నదైనా, పెద్దదైనా, వ్యాధి వ్యాధే. అది ముదిరిందంటే చివరకు మనిషి నాశనానికి జారిపోతున్నాడు. ధనాశ కలిగిన ప్రతీ ఒక్కడికి జీవించే కళ తెలపాలి. ధనాశపరులకు జీవించే కళ తెలియాలి. ఈ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనరే ఇలా ఉంటే, అతని క్రింద ఉన్న సహ ఉద్యోగులు, సబార్డినేట్స్, అతని దగ్గర ఉన్న గుమాస్తాలు,... అటెండర్ వరకు ఎలా ఉంటారు చెప్పండి? మా అయ్యగారే ఇంత తీసుకుంటున్నారంటే, అతని క్రిందున్నవాడు నేను కూడా ఎంతోకొంత నొక్కేయాలి అనుకుంటాడు. ఆ తరువాత ప్రక్క విభాగంలో ఉన్నవాడు, ఆయనే అంత సంపాదిస్తుంటే నేనెంత సంపాదించాలి? ఆయనే అన్ని బిల్డింగులు కడుతుంటే నేనెన్ని బిల్డింగులు కట్టాలి? ఆయనే తన కుమార్తె వివాహాన్ని అంత వైభవంగా చేస్తే, నేను నా కుమారుని వివాహాన్ని ఇంకెంత వైభవంగా చెయ్యాలి? అనుకుంటాడు. ఇలా ఒకడిని చూచి ఒకడు, అత్యంత ధనాశపరులై దేవునికి దూరమవుతున్నారు. జాగ్రత్తగా ఆలోచించండి. దీనివలనే ఈ రోజు మనం బ్రతుకుతున్న సమాజం చెడిపోయింది. వీరికి జీవించే కళ తెలియదు. రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారికి తెలియదు. నీవు భూమిమీద ధన సంపాదన కోసం వచ్చావా? ఆ ధన సంపాదన నీకు పరలోకమును ఇస్తుందా? అతడు సంపాదించినదంతా ఇక్కడే విడిచిపెట్టి వెళ్లిపోతాడు. 800 కోట్లు ఎ.సి.బి. వాళ్లకు ఇచ్చి ఇప్పుడు జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు. అతడు అక్రమంగా సంపాదించిన ధనం అతడిని రక్షించిందా? ఈ రంగు నోటు అతడిని కాపాడిందా? ఎన్నటికి కాపాడదు. ప్రపంచంలో దీనిని గూర్చి ఎవ్వడూ ఇంత వివరంగా చెప్పలేదు. లంచం పుచ్చుకునేవారిని గూర్చి బైబిల్ మాట్లాడింది. ఎందుకంటే ఆయన దేవుడు! ఆయన మనసులో ఉన్న మాటలన్నీ సమాజాన్ని చక్కదిద్దేవి.

**నిర్గమకాండము 23 : 8 'లంచము తీసికొనకూడదు. లంచము దృష్టిగలవానికి గ్రుడ్డితనము కలుగజేసి, నీతిమంతుల మాటలకు అపార్థము చేయించును.'** దేవుడు సుమారు 4వేల సంవత్సరాల క్రితమే ఈ మాటను వ్రాయించాడు. లంచము తీసుకోవద్దన్నాడు. లంచము ఎందుకు తీసుకొనకూడదంటే, లంచము దృష్టి గలవానికి గ్రుడ్డితనము కలుగజేస్తుంది. తద్వారా నీతిమంతుల మాటలకు అపార్థము చేయించును. అంటే లంచం తీసుకునేవాడు తన మనోదృష్టిని కోల్పోతాడు. వాడు గ్రుడ్డివాడైపోతాడు. వాడికి ధనాశ, ప్రజలను పీల్చి పిప్పిచేయడం తప్ప ఇక ఏమీ కనిపించదు. కరెన్సీ కాగితాలను సంపాదించడం, బంగారము, ఆస్తులు, భవనాలు... కూర్చుకోవడం తప్ప, అలాంటివాడికి ఇక ఏమీ కనిపించదు. దేవుని మాటలు వాడికి కనిపించవు. అందుకే దేవుడు ఈ జాగ్రత్తలు చెప్పాడు. ఈ రోజు ప్రతీ ఒక్కరూ ఈ లంచానికి అలవాటుపడ్డారు. స్కూల్‌లో సీటు రావాలంటే లంచము, ఆఫీసులో పని జరగాలంటే లంచము. ఉద్యోగం కావాలంటే లంచము, వైద్యం జరగాలంటే లంచము. న్యాయం జరగాలంటే లంచము, చివరకు మనిషి బ్రతకాలన్నా లంచము ఇవ్వాల్సిన పరిస్థితి. ఎక్కడికి వెళ్లినా లంచం లేకపోతే పని జరగడం లేదు. తీసుకునేవారికి, ఇచ్చేవారికి, ఇది ఒక అలవాటుగా మారిపోయింది. ముఖ్యంగా కొంతమంది ఉద్యోగులైతే, వారి జీతం తరువాత తీసుకోవచ్చు, ముందు లంచము తీసుకోవాలి అనుకుంటున్నారు. నెలసరి జీతం ఎలాగూ బ్యాంక్ ఎకౌంట్‌లోనికి వచ్చేస్తుంది. కానీ, లంచం అయితే ఫ్రెష్‌గా వస్తుంది. అది వారికి అదనపు ఆదాయం అనుకుంటున్నారు. దానివలన సుఖభోగాలను అనుభవించాలని

అనుకుంటున్నారు. ఓరి దౌర్భాగ్యులారా, నీవు తీసుకునే లంచం నీ దృష్టికి గ్రుడ్డితనాన్ని కలుగుజేస్తుంది. ఇది దేవుని తీర్పు. ఈ తీర్పును నీవు పాటించకపోతే అదే డబ్బు నిన్ను నరకానికి తీసుకు వెళ్లిపోతుంది. అదే డబ్బు నిన్ను కటకటాల వెనక్కి తీసుకు వెళుతుంది. అదే డబ్బు నిన్ను నాశనం చేస్తుంది. ఎందుకంటే అది దేవునికి విరోధి. ఇద్దరూ నీ పాలిట రెండు యజమానులు. ఒకాయన దేవుడు. మరొకడు సిరి. ఒక దాసుడు ఇద్దరు యజమానులకు సమానంగా సేవ చేయలేడు. ఇద్దరు యజమానులను ఒకేలా ప్రేమించలేడు. ఒకనిని ప్రేమిస్తాడు, ఒకనిని ద్వేషిస్తాడు. మీరు ఎవరిని ప్రేమిస్తున్నారో చెప్పండి? ఈ సమాజం అంతా ఎవనిని ప్రేమిస్తున్నారో చెప్పండి? లోకపుజనులు ధనాన్ని తప్ప ఇంకెవ్వరినీ ప్రేమించటం లేదు. అందుకే కొందరు ఈ ధనాన్ని ఏమంటారో తెలుసా? దైవం అంటారు. మనం ముద్రించుకున్న కరెన్సీ నోటు క్రింద పడితే కళ్లకు అద్దుకుంటారు. ఎందుకు? అది వారికి దేవుడైపోయింది కదా. నిజమైన దేవుడంటారా.., ఆయన ఎప్పుడో పక్కకి వెళ్లిపోయాడు. ఆయన మాటలు ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ, వారి జేబులో ఉన్న నలిగిపోయిన, చెమటపట్టిన రంగు కాగితమంటే వారికి ఎంత భక్తో! అది క్రింద పడిపోతే కళ్లకు అద్దుకుని తీసుకోవాలి. ఒకవేళ ఎవరైనా తమ ఎడమ చేతితో ధనాన్ని ఇస్తే దయచేసి మీ కుడిచేతితో ఇవ్వండి అంటారు. ఎందుకంటే అది ధనం. మంగళవారం ధనాన్ని ఇవ్వకండి, చీకటి పడిన తరువాత మీ ధనాన్ని ఇవ్వకండి, లేదంటే మీ ఇంటిలో నుండి ఆ ధనం వెళ్లిపోతుంది అంటారు. అది ఎల్లప్పుడూ మీ ఇంట్లోనే మూలగాలి. ఎందుకు? మిమ్మల్ని చంపటానికా? ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు మీకు ధనం అవసరమైతే, ఈ రోజు మంగళవారం, చీకటి పడింది అని అంటారా? అలా అంటే, ఒకప్రక్క ప్రాణం పోతుంది. ధనం దేశాలను పాడు చేస్తోంది. అది ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉంటేనే మంచిది. అంతకు మించితే, దానివలన మీ కన్నులకు దేవుడు కనుమరుగైతే, ఇక మీకు జీవించే కళ తెలియదు. ఇది నిజం! ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలు ఈ దేవుని మాటలు నేర్చుకోవాలి. దేశాలు బాగుపడాలంటే ధనానికి ఎంత వరకు విలువనివ్వాలో అంతవరకే ఇవ్వండి. అప్పుడే ఈ సమాజం బాగుపడుతుంది. మీకు సకాలంలో వర్షాలు పడతాయి. మీ భూములు పండుతాయి. మీ కడుపు నిండుతుంది. మీ బ్రతుకులు దేవుని దృష్టిలో ఆనందదాయకంగా ఉంటాయి. ఏదో సంపాదిద్దామని, ఏదో కోరుకుందామని మీరు ముద్రించుకున్న వాటినే, మీరు సంపాదించుకున్నవాటినే దేవుడు అనుకుంటే, అసలైన దేవుడు కన్నెర్ర చేయక తప్పదు. దేవుని శాస్త్రంలో మరొక మాటను చూడండి.

**సామెతలు 29 : 4 'న్యాయము జరిగించుట వలన రాజు దేశమునకు క్షేమము కలుగజేయును. లంచములు పుచ్చుకొనువాడు దేశమును పాడుచేయును.'** ఇంతకీ న్యాయమంటే ఏమిటి? జీవించే కళ నేర్పించడమే న్యాయం. ఆ తరువాతే ఏదైనా! తల్లి తన పిల్లలకు బుడి బుడి అడుగులు నేర్పిస్తుంది. అన్నం ఎలా తినాలో నేర్పిస్తుంది. అమ్మా అనడం నేర్పుతుంది, నాన్నా అనడం నేర్పిస్తుంది. ఆ తరువాత అ, ఆ లు నేర్పిస్తుంది. తరువాత స్కూలుకు పంపించేస్తుంది. ఆ తరువాత పెరిగి పెద్దైతే వివాహం చేసి, ఒక ఇల్లు కట్టిస్తుంది. ఆ తరువాత చచ్చిపోతుంది. తన జీవిత కాలంలో ఏనాడూ తల్లి, తండ్రీ తమ పిల్లలకు జీవించే కళ ఇదిరా... అని చెప్పలేదు. పోనీ పాఠశాలలో ఉపాధ్యాయుడు జీవించే కళ ప్రకారము ఇలా ఉండాలిరా అని చెప్పలేదు. అందుకే దేవుడే ఈ బాధ్యతను తీసుకున్నాడు. ఒక రాజు దేశాన్ని పరిపాలిస్తే ఎలా పరిపాలించాలో తెలుసా? తన ప్రజలందరికీ మొట్టమొదట జీవించే కళ తెలియజేయాలి. అంటే, దేవుని జ్ఞానానుసారముగా జీవించే కళను నేర్పించుట వలన రాజు దేశమునకు క్షేమము కలుగజేయును. లంచము పుచ్చుకొను రాజు, లంచము పుచ్చుకొను ప్రజలు దేశమును పాడుచేయును. మన దేశంలో పనామా పత్రాల ప్రకారం 500 మంది నల్ల కుబేరులున్నారు. స్విస్ బ్యాంకులో ఎక్కౌంట్లు ఉన్నవారు వేలకు వేలుగా ఉన్నారు. ఇలా లంచములు పుచ్చుకొనువారు దేశములో ఉంటే ఆ దేశం పాడవదా? దేవుని ధర్మవిధి అదే చెప్పింది. ఒక దేశం పాడవుతుందంటే కారణం ఏమిటో తెలుసా? లంచం పుచ్చుకొనువాడు ఆ దేశంలో ఉన్నాడు. మన పల్లెలో ఉన్నారు, మన జిల్లాలో ఉన్నారు, మన రాష్ట్రంలో ఉన్నారు, మన దేశంలో ఉన్నారు. శ్రీలంకలో ఉన్నారు, పాకిస్తాన్‌లో ఉన్నారు, ప్రపంచ దేశాలన్నిటిలోనూ లంచం పుచ్చుకునే వారున్నారు. అందుకే ఈ రోజు దేశాల పరిస్థితి దిగజారిపోయింది. సుఖం లేదు, శాంతి లేదు. ఎవ్వరికీ కంటిమీద కునుకు లేదు. ఏ రోజు ఏం జరుగుతుందో భయభ్రాంతులతో ఉన్నారు. ఎందుకంటే, ఆ దేశాలలో నివసిస్తున్నవారికి జీవించే కళ తెలియదు. చీమకు ఆ భయం లేదు. పక్షికి ఆ భయం లేదు. చేపకు ఆ

భయం లేదు. అవి స్వచ్ఛందంగా మనుష్యులకు ఆహారాన్నిస్తూ, దేవుని ఆజ్ఞలను నెరవేరుస్తూ, తమ జీవితకాలంలో ఎంతో చక్కగా బ్రతుకుతున్నాయి. ఎందుకంటే వాటన్నింటికీ జీవించే కళ తెలుసు. వాటిలో లంచగొండితనము లేదు. వాటిలో ఆత్మహత్యలు లేవు. అవన్నీ దేవుడు నిర్ధేశించిన మాటల ప్రకారం బ్రతుకుతున్నాయి. అందుకే వాటన్నిటికీ జీవించే కళ తెలిసిపోయింది. మనమందరం మనుష్యులం. మన చుట్టూ ఉన్న మనుష్యులను మనం బ్రతికించొద్దా? వారిని చంపి మనం బ్రతకాలా? ఏంటండీ ఈ దుష్ట ఆలోచన? మనిషికి ఎందుకండీ ఇటువంటి దుర్బుద్ధి? వందలకోట్ల రూపాయలను ఏమి చేసుకుంటాడండీ? తన చుట్టూ ఉన్న సమాజాన్ని బ్రతికించలేని దౌర్భాగ్యుడై, పనికిమాలిన ధనముతో ఏమి చేసుకుంటాడు చెప్పండి. అందుకే గలతీయులకు వ్రాసిన పత్రికలో అపొస్తలుడైన పౌలుగారు ధర్మశాస్త్రమంతటిని ఒకే ఒక్క మాటలో చెబుతున్నాడు చూడండి. జీవించేకళ నేర్చుకున్న వారిలో ప్రధానంగా ఉండవలసిన లక్షణం అదే!

**గలతీయులకు 5 : 14- 'ధర్మశాస్త్రమంతయు నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్కమాటలో సంపూర్ణమైయున్నది'** చూసారా? ధర్మశాస్త్రమంతటిని ఒకే ఒక్క మాటలో చూపించాడాయన. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుము. లంచగొండులకు ఇప్పటి వరకు జీవించే కళను ఎవ్వరూ చెప్పలేదు. నల్ల కుబేరులకు ఇప్పటివరకు జీవించే కళను ఎవ్వరూ చెప్పలేదు. అందరూ డబ్బు సంపాదించడమే చెప్పారు. అందుకే అధికార పీఠాన్ని ఎక్కిన వారికి కూడా జీవించే కళ తెలియదు. అందుకే వారు కూడా డబ్బు సంపాదనలో ఉన్నారు. మన వలన ఓట్లు పొందినవాడు, పరీక్ష రాసి పాసై గవర్నమెంటు చేత ఒక అధికారిగా నియమింపబడిన వాడు కూడా ఈ రోజు ధనార్జనలో ఉన్నాడు. అంటే దానికి కారణం ఏమిటో తెలుసా? వాడికి జీవించే కళ తెలియదు. అందుకే దేవుడు వ్రాయించిన మాట చూడండి. ధర్మశాస్త్రమంతయు నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుము అను ఒక మాటలో పూర్తి చేయబడింది. **గలతీయులకు 5 : 15, 'అయితే మీరు ఒకనినొకడు కరచుకొని భక్షించిన యెడల మీరు ఒకనివలన ఒకడు బొత్తిగా నశించిపోదురేమో చూచుకొనుడి.'** ఒక వ్యక్తికి మంచి ఉద్యోగం వస్తుంది. దాని వలన మంచి జీతం వస్తుంది. ఆరోగ్యవంతంగా దేవుని దయలో బ్రతుకుతూ జీవించే కళను నేర్చుకుంటూ, నీ చుట్టూ ఉన్న సమాజానికి ఉపయోగపడుతూ మంచివాడవుగా బ్రతకొచ్చుగా. లేదు లేదు. అందరి కడపూ కొట్టాలి. అతడు సంపాదించే అక్రమ సంపాదనలో ఎంతోమంది హృదయ వేదన ఉంది. లంచం పుచ్చుకునే ప్రతీ దౌర్భాగ్యుడు ఏం చేస్తున్నాడో తెలుసా? ప్రజలను కరిచి భక్షిస్తున్నాడు. ఒక పులి మరొక పులిని చంపుకుని తినదు. ఒక చీమ మరొక చీమను ఆహారంగా మార్చుకోదు. చీమ పంచదార ముక్కలు ఎక్కడున్నాయో చూసుకుంటుంది. ఒక గ్రద్ద మరో గ్రద్దమీద కక్ష కట్టదు. అవును. ప్రతీ జీవి జీవించే కళను తెలుసుకున్నాయి. గనుక వాటి జీవనం ప్రకారం అవి బ్రతుకుతున్నాయి. దేవుడు నిర్ధేశించిన మాటలతో అవి బ్రతుకుతున్నాయి. కానీ జీవించే కళ వాడికి తెలియదు గనుక మనిషే ఎలా మారిపోయాడో చూడండి. సాటి మనిషిని మనిషి చంపాలి అనుకుంటున్నాడు. అలా చంపిన తరువాత వచ్చినటువంటి పైసలు సంపాదించాలనుకుంటున్నాడు. అంటే ఎంత దౌర్భాగ్యుడు? నీ వలన నీ సహోదరుడు బ్రతకాలని దేవుడు చెప్పాడు. నిన్ను బట్టి నీ పొరుగున ఉన్నవాడు బ్రతకాలని దేవుడు చెప్పాడు. నీవు బ్రతుకుతున్నందుకు నిన్ను బట్టి ఈ లోకమంతా బ్రతకాలి అన్నాడు దేవుడు. అదే ఆలోచన నాలో కూడా ఉంది. ఆ మనస్సు నాలో కూడా ఉంది. ఆ దేవుని మాటలు నాలో ఉన్నాయి. నేను ఉన్నాను అంటే, నాకు ఈ జీవించే కళ తెలిసిందంటే, నాలో దీనిని నేను సమాధి చేయకూడదు. అందుకే ఈ పుస్తకం వ్రాస్తున్నాను. నా చుట్టూ ఉన్నవారికి నేను దీనిని తెలియజేయాలి. నా చుట్టూ ఉన్నవారికి నేను దీనిని ప్రకటించాలి. లేకపోతే నా వలన ప్రయోజనం ఏమీ లేదు. నావల్ల అనేకమంది సహోదరులు బ్రతకాలి. కానీ వారిని నేను కరిచి భక్షించటానికి వీలులేదు. ఇదే దేవుడు కూడా చెప్పాడు. మీరు ఒకరిని ఒకరు కరచుకుని భక్షించినయెడల మీరు ఒకని వలన ఒకడు బొత్తిగా నశించిపోదురు. నీవు తప్పు చేస్తే మరలా మరొక మనిషే వచ్చి నిన్ను జైల్లో పెడతాడు. అక్రమాస్తులను కూడబెట్టిన వానిని జైల్లో ఎవరు పెట్టారు చెప్పండి? మరల ఒక ఎ.సి.బి. వారు, అందులో మరలా ఒక గవర్నమెంటు ఉద్యోగి అయిన డి.ఎస్.పి. అరెస్ట్ చేసారు. అంటే అదే మనిషి మరలా వాడిని జైల్లో వేస్తాడు. ధనం ఎంత దౌర్భాగ్యమైన పనులు చేయిస్తుందో చూడండి. న్యాయాన్ని కూడా అన్యాయంగా మార్చేస్తుంది. అన్యాయాన్ని న్యాయంగా త్రిప్పేస్తుంది. నీతిమంతునికి శిక్షపడేటట్టు చేస్తుంది, అన్యాయస్తుడు బయట తిరిగేటట్టు చేస్తుంది ఈ ధనమే. ఈ ధనమే లేకపోతే ఇవి ఏమీజరగవు. ప్రతీ మనిషి

తన పొరుగువానిని ప్రేమించాలి. తన పొరుగు వానిని బ్రతికించాలి. ఆ పొరుగు వానికొరకు బ్రతకాలి. ఇది బైబిలు చెప్పిన సూత్రం. ఇది తెలియని వానికి జీవించే కళ తెలియనట్టే. జీవించే కళ మీకు తెలిస్తే నిజంగా మీ పొరుగు వారిని మీరు బ్రతికిస్తారు, వారి కొరకు మీరు మీ జీవితాన్ని అర్పిస్తారు. అదే ఆనాడు యేసు చేసాడు. ఆయన తన బ్రతుకు కాలంలో అందరికీ జీవించే కళను నేర్పించాడు. ప్రజలందరికీ జీవించే కళ ఎలాగో తెలియజేసాడు. ఆయన దేవుని కుమారుడు గనుక అదే చెప్పాలి, అదే చెప్పాడు. కానీ ఈ రోజు మనుష్యులలో అదే కరువైపోయింది. మనుష్యులలో ఎక్కడా అది కనిపించడం లేదు. ప్రియులారా! మరొక చక్కని మాటను చూడండి.

**తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 6 : 6- 'సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమైయున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసుకొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొందియుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనాములోను ముంచివేయును. ఎందుకనగా, ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి.'** మన దైవభక్తి సంతుష్టి సహితమైనదిగా ఉండాలి. అందుకే ఈ పుస్తకమును చదివేవారందరికీ సంతుష్టి సహితమైన దైవ భక్తినే నేర్పిస్తున్నాను. మీకు కష్టాలున్నాయా? మీకు బాధలున్నాయా? మీకు రోగాలున్నాయా?.. అయితే దేవుని నమ్ముకోండి అని, అలాంటి మాటలను మీకు వ్రాయడం లేదు. అసలైన, సంపూర్ణమైన దైవభక్తి అంటే ఏమిటో, అది ఎలా ఉండాలో మీకు వ్రాస్తున్నాను. నిజానికి మాట్లాడితే భూమి మీదున్న అందరికంటే, నేనేది అడిగినా దేవుడు కాదనడు. తప్పకుండా ఇస్తాడు. ఎందుకంటే ఐ యామ్ ది మెస్సెంజర్ ఆఫ్ ది ఆర్ట్ ఆఫ్ లివింగ్. నేను జీవించే కళను చెప్పడానికి వచ్చిన రాయబారిని. నేను నా దేవుని తరుపున వచ్చిన రాయబారిని. నేను ఏది అడిగినా దేవుడు దానిని నాకు ఇవ్వాల్సిందే. నాకొరకు అవసరమైతే ఈ ప్రకృతిని కూడా స్తంభింపచేయాల్సిందే. దేవుని మీద ఇంకెవ్వరికీ ఆ హక్కులేదు. దేవున్ని అడగటానికి ముందు ఆయన కొరకు మనము ఏమి చేసామో ఆలోచించుకోవాలి. నేను చేసాను, చేస్తున్నాను గనుక నా దేవున్ని అడగటానికి నాకు హక్కు ఉంది. నేనేది అడిగినా దేవుడు ఇస్తాడు కానీ నేను అడగను. అదే నాలోఉన్న అర్హత. నా దేవునికి నేను కుమారున్ని అయినందుకు నాకున్న ఆ అర్హత ఏమిటో తెలుసా? నేను దేవున్ని ఎప్పుడూ ఏదీ అడగను. ఎందుకడగనో చెప్పమంటారా? నాకు ఏది అవసరమో దానిని దేవుడు ముందుగా నాకు అనుగ్రహిస్తాడు. ఇక నేను అడగడం ఎందుకు చెప్పండి? నిజమైన తండ్రి తన కుమారునికి ఏది ఇవ్వాలో ముందే గ్రహిస్తాడు. తన కుమారుడు అడుగక ముందే ఆ తండ్రి తెలుసుకుంటాడు. మంచి తండ్రి అంటే, నాకు అది ఇవ్వు, నాకు ఇది ఇవ్వు అని మాటిమాటికి అడిగించుకొనేవాడు కాదు. ఒకవేళ భూమిమీద ఉన్న తండ్రులయినా ఇలా అడిగించుకుంటారేమోగాని పరలోకమందున్న తండ్రి మాత్రం అలా చెయ్యడు. కానీ, మీ ప్రార్థనలన్నింటిలో దేవుని అడిగీ అడిగీ ఆయన పరువు తీసేస్తున్నారు. ఎవ్వరికీ ఆయనంటే నమ్మకం లేదు. మీరు అడుగకముందే మీ అవసరాలను తీరుస్తాను అని దేవుడన్నప్పుడు, మీరు మాటి మాటికి అడుగుతున్నారంటే, ఆయన మీద మీకు నమ్మకం లేదని అర్థం. పరమందున్న దేవుని మనస్సును మీకు చెప్పకుండా దేవునికి, మీకు నేను అన్యాయం చేయలేను. మీ అందరికి యేదో చిల్లి గవ్వలు, చిల్లరి పైసలు, ఒక భూమి ముక్క, ఒక చిన్న ఇల్లు, ఒక చిన్న ఉద్యోగం, ఒక చిన్న అధికారం, ఒక చిన్న ఆరోగ్యం,... ఇవ్వమని నేను దేవుని కోరను. అలా నేను ప్రార్థిస్తే, ఈ రోజు మీకు స్వస్థత కలుగుతుంది. రేపు ప్రొద్దుట మరల మీకు రోగం రాదని గ్యారెంటీ ఏమిటి? ఈ రోజు మీకు కడుపు నొప్పని మీరు నాదగ్గరకొచ్చారు అనుకుందాం. నేను దేవునికి ప్రార్థన చేసి మీ కడుపు నొప్పిని నివారించాను అనుకుందాం. తరువాత మీరు ఇంటికెళ్లగానే మీకు గుండెనొప్పి వస్తే, పరిస్థితి ఏమిటి? ఈ గుండెనొప్పికంటే కడుపునొప్పే మంచిదనుకుంటారప్పుడు. అందుకే, మీరు తెలుసుకోవలసిన మొట్టమొదటి సంగతి జీవించే కళ. మీరు దేవుని ప్రార్థించి అడుగవలసినది స్వస్థత కాదు, మీరు జీవించే కళ. మీకు అనుగ్రహించమని నేను దేవుని కోరేది ఒకే ఒక్కటి, అదే మీరు జీవించే కళ. దేవుని నుండి మీరు కోరుకోవలసింది ధనము కాదు, ఆశీర్వాదము కాదు, ఐశ్వర్యము కాదు. మీరు దేవునికి పిల్లలైతే ఇవన్నీ మీకు దేవుడు యే కాలంలో అనుగ్రహించాలో ఆ కాలంలో అనుగ్రహిస్తాడు. మీ తండ్రి పై మీకు విశ్వాసం ఉంటే మీరు అడగకముందే

వీటన్నింటినీ దేవుడు ఇస్తాడు. కానీ మొట్టమొదట నేర్చుకోవలసింది మీరు జీవించే కళ. సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై ఉన్నది. ఎందుకంటే నీ దేహాన్ని విడిచి పెట్టిన తరువాత ఆ లాభం మీకు కనిపిస్తుంది. ఆ లాభమే పరలోకంలో ఉంది. అది మహాలోకం. మహా జీవితమది. దానిని మీరు పొందాలి అంటే భూమిమీద మీరు సంతుష్టిసహితమైన దైవభక్తిని కలిగి ఉండాలి. భూమిమీద మనకు యేదో చిన్న లాటరీ తగిలితే అది లాభం కాదు. ఏదో ఒక చిన్న ఉద్యోగం దొరికితే అది మనకు లాభం కాదు. అది శరీర సంబంధమైనది. అది చాలా చిన్నది. అది సముద్రంలో నీటి బొట్టంత. కానీ, మీరు జీవించే కళ కలిగినవారైతే దేహాన్ని విడిచిపెట్టిన తరువాత మహా సముద్రాలనే దేవుడు ఇచ్చేస్తాడు. ఆయన మనస్సును మీరు గ్రహించండి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లంచగొండులందరికీ ఈ మాటలు తెలియాలి. మనము ఈ లోకములోనికి ఏదీ తీసుకుని రాలేదు. నల్లధన కుబేరులారా, ధనాశపరులారా! మనమీలోకములోనికి ఏమియు తేలేదు. ఈ లోకములోనుండి ఏమియు తీసుకుని పోలేము. తాను మరణించిన తరువాత పరలోకానికి వందల కోట్ల రూపాయలు తీసుకుని వెళ్ళిపోతాడా? లేదు. వెళ్ళలేడు. తాను సంపాదించినదంతా ఇక్కడే వదిలేస్తాడు. తనకున్నదంతా ఇక్కడే విడిచిపెట్టాలి. చిల్లి గవ్వ అయినా సరే ఇక్కడే విడిచిపెట్టాలి. మీరు చనిపోగానే ఆఖరికి మీ ఒంటిమీద బంగారం కూడా ఒలిచేస్తారిక్కడ. దానిని మీ దేహంపై ఉంచరు. ఒకవేళ బంగారము ఎక్కువైపోయి ఇంటిలో ఉన్న బంధువులు విడిచిపెడితే, కాటికి తీసుకుని వెళ్లిన తరువాత కాటికాపరి అయినా ఒలిచేస్తాడు. కట్టెల మీద పడుకుని కాలిపోబోయే వాడికి ఈ బంగారం ఎందుకు? ఒంటిమీద నుండి గట్టిగా తీసి ఒలిచేస్తాడు. ఒకవేళ ఒలవకపోయినా కాలిన తరువాత అవి బూడిదలో క్రింద పడతాయి. అప్పుడైనా ఎవరో ఒకరు తీసుకోవాలి. చనిపోయినవాడు మాత్రం వాటిని పొందలేడు. వారు రాసిన వీలునామాలన్నీ ఇక్కడే ఉండిపోతాయి. వారు ధరించుకున్న బంగారమంతా ఇక్కడే ఉండిపోతుంది. వారు దాచుకున్న బ్యాంక్ బ్యాలెన్స్ అంతా ఇక్కడే ఉండిపోతుంది. అది మరొకరి సొత్తు అవుతుంది. వారి ఒంటి మీద బట్టలు కూడా విప్పేస్తారు. చనిపోయిన వారికి ఇవేమీ తెలియవు. పాడె మీద పడుకోబెట్టి వారిని మొండి దేహముతోనే కాటికి పంపిస్తారు. ఇంటిలో ఉంచుకోరు, ఊరిలో ఉంచుకోరు. వాడెంత ధనవంతుడైనా, ఎంత పేదవాడైనా వారి దేహాన్ని ఊరికి దూరంగా పారేస్తారు. ఇవన్నీ మీరు ప్రతిదినం చూస్తున్న సంఘటనలే. ఇప్పుడు మీరు దేనిని సంపాదించాలి చెప్పండి? డబ్బునా? సంతుష్టి సహితమైన దైవభక్తినా? దేనిని ఇవ్వాలని నేను మిమ్మును ఆహ్వానించాలి? నేను మీకు సంతుష్టి సహితమైన దైవభక్తినే ఇవ్వాలి. అదే గొప్ప లాభమును మనకు ఇస్తుంది. మనము ఈ లోకములోనికి ఏదియు తీసుకుని రాలేదు. తల్లి గర్భములో నుండి మనము నగ్నంగా వచ్చాము. మరలా నగ్నంగా వెళ్లిపోతున్నాము. ఈ లోకములోనుండి ఏమియు తీసుకుని పోలేము. మరలాగైతే మాకున్నదానిని అంతటిని విడిచిపెట్టి, దేవుని దగ్గరకు వచ్చేయమంటారా? దేవుని కొరకు మాత్రమే బ్రతకమంటారా? అని మీరు అడిగితే, అన్నవస్త్రములు కలిగినవారుగా ఉండండి అన్నాడు దేవుడు. అదికూడా లేకపోతే పేదవారై చచ్చిపోతారు. బైబిల్ ఎంత డిప్లమాటిక్‌గా మాట్లాడిందో చూడండి. దేవుడు ఏకపక్షంగా మాట్లాడలేదు. స్వార్థంతో మాట్లాడలేదు. అన్న వస్త్రాలు కలిగిన వారుగా ఉండండి చాలు. ఎందుకంటే మీ చుట్టూ ఉన్న లోకం మీకు పట్టెడన్నం కూడా పెట్టదు. వారు దుష్టులు, వారు దౌర్భాగ్యులు. వారి కళ్ల ముందు మీరు చనిపోయినా మిమ్మల్ని పట్టించుకోరు. మిమ్మల్ని చంపైనా వారే బ్రతకాలనుకుంటారు. అందుకే అన్నము, వస్త్రము కలిగిన వారుగా బ్రతకండి. అద్దె ఇల్లయినా ఫరవాలేదు. నా జీవితకాలంలో నాకు కూడా ఒక సొంత ఇల్లు ఉండాలని మీరు అనుకోకండి. నా జీవిత కాలంలో నేను ఒక రోల్స్ రాయిస్ కారులో తిరగాలని అనుకోకండి మీరు. జీవించే కళను కలిగి మీరు జీవిస్తున్నప్పుడు మీకు ఏదైనా అవసరము అని దేవుడు అనుకుంటే అది ఆయన ఇస్తాడు. దేవుని కొరకే మనము దేనినైనా కోరుకోవాలి. దేవుని సేవలో ఉపయోగపడితేనే దేనినైనా మనము స్వీకరించాలి. మనకు బంగారం ఎందుకు? విస్తారమైన డబ్బు ఎందుకు? విలువైన వస్త్రాలెందుకు? లగ్జరీ లైఫ్ ఎందుకు? సంతుష్టి సహితమయిన భక్తి మాత్రమే మనకు కావాలి. అపొస్తలుడైన పౌలు, తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో, ధనాపేక్షకులందరి కొరకు జీవించే కళను ఈ విధంగా దేవుడు వ్రాయించాడు. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను

నష్టములోను నాశనములోను ముంచివేయును అన్నాడు చూడండి. ధనాన్ని సంపాదించుకుంటే నష్టం వస్తుందా? షేర్ మార్కెట్‌లో వేల, కోట్ల రూపాయలు సంపాదించుకుంటే నష్టం వస్తుందా? అవును. మీరు ఎంత ధనాన్ని సంపాదిస్తే అంత నష్టంలో మీరున్నట్టు. చివరకు అట్టివి ఏం చేస్తాయో తెలుసా? ఉరిలోను, శోధనలోను అవివేకయుక్తములు, హానికరములునైన అనేక దురాశలలో మిమ్మును పడేస్తాయి. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను ముంచేస్తాయి. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము. కీడుకు అదే మొదటి మెట్టు. వ్యభిచారానికైనా, ఉగ్రవాదానికైనా, ఆత్మహత్యలకైనా మూలం ఏమిటి చెప్పండి? ధనాశ, ధనాశ, ధనాశ! ఈ ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలం. దానిని ఆశించినవారు దేవుని యందుంచవలసిన విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. ఇటువంటి ధనాన్ని మీకు ఇమ్మని దేవునికి నేను ప్రార్థించాలా చెప్పండి? మీకు పరలోకం ఇమ్మని మాత్రమే నేను ప్రార్థించాలి. మీకు పరలోకం వచ్చేలా మంచి మాటలు చెప్పాలి. మిమ్మును పరలోకానికి ఆహ్వానించేలా మిమ్మును దేవుని కుమారులుగా నేను మలచాలి. జీవించే కళను మీకు నేర్పించాలి. ధనాపేక్ష మంచిది కాదు. ధనము మనిషి సృష్టించుకున్నది. అది కేవలం మన కనీస అవసరములు తీర్చుకోవడానికి మాత్రమే ఉపయోగపడాలి. కానీ, విస్తారమైన ధనము మనిషి పాలిట దేవునిగా మారిపోయింది. అదే మీకు దేవుడైతే, మీ అసలైన దేవుడు మీకు కనుమరుగైతే మీరు నిత్య నాశనానికి వెళ్ళిపోతారు. నాశనకరమైన పాతాళానికి జారిపోతారు.

ప్రియులారా! ఈ మాటలు సమాజానికి చాలా అవసరం. జీవించే ప్రతీ మనిషి ఈ మాటలు వినాలి. ఇది నిజమైన జీవించే కళ. ఈ పాపిష్టిలోకంలో ఉండిపోయి ఈ మాటలు చదువలేని, వినలేని, గ్రహించలేని వారు జీవించే కళ తెలియనట్టే ఉండిపోతారు. జీవించే కళ రానట్టే బ్రతుకుతారు. మరి వారందరినీ అలాగే విడచి పెట్టేద్దామా? అందుకే ఈ మాటలను అనేక మందికి చేరవేయండి. ఎక్కువమంది జీవించే కళను నేర్చుకుంటే, దాని వలన నాకు లాభమేమీ రాదని మీకు తెలుసు. ఇదిగో ఇప్పుడు మీరు నేర్చుకుంటారు, వెళ్ళి దేవుని కొరకు బ్రతుకుతారు. దాని వలన నాకు ఈ భూమిపై లాభము ఏమీ రాదు. పరలోకం తప్ప! నా దేవుని దగ్గర మంచి పేరు తప్ప ఇంకేమి నాకు రాదండి. నా దేవుని కళ్ళలో సంతోషాన్ని తప్ప, నేను ఇంకేమీ చూడాలనుకోవడం లేదు. అందుకే మీరు చేయగలిగిందంటూ ఒకటుంది. సమాజంలో ఎవడైతే జీవించే కళను కలిగి లేక చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాడో, పాతాళానికి జారిపోవడానికి సిద్ధంగా ఉన్నాడో, వాడికి ఈ మాటలు నేర్పించండి. లేదంటే అలాంటి వారిని నా దగ్గరకు తీసుకొని రండి. ప్రభువు చిత్తమైతే, అలాంటి వారికి జీవించే కళను చెప్పడానికి నేను ఎల్లప్పుడూ సర్వసిద్ధంగా ఉంటాను. ఈ జీవించే కళ గనుక అందరికి తెలిస్తే, ఆ దేశం ఎలా ఉంటుందో తెలుసా? అప్పుడు ఈ భూమి ఎలా ఉంటుందో తెలుసా? మన చుట్టూ ఉన్న సమాజం ఎలా ఉంటుందో తెలుసా? ఈ భాగానికి ముగింపులో మీరు ఆ మాటలను చూడాలి.

**లేవీయకాండము 26 : 3- 'మీరు నా కట్టడలను బట్టి నడుచుకొని నా ఆజ్ఞలను ఆచరించి వాటిని అనుసరించి ప్రవర్తించినయెడల, మీ వర్షాకాలములలో మీకు వర్షమిచ్చెదను. మీ భూమి పంటలనిచ్చును. మీ పొలములచెట్లు ఫలించును. మీ ద్రాక్షపండ్ల కాలము వరకు మీ నూర్పు సాగుచుండును. మీరు తృప్తిగా భుజించి మీ దేశములో నిర్భయముగా నివసించెదరు. ఆ దేశములో నేను మీకు క్షేమము కలుగజేసెదను.'** మీరు దేవుని జ్ఞానమును, ఈ జీవించే కళను కేవలం చదివితే సరిపోదు. విని శభాష్ అని చప్పట్లు కొట్టి వెళ్లిపోతే సరిపోదు. మీరు చదివి, దానిని అనుసరించాలి. దాని ప్రకారము మీరు ప్రవర్తించాలి. ఇప్పటి నుండి మీరు జీవించే కళ మారిపోవాలి. ఇప్పటివరకు మీరందరూ ధనాశపరులై ఉన్నారేమో! ఆడవారు, మగవారు, పిల్లలు, వృద్ధులు,... ఇలా అందరూ మీ జీవించే కళను మార్చుకోవాలి. ఇక మీదట మీకు ఉండవలసింది ధనాశ కాదు. దేవుని ఆశ. దేవుని ఆలోచనలను భూమి మీద మీరు పండించాలి. దేవుని జ్ఞానమును మీరు భూమిమీద జరిగించాలి. అలా జరిగిస్తే దేవుడు ఏమి చేస్తానన్నాడో చూడండి. భూమిమీదనున్న ప్రజలు జీవించే కళలోనికి వచ్చినప్పుడు, మీ వర్షాకాలములలో ఆయన మీకు వర్షమిచ్చును. అప్పుడప్పుడు కాలం కాని కాలంలో వర్షాలు పడుతున్నాయి. ఎందుకు? వర్షాకాలంలో రావలసిన మంచి వర్షం అకాలములో ఎందుకొచ్చింది? జీవించే కళ మనిషికి తెలియదు అందుకే అకాలపు వర్షం వచ్చింది. వాతావరణ శాఖను అడిగితే, మీకు వర్షం ఎప్పుడొస్తుందో చెబుతారంతే తప్ప, అది అప్పుడే ఎందుకొస్తుందో చెప్పలేరు. ఆకాశం మేఘావృతమై ఉందని, ఎక్కడో బంగాళాఖాతం

నుండి ఒక ఉప్పెనగా తుఫాను దూసుకు వచ్చేస్తుందని, అల్పపీడనము ఏర్పడి శ్రీలంక నుంచో, బర్మానుంచో బలమైన తుఫాను మన మీదికి వస్తోందని చెబుతారు. అలా ఎందుకొస్తున్నాయి డిసెంబర్‌లో? అలా ఎందుకొస్తున్నాయి జనవరిలో? ఇలా వాతావరణ శాఖను అడిగితే వారు ముక్కున వేలేసుకుంటారు. వారికి ఈ రహస్యం తెలియదు. వారు శాస్త్రవేత్తలు కావచ్చు. వాతావరణాన్ని పరిశోధన చేసిన వారు కావచ్చు. కానీ, వారికి ఆ వాతావరణమును సృష్టించిన దేవునిపై పరిశోధన లేదు. అందుకే దాని ఆయుపట్టును చెప్పలేకపోతున్నారు. నా చిన్ననాడు మనకు మూడు కాలాలుంటాయని నేర్చుకున్నాను. ఒకటి వేసవికాలం, రెండవది వర్షాకాలం, మూడవది చలికాలం. వేసవికాలంలో ఎండ ఉండాలి, వర్షాకాలంలో వర్షం ఉండాలి, చలికాలంలో చలి ఉండాలి. ఇవికూడా మంచివై యుండాలి. ఎండాకాలంలో వచ్చే ఎండ మంచిదైయుండాలి. మనము ఎండ వలన మాడిపోకూడదు, ఈ ఎండ వడదెబ్బకు అనేకమంది మృతి చెందకూడదు. కానీ, అలాగే జరుగుతుంది. ఎందుకు? వారికి జీవించే కళ తెలియదు. అకాలములో వర్షాలు పడుతున్నాయి. తుఫానులు భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. రైతులందరూ నష్టపోతున్నారు. ఎందుకు? మనుష్యులకు జీవించే కళ తెలియదు. గడ్డకట్టే చలితో చాలామంది చనిపోతున్నారు. ఎందుకు? జీవించే కళ తెలియదు. **లేవీయకాండము 26 : 3-** లో దేవుడు ఏమంటున్నాడో ఇప్పుడు చూడండి. మీరు జీవించే కళను నేర్చుకుని, మీరు దానిని అనుసరించి, దాని ప్రకారము ప్రవర్తించిన యెడల మీ వర్షాకాలములో మీకు వర్షమిచ్చెదను. మీ భూమి పంటలనిచ్చును. మీ పొలముల చెట్లు ఫలించును. మీ ద్రాక్షపండ్ల కాలము వరకు మీ నూర్పు సాగుచుండును. మీరు తృప్తిగా భుజించి, మీ దేశములో నిర్భయముగా నివసించెదరు. ఇప్పటివరకు యే దేశమైనా ఇలా చెప్పిందా? యే దేశమైనా ఈ మాటలను అంగీకరించిందా? లేదు. వర్షాలు పడకపోతే హెలీకాప్టర్‌లో వెళ్లి, మేఘాలలో రసాయనాలను జల్లి, కృత్రిమ వర్షము కురిపించాలి అనుకున్నారు తప్ప, తమ ప్రజలకు జీవించే కళను నేర్పించాలని ఎవ్వరూ అనుకోలేదు. ఇంతకన్నా పిచ్చోళ్ళు ఇంకెవరైనా ఉంటారా? వర్షమును కురిపించేది మేఘము కాదు బిడ్డా... దేవుడు! హి ఈజ్ మై గాడ్. ఈ సమాజానికి నాకు తెలిసిన దేవుడు తెలియదు. ఆనాడు యేసుక్రీస్తుకు తెలిసిన ఇదే దేవుడు యూదులకు తెలియలేదు. ఆనాడు దావీదుకు తెలిసిన ఇదే దేవుడు ఇశ్రాయేలీయులకు తెలియలేదు. ఆనాడు మోషేకు తెలిసిన ఇదే దేవుడు ఇశ్రాయేలీయులకు తెలియదు. ఆనాడు అబ్రాహాముకు తెలిసిన ఇదే దేవుడు సొదొమ గొమొఱ్ఱా ప్రాంతాలవారికి తెలియలేదు. నోవహుకు తెలిసిన ఇదే దేవుడు లోకమందు ఎవ్వరికీ తెలియలేదు.

ప్రియులారా! నాకు తెలిసిన దేవున్ని ఇదిగో ఈ రోజు సమాజంలో బహిరంగముగా చూపించి, మీ అందరికీ చెప్పాను. ఆ దేవున్ని తెలుసుకోండి. మీరు అనుసరించవలసినది డూప్లికేట్ దేవున్ని కాదు. నిజమైన మీ దేవున్ని తెలుసుకోండి. ఆ దేవుని కొరకు బ్రతకండి. మీ చుట్టూ ఉన్న సమాజాన్ని సస్యశ్యామలంగా మార్చండి. అనేకమందికి ఈ జీవించే కళను తెలియజేయండి. మిగిలిన భాగాలలో మనిషిని మార్చే మరిన్ని చక్కని సంగతులున్నాయి. చదవండి, గ్రహించండి. అనేకమందిని దేవునికి దగ్గర చేయండి.

-------x-------

## <u>ప్రశ్నలు</u>

1. దేవుని విప్లవాలు ఎలా ప్రారంభమవుతాయి? అవి ఎలా వర్ధిల్లుతాయి? వివరించండి.

2. ధనముయొక్క ప్రస్థానాన్ని వివరించండి.

3. మనిషితో ధనముకున్న సంబంధము ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చర్చించండి.

4. దేవుని స్థానమును ధనము ఆక్రమించడంలో మనిషి పాత్రను వివరించండి.

5. 'లంచగొండులు ఉండుట వలన దేశానికి కీడు' సహేతుకముగా వివరించండి.

6. మనిషి సంతుష్టి సహితమైన దైవభక్తిని ఎలా పొందగలడు? వివరించండి.

7. జీవించే కళను తెలుసుకొని జీవించుటవలన మనకు కలిగే లాభమేమిటి? చర్చించండి.

-------×-------

## జీవించే కళ ఎలా ? (నాలుగవ భాగము)

ప్రియ పాఠకులారా! జీవించే కళ ఎలా అనే ఒక మంచి అద్భుతమైన అంశముతో 4వ భాగములోనికి వచ్చాం. పరలోకమందున్న దేవుడు, తన ఆలోచనలో ఉన్నటువంటి సంగతులు, ఆయన ఎవరికి అనుగ్రహించాడో వారు చదువుచున్నటువంటి మాటలివి. దేవునికి భిన్నంగా కోట్లమంది మనుష్యులు ఉన్నా, దేవుని తరుపున ఒక్కడుంటే చాలు. ఆ ఒక్కనికి మరొకడు తోడు అయితే చాలు. ఆనాడు యేసుక్రీస్తు మరణానికి చేరువవుతున్నప్పుడు ఆయన వెంట ఒక్కడు కూడా లేడు. యేసును సిలువ వేసినప్పుడు, శిష్యులలో అగ్రగణ్యుడైన పేతురు కూడా యేసు ఎవరో నాకు తెలియదు అన్నాడు. యూదులు పెడుతున్నటువంటి కేకలు కంటే, రోమా సైనికులు కొడుతున్నటువంటి కొరడా దెబ్బలు కంటే, యేసు ఎవరో తెలియదు అన్న పేతురు మాటే ఆయనకు బాగా నొప్పి కలిగిస్తుంది. ఆయన దగ్గర వాక్యాన్ని విని, బాప్తిస్మమును పొంది, ఎన్నో అద్భుతములు, మహత్కార్యములు, సూచకక్రియలు, వారి కళ్ళార చూచి, అవసరమైతే నీకొరకు ప్రాణం పెడతాను అన్న శిష్యులే, ఆయన నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు, వెనకడుగు వేసిన సందర్భంలో యేసుక్రీస్తు ఎంతగా, తన హృదయంలో బాధపడి ఉంటాడో ఆలోచించండి. ఆ బాధ నిజంగా వర్ణనాతీతము. ఇప్పుడు అదే యేసుక్రీస్తు కొరకు బ్రతికే వారు ఈ భూమిమీద ఉన్నప్పుడు, లోకమంతా వారికి ఎదురు తిరిగినా, వారికి వ్యతిరేకంగా మారిపోయినా, ఒకరో ఇద్దరో ఆ దేవుని పక్షాన నిలువబడినప్పుడు చాలా సంతోషం కలుగుతుంది. హృదయానికి ఎంతో ధైర్యం వస్తుంది. చదువుచున్న వారందరికి వాక్యం సరిగ్గా వెళుతోందని నేను భావిస్తున్నాను. అందుకే అదే ఉత్సాహములో మనము ఈ నాలుగవ భాగములోనికి అడుగు పెట్టాం. మన దేవునిని మనము పరిశోధిద్దాం. ఇప్పటివరకు ప్రపంచములో ఏ మనిషీ, ఏ భాషలోనూ, ఏ దేశంలోనూ తెలుసుకొనని ఆ దేవునిని తెలుగుభాషలో మనము తెలుసుకుందాం. నిజమైన జీవించే కళను తెలుసుకుంటున్నందుకు మీరు చాలా గొప్పవారు.

ప్రపంచ మనుష్యులలో లేని ఈ జీవకళను దేవుని వాక్యములో వ్రాయబడిన చక్కని సంగతుల ద్వారా మనము నేర్చుకోవాలి. లేకపోతే ఈ మానవాళికి దిక్కులేదు. పాఠ్యపుస్తకాలు మనకు దిక్కు కావు. విద్యావేత్తలు మనకు దిక్కు కారు. శాస్త్రవేత్తలు మనకు దిక్కుకారు. ప్రభుత్వాధికారులు మనకు దిక్కుకాదు. మనము పుట్టినప్పటి నుండి ఈ సమాజం ఎలా ఉందో మీ అందరికి తెలుసు. నానాటికి దిగజారుతుందే తప్ప అది మెరుగు పడటం లేదు. కేవలం దేవుని వాక్యమే ఈ సమాజానికి చక్కని మందు. ప్రపంచంలో ఉన్న మనుష్యులలో ఉన్న ఎన్నో రుగ్మతలను దేవుని వాక్యం ఎత్తి చూపింది. ఇది మతం కాదు. 'క్రిష్టియానిటి ఈజ్ నాట్ ఎ రిలిజియన్' ఎవరైనా ఒకవేళ మిమ్మును తెలియక అమాయకత్వంతో, మీరు మతం పుచ్చుకున్నారా? అని అడిగితే కాదు అని చెప్పండి. నేను క్రీస్తును ధరించుకున్నాను అని చెప్పండి. ఇది మతం కాదు. మతంలో ఉండవలసిన సంగతులు బైబిల్‌లో లేవు. బైబిల్‌లో దేశాన్ని చక్కదిద్దే సంగతులు ఉన్నాయి. మనుష్యులను సన్మార్గంలో నడిపించే సంగతులు ఉన్నాయి. మానవాళి శ్రేయస్సును కోరుతున్న దేవుని మాటలు ఉన్నాయి. కాబట్టి ఇది మతం ఎలా అవుతుంది చెప్పండి? ఇది జీవించే కళను నేర్పించే పుస్తకం. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతా బైబిల్ లోనే ఉంది. ఒక మనిషి ఎలా జీవించాలి?, తల్లి గర్భంలోనుండి వచ్చిన వాడు మరల మట్టిలో కలసిపోయేంత వరకు తనకు దేవుడు ఇచ్చిన ఆయుష్కాలములో ప్రతిక్షణం ఎలా బ్రతకాలి అనే దానిని బైబిల్ నిర్దేశించింది. మరణించిన తరువాత మరో లోకాన్ని ఎలా సాధించాలో బైబిల్ మాత్రమే తెలియచేసింది. అందుకే ఇది జీవించే కళను కలిగిన పుస్తకం. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో కనిపిస్తున్న దేవుడు, జీవించే కళను కలిగిన దేవుడు. జీవించే కళను కలిగిన మనుష్యులే నిజమైన క్రైస్తవులు.

ప్రియులారా! మనచుట్టూ ఉన్న జీవులలో ప్రతి జీవిని గూర్చి మనము ఆలోచించినప్పుడు అందులో మగ, ఆడ రెండు జీవులూ ఉన్నాయి. ఎందుకు రెండు జీవులు? మగ జీవులు, ఆడజీవులు ఎందుకు? అని అడిగితే సంతాన ఉత్పత్తి జరగాలి అనే సమాధానము వస్తుంది. భూమిమీద వాటి యొక్క సంతానోత్పత్తి జరగాలి. అవి ఒకటిగా,

రెండుగా, మూడుగా మాత్రమే ఉండకూడదు. అవి తమ తమ జాతులతో ఈ భూమిని నింపించాలి. అందుకే ప్రతీ జీవిలోను దేవుడు మగదానిని, ఆడదానిని ప్రవేశపెట్టాడు. ప్రారంభంలో వాటిని కలిగించిన దేవుడు వాటిని ఆశీర్వదించి మీరందరూ ఈ భూమిమీద విస్తరించాలి అన్నాడు. ఆ తరువాత మనుష్యులను కూడా అదే క్రమంలో దేవుడు తయారుచేసాడు. ఇదంతా మీకు ఆదికాండము అనే ప్రారంభపు పుస్తకములో కనిపిస్తుంది. ఆదామును దేవుడు తయారు చేసాడు. మగవానిగా తయారు చేసాడు. ఆ తరువాత హవ్వను తయారుచేసాడు. ఆమెను స్త్రీగా తయారు చేసాడు. వారిద్దరిని సృష్టించిన దేవుడు, మీరిద్దరి కలయిక ద్వారా ఈ భూమిని నింపించండి అన్నాడు. **ఆదికాండము 1 : 28**వ వచనంలో దేవుని మనస్సు అదే. దేవుడు వారిని ఆశీర్వదించి మీరు ఫలించాలి, అభివృద్ధి నొందాలి, ఈ భూమిని నింపించాలి అన్నాడు. ఇలా నింపించే క్రమంలో మనుష్యులకు కొన్ని వావివరసలు నియమించబడ్డాయి. కనుక వాటి ప్రకారము, పురుషులు వారి యుక్త వయస్సుకు వచ్చిన తరువాత ఒక స్త్రీని వివాహం చేసుకోవాలి. స్త్రీ అయితే ఒక పురుషుని వివాహం చేసుకోవాలి. అప్పుడు వారిద్దరూ ఒక కుటుంబముగా ఏర్పడాలి. ఇదంతా పరలోకమందున్న దేవుని అనుగ్రహం. ఆయన విధించిన కట్టడ! దాని ప్రకారమే ఈ రోజు భూమిమీద ఉన్న మనుష్యులందరూ వివాహాలను జరిగించుకుంటున్నారు. దాని ప్రకారమే భూమిమీద ఉన్న స్త్రీ, పురుషులందరూ కుటుంబాలుగా ఏర్పడుతున్నారు. వివాహం చేసుకుంటున్న చాలా మంది వధూవరులకు కూడా ఈ రహస్యాలు తెలియవు. ఏదో మగవానిగా పుట్టాను, ఆడదానిగా పుట్టాను. నా ఇష్టం చేత నేను వివాహం చేసుకోవాలి. నా ఇష్టం చేత నేను కుటుంబంగా ఏర్పడుతున్నాను. నా ఇష్టం చేత నేను పిల్లలను కంటున్నాను. ఇలా అనుకుంటే పొరపాటు. భూమిని నింపించే క్రమంలో దేవుడు ఒక పద్ధతిని ప్రవేశపెట్టాడు. స్త్రీ, పురుషులు యుక్తవయస్సుకు వచ్చిన తరువాత వివాహం చేసుకోవాలి. ఆ వివాహం పవిత్రమైనది, ఘనమైనది. వారి ద్వారా దేవుని పిల్లలు భూమిమీదకి రావాలి. వారు నా పిల్లలు అన్నాడు దేవుడు. దేవుడు తన కుమారుడు, మొదటి మానవుడైన ఆదామును భూమి మీదకి రప్పించడానికి, అప్పటికి తల్లిదండ్రులు లేరు గనుక, ఒక మట్టి ఆకారాన్ని తయారుచేసి, అందులో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మగా మారాడు. అంటే ఆదాము అనే తన కుమారుని భూమి మీదకి రప్పించడానికి దేవుడు ఒక పద్ధతి ప్రవేశపెట్టాడు. ఆ తరువాత స్త్రీని రప్పించడానికి మరొక పద్ధతిని ఆయన ఎన్నుకున్నాడు. ఆత్మ పరంగా ఆమె కూడ దేవునికి కుమారుడు. ఈ భూమి తన పిల్లలచేత నింపబడాలంటే, ఆదాము కొరకు దేవుడు హవ్వను సృష్టించాలి. ఆమె ఆదాముకు ఒక సాటియైన సహాయముగా ఉండాలి. వారిద్దరి ద్వారా భూమిమీదకి అనేకమంది మనుష్యులు రావాలి. కనుక హవ్వ సృష్టింపబడింది. ఆ హవ్వ లోనికి మరల దేవుని ఆత్మ వెళ్ళింది. అప్పుడు హవ్వ మరల మనిషిగా మారింది. అప్పుడు వారిద్దరి కలయిక వలన కయీను, హేబెలు, షేతు,.. ఇంకా అనేక మంది మనుష్యులు భూమి మీద పుట్టారు. ఇలా మానవ జాతి ఈ భూమిమీద ప్రారంభమైంది. ఈ పుట్టుచున్న వారందరూ ఎవరనుకుంటున్నారు? వారందరూ దేవునికి పిల్లలు. వారందరూ ఆదాము, హవ్వల కష్టార్జితము లేక వారి స్వంత పిల్లలు అనుకోకండి. దేవుడు తన పిల్లలను వారి ద్వారా భూమి మీదకి తీసుకుని వచ్చాడు. భూమిమీద కయీను పుట్టడానికి, హేబెలు పుట్టడానికి ఆదాము హవ్వలిద్దరిని దేవుడు ఉపయోగించాడు. అంతేకానీ, తమ పిల్లలు వారిద్దరి యొక్క సృష్టి కాదు. దేవుని పిల్లలను తల్లిదండ్రుల ద్వారా ఈ భూమి మీదకు దేవుడు రప్పిస్తున్నాడు. వీరు కేవలం మధ్యవర్తులు మాత్రమే. ఎందుకు తల్లిదండ్రులను మధ్యవర్తులుగా పెట్టాడు? ఈ భూమిమీదకు పుట్టుకొచ్చే మనుష్యులందరినీ మట్టినుండి సృష్టించి, వారిని కూడా ఆదాము, హవ్వల వలె తయారు చేయవచ్చుకదా. వారిద్దరిలోనుండి మిగిలినవారు, ఆ మిగిలిన వారిలో నుండి తరువాతి వారు రావాలనే నియమము ఎందుకు చెప్పండి? ఎందుకంటే, మొదటి మనుష్యులైన ఆదాము హవ్వలు బాల్యము లేనివారు, తల్లిదండ్రుల పెంపకము లేనివారు. కానీ, తరువాత వచ్చేవారందరూ బాల్యం కలిగినవారు. వారందరూ తల్లిదండ్రుల పెంపకంలో, దేవుని యొక్క శిక్షణలో పెరగాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు దేవుని మాటలు వారి బాల్యదశ నుంచే నేర్పించాలి. అందుకే తన పిల్లలను తల్లిదండ్రుల ఒడిలో పెట్టాడు. ఇది మనిషి యొక్క పుట్టుకకు ప్రారంభం. మనుష్యులు స్త్రీ, పురుషులుగా ఎందుకున్నారు అన్న దానికి ఇది చరిత్ర.

**ఆదికాండము 2 : 24 'కాబట్టి పురుషుడు తన తండ్రిని, తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును. వారు ఏకశరీరమై యుందురు.'** తమ తల్లిని, తమ తండ్రిని విడచిన వారు ఏకశరీరమై ఉండేది ఎందుకు అంటే, ఒక కుటుంబముగా మారాలి అని అర్థం. ఇదంతా దేవుని పిల్లలు భూమిమీదకి రావడానికేనని మీరు అర్థం చేసుకోవాలి. అంతే తప్ప, స్త్రీ, పురుషులు కామాభిలాషలను తీర్చుకుంటారని మాత్రం కాదు. ఈ భాగములో మన సబ్జెక్టు ఇదే. మనుష్యులను స్త్రీ, పురుషులుగా దేవుడు ఎందుకు సృష్టించాడంటే, వారి వారి కామాభిలాషలను తీర్చుకుంటారని మాత్రం కాదు. ప్రకృతిలో ఏ జీవినైనా చూడండి. కామాభిలాషను కలిగి ఉందా? ఎందుకంటే, జీవించే కళ వాటికి తెలుసు. జంతువులు, చేపలు, పక్షులు, పురుగులు, వృక్షాలు... ఇలా దేనిలోను కామాభిలాష లేదు. ఒక ఆడజీవిగా, ఒక మగజీవిగా అవి ప్రత్యుత్పత్తి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయి. అవి శారీరకంగా కలుసుకుంటున్నాయి అంటే దానికి కారణం ఏమిటో తెలుసా? సంతానోత్పత్తిని జరిగించాలి. అదొక్కటే వాటికి తెలుసు. ఇది దేవుడు వాటికి నిర్ణయించిన విధి. కానీ, ఈ రోజు సమాజంలో ఉన్నటువంటి మనుష్యులను చూడండి. ఒక కుర్రాడికి ఇంకా మీసం కూడా మొలవదు, వాడికి అప్పుడే లవ్ కావాలి. చిన్న పిల్లల మధ్య ప్రేమలు. ఏమి అర్థమయింది వారికి? స్త్రీ, పురుషులను దేవుడు ఎందుకు కలిగించాడో తెలుసా? అసలు వివాహం యొక్క పరమార్థం ఏమిటో తెలుసా? దేవుని పిల్లలను భూమిమీదకి తీసుకొని వచ్చిన తరువాత వారిని దేవుని కొరకు పెంచాలనే ఈ జ్ఞానం మనుష్యులకు తెలుసా? తెలియదండి. తెలియకుండా అమాయకులుగా, అవివేకులుగా, మూర్ఖులుగా బ్రతుకుతున్నారు. సాయంత్రం చీకటి పడితే చాలు ప్రతీ ఒక్కడికీ కామాభిలాష. పట్టపగటి వేళ ప్రతీ ఒక్కడికీ కామాభిలాష. దీనిని గూర్చి బైబిల్‌లో దేవుడు మాట్లాడాడు. సమాజాన్ని చక్కదిద్దటానికి ఈ బైబిల్‌లో ఉన్న పవర్ ఏమిటో మీరు చూడాలి. ఇప్పటివరకు ప్రతీ ఒక్కరు బైబిల్‌ని మత పుస్తకం అనుకుంటున్నారు. కాదు. ఈ బైబిల్‌లో ఉన్న రియల్ ఎస్సెన్స్ బయటకు తీస్తే ప్రతీ ఒక్కడు ముక్కున వేలు వేసుకోవాలి. బైబిల్ అంటే అంత గొప్పది. మనిషి తన దేహాన్ని చూసుకుని, తన అవయవాలను చూసుకొని, కామాభిలాషయందు మునిగి తేలుతున్నాడు. 40యేళ్లు, 50 యేళ్లు, పైబడే సరికి మన చర్మమంతా ముడతలు పడిపోతుంది. 60 యేళ్లు దాటే సరికి పళ్లన్నీ ఊడిపోతాయి. 20 యేళ్లప్పుడు నువ్వు ఎంత అందమైన బొమ్మవి అయినా, తరువాత ముసలి బామ్మవే. 40, 50 యేళ్లకు తుక్కులా అయిపోతావు, ఆ తరువాత మట్టిలో కలిసిపోతావు. ఈ చిన్న జీవితకాలంలో దేవుని మాటలు గ్రహించక, 10 సం॥లు లేక 20 సం॥లు ఉండే నీ అందాన్ని చూసుకొని కామాభిలాషయందు నీ జీవితాన్ని గడుపుతున్నావా? ఈ ప్రపంచమంతా అదే దృష్టిలో ఉందా? అయితే వారికి జీవించే కళ తప్పనిసరిగా నేర్పించాలి. లేదండి, మనుష్యులందరూ చాలా బుద్ధిమంతులండి, మానవజాతి అంతా చాలా పవిత్రులమండి అనుకుంటున్నారా మీరు? అలా అయితే మీరు దైనందిన వార్తలు వింటూనే ఉన్నారు, చూస్తూనే ఉన్నారు. గత సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఒక భయంకరమైన కార్యక్రమం జరిగింది. ప్రపంచ దేశాలు అన్నిటికి ఆ వార్త తెలిసింది. అదేమిటంటే, 'నిర్భయ' కేసు. 2012 సం॥ డిసెంబర్, 16వ తేదీన రాత్రివేళ 'జ్యోతి సింగ్' అనే ఒక యువతి, తనకు కాబోయే భర్తతో కలసి, మన దేశ రాజధానియైన ఢిల్లీలో బస్ ప్రయాణం చేస్తుంది. అదే బస్‌లో ప్రయాణం చేస్తున్న అయిదుగురు వ్యక్తులకు ఆనాడు కామంతో కళ్లు మూసుకుపోయాయి. ఆ అయిదుగురు వ్యక్తులు బస్‌లో ఉన్న ఆమెను చెరచి, అతి కిరాతకంగా ఆమెపై దాడి చేసారు, చివరకు ఆ సంఘటన వలన ఆమె చనిపోయింది. స్త్రీ ఎవరో, పురుషుడు ఎవరో, వారెందుకు ఈ భూమిమీద సృష్టింపబడ్డారో, వారి వారి రూపాలలో ఎందుకు పుడుతున్నారో, దీని వెనుక ఉన్న పరమార్థం ఏమిటో ఇప్పటివరకు ఎవ్వరికీ తెలియదు. అందుకే 2012లో ఈ దారుణం జరిగినా, దాని వెనుక ఇలాంటివి మరెన్నో జరుగుతున్నా, ఇప్పటి వరకు ఎవ్వరూ చెప్పలేదు. తప్పు చేసిన మనుష్యులను శిక్షించమన్నారంతే తప్ప, దీని వెనుక ఏయే రహస్యాలు దాగి ఉన్నాయో ఏ ఒక్కరూ విశదీకరించలేకపోయారు. దేశమంతా అట్టుడికిపోయి, ఆ నేరస్తులకు ఉరిశిక్ష వేయమన్నారు. సరే, ఆ అఘాయిత్యం చేసినవారికి ఉరిశిక్ష అమలుచేసిన తరువాత, ఇలాంటి దౌర్జన్యాలు జరగటం ఆగిపోయాయి అనుకుంటున్నారా? ఇప్పుడు ఇంకా ఎక్కువ అయిపోయాయి. అవునండి. మన ప్రాంతాలలో చాలామంది ఇంకా అలాంటివారున్నారు. అవకాశం దొరకక మేకవన్నె పులిలా మన మధ్యనే తిరుగుతున్నారు. దాదాపుగా మనుష్యులందరూ అలాంటి వారే. ఒక స్త్రీని చెల్లెగా, తల్లిగా చూడగలరా ఎవరైనా? చూడలేరండి. ఒక

రైల్వేస్టేషన్‌లో, ఒక బస్‌స్టేషన్‌లో, ఒక సినిమా థియేటర్‌లో, ఒక పాఠశాలలో, ఒక కళాశాలలో, ఒక ఉద్యోగం చేస్తున్న ఆఫీసులో, ఒక పోలీస్‌స్టేషన్‌లో,.. ఎక్కడైనా, ఎవరినైనా చూపించండి. పరాయి స్త్రీని చూస్తే తల్లిలా, చెల్లిలా ఇతడు గౌరవిస్తాడండి అని ఖచ్చితంగా చెప్పమనండి చూద్దాం. అలా చెప్పగలిగిన ఏ పురుషుడయినా ఉన్నాడేమో చెప్పండి? లేడండి. ఎందుకో తెలుసా? వీరికి జీవించే కళ తెలియదు. ఈ రోజు పోలీసులు చేదించవలసిన ఎన్నో కేసులలో సగం మట్టుకు ఇలాంటివే. అక్రమ సంబంధాలు, యువతీ యువకుల మధ్య ప్రేమలు, స్త్రీలపై అఘాయిత్యాలు, అబలలపై అత్యాచారాలు,... ఇలాంటివి నేడు సర్వసాధారణం అయిపోయాయి. దీనికి పరిష్కారమును జీవించే కళ మాత్రమే చూపిస్తుంది. కామంతో కళ్ళు మూసుకుపోయిన ప్రపంచమిది. ఈ దేహాన్ని దేవుడు ఎందుకు ఇచ్చాడో తెలియని అవివేక సమాజమిది. ఇవన్నీ ఎవరు చెబుతారు చెప్పండి? ఎవరు చెప్పడానికైనా ముందు వాడికి తెలిసి ఉండాలి కదా. అందుకే జరిగిన కొన్ని యదార్థ సంఘటనలను మీకు పరిచయం చేస్తూ, దేవుడు చెప్పిన జీవించే కళను మీకు వివరిస్తున్నాను. బెంగుళూర్‌లో మరల మరొక కేసు జరిగింది. 'నర్సింగ్ విద్యార్థిని' బస్‌లో వెళుతుంది. ఆ బస్ డ్రైవర్ అత్యాచారం చేసి చంపేసాడు. మరొక సంఘటన కేరళ రాష్ట్రంలో జరిగింది. ఒక విద్యార్థిని సహచరుడే అనగా, తనతోపాటు ఉన్న స్నేహితుడే మిగిలిన వారితో కలిసి అత్యాచారం చేసి చంపేసాడు. ఆనాడు ఢిల్లీలో జరిగిన నిర్భయ సంఘటన తరువాత, ఈ రోజు దేశవ్యాప్తంగా నిర్భయ కేసులు ఎన్ని ఉన్నాయంటే, వేలకు వేలుగా ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు ఎవ్వరైనా సరైన జవాబును ఇవ్వగలిగారా?

*న్యూస్: బెంగుళూరులో దారుణం జరిగింది. 'సొలెబిలె' పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ 19 సం॥ల నర్సింగ్ విద్యార్థినిపై ఓ డ్రైవర్ అత్యాచారానికి ఒడిగట్టాడు. కాలేజ్ నుంచి నర్సింగ్ విద్యార్థిని ఇంటికి వెళ్ళేందుకు మినీ బస్‌లో బయలుదేరింది. యువతి ఒంటరిగా ఉండటాన్ని చూచిన మినీ బస్ డ్రైవర్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం 'వసాగుట్టె' ప్రాంతంలో ఆమెను పడేసి వెళ్ళాడు. అది గమనించిన స్థానికులు యువతిని హాస్పటల్‌కి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. దారుణం జరిగిన సమయంలో బస్‌లో డ్రైవర్ మరియు క్లీనర్ ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. అత్యాచారానికి ఒడిగట్టిన డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోనికి తీసుకొన్నారు. వారు ఉపయోగించిన వాహనాన్ని సీజ్ చేసారు.*

*న్యూస్: దేశ రాజధాని ఢిల్లీలో మహిళలకు రక్షణ లేకుండా పోతుంది. చాలాసార్లు ఇది ఋజువు అయ్యింది. నిర్భయ ఘటనతో తిరుగులేని ఆధారము దొరికింది. ఆ తరువాత సెక్యూరిటీ పెంచారు. నిర్భయ చట్టం తెచ్చారు. అయినా ఏదీ మారలేదు. తాజాగా మరో నిర్భయ మృగాళ్ళ కామ దాహానికి బలి అయ్యింది. ఢిల్లీలో నిర్భయను మరిచే లోపే మరో దారుణం జరిగింది. దుండగులు 30 సం॥ల మహిళపై పైసాచికంగా అత్యాచారం చేసి హత్యచేసారు. కాళ్ళు, చేతులు కట్టేసి ఉన్న ఆమె మృతదేహం 'వసంత కుంజు' ప్రాంతంలో ఉన్న నర్సరీలో నిన్న సాయంత్రం బయటపడింది. అత్యంత పాశవికంగా లైంగికదాడి చేయడమే కాకుండా, ఆమె మర్మాంగాలలో ఇనుప వస్తువులు గుచ్చారు. మెడ చుట్టూ గుడ్డ కట్టారు. డెడ్ బాడీని పోలీసులు పోస్టు మార్టంకి పంపించారు. రిపోర్ట్ వచ్చిన తరువాత ఆమె మరణానికి గల అసలు కారణాలు బయటకు వస్తాయంటున్నారు. ఘటనకు సంబంధించిన ముఖ్యమైన ఆధారాలు పోలీసులకు దొరికాయి. దీని వెనుక బాధితురాలు యొక్క స్నేహితులు ఉండి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.*

నేటి వరకు ఈ భారతావనిలో ఇలాంటి వార్తలు కోకొల్లలుగా ఉన్నాయి. సమయం లేదు గనుక కేవలం ఉదాహరణకు రెండు సంఘటనలను మీకు వివరించాను. ఇవన్నీ మన భారతదేశంలో జరుగుచున్నవే. విదేశాలనుంచి మనదేశంలో ఉన్న కొన్ని పర్యాటక ప్రాంతాలను చూడటానికి వచ్చిన విదేశీ యాత్రికులను కూడా చెరుస్తున్నారు. అప్పుడు వారు ఇక్కడికి రావడానికి భయపడుతున్నారు. భారతదేశం ఇలాంటిదా అనుకుంటున్నారు. భారతదేశంలో ఇలాంటి మృగాళ్ళున్నారా, వారు మగాళ్ళు కాదు మృగాళ్ళు అంటున్నారు. మృగములాంటి వారు! ఇంకా కొంతకాలం ముందుకు వెళితే 'నిత్యానంద స్వామి' మీ అందరికీ తెలిసే ఉండవచ్చు. దేవునిని సమాజానికి పరిచయం చేయవలసిన నిత్యానందలాంటి వారు కూడా కామాభిలాషలోనే బ్రతుకుచున్నారు. వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవరు

చూపిస్తారు సరైన మార్గం? ఎవరు చెబుతారు చెప్పండి? అలాంటివారే కామాభిలాషలో ఉన్నప్పుడు నాలాంటి వాడు ఉండటం పెద్ద లెక్కా అంటున్నాడు సామాన్య మానవుడు. మన రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన ఎన్.డి. తివారి మీకు గుర్తు ఉండి ఉండాలి. ఒక న్యూస్ ఛానెల్ యొక్క 'స్టింగ్ ఆపరేషన్' లో అతడు కూడా దొరికిపోయాడు. చరిత్రలో ఎంతోమంది కామాభిలాషతో తమ జీవించే కళను కోల్పోయినవారున్నారు. దేవుడిచ్చిన ఆయుష్కాలం చాలా చిన్నది. అందులోని ప్రతీ క్షణం గడుస్తుంటే మనకు భయము వస్తుంది. దేవుని పనిని మనము ఎలా ముగించాలి? అనేకమంది ఆత్మలను ఎలా రక్షించాలి? అని ప్రతీక్షణం గడుస్తున్నప్పుడు మనకు భయం ఉంటుంది. కానీ, అసలు ఇలాంటి వారికి సమయం ఎక్కడ ఉంటుందండి. మనిషి ఈ రోజు కామాభిలాషలో ఉంటున్నాడా? అందుకే ఈ ప్రేతకళ కలిగిన మనుష్యులందరికి నేను జీవకళను నేర్పించాలి. ఆడవారి వెనుక తిరగటం, మగవారి వెనుక తిరగటం జీవించే కళ కాదురా బిడ్డా. జీవించే కళ ఒక చీమకు ఉంది. ఆ జ్ఞానం మనిషికి లేదు. ఒక పక్షికి జీవించే కళ ఉంది, ఆ జ్ఞానం మనిషికి లేదు. అలాగని దేవుడు మనుష్యులను వివాహాలు చేసుకోవద్దన్నాడా? అలాగని దేవుడు జనులందరినీ సన్యాసులుగా బ్రతకమన్నాడా? లేదు. యుక్తవయస్సు వచ్చిన తరువాత ఒక మహాకార్యక్రమము, ఘనమైన కార్యక్రమముగా వివాహమును చేసుకోండి అన్నాడు. మీ భార్యకు, మీ భర్తకు బద్ధులై ఉండండి అన్నాడు. ఆయనను బట్టి ఒక కుటుంబము ఏర్పడాలి అన్నాడు. తన పిల్లలను భూమిపైకి తీసుకొని రమ్మన్నాడు. దేవుడు మీ సుఖాన్ని అడ్డుకోలేదు. కానీ, పైశాచిక ఆనందాన్ని పొందడానికి ఈ రోజు ప్రతీ మనిషి ఆలోచిస్తున్నాడు. అలాంటివాడు మృగం కంటే హీనమైనవాడు. అందుకే ఈ జీవితకాలంలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు వారు చెప్పిన ఒక చక్కని సంగతిని మీకు పరిచయం చేయాలి అనుకుంటున్నాను.

**మత్తయి సువార్త 5 : 27 'వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా- ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును.'** ధర్మశాస్త్రంలో వ్యభిచారము చేయవద్దని వ్రాయబడింది. అది అందరికీ తెలుసు. కానీ, ఇక్కడ యేసుక్రీస్తు జీవించే కళను నేర్పిస్తున్నాడు. ఆయన జనసమూహములకు ఏమి నేర్పిస్తున్నాడో చూడండి. నేను మీతో చెప్పునదేమనగా- ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును అన్నాడు. ఇప్పుడు మన చుట్టూ ఎంతమంది వ్యభిచారులుగా తిరుగుతున్నారో చెప్పండి? ఎంతమంది వ్యభిచారులు దేశంలో ఉన్నారో, ఈ ప్రపంచంలో ఉన్నారో చెప్పండి? యేసుక్రీస్తు మాట ప్రకారం ఈ చట్టం దృష్టికి, మన సెక్షన్స్ దృష్టికి, వ్యభిచారమంటే ఎప్పుడో తెలుసా? స్త్రీ, పురుషులిరువురు వ్యభిచారం చేసి, వారు రెడ్ హేండెడ్‌గా దొరికినప్పుడు వారిని పోలీసులు పట్టుకుంటే, దానికి ఆధారాలు, సాక్ష్యాలు ఉంటే అప్పుడు దానిని వ్యభిచారం అంటారు. వారిని వ్యభిచారులు అంటారు. కానీ, యేసుక్రీస్తు వ్యభిచారులను ఎప్పుడు పట్టుకుంటున్నాడో తెలుసా? దేవుడు స్త్రీ, పురుషులను ఎప్పుడు వ్యభిచారులుగా చిత్రీకరిస్తున్నాడో తెలుసా? ఒక స్త్రీని నీవు మోహపు చూపుతో చూసిన మరుక్షణమే నీవు నీ హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడవవుదువు. ఇలా ఎప్పుడైనా చెప్పిందా ఈ దేశం? ఇలా ఎప్పుడైనా చెప్పిందా ఈ ప్రపంచం? నిర్భయ సంఘటన జరిగిన తరువాత గాని, ఎంతోమంది అబలలపై జరుగుతున్న అత్యాచారాలు చూసిన తరువాత గాని, ఏనాడైనా ఇలాంటి స్టేట్‌మెంట్ ఇచ్చిందా? యువతీ యువకులారా మీరు మోహపు చూపును కలిగి ఉండకండి. మీ చూపును చెడుగా మార్చుకోకండి. మీకు దేవుడిచ్చిన ఆ రెండు కళ్లు, స్త్రీని మోహపు చూపుతో చూడడానికి కాదు; పురుషుని మోహపు చూపుతో చూడటానికి కాదు. మరి దేనికి? దేవుని వాక్యాన్ని చదవటానికి! భూమి మీద జీవించే కళను కలిగిన వాటిని చూడటానికి! దేవుని ఇష్టాన్ని నెరవేర్చటానికి మాత్రమే మన అవయవములను వినియోగించాలి. దీనినే జీవించే కళ నేర్పించింది. జీవించే కళ చెప్పేది ఇదే. ఇదంతా దుష్ట మృగములకు చెప్పండి. మనుష్యులు దుష్ట మృగములు, జంతువులు లాంటివారు. మోహపుచూపుతో తమ చెంత ఉన్న స్త్రీలను చూస్తున్నారు. అప్పుడే వారి హృదయమందు వారు వ్యభిచారులుగా మారుతున్నారు. చూసారా! ఎప్పుడు వ్యభిచారులు? మోహపుచూపుతో చూచినప్పుడే. ఎంతమంది వ్యభిచారులు? ప్రత్యక్షంగా, పరోక్షంగా స్త్రీలను, పురుషులను మోహపుచూపుతో చూచినవారందరూ వ్యభిచారుల లెక్కలలోనికి వచ్చేస్తున్నారు చూడండి. దేవుని లెక్కలలో చాలామంది ఇప్పుడు

వ్యభిచారులుగా మారిపోయారు. ఒక వేశ్యను, ఒక వ్యభిచారిని చూస్తే అలాంటి మోహపుచూపుతో చూసాడు అనుకోవచ్చు. కానీ ఈ రోజు ఎవరిని చూచినా మోహపు చూపుతోనే చూస్తున్నారు. ఎందుకు వీరి చూపు చెడిపోయింది? ఎందుకు వీరి కన్ను చెడిపోయింది? ప్రారంభ శతాబ్ధంలో యేసుక్రీస్తు దగ్గరకు ఆనాటి యూదులు వ్యభిచారమందు పట్టబడిన ఒక స్త్రీని తీసుకొని వచ్చారు. ఆ రోజున్న యూద సమాజం, మనుష్యులలో నీతిమంతులని పిలిపించుకుంటున్నవారు ఒక వ్యభిచారిణిని ఆయన యొద్దకు తీసుకునివచ్చి, ఆమెను రాళ్ళతో కొట్టమంటావా అని అడుగుతున్నారు. కానీ, ఆనాడు యేసుక్రీస్తు వారికి ఏమి నేర్పించాడో తెలుసా? చూడండి.

**యోహాను సువార్త 8 : 3- 'శాస్త్రులును పరిసయ్యులును, వ్యభిచారమందు పట్టబడిన యొక స్త్రీని తోడుకొని వచ్చి ఆమెను మధ్య నిలువబెట్టి - బోధకుడా , యీ స్త్రీ వ్యభిచారము చేయుచుండగా పట్టబడెను. అట్టివారిని రాళ్లు రువ్వి చంపవలెనని ధర్మశాస్త్రములో మోషే మన కాజ్ఞాపించెను గదా. అయినను నీవేమి చెప్పుచున్నావని ఆయన నడిగిరి.** యేసుక్రీస్తు యొద్దకు ఆనాడు వ్యభిచారమందు పట్టబడిన యొక స్త్రీని తీసుకొనివచ్చి నిలువబెట్టారు. అప్పుడు యేసుక్రీస్తు పలుకుచున్న మాటలు చూడండి. **యోహాను సువార్త 8 : 7 'వారాయనను పట్టువదలక అడుగుచుండగా ఆయన తలయెత్తి చూచి మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చునని వారితో చెప్పి మరల వంగి నేల మీద వ్రాయుచుండెను. వారామాట విని, పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు ఒకని వెంట ఒకడు బయటికి వెళ్లిరి. యేసు ఒక్కడే మిగిలెను. ఆ స్త్రీ మధ్యను నిలువబడియుండెను.'** ఈ సందర్భంలో అక్కడ రెండు వర్గాలకు చెందిన మనుష్యులున్నారు. ఒకటి జీవించేకళ తెలిసిన యేసుక్రీస్తు, రెండవది జీవించే కళ తెలియని శాస్త్రులును పరిసయ్యులు మరియు వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీ. జీవించే కళ తెలిసిన యేసు అడిగిన ప్రశ్నకు, జీవించే కళ తెలియని వారంతా సమాధానం చెప్పలేక అక్కడ వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీని విడిచిపెట్టి వెళ్లిపోయారు. వారు వారియందు పాపము కలిగియున్నవారు గనుక రాయి వేయకుండా వెళ్ళిపోయారు. యేసు ఒక్కడే మిగిలియున్నాడు. వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీ అక్కడ ఉంది. అప్పుడు ఆయన ఎలా మాటలాడుతున్నాడో చూడండి. అప్పుడు ఆయన పలుకులు ఎలా ఉన్నాయో చూడండి. ఈ ప్రపంచంలో పూర్తిగా జీవించే కళ తెలిసినవాడు మొట్టమొదట యేసుక్రీస్తు మాత్రమే. ఇక ప్రపంచంలో ఎవ్వడూ లేడు. ఆయనకు మాత్రమే జీవించే కళ తెలుసు.

**యోహాను సువార్త 8 : 10- 'యేసు తలయెత్తి చూచి, అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా అని అడిగినప్పుడు, ఆమె లేదు ప్రభువా అనెను. అందుకు యేసు, నేనును నీకు శిక్షవిధింపను. నీవు వెళ్ళి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను.'** వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీని చూచి, నీవు నాకు జన్మనిచ్చిన తల్లిలాంటిదానివి అని యేసుక్రీస్తు అన్నాడు. ఈ భూమిపై ప్రతి స్త్రీ తనకు జన్మనిచ్చిన తల్లిలాంటిది అంటున్నాడాయన. ఒక స్త్రీని ఆయన చూచే చూపు ఎలాంటిదో చూడండి! అమ్మా! వారు ఎక్కడ ఉన్నారు? అనే పిలుపు చూడండి. ఎవరును నీకు శిక్షవిధింపలేదా అని అడిగినప్పుడు ఆమె లేదు ప్రభువా అని చెప్పి ఆశ్చర్యపోయింది. ఆమె కూడా ఆయనను ప్రభువా అని పిలువగలుగుతుంది. శాస్త్రులు, పరిసయ్యులందరూ తన జుట్టు పట్టుకొని ఈడ్చుకుని వచ్చి తనను రాళ్లచేత కొట్టి చంపాలనుకున్నారు. తన పాపానికి శిక్ష విధించాలనుకున్నారు. కానీ, యేసు ఆమెను ఆ పరిస్థితులలో తనను రక్షించటమే కాక, ఆమెను చూచి అమ్మా! అంటున్నాడు. నిజంగా ఈయనలో జీవించే కళ, ఎదుటివారిని జీవింప చేసే కళ ఉందని తెలుసుకుంది. ఈ భూమి మీద ఆ స్త్రీని ఇప్పటివరకు ఎవ్వరూ అమ్మా అని పిలువలేదు. ఎందుకంటే, తాను వ్యభిచారము చేయుచున్న స్త్రీ అని ప్రతీ ఒక్కరికి తన మీద చులకన చూపు. చిన్నవాడు మొదలుకొని పెద్దవారి వరకు ప్రతీ ఒక్కడు తనను మోహపు చూపుతోనే చూసాడు. ఆ విషయం ఆమెకు తెలుసు. కాని యేసుక్రీస్తు అమ్మా అని పిలుస్తున్నాడు. అప్పుడే ఆమె మనసు మారిపోయింది. ఆ ఒక్కమాటతో ఆమెలో పరివర్తన వచ్చింది. ఎవరును శిక్ష విధించలేదా? నేను కూడా నీకు శిక్ష విధింపనమ్మా! నీవు ఇక మీదట వెళ్లి పాపం చేయవద్దమ్మా, నీవు జీవించే కళను తెలుసుకోవాలమ్మా, నీవు భూమి మీదకి వచ్చింది దేవుని కొరకేగాని నీ శరీరాన్ని అమ్ముకోవటానికి కాదు. అనేకమందిని పాడుచేయటానికి కాదు అని నేర్పించినప్పుడు ఆమె పరివర్తన చెందింది. జీవించే కళ ను తెలుసుకుంది. 'ఎయిడ్స్' అనే భయంకరమైన మహమ్మారి ఈ ప్రపంచంలోనికి ఎలా వచ్చిందో, ఎంతమందిని తీసుకొని వెళ్లిపోయిందో ఇప్పుడు చెప్పండి. ఈ జీవించే

కళ తెలియకే అనేకమందిని 'ఎయిడ్స్' బలిగొంది. దేవుడు ఊరుకుంటాడు అనుకుంటున్నారా? జారత్వం చేసే వారిని దేవుడు ఊరుకుంటాడు అనుకుంటున్నారా? అందుకే భయంకరమైన తెగులును ఆయన ప్రవేశపెట్టాడు. ఎయిడ్స్‌కు ఇప్పటివరకు మందు లేదు. నివారణ ఒక్కటే మార్గం అంటున్నారు జీవించే కళ తెలియని అమాయకులు. జీవించే కళ తెలియ చెప్పలేని అవివేకులు ఏమంటున్నారో తెలుసా? జారత్వాన్ని చేయడానికి వెళ్లేముందు మీ కూడా 'కండోమ్' పట్టుకొని వెళ్లమంటున్నారు. అవసరమైతే, ఆ కండోమ్స్‌ను ఉచితముగా కూడా సరఫరా చేస్తున్నారు. ఎంత దౌర్భాగ్యులు వీరు? నీవు చెడిపోయిన చూపు కలిగి ఉండకూడదని, మోహపు చూపుతో ఏ స్త్రీని చూడకూడదని ఎవడైనా చెప్పాడా? లేదు. కండోమ్ పట్టుకొని వెళ్లండి అంటున్నాడు. అంటే ఏమి చేయమంటున్నారు? తప్పు చేయమంటున్నారా, పాపాన్ని చేయమంటున్నారా? నిలదీసిందా ఈ లోకం? లేదు. ఎవరు బాగు చేస్తారండి ఈ సమాజాన్ని? మీకు ఇవ్వబడిన రెండు కళ్లు పవిత్రమైనవి. వాటితో మోహపు చూపు చూడకూడదు. మరొక సందర్భాన్ని చూడండి. యేసుక్రీస్తు జీవించే కళను ఎలా నేర్పిస్తున్నాడో గ్రహించండి.

**యోహాను సువార్త 4 : 16- 'యేసు- నీవు వెళ్ళి నీ పెనిమిటిని పిలుచుకొని యిక్కడికి రమ్మని ఆమెతో చెప్పెను. ఆ స్త్రీ నాకు పెనిమిటి లేడనగా, యేసు ఆమెతో నాకు పెనిమిటి లేడని నీవు చెప్పిన మాట సరియే. నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి. ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటి కాడు. సత్యమే చెప్పితివనెను. అప్పుడా స్త్రీ అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను. మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరిగాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా యేసు ఆమెతో ఇట్లనెను. అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది.'** అని తన సంభాషనను కొనసాగిస్తున్నాడు. ఇది యేసుక్రీస్తు సమరయి స్త్రీతో మాట్లాడుతున్న మంచి సందర్భం. ఈ సమరయి స్త్రీ ఎవరు? ఈమె అయిదుగురు భర్తలను కలిగియున్న స్త్రీ. ఈమె కూడా వ్యభిచారిణిలాంటిది. అప్పుడు యేసుక్రీస్తు సమరయి స్త్రీతో ఎలా మాట్లాడుతున్నాడో చూడండి. ఆమెను ఎలా పిలుస్తున్నాడో చూడండి. అమ్మా! ఒక కాలము వచ్చుచున్నది. జీవించే కళ తెలిసిన నేను, దేవుని కుమారుడినైన నేను, ఈ సమరయి స్త్రీకి బోధ చేయడం ఏమిటి? అయిదుగురు పెనిమిటిలు ఉన్న ఈమెతో నేను మాట్లాడటం ఏమిటి? అనుకోలేదండి. యేసుక్రీస్తు జీవించే కళ తెలిసినవాడు గనుక ప్రతీ ఒక్కరిని తన తల్లిగా, తన చెల్లిగా చూస్తున్నాడు. దానినే మనకు నేర్పించాడు. కేవలం నీతులు చెప్పడం కాదు, ఆయన దానిని జరిగించి చూపించాడు. అందుకే, ఆయన సమరయి స్త్రీతో ఎలా మాట్లాడుతున్నాడో చూడండి. అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమున ఈ పర్వతము మీదనైనను, కొండలమీదనైనను, మీరు అనుకున్న స్థలములోనైనను దేవుని ఆరాధింపరు. దేవునిని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించే కాలము వచ్చుచున్నది. అని ఆరాధనను గూర్చి ఆమెకు చెప్పుతున్నాడు. అప్పుడు ఆమె పరివర్తన చెందింది. జీవ జలముల రుచిని చూచిన ఆమె, తన కుండను అక్కడే విడిచిపెట్టి వెళ్లి తన గ్రామములో ఉన్న మనుష్యులందరికి దేవుని వాక్యాన్ని చెప్పాలనే ఉద్దేశ్యంతో తాను బావి దగ్గరకు ఎందుకు వచ్చిందో ఆ పనిని విడిచిపెట్టి, వెంటనే దేవుని పనిలోనికి వెళ్లిపోయింది. ఎందుకంటే ఆమెను యేసుక్రీస్తు మార్చాడు. ఈ సమాజానికి జీవించే కళ తెలియక ప్రతీ ఒక్కరు వ్యర్థంగానే బ్రతుకుచున్నారు. అందరిదీ మోహపు చూపు. ప్రతిచోట మోహపు చూపే! సినిమా వాల్‌పోస్టర్ చూస్తే అందులో మోహపు చూపు. కేవలం పురుషులు మాత్రమే అనుకుంటున్నారా? మరోప్రక్క స్త్రీలను గూర్చి ఆలోచిస్తే వీరుకూడా మోహపు చూపులతో ఉంటున్నారు. **మత్తయి సువార్త 5:27-** లో దేవుడు పురుషులను గూర్చి వ్రాయించాడు. స్త్రీలను గూర్చి వ్రాయించలేదు అనుకోకండి. ప్రతీ ఒక్కరిని గూర్చి ఆయన మాట్లాడుతున్నాడు. స్త్రీలు కూడా మోహపు చూపును కలిగి ఉండకూడదు. పురుషుడు అయినా స్త్రీ అయినా ఎవ్వరూ మోహపు చూపును కలిగి ఉండకూడదు. స్త్రీ యొక్క అలంకరణ ఎలా ఉండాలో తెలుసా? నిన్ను చూడగానే ఒక తల్లే గుర్తుకు రావాలి. నిన్ను చూడగానే తన చెల్లెలే గుర్తుకురావాలి. అంతేకాని, నీవేదో మోహపు చూపును కలిగించే వస్త్ర అలంకరణ వేసుకోకూడదు. ఓ క్రైస్తవ సోదరీ, ఈ ప్రపంచంలో జీవించే కళను నీతో ప్రారంభించు. ఒక జీవించే కళ కలిగిన స్త్రీ ఈ భూమిమీద ఎలా ఉండాలో నీవే చూపించు. అమ్మా, చెల్లీ, మీరు మారండి. క్రైస్తవేతరులుగా ఉన్న వారికి నేను చెప్పినా వారు వినరు. మీరు వింటారు గనుక మొదట నేను మీకు చెబుతున్నాను. జీవించే కళను మీరు ప్రారంభించండి. మీరే తెలియజేయండి. 'మదర్‌థెరిస్సా'

ని చూస్తే ఎవడైనా మోహపు చూపుతో చూస్తాడా? చూడడు. ఎందుకు చూడడు? అది ఆమె అలంకరణ. ఆమెను చూడగానే దైవభావం కలుగుతుంది. ఆమెను చూడగానే సేవాభావం గుర్తొస్తుంది. మీలో అలాంటివి కనిపిస్తున్నాయా? ఫలానా ఆమెను చూడగానే దేవుని వాక్యం చెప్పే స్త్రీ మూర్తిలా, తల్లిలా కనిపిస్తుంది. నా చెల్లిలా, నా సోదరిలా కనిపిస్తుందని అందరూ అనేలా మీ ప్రవర్తన ఉండాలి. వాక్యము అనేటటువంటి అలంకరణ, నీతి అనేటటువంటి రూపం మీలో ఉన్నాయా.? ఉండాలి. ఈ రోజు మీడియా అంతా పాడైపోయింది. ఈ పనికిమాలిన మీడియా గొప్పది అనుకుంటున్నారా? 'డర్టీ పిక్చర్స్' వారే చూపిస్తున్నారు. ఇది చెత్త పిక్చర్, ఇది చెత్త సినిమా అని టైటిల్ పెడుతున్నారు. ఆ సినిమాలో ఎవరుంటారు. మీరు మంచి చూపుతో చూడలేని వారుంటారు. ఇందులో హీరోయిన్‌ని, ఇందులో నటించేవారిని, ఇందులో ఉన్న హావభావాలను, వాల్ పోస్టర్స్‌లో మీకు చూపిస్తే మీ చూపు మారిపోతుంది. అలాంటి వారిని ఈ మీడియాలో చూపిస్తున్నారు. ఈ రోజు మీడియా ప్రజల కళ్ళముందు అలాంటి వాటినే ప్రదర్శిస్తుంది. దేశంలో ఉన్న యువతీ యువకులను ఈ మీడియా పాడు చేస్తుంది. ఈ మధ్య ప్రతీ సినిమాలో ఏమి ఉండాలట? ఐటమ్ సాంగ్ ఉండాలంట. లేకపోతే సినిమా నడవదట. ఏమిటి, ఈ ఐటమ్ సాంగ్ ఇంతకీ? ఒక స్త్రీకి విచిత్రమైన వస్త్రధారణ, రంగు రంగుల చెమికీల వస్త్రధారణ, చిన్ని చిన్ని వస్త్రాలతో వస్త్రధారణ, వేసి నాట్యం చేయిస్తారు. ఎందుకు? నీ చూపును పాడుచేయడానికి మాత్రమే సుమా. జాగ్రత్త! ఈ ప్రపంచంలో ఉన్న దుష్టులు నిన్ను పాడు చేస్తున్నారు. వీరందరూ జీవించే కళను తెలియనివారు. ఏదో నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి మానవజాతిని నశింపచేస్తున్నారు వీరందరూ. మంచి సామాజిక చిత్రాన్ని ఎవరైన తీయగలుగుతున్నారా? హీరోకు అంత దమ్ము లేదా? వాడి నటన చూచి ఎవ్వరూ డబ్బులివ్వరా? వాడి నటన చూచి ఎవరూ టిక్కెట్ కొనుక్కోరా? వాడి నటన వల్ల ఎవ్వరూ సినిమా చూడరా? ఐటెమ్ సాంగ్ లేకపోతే ఆ సినిమా 100 రోజులు ఆడదా? హీరో, దర్శక, నిర్మాతలకు అదే భయం. అందుకే ఒక ఐటమ్ గర్ల్‌ని తెప్పించుకుంటున్నారు. వారితో సాంగ్ చేయించి, ఈ సమాజాన్ని పాడు చేస్తున్నారు. వాడు ఎంత గొప్ప దర్శకుడైనా, నిర్మాతైనా, హీరో అయినా, వారందరూ నా ముందు జీరో! ఐ డోంట్ కేర్. ఈ సమాజంలోనికి ఇలాంటి చిత్రాలను విడుదల చేయమని అసలు ఈ 'సెన్సార్ బోర్డు' ఎలా సంతకం పెడుతోంది చెప్పండి. ప్రజలను పాడు చేయడానికి అనుమతులు ఎలా ఇస్తున్నారు చెప్పండి? వీటివల్లనే కదా ఈ రోజు ఇంతమంది పాడవుతున్నది. యేసుక్రీస్తు మాటలను పట్టించుకోనివారు, ప్రకటించనివారు ఇలాంటి చెడ్డవాటిని మనమధ్య చూపిస్తూ ప్రతీ ఒక్కరిని, ముక్కుపచ్చలారని స్థితిలోనే పాడుచేస్తున్నారండి. అందుకే మనుష్యులు తమ చిన్ననాడే పాడైపోతున్నారండి. జనులు ఎందుకు ఇలా మారిపోతున్నారు? వారి చూపు ఎందుకు ఇలా మారిపోతుంది? ఈ రోజు ఎక్కడ చూచినా అలాంటివారేనండి. ప్రియులారా! అందుకే బైబిల్‌లో మీ అలంకరణ చక్కగా ఉండాలి అన్నాడు. మీరు ఎలా జీవించాలో, ఎలా అలంకరించుకోవాలో కూడా దేవుడు తన గ్రంథంలో వ్రాసాడు. ఎందుకంటే ఇది జీవించే కళ.

**పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 1- 'అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడివలన రాబట్టబడవచ్చును. జడలు అల్లుకొనుటయు, బంగారునగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువగలది.'** మీ ప్రవర్తన దైవ సంబంధమైనదైతే, మీ ప్రవర్తనను చూచి, మారని మీ భర్తలు మారిపోతారు అంటున్నాడు దేవుడు. ఒక స్త్రీ ఎలాంటి అలంకారమును కలిగి ఉండాలి? వెలుపటి అలంకారాన్ని దేవుడు ప్రోత్సహించలేదు. వెలుపటి అలంకారాన్ని కలిగి ఉండకూడదన్నాడు దేవుడు. జడలు అల్లుకొంటున్నారు. అది ఎవరి కోసం? నీవు జడలు, జడలుగా నీ తలను అల్లుకోకపోతే నీకు బ్రతుకు గడవదా. నీవు జీవించలేవా? నీ అలంకరణ ఎవరికి చూపించడానికి? ఎవరి కన్నులు పాడుచేయటానికి? నీవు ఒక వేళ అందంగా తయారు అవుతున్నావు అంటే, బయట ఎవడో ఒకడిచేత వాని హృదయమందు వ్యభిచరించబడుతున్నావు జాగ్రత్త. అప్పుడు నీవు కూడా వ్యభిచారిణిగా మారిపోతున్నావు. ఇదే జీవించే కళలో టాప్ సీక్రెట్. ఎవరో నన్ను మోహపు చూపుతో చూస్తున్నారు, వారు వారి హృదయమందు వ్యభిచరిస్తున్నారు,

కానీ నేను మాత్రం పవిత్రురాలినే అనుకుంటున్నారా? మీరు అలాంటి అవకాశం ఇచ్చారు గనుక మిమ్మల్ని కూడా ఆ జాబితాలోకి దేవుడు చేర్చాడు. వ్యభిచారం ఎప్పుడూ ఒక్కడితో అవ్వదు. జారత్వం జరగాలంటే, ఇద్దరూ ఉండాలి. కనుక ఒకడు నీ అలంకరణను బట్టి, మోహపు చూపుతో తన హృదయమందు వ్యభిచారం చేస్తున్నాడంటే, అది నీతోనే చేస్తున్నాడు. కనుక నీవు కూడా అందులోనికి వచ్చేస్తావు. ఈ రోజు సినీ హీరోయిన్స్ అందరూ ఎందులోనికి వచ్చేస్తారో ఆలోచించండి? చిన్న చిన్న దుస్తులతో తిరుగుతున్న వారు, ఎన్నో కోట్లమంది కామాంధుల హృదయములలో వ్యభిచరించబడుతున్నారు. అసలు యువతీ యువకులను, ఈ రోజు బ్రతుకుచున్న ప్రతి మనుషిని పాడుచేయడానికి వీరు ఎవరు? వీరికి ఆ హక్కులేదు. బ్రతికితే, జీవిస్తే, దేవుని మాటలే చెప్పాలి. లేకపోతే గప్ చుప్. చేత కాకపోతే ఇంటిలో కూర్చో. నీవు బయటకు వచ్చావంటే నీవు అందరికీ కనిపిస్తున్నావంటే, నీవు దేవుని కొరకు మాట్లాడు. లేకపోతే నీవు అసలు బయటకే రాకూడదు. నీవు ఎవరివైనా సరే, నీవు ఎంత గొప్పవాడివైనా సరే, నీవు బ్రతకాల్సింది దేవుని కొరకు, సమాజాన్ని బ్రతికించడం కొరకు! అంతేగాని సమాజాన్ని పాడుచేసి డబ్బు సంపాదించడం కొరకు మాత్రం కాదు. ఏ విధముగానైనా పేరు ప్రఖ్యాతలు సంపాదించడం కొరకు మాత్రం కాదు. జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను. అలాంటివారు ఉన్నారంటారా? అలాంటి వారే గనుక ఉంటే మోహపుచూపుతో చూసేవారు ఉండరు. అదే దేవుని దృష్టికి మిగుల విలువైనది అన్నాడు. మీరూ అతిగా అలంకరించుకోవటం వల్ల ఎవరికి ఉపయోగం చెప్పండి? నా ప్రియ సోదరీమణులారా, నా ప్రియసోదరులారా మీరు అతిగా అలంకరించుకోవడం వల్ల ఎవరికి ఉపయోగం చెప్పండి. మహా అయితే మీ శరీరపు కోరికలు తీర్చుకుంటారేమో. మీ శరీరము కోరుకున్న దానిని క్షణకాలం తీర్చుకుంటారేమో తప్ప, మీ ఆత్మ నాశనానికి వెళ్ళడానికి అదే ప్రారంభం. మీరు నిజంగా ఆ అగ్నిలోనికి వెళ్లిపోతే, హాహాకారాలు చేస్తుంటే అప్పుడు మిమ్ము్మను ఎవరు రక్షిస్తారు చెప్పండి. ఈ భూమి మీద చిన్న జీవితకాలంలో మీరు మీ శరీరాన్ని నిగ్రహించుకోవాలి. మీకు దేవుడు ఈ అవయవాలను జీవించే కళ కొరకు ఇచ్చాడు. ఈ శరీరం ఎందుకంటే, ఆయన సేవను జరిగించడానికి మాత్రమే. ఆయన కొరకు మీరు బ్రతకడానికి మాత్రమే. జీవించే కళను కలిగి ఉండటానికి మాత్రమే. అంతే తప్ప మీ ఇష్టాన్ని మీరు నెరవేర్చుకోవటానికి మాత్రం కాదు.

**తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 2 : 9 'మరియు స్త్రీలును అణుకువయు, స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగుమాత్రపు వస్త్రముల చేతనేగాని జడలతోనైనను బంగారముతోనైనను ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తి గలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్క్రియల చేత తమ్మును తాము అలంకరించుకొనవలెను.'** తగుమాత్రపు వస్త్రములు అంటే మిమ్ము్మను చూసిన వెంటనే ఒక సోదరే గుర్తుకురావాలి. ఒక తల్లే గుర్తుకు రావాలి. అంతే తప్ప, మరి యే ఆలోచనా, ఎవ్వరికీ గుర్తుకు రాకూడదు. అలాంటి వారుగా మీరు ఉండాలి. దీనిని బైబిల్ నిర్ధేశించింది. మీ జీవిత కళను బైబిల్ ఆదేశించింది. ఓ పురుషుడా, ఓ స్త్రీ, మీ అలంకరణ ఎలా ఉండాలో చూడండి. నా యొద్ద దేవుని పనిని జరిగించే కళాకారులు ఉన్నారు. దేవుని సాంస్కృతిక కార్యక్రమాలను జరిగిస్తున్న కళాకారులు నా చెంత ఉన్నారు. వారిలో స్త్రీలు, పురుషులు మరియు చిన్నపిల్లలు ఉన్నారు. వారిలో ఏ ఒక్కరైనా విచిత్రమైన వేషదారణతో ఉన్నారేమో చూడండి. వారందరూ దేవుని కొరకు తమ అర్పణలను ఇచ్చేవారు. వారందరూ తమకు తాముగా దేవుని సేవ కొరకు అర్పించుకొనేవారు. వారి జీవితాలను ప్రజలకు అంకితం చేసినవారు. అందుకే వారి ఇళ్ళను విడిచిపెట్టి, వారి కుటుంబాలను విడిచిపెట్టి వారి ఊరు విడిచిపెట్టి సర్వలోకానికీ నాతో పాటు వచ్చి ప్రతిరోజు దేవుని కొరకు సేవ చేస్తున్నారు. దేవుడు కోరుకున్న కళ అదే. మీరు అనుకొన్న అలంకారం వారిలో ఉండకూడదు. అది దేవునికి అసహ్యకరమైనది. అలాంటి వాటితో వారు అలంకరించుకొనక దైవభక్తి గలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్క్రియల చేత తమ్మును తాము అలంకరించుకొంటున్నారు.

పరాయివారు మిమ్ము్మను చూడగానే ఈమె దైవభక్తి కలిగిన స్త్రీ, ఈయన దైవభక్తి కలిగిన పురుషుడు

అనిపించుకోవాలి. ఇలాంటివారు ఈ భారతదేశంలో ఉంటే నిర్భయ సంఘటన జరుగుతుందా చెప్పండి? ప్రతి ఒక్కరికి వాక్యాన్ని నేర్పించే స్త్రీలు, ప్రతి ఒక్కరికి దేవుని వాక్యాన్ని పరిచయం చేసే పురుషులు, జీవించే కళను కలిగివున్న జనులు రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచ దేశాలలో ఉంటే అసలు ఇలాంటి అత్యాచార కేసులుంటాయా చెప్పండి? నర సమాజంలో ఇలాంటి వార్తలు వినిపిస్తాయా చెప్పండి. ఉండనే ఉండవు. అత్యాచారాల విషయంలో, వ్యభిచారాల విషయంలో అసలు మొట్టమొదట ఎక్కడ తప్పు జరుగుతుందో అక్కడ వైద్యం చేస్తున్నాడు దేవుడు. మనిషి చూపులోనే తప్పు జరుగుతుంది. అక్కడే ప్రతి ఒక్కరూ దానికి చరమ గీతం పాడాలి. అక్కడే మనుష్యసమాజం దానిని ఉరితీయాలి. అలాంటి ఆలోచన ఎవ్వరిలోనూ ఉండకూడదు. ప్రతి ఒక్కరూ తమ చూపును మంచిదిగా కలిగి ఉండాలి. దైవ సంబంధమైన చూపును అందరూ కలిగియుండాలి. అంతేకాని మోహపుచూపును కాదు. ఇలాంటి జ్ఞానాన్ని సమాజంలో ఏ పాఠ్యపుస్తకములోనూ వ్రాయలేకపోయారు. నేను చాలా పాఠ్యపుస్తకాలు చూసాను. అసలు వ్యభిచారం జరగకుండా ఉండాలి అంటే, అత్యాచారాలు జరగకుండా ఉండాలి అంటే, స్త్రీలకు రక్షణ కలగాలి అంటే, ప్రతీ ఒక్కరు పరిరక్షింపబడాలి అంటే, సమాజమంతా కామాభిలాష యందు కాక, దేవుని ఆలోచనలో బ్రతకాలి అంటే ఏమి చేయాలి? అని ప్రతి పుస్తకాన్ని వెతికితే, ఏ పుస్తకములోను ఇలాంటి సూత్రాలు లేవు. యేసుక్రీస్తు మాత్రమే అసలైన సంగతిని చెప్పాడు. మనిషికి జీవించే కళను మరుగు చేసి ఏదేదో నేర్పిస్తున్నారు. ఇదే రీతిలో, ఇదే పద్ధతిలో యేసుక్రీస్తు ఈ సమాజానికి పరిచయమవ్వాలి! ఏదో అల్లెలూయ అని నాలుగుసార్లు, స్తోత్రం అని నాలుగుసార్లు, మీకు ఇష్టం వచ్చినట్లుగా ఆరాధనలు, స్తుతులు జరుపుకొని వెళ్ళిపోవడం చేత, యేసుక్రీస్తు సమాజానికి తప్పుగా అర్థమయ్యాడు. అందుకే యేసు పలికిన జీవపు మాటలు, మాటలుగానే ఉండిపోయాయి. కొండమీద తన ప్రసంగాన్ని ఆయన ఎలా ప్రారంభించాడో తెలుసా? యేసుక్రీస్తు తన మాటలలో జీవించే కళను ఎలా నేర్పిస్తున్నాడో చూడండి.

**మత్తయి సువార్త 5 : 1 'ఆయన ఆ జనసమూహములను చూచి కొండయెక్కి కూర్చుండగా ఆయన శిష్యులాయనయొద్దకు వచ్చిరి. అప్పుడాయన నోరు తెరచి యీలాగు బోధింపసాగెను.'** సమాజానికి దేవుని వాక్యమును ఎలా బోధించాలి? యేసుక్రీస్తు అల్లెలూయ, అల్లెలూయా, అల్లెలూయ... అని ఎక్కడైనా అన్నాడా? అసలు నాలుగు సువార్తలలో యేసుక్రీస్తు తన భూజీవిత కాలములో ఎన్నడైనా అల్లెలూయ అని అన్నాడా? **ప్రకటన గ్రంథము 19**వ అధ్యాయంలో **'దేవుని స్తుతించండి'** అనే మాటకు మూలభాషలో అల్లెలూయ అని ఫుట్‌నోట్‌లో వ్రాయబడిన మాట తప్ప, ఆదికాండము నుంచి ప్రకటన గ్రంథము వరకు ఏ భక్తుడైనా సరే, అల్లెలూయ అనినట్టు చూపించండి. సమాజాన్ని మార్చలేని మన మాటలు ఎందుకండి? ఎన్ని చెప్పినా సమాజాన్ని బ్రతికించాలి, అలాంటి మాటలు మాత్రమే మనము చెప్పాలి. మిగిలిన మాటలు మంచివే కావచ్చు. అల్లెలూయ అనే పదాన్ని నీవు ఒంటిరిగా ఉన్నప్పుడు, నీ ఇంటిలో ఉన్నప్పుడు చెప్పుకోవాలి. అంతేకానీ, సమాజం లోనికి వచ్చిన తరువాత, అందరిని కూర్చోబెట్టిన తరువాత విలువైన సమయంలో నువ్వు చెప్పాల్సింది కేవలం జీవించే కళను మాత్రమే. యేసు ఏమి చెప్పమన్నాడో, దేవుని గ్రంథంలో ఏమి వ్రాయబడిందో ఈ సమాజానికి దానినే చెప్పాలి అని దేవుడు ఎదురు చూస్తున్నాడు. అందుకే ఆయన నోరు తెరచి జనసమూహములతో ఏమి చెబుతున్నాడో చూడండి. **మత్తయి సువార్త 5 : 3- 'ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు. పరలోకరాజ్యము వారిది.'** మనిషికి జీవించే కళ తెలియాలి. ఆత్మ విషయమై మనుష్యులు దీనులు కావాలి. వారు శరీర విషయమై ఆలోచిస్తున్నారు. ఇప్పటివరకు అసలు ఆత్మ ఉన్నదన్న సంగతి కూడా తెలియకుండా బ్రతుకుచున్నారు. మీరైన ఆత్మ, మీకివ్వబడిన శరీరంలో ఒదిగి పోయింది. ఈ దేహాన్ని ఏ క్షణమైనా విడిచిపెట్టి వెళ్ళడానికి సిద్ధంగా ఉంది. అదే మనలోనున్న ఆత్మ. అదే మనలోనున్న శక్తి. ఈ ఆత్మ విషయమై ఎవరు దీనులో వారిదే పరలోకరాజ్యం అన్నాడు. నాలుగు భాగాలుగా మీరు చదువుతున్నారు. ఈ నా మాటలలో ఏ ఒక్కటైనా శరీర సంబంధమైన మాట మీకు చెప్పానా? శరీర సంబంధమైన అవసరతలు తీర్చడానికి ఒక్క మాట కూడా నేను మీకు వ్రాయలేదు. ప్రతి ఒక్కటి ఆత్మ సంబంధమైన మాటగానే చెబుతున్నాను. ఎందుకంటే మనకు పరలోకరాజ్యం కావాలి. అందరికీ పరలోకరాజ్యము రావాలి. ఈ పుస్తకము చదువుచున్న ప్రతీ ఒక్కరూ పరలోకరాజ్యానికి అర్హులు కావాలి. ఈ పుస్తకం ద్వారా నా లక్ష్యం ఏమిటో తెలుసా? ఈ ఐదు భాగములు చదివిన తరువాత ప్రతి మనిషి ఎలా వెళ్ళాలి అంటే, పరలోకరాజ్యానికి అర్హులుగా వెళ్ళాలి. అదే నా

లక్ష్యం. యేసుక్రీస్తు వారు ఆనాడు ఏమి చెబుతున్నారో చూడండి. ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు, పరలోకరాజ్యం వారిది. దు:ఖపరచబడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు. దేవునికొరకు మీరు దుఖపడుచున్నారా? దేవుని కొరకు మిమ్మును అనరాని మాటలు అంటున్నారా? హింసిస్తున్నారా? అలాగైతే మీరు పరలోకములో ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురు. నీతి కొరకు ఆకలిదప్పులు కలవారు ధన్యులు, వారు తృప్తిపరచబడుదురు. కనికరముగలవారు ధన్యులు, వారు కనికరమును పొందుదురు. హృదయశుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు. మీకు దేవుని చూడాలని ఉందా? మీరు దేవుని చూడాలి అనుకుంటున్నారా? అయితే మీ బ్రతుకు కాలములో మీరు హృదయ శుద్ధిని కలిగి ఉండండి. మీరే దేవుని చూస్తారు. ప్రపంచంలో ఎవ్వరు ఇప్పటివరకు దేవుని చూడాలి అనుకోలేదు. ఎవరికి వారు ఎడ్జస్ట్ అయిపోయారు. అందరూ దేవుని చూచేస్తున్నాము, చూచేస్తున్నాము అని ఎడ్జస్ట్ అయిపోయారు. కానీ, యేసుక్రీస్తు ఏమి చెబుతున్నాడో తెలుసా? అసలు మీరు దేవునిని చూడాలి అంటే, మీలో ఒక అర్హత ఉండాలి. మీకు ఒక మంచి క్వాలిఫికేషన్ ఉండాలి. అది ఏమిటో తెలుసా? మీకు హృదయశుద్ధి ఉండాలి. మీచూపు చెడినదైతే మోహపు చూపుతో ప్రతి ఒక్కరిని చూస్తున్నవారయితే, మీ హృదయం కనిపించిన ప్రతి ఒక్కరితో వ్యభిచరించేదైతే అసలు మీరు దేవునిని ఎలా చూస్తారు చెప్పండి. మీరు దేవునిని ఎప్పుడు చూస్తారు చెప్పండి? మీ ఆత్మలకు కన్నతండ్రిని మీరు చేరుకోరా? మీ సైన్యములకధిపతిని మీరు చూడరా? అందుకే యేసుక్రీస్తు చెప్పాడు. జీవించే కళ తెలియాలి అంటే ముందు హృదయశుద్ధిని కలిగియుండాలి. అప్పుడు మీరు దేవుని చూస్తారు. ఏదో ఉపవాసం ఉండి, ప్రార్థన చేసి, కానుక ఇస్తే దేవుని చూస్తాను అంటే పొరపాటు. యేసు ఏమి చెప్పాడో చూడండి. మీరు హృదయశుద్ధిని కలిగి ఉండాలి, మీ హృదయాన్ని చూసిన దేవుడు పొంగిపోవాలి. నా కుమారుడు, నా కుమార్తె ఇంత పవిత్రమైన హృదయాన్ని కలిగి భూమిమీద బ్రతుకుతున్నారు అని దేవుడు ఆనందించాలి. ఇదే దేవుని చూడడానికి ఉండవలసిన అర్హత. ఆయన తన కుమారుని మీకొరకు రక్షణకర్తగా దయచేసినప్పుడు, మీరు హృదయశుద్ధిని కలిగి ఉండలేకపోతే దేవుని చేరుకోలేరు. హృదయశుద్ధిని కలిగి ఉండటం మీరు చేయలేని కార్యక్రమం కాదే, అలాగని ఇది నేరమేమీ కాదే. ఈ సమాజం దృష్టికైనా, దేవుని దృష్టికైనా ఇది మంచి కార్యక్రమమే కదా. అందుకే హృదయశుద్ధిని కలిగియుండండి. మీ చూపును మంచిదిగా మార్చుకోండి. మీ దేహాన్ని, మీ అవయవాలను దేవుని కొరకు వినియోగించండి. అప్పుడు మీరు ఈ భూమిమీదకు ఎందుకు వచ్చారో దాని పరమార్థం మీకు అర్థమవుతుంది. మీరు జీవించే కళను కలిగిన వారవుతారు.

**థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక 4 : 4 'మీలో ప్రతివాడును దేవుని ఎరుగని అన్యజనులవలె కామాభిలాషయందు కాక, పరిశుద్ధతయందును ఘనతయందును తన తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది యెరిగియుండుటయే దేవుని చిత్తము.'** ఆయన ఎంత గొప్పగా వ్రాయించాడో చూడండి. దేవుడు ఇలా వ్రాయించాడు కనుకనేనేమో, ఈ రోజు మీడియా అంతా దీనితోనే నిండిపోయింది. దేవుని యెరుగని వాడు ఎలా ఉంటాడంటే, కామాభిలాషయందు ఉంటాడు. మోహపు చూపుతో చూడొద్దని ఎవరికైనా చెబితే , వారు ఏమంటున్నారో తెలుసా? మాకు కళ్లున్నవి అందుకే కదా బ్రదర్, అందుకే చూస్తున్నాను అంటున్నాడు. నాకళ్లతో నేను చూస్తున్నాను; నేనేమైనా నీ కళ్లతో చూస్తున్నానేంటి? నా కళ్లు - నా ఇష్టం అంటున్నాడు. అవును. వాడి ప్రగల్భపు మాటలు అలాగే ఉంటాయి. దేవుడు ఆ మనిషిని ఈ భూమిమీద నుండి తీసేంతవరకు వాడు అలాంటి మాటలే పలుకుతాడు. వాడి బ్రతుకు, వాడి ఆయుష్షు, వాడి జీవితమంతా దేవుని చేతిలో ఉన్నదన్న సంగతి వాడికి తెలియటంలేదు. దుష్టుడు వాని మనోనేత్రాలకు గ్రుడ్డితనాన్ని కలుగుజేసాడు. నీకు ఇవ్వబడిన ఈ రెండు కళ్ళతో మోహపు చూపుతోనే చూడమంటున్నాడు. ఈ రోజు ప్రతీ ఒక్కడి చేతిలో ఉన్న మొబైల్ ఫోన్, అందులోని ప్రతి మెమొరి కార్డు, ప్రతి కంప్యూటర్, ఇంటర్‌నెట్‌లో కోట్లాది వెబ్‌సైట్‌లు, అశ్లీలతతోనే నిండిపోయింది. కాదంటారా? సెల్‌ఫోన్ షాపుకి వెళ్లి అడగండి. మీ దగ్గర మెమొరి కార్డులు కొనేవారు అందరూ వాటిని వేటితో నింపుకుంటారు? అని అడగండి. వారి కంప్యూటర్ నిండా అవే చెత్త చెత్త బొమ్మలుంటాయి. ఏ బొమ్మ అయితే చూడగానే మోహపు చూపును పుట్టిస్తుందో ఆ బొమ్మ వాడి దగ్గరే ఉంటుంది. వాడు నరహంతకుడు కాదా? వాడు దుర్మార్గుడు కాదా? వాడు వ్యభిచారి కాదా? అవును. వాడు నిజంగా వ్యభిచారి. నీవు నమ్ముకున్న లోకనీతి

నీకేమి నేర్పించింది? ప్రతీ స్త్రీని తల్లిగా, చెల్లిగా చూడాలన్న ఈ నీతి, నీవు నేర్చుకున్న పాఠ్యపుస్తకాలలో లేదా? నీ తల్లిదండ్రులు దీనిని నీకు నేర్పించలేదా? అందుకే నేను చెబుతాను రండి. నా దగ్గరకు రండి. నేను జీవించే కళను చెబుతాను. ఆనాడు థెస్సలొనీకయులతో పౌలు చెబుతున్నాడు. దానిని మనందరికొరకు దేవుడు వ్రాయించాడు. మీలో ప్రతి వాడును దేవుని యెరుగని అన్యజనులవలె కామాభిలాషయందుకాక పరిశుద్ధత యందును, ఘనతయందును తన తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది యెరిగి యుండుటయే దేవుని చిత్తము. అందుకే నేను పరిశుద్ధమైన హృదయమును కలిగి ఉండేటందుకు మీ మీ ఘటములను ఎలా కాపాడుకోవాలో దానిని మాత్రమే వ్రాస్తున్నాను. పరలోకమందున్న దేవుడు మీతో దానినే చెప్పమన్నాడు. అది మీపట్ల దేవుని చిత్తం. ఈ దేహాన్ని అన్యాయంగా వినియోగించకండి. మీకు ఇవ్వబడిన దేహం ఎలాంటిది అయినా సరే అది దేవుని కొరకే వినియోగింపబడాలి. అందంగా ఉన్నదైనా, అందవిహీనమైనదైనా, ఆ దేహముచేత ఈ భూమి మీద మీరు దేవుని సేవను జరిగించాలి. దేవుని కొరకు మీరు బ్రతకాలి. అలాగని మీ దేహం నిత్యమూ ఈ భూమిపై ఉండిపోయేది కాదు కదా. ఈ అందం, ఈ రంగు నిత్యం ఉండిపోతుందా. మహా అయితే మీ దగ్గర అయిదేళ్లపాటు ఉంటుంది. లేదంటే ఒక పదేళ్లపాటు ఉంటుంది. ఆ తరువాత వెళ్లిపోతూ, వెళ్లిపోతూ మీకు ఒక పాఠాన్ని నేర్పిస్తుంది. ఈ దేహానికి పౌడర్ రాసారు, సెంట్ పూసారు, దాని రక్షణ కొరకై మీ జీవితమంతా ఆలోచించారు కానీ, లోనున్న మీ ఆత్మకొరకు ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని మీ శరీరము పోతూ పోతూ మీకు పాఠం చెబుతుంది. అయినా మీరు పట్టించుకోవడం లేదు. చర్మం ముడతలు పడిపోకుండా ఉండాలి అంటే ఏమి చెయ్యాలి అని మరల ఆలోచిస్తున్నారు. పళ్లు ఊడిపోతే మరల పళ్లసెట్ వేయించుకుంటున్నారు. తల వెంట్రుకలు తెల్లబడిపోతే వాటికి రంగు వేస్తున్నారు. ఇది కేవలం తాత్కాలికమైన రంగు. వీటివల్లే ఈ రోజు ఎన్నెన్నో రోగాలు కూడా మనిషిని వెంటాడుతున్నాయి. కృత్రిమమైన పదార్థాలు విషపూరితముగా ఉంటాయి. అందుకే మీ చేతికి ఒక గ్లౌజ్ ఇచ్చి, రంగును చర్మానికి తగలనివ్వకుండా, దానిని కడుపు లోనికి స్వీకరించకుండా, జాగ్రత్తగా కేవలం జుట్టుకు మాత్రమే వేయమంటారు. మీ తల రంగును ఎవరు చూడాలని? ఎవరి చూపును చెరపాలని మీరు రంగు వేస్తున్నారు చెప్పండి? దేవుడు మీ అంతరంగపు స్వభావాన్ని చూస్తున్నాడు జాగ్రత్త! మీ దేహమే మీకు పాఠం నేర్పిస్తుంది. దేవుని వాక్యములోని ప్రతి అక్షరం మనుష్యులందరికీ జీవించే కళను నేర్పిస్తుంది. మన ఘటమును మనమే కాపాడుకోవాలి. దానిని పరిశుద్ధతయందు కాపాడుకోవాలి. పరిశుద్ధముగా ఈ ఘటమును దేవుని కొరకు సమర్పించాలి. ఆనాడు యేసుక్రీస్తు అదే చేసాడు. వ్యభిచారిని చూచినా, వేశ్యను చూచినా, అమ్మా అన్నాడు. ఏ స్త్రీని చూచినా, ఏ పురుషుని చూచినా అలాంటి పిలుపు, అలాంటి ఆలోచన, అలాంటి చూపు మనలో ప్రతిఒక్కరిలో ఉండాలి. ఈ పాఠం మీ అందరిలో మార్పును తేవాలి. అదే నా కోరిక. ఇంకా అద్భుతమైన మాటలను అయిదవ భాగంలో చదవండి.

------x------

<u>ప్రశ్నలు</u>

**1. ఈ భూమిమీద దేవుడు మనుష్యులను ప్రవేశపెట్టిన క్రమమును వివరించండి.**

**2. దేవుడు స్త్రీ, పురుషులను సృష్టించడంలో పరమార్థమును సహేతుకముగా చర్చించండి.**

**3. నేటి సమాజంలో స్త్రీలపై జరుగుచున్న కామాంధుల దుశ్చర్యలను నివారించాలంటే, జీవించే కళ ఏమి చెప్పిందో వివరించండి.**

**4. ఒక స్త్రీని మోహపు చూపు చూచినవారు ఎలా వ్యభిచారులౌతారు? వివరించండి.**

**5. జీవించే కళ తెలిసిన యేసుక్రీస్తు వ్యభిచారిని సయితం 'అమ్మా' అని పిలిచి ఈ సభ్య సమాజానికి ఏమి నేర్పిస్తున్నాడు?**

**6. ఈ లోకాన్ని పాడుచేయడంలో మీడియా పాత్రను విశదీకరించండి.**

**7. జీవించే కళ తెలిసిన స్త్రీలు, పురుషులు తమ తమ ఘటములను పరిశుద్ధతయందు ఎలా కాపాడుకోవాలో వివరించండి.**

-------x------

నా ప్రియ సోదర సోదరీమణులారా! దేవుని సంస్కృతిని తెలియజేసే ఈ జీవించే కళలోని ఐదవ భాగానికి మీకు ఆహ్వానాన్ని తెలియజేస్తున్నాను. ప్రారంభ భాగము నుండి ఇప్పటి వరకూ దేవుని వాక్యాన్ని స్వచ్ఛమైనదిగా నేర్చుకుంటూ చదువరులందరూ ఎంతో సంతోషిస్తున్నారని నేను నమ్ముతున్నాను. ఈ ప్రపంచంలో దేవుని పేరిట ఉన్న ప్రతి బోధా ఇలాంటిదే అయితే, మన చుట్టూ ఉన్న సమాజం ఎంతో బాగుండేది. కానీ, అది జరగదు. నేను చెబుతున్న ఈ జ్ఞానము యొక్క స్థాయిని, ఐడియాలిటీ అంటారు. ఈ ఐడియల్ స్థాయిని అందుకోవాలంటే, అది అందరికీ సాధ్యం కాదు. ఆయా బోధలలో ఎన్నెన్నో మలినాలుంటాయి, వంకర టింకర మార్గాలుంటాయి. స్వార్ధపరులుంటారు, దేవుని యొక్క పనిని, దేవుని ముసుగులోనే పాడు చేసేవారుంటారు. ఆయా తరాలలో దేవుడు మనకు దీనిని గూర్చిన ఎన్నో ఉదాహరణలను చూపించాడు. ఆదాము కాలము మొదలుకొని అన్ని కాలాలలోనూ, ప్రారంభ శతాబ్ధపు క్రైస్తవుల కాలములో కూడా దేవుడు మనకు తన గ్రంథములో వీరిని పరిచయం చేస్తున్నాడు. అనేక సందర్భాల ద్వారా దేవుని పక్షమున ఉన్నవాడు ఒకడైతే, దేవునికి భిన్నంగా ఉన్నవారు వందలమంది, వేలమంది, లక్షలమంది, కోట్లమందిగా మనకు కనిపిస్తున్నారు. మీరు ఏ కాలంలో చూచినా, దేవుని పక్షాన నిలబడినవారు వ్రేళ్ల మీద లెక్కపెట్టగలిగినంత మంది మాత్రమే ఉంటారు. ఎందుకంటే, మన విరోధి అయినవాడు అంత సులభంగా ఎవరినీ విడిచిపెట్టడు. వాడు గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా అని వెదుకుచూ తిరుగుచున్నాడు. ఆ శత్రువు యొక్క బలం అంచనా వేయకపోతే దేవునితోనే ఉన్నామనే ముసుగులో, వాడి చేతిలో మనము ఓడిపోతాము. గనుక వాడిని చాలా చాకచక్యంగా దెబ్బకొట్టాలి. ఇంతమంది మనుష్యులను, లోకంలో మన తండ్రి పిల్లలను, వాడి వెనుక ఈడ్చుకొని పోతున్నాడు. మరణించిన ప్రతి మనిషి, ఆత్మగా వాడున్న లోకానికి చెరపట్టపడుతున్నప్పుడు మనము వాడి విషయంలో చాలా తెలివిగా ఆలోచించాలి. చాలా యుక్తిగా మన ప్రయత్నమును చేయాలి. అందుకే ఈ క్రైస్తవ్యాన్ని స్వీకరించినప్పుడే నేను నా దేవునిని ఒకటి అడిగాను. నేను అందరిలా ఉండకూడదు. అందరివలె నేను దేవునిని మోసం చేయకూడదు. నేను దేవుని కొరకు బ్రతికితే నిజంగా ఆయన కొరకు బ్రతకాలి. లేకపోతే ఆయన్ను స్వీకరించకపోవడమే మంచిది. అలాంటి బ్రతుకును ఇవ్వు తండ్రీ అని అడిగాను. నాకు సర్వసంపదలు అక్కరలేదు. అలా కావాలి అనుకుంటే నేను దేవునివాక్యమే ప్రకటించనక్కరలేదు. లోకంలో లోక విద్యలో, ఏదో ఒక మంచి విద్యను చదువుకుని, ధన సముపార్జనలో పడి ఏ సాఫ్ట్‌వేర్ రంగాన్నో, ఏ ఇంజనీరింగ్ విభాగాన్నో, ఏ వైద్య విభాగాన్నో, ఏ రాజకీయ విభాగాన్నో ఎన్నుకుని ధనము సంపాదించవచ్చు. ఈ రోజు నన్నడిగితే ఈ ప్రపంచంలో అతి సులభమైన పని ధనం సంపాదించడమే. నీతి, న్యాయం ప్రక్కన పెడితే ధనం సంపాదించడమే అతి సులభమైన పని. కానీ, నాకు ధన సముపార్జన మీద ఆశ లేదు. అన్నిటికంటే ముఖ్యమైనది నన్ను నేను రక్షించుకోవాలి. ఈ శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత నా ఆత్మ రక్షింపబడాలి. నా ఆత్మ దిక్కు తోచని పరిస్థితుల్లోనికి వెళ్లిపోకూడదు. తరతరాలు కాలిపోయే అగ్నిలోనికి అది వెళ్లకూడదు, అదే నా తపన. నా ఆత్మను రక్షించుకోవాలి అంటే ఏంచేయాలి? అనే పరిశోధనతో బైబిల్‌ను తెరిచాను. ధనమును సంపాదించడానికి, కూడబెట్టడానికి నేను బైబిల్‌ను తెరవలేదు. అధికారమో, పేరుపలుకుబడులో సంపాదించాలని నేను బైబిల్ చదువలేదు. లోకంలో ఏ పుస్తకం చదివినా నన్ను నేను రక్షించుకోలేని పరిస్థితుల్లో ఎవరిని నమ్మినా నా ఆత్మను కాపాడుకోలేని స్థితిలో నేను ఈ బైబిలు తెరచినప్పుడు కేవలం నేను దానినే కోరుకోవాలి. నన్ను నేనెలా రక్షించుకోవాలి అన్న దానినే కోరుకున్నాను. అందుకే అప్పటి నుండి అనేకమందికి, నేను నేర్చుకున్న ఈ తత్వాన్నే నేర్పుతున్నాను. ప్రారంభంలో నా వెనుక చాలామంది వచ్చారు. వారిది ఆరంభ శూరత్వం మాత్రమే. అసలే అది ప్రారంభం కదండీ! చూడగానే చిన్న పిల్లవాడు, చాలా మంచిగా చెబుతున్నాడు, ఇతని వెనక వెళితే నా డబ్బు సంచి నిండుతుందేమో అనుకుని చాలామంది వచ్చారు. కానీ, నేను వారి పప్పులు ఉడకనివ్వలేదు. మీరు నా వెనక ఉంటే మీరు ధనం సంపాదించుకోలేరు, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోలేరు,

కేవలం మీ ఆత్మను మాత్రమే మీరు రక్షించుకోగలరు అని వారికి చెప్పాను. ఇది చాలా మందికి నచ్చలేదు. అందుకే కొంతమంది వెనకడుగు వేసారు, వెనక్కి వెళ్లిపోయారు. కొంతమంది మాత్రమే నాతోపాటు నిలిచారు. ఇంకా క్రొత్తవారు మరలా వస్తున్నారు. దేవుని వాక్యం నేర్చుకుంటున్నారు, ప్రోత్సహింపబడుతున్నారు, నా విధానము నచ్చని కొంతమంది వెనక్కి వెళ్ళిపోతున్నారు. ఇదొక ప్రవాహం లాంటిది. మొదటి నుండి నేను అనేకమందిని చూస్తున్నప్పుడు నన్ను విడిచి వెళ్లిపోతున్న వారందరిని గూర్చి నేను ఆలోచించినప్పుడు వెళ్ళినవారు ఎందుకు వెళ్ళిపోయారంటే దానికి సరైన కారణం లేదు. ఇంతటి మహా జ్ఞానమును చెప్పే నన్నెందుకు విడిచి వెళ్లిపోయారు? కేవలం కారణం అంటూ ఉంటే, నేను వాక్యాన్ని ఉన్నది ఉన్నట్టుగా పాటించడం, దానిని ప్రకటించడం! అదే కారణం. అది వారికి నచ్చలేదు. వారెందుకు వెళ్ళిపోతున్నారో కారణం కూడా చెప్పకుండా వెళ్లిపోయినవారు చాలామంది ఉన్నారు. ముఖం చూపించలేక కనుమరుగైనవారు ఎందరో ఉన్నారు.

ప్రియులారా! ఇదంతా మీకెందుకు చెబుతున్నానంటే విప్లవం అనేది, నీతి అనేది, పరలోకమునకు తీసుకుని వెళ్లే దేవుని జ్ఞానమనేది ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. లక్షలమంది, కోట్లమంది, తండోపతండాలుగా అనుకరించేదిగా ఉండదు. ఏ కాలములోనైనా మీరు చూడండి. గత చరిత్ర మనకు ఇదే పాఠమును నేర్పింది. బైబిల్‌లో ఆ చరిత్ర భద్రపరచబడి ఉంది. నోవహు కాలంలో వేలకొలదిగా, లక్షలకొలదిగా జనులు నోవహు మాట విన్నారా? ఆయన కుటుంబం ఒక్కటే ఆయన మాట విన్నది. లోతు కాలంలో సొదొమ గొమొఱ్ఱా పట్టణాలు నాశనమవుతాయని చెప్పబడినప్పుడు, రెండు, మూడు కుటుంబాలు లోతుతో పాటు వచ్చాయా? లోతు కుటుంబము ఒక్కటే అతని వెంట వచ్చింది. అందులోనూ, లోతు భార్య మరల వెనక్కి తిరిగి చూసింది. అంటే దేవుని రాజ్యంలో ప్రవేశించిడమంటే అది చాలా కష్టం. నేనెప్పుడూ నాకు నేను చెప్పుకునేది, నా చుట్టూ ఉన్నవారికి చెప్పేది అదే! పరలోకరాజ్య ప్రవేశం అంత సులభం అనుకోకండి. భూమి మీద ఒక చిన్న ఉద్యోగ సాధనే చాలా కష్టం. ఒక బ్యాంకులో ఉద్యోగం సంపాదించాలంటే మీరెంత కష్టపడతారో చెప్పండి. ఒక క్లర్క్‌ఉద్యోగం, ఒక ప్రొఫెసర్ ఉద్యోగం, ఒక గవర్నమెంట్ ఉద్యోగం, ఇలాంటివి సంపాదించాలంటే మీరెంత కష్టపడాలి చెప్పండి? అలాంటిది మనము పరలోకం పొందాలంటే ఎంత కష్టమో చెప్పండి. అంత సులువుగా దేవుడు మనకు పరలోకాన్నిస్తాడా? పోనీ ఏ కాలంలోనైనా, ఎవరికైనా అలా ఇచ్చాడా? ఇశ్రాయేలీయులు లక్షల కాల్బలముగా బయలు దేరారు. కానీ వారిలో ఇద్దరిని దేవుడు ఎంచుకుని, మీరు మాత్రమే కనాను దేశానికి ప్రవేశించడానికి అర్హులు అన్నాడు. మిగిలిన వారెవ్వరికి ఆ అర్హతను దేవుడు యివ్వలేదు. ఈ ఉదాహరణలన్నీ మీకు ఎందుకు చూపిస్తున్నాడంటే మనము ఆ అర్హతను సంపాదించుకోవాలి. మన విరోధియైనవాడు చాలా కఠినాత్ముడు, కిరాతకుడు. దేవునిలో ఉన్నాము అనుకుంటూనే మనము మోసపోయేలా చేస్తుంటాడు. ఇప్పటివరకూ అందరినీ అలాగే చేసాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతీ ఒక్కరినీ అలాగే మోసం చేస్తున్నాడు. నేను క్రీస్తును తెలుసుకున్నాను కదా! నేను బైబిల్ పట్టుకున్నాను కదా! నేను ప్రార్థన చేసుకుంటున్నాను గదా! నేనేదో కొంత చందా దేవునికి ఇచ్చేస్తున్నాను కదా! నేను ఒక సంఘ సభ్యున్ని కదా! నేను ఆదివారం గుడికి వెళుతున్నాను కదా! ఏదో సంవత్సరానికి ఒక రోజు క్రిస్టమస్, ఈస్టర్, లెంట్ డేస్ నేను పాటిస్తున్నాను కదా! క్రైస్తవ సభలలో నేను పాల్గొంటున్నాను గదా! ఇక నాకు తిరుగు లేదు, నాదే పరలోకము అనుకుంటున్నారా? అపవాదిని చాలా చాకచక్యంగా మీరు ఎదుర్కొనవలసిన పరిస్థితి కనిపిస్తుంది. నిజంగా మీరందరూ ఈ పుస్తకాన్ని చదువుతున్నందుకు అదృష్టవంతులు. ఎందుకంటే ఎంతోమంది క్రైస్తవులున్న ఈ లోకములో దేవుడు నేర్పించే జీవించే కళను మీరు తెలుసుకుంటున్నారు. ఆ క్రైస్తవులలో మీకు మాత్రమే దేవుడు అవకాశమిచ్చాడు. ఈ విషయంలో మీరు చాలా ధన్యులు. కానీ, ఇది ధన్యతకు ప్రారంభం మాత్రమే. ఇది మీ అదృష్టానికి మొదటి మెట్టు మాత్రమే. దీనిని మీరు నిలబెట్టుకోగలిగితే, అసలుసిసలైన దేవుని జ్ఞానం మీకు అర్థమయితే, దానిని మీ బ్రతుకు కాలమంతా కొనసాగించగలిగితే అప్పుడు మీరు నిజంగా గొప్పవారు. అప్పుడు మీరు దేవుని కుమారులు.

ఉపోద్ఘాతములో మీకు ముందుగా చెప్పినట్టుగా, నేను ఈ పుస్తకాన్ని వ్రాయడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉంది. నా రచనకు ఈ అంశాన్ని నిర్ణయించడంలో కూడా ఒక ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే, 2016

మార్చి నెల 11, 12, 13 తేదీలలో ఢిల్లీ మహా పట్టణంలో యమునా నది తీరాన శ్రీశ్రీ రవిశంకర్ అనేటువంటి ఒక వ్యక్తి సరిగ్గా ఇలాంటి అంశంతోనే ఒక బ్రహ్మాండమైనటువంటి సభను నిర్వహించాడు. అది 3 రోజుల సభ. దాని నిర్వహణకు కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసారు. యమునా నదీ తీరంలోని ఈ సభను నిర్వహించడం వలన అక్కడి పర్యావరణాన్ని వారు భారీ స్థాయిలో పాడు చేసారు. ఈ సభను నిర్వహిస్తున్నందు వల్ల పర్యావరణము పాడైనదంటూ 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' వారు నిర్వాహకుల మీద న్యాయస్థానంలో కేసు కూడా వేసారు. దీనికై సుమారుగా 5 కోట్ల రూపాయల జరిమానా కట్టమన్నారు. కానీ, ఆ సభ నిర్వాహకుడైన రవిశంకర్ గారు కట్టలేదు. యమునా నది తీరాన 'జీవించే కళ' నేర్పించే సభను నిర్వహించడానికి, 'అప్పటికే అక్కడ ఏపుగా పెరిగి ఉన్న చెట్లను నరికేసారు' అనేది 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' వారి యొక్క అభియోగం. కానీ, ఆ రవిశంకర్ గారు ఏమన్నారో తెలుసా? నేను జరిమానా కట్టను అన్నారు. ఆయన 'జీవించేకళ' అనే సభను నిర్వహించారు. మంచిదే! ఆయన ఎన్నుకున్న అంశం వరకూ బాగానే ఉంది. దానిని ఆయన కూడా జీవించేకళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) అన్నారు. ప్రపంచ దేశాలలో అనేకమంది గొప్పవారందరినీ ఆ సభకు ఆయన ఆహ్వానించారు. సుమారు 36 లక్షలమంది విదేశీయులు ఆ సభకు వచ్చారని అంచనా! ఇంతకీ ఆనాడు 'జీవించేకళ'(ఆర్ట్ ఆఫ్ లివింగ్)లో ఏమి చెప్పారు అనగానే, మనకు పత్రికా మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఏమి చూపించారో తెలుసా? అసలు అక్కడేమి జరిగిందో తెలుసా? వారికి సంబంధించిన ఆ 'జీవించేకళ' సభలో వారు నాట్యాలు వేసుకున్నారు, పద్యాలు పాడుకున్నారు, గీతాలాపన చేసారు, సంగీతాన్ని వాయించారు, యోగా చేసుకున్నారు, ధ్యానం చేసుకున్నారు, తమ తమ సంస్కృతిని తెలుపుకున్నారు... తరువాత ఎవరింటికి వారు వెళ్ళిపోయారు. ఆ కార్యక్రమానికి హాజరైన వారిలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు కూడా ఉన్నారు. అత్యధిక పదవుల్లో ఉన్న అనేకమంది ఆ కార్యక్రమానికి ఆహ్వానింపబడ్డారు. వారందరూ ఆ కార్యక్రమాన్ని ఇంత, అంత, అని చాలా పొగిడారు. ఈ భూ ప్రపంచం మీద మనిషిని మార్చగలిగే ఏ కార్యక్రమాన్నైనా సరే, నేను కూడా అభినందిస్తాను. కానీ, ఆనాడు వారు అన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, భారతదేశపు ప్రధానపట్టణం ఢిల్లీలో పర్యావరణాన్ని పాడుచేస్తూ ఇంత గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టిన తరువాత, ప్రపంచ దేశాలకు వారిచ్చినటువంటి సందేశం ఏమిటి అంటే, ఆ సభలో రవిశంకర్ గారి చివరి సందేశమేమిటో తెలుసా? 'అందరి సంతోషమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశ్యం' అన్నాడు. వచ్చిన వారందరి సంతోషమే ఆ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం అంటున్నాడాయన. 'జీవించేకళ' అనగానే యోగా చేయాలట, ధ్యానం చేయాలట, నాట్యం చేయాలట, గీతాలాపన చేయాలట, ఒకరి సంస్కృతిని మరొకరికి తెలియజేయాలట. భారతదేశపు సంస్కృతిని శ్రీలంక వారికి, పాకిస్తాన్ సంస్కృతిని బంగ్లాదేశ్ వారికి, ఆఫ్ఘనిస్తాన్ సంస్కృతిని సౌదీ అరేబియా వారికి, ఇలా... ఒక దేశపు సంస్కృతిని మరొక దేశానికి తెలియజేయటమే జీవించే కళా? దీని వలన ప్రపంచశాంతి ఏర్పడుతుందా చెప్పండి. ఈ రోజు మనము నేర్పించవలసింది అదేనా? ఈ సమాజానికి మనము తెలియజేయవలసింది అదేనా? అపవాదియైనవాడు ఎంత కుయుక్తితో ఆలోచిస్తున్నాడో చూసారా? ప్రపంచ దేశాలన్నిటిని పిలిచి ఎంత మాయ చేస్తున్నాడో నాకప్పుడు అర్థమైంది. అప్పుడే నాకు ఒక ఆలోచన పుట్టింది. అందుకే నా దగ్గర ఉన్నటువంటి నా విద్యార్థులతో అదే చెప్పాను. మనము కూడా ఇప్పుడు అపవాదిని దెబ్బకొట్టడానికి అంత భారీ కార్యక్రమాన్ని అంత ప్రధానమైనటువంటి పట్టణంలో మనము నిర్వహించలేకపోయినా, మన స్థాయికి తగ్గట్టుగా మనము కూడా దేవుని తరుపున ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలి అనుకున్నాము. ఇందులో దేవుడే ప్రధానమైనటువంటి అంశము కావాలి. మనిషి యొక్క సంస్కృతిని తెలియజేయడానికి వారు ఆహ్వానింపబడ్డారు. మేము దేవుని సంస్కృతిని తెలియజేయాలి. జీవించే కళ అని మాత్రమే కాదు, "జీవించే కళ ఎలా?" అని చెప్పాలనుకున్నాను. జీవించే కళ ఎలా? అనే ఒక ప్రశ్నను రేకెత్తించాలనుకున్నాను. దీనిని దేశాల సంస్కృతిగా కాదు, దేవుని సంస్కృతిగా పరిచయం చేయాలనుకున్నాను. ఎందుకంటే, దేవునికి కూడా ఒక గొప్ప సంస్కృతి ఉందండీ. పరలోకమందున్న తండ్రికి కూడా ఒక బ్రహ్మాండమైన సంస్కృతి ఉంది. ఆయనకు ఒక కల్చర్ ఉంది. గత నాలుగు భాగాలుగా మీరు విన్నదంతా దేవుని సంస్కృతి. అది మణికుమార్ సంస్కృతి కాదు, లేక నా దగ్గరున్నటువంటి విద్యార్థుల సంస్కృతి కాదది. అది దేవుని యొక్క కల్చర్. ప్రపంచంలో ఇప్పటి వరకు ఎవడైనా దేవుని సంస్కృతిని మనిషికి పరిచయం చేయాలని అనుకున్నాడా? లేదండి. అంతటి గొప్ప మహా సభలో, అత్యంత ఖరీదైన

కార్యక్రమంలో ఒక దేశం యొక్క సంస్కృతిని మరొక దేశానికి పరిచయం చేయాలనుకున్నారే తప్ప దేశాలన్నిటికీ దేవుని సంస్కృతిని పరిచయం చేయాలని ఎవరూ అనుకోలేదండి. అందుకే ఈ అపవాదిని ఎలాగైనా సరే నేను ఓడించాలి అనుకున్నాను. నేను వాడికి సరైన గుణపాఠమును చెప్పాలి. ఈ అసలైన జీవించే కళను, దేవుని సంస్కృతిని అన్ని దేశాలకూ పంపించాలనే ఆలోచనలతో ఉన్నాను. తెలుగు భాషలో చదువుచున్నటువంటి ఈ దేవుని సంస్కృతిని ఆంగ్లములోనికి తర్జుమా చేసి, ప్రపంచములోని సుమారు 200 దేశాల ప్రతినిధులకు దీనిని పంపించాలి అనుకుంటున్నాను. ఎవరికి అర్థమయితే వారి దేశం మారుతుంది. భారతదేశంలో దేవుని సంస్కృతిని తెలియచేసే వారున్నారన్నమాట అని అప్పుడు వారు నిజముగా దేవున్ని తెలుసుకుంటారు. ఎందుకు మనిషి దేవుని సంస్కృతిని తెలుసుకోవాలి? దేశంలోని సామాన్యులు మొదలుకొని, ప్రధానమైన మనుష్యుల వరకూ ఏ ఒక్కరికీ 'నిజమైన జీవించే కళ' తెలియదు. ఎవ్వరికీ దేవుని సంస్కృతి తెలియదు. అందుకే దేశ విదేశాలలో ఒకడు ధన సంపాదనలో ఉన్నాడు. అందుకే మరొకడు అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఒకడు తన జీవితకాలమంతా పరాయి స్త్రీలను మోహిస్తున్నాడు, పరాయి పురుషుని మోహిస్తున్నది. వారికి వారి, వారి బ్రతుకు పరమార్థాలు అర్థం కావడం లేదు. మనుష్యులు ఈ భూమి మీదకు ఒక ప్రత్యేకమైన పని మీద వచ్చారు. వారంతా దేవుని కొరకు సృష్టింపబడ్డారు. భూమిమీద వారందరూ దేవుని కుమారులు. ఒకవైపు దేవుని ప్రణాళిక అంతా ఆవిరై పోతుంటే, దేవుని కొరకు ఎవ్వరూ పట్టించుకోకుంటే, ఇలాంటి పరిస్థితులలో దేవుని సంస్కృతిని నేర్పించాలా? వద్దా? భక్తంటే భజన చేయడం కాదు. భక్తంటే మోకాళ్లు వేయటం, కన్నీళ్లు కార్చటం కాదు. ఇదంతా భక్తి కాదు. మరి నిజమైన ఆరాధన, నిజమైన భక్తి ఎలా ఉంటుంది? దేవుని కొరకు మీరు నిరంతరం ఆలోచించడం, దేవుడు రచించిన ప్రణాళికను మీ ద్వారా మీరు నెరవేర్చటమే నిజమైన భక్తి. ఒక ఉపాధ్యాయునికి విద్యార్థి నిజమైన భక్తిని ఎప్పుడు చూపిస్తాడు? ఊరకనే మోకాళ్ళేసా, కారణం లేకుండా కన్నీళ్ళు కార్చా? కనిపించిన ప్రతిరోజూ గుడ్ మార్నింగ్, గుడ్ ఆఫ్టర్‌నూన్, గుడ్ ఈవినింగ్ చెప్పా? ఏదో కొంచెం ధనాన్ని మాసారు జేబులో వేసా? కాదు, కాదు. మాస్టారు ఇచ్చిన పాఠాన్ని సరిగ్గా చదివి, హోమ్‌వర్క్ కరెక్ట్‌గా చేసినప్పుడు, సదరు విద్యార్థి ఉపాధ్యాయునికి మంచి ఆరాధన చేస్తున్నట్టు, మంచి భక్తిని చూపిస్తున్నట్టు అని అర్థం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే ఆ మంచి ఉపాధ్యాయుడు సదరు విద్యార్థిని చూచి చాలా మెచ్చుకుంటాడు. దేవుడు మనలను చూచి మంచి భక్తుడు అని అనాలంటే ఆయన మనకొరకు ఏమనుకున్నాడో దానిని మనము నెరవేర్చాలి. దానినంతటినీ మనము పూర్తిచేయాలి. ప్రపంచంలో ఎవ్వరూ దేవుని సంస్కృతిని నేర్పించలేదు. రవిశంకర్ గారు ఆర్ట్ ఆఫ్ లివింగ్ అన్నారేగాని నిజంగా వారికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలియదు. కానీ, ఆదికాండము మొదలుకొని ప్రకటన గ్రంథము వరకూ దేవుడు వ్రాయించిన ప్రతీ మాటలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ 'జీవించేకళే' ఉన్నది. ఇది నిజమండీ! మనిషి ఎలా జీవించాలో దేవుడు వ్రాయించిన ఈ గ్రంథములో తప్ప ఇంకెక్కడా ప్రపంచంలో మీకు కనిపించదు. అందుకే ప్రపంచ దేశాలలో ప్రజలు నరమేధముతో, ఉగ్రవాదముతో, ఆత్మహత్యలతో, రాజకీయ కుట్రలతో, కరువు కాటకాలతో, కాలుష్యంతో,... చాలా భయంకరమైనటువంటి సమస్యల మధ్య సతమతమవుతున్నారు. దేవుడు చెప్పిన జీవించే కళ నేర్చుకుంటే, అది మనిషికి చాలా ఉపయోగకరం.

ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం, మావోయిజం,... ఇవన్నీ మన చుట్టూ అలుముకొని ఉన్నాయి. ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్నాయి. ఆల్‌ఖైదా తీవ్రవాదులు ప్రపంచంలోనే అత్యంత క్రూరమైనవారు. ఈ తీవ్రవాద సంస్థకు చెందిన ఆత్మాహుతులు అమెరికా దేశంలోని డబ్ల్యు.టి.సి. టవర్స్‌ను లక్ష్యంగా చేసుకుని వేలకు వేలుగా అమాయకపు మనుష్యులను సంహరించారు. 2002 సం॥ సెప్టెంబరు దాడులు అందరికీ సుపరిచితమే. ఈ దారుణమైన ఫలితాన్ని చవిచూసిన అమెరికా ఆల్‌ఖైదాను ఎలాగైనా నిర్మూలించాలని, ఉగ్రవాదానికి సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేయాలని అమెరికా దేశం ఆల్‌ఖైదా మీద గురిపెట్టింది. ఆ తరువాతి కాలంలో ఎలాగైతేనే ఆల్‌ఖైదా యొక్క ప్రధాన నాయకుడైనటువంటి బిన్ లాడెన్‌ను, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చంపించేసాడు. ఒకవైపు తీవ్రాదులు చేస్తున్నదానిని, మరొకవైపు అమెరికా వారు చేస్తున్నదానినంతటినీ దేవుని యొక్క గ్రంథము, దేవుని యొక్క జ్ఞానము అనే ఈ అద్దంలో చూస్తే - ఇద్దరిదీ తప్పే అని చెప్పక తప్పదు. ఉగ్రవాదులు మనుష్యులను చంపుతున్నారు. సైనికులు

ఉగ్రవాదుల్ని చంపుతున్నారు. ఈ రెండింటిలో మనకు కనిపిస్తున్నది ఏమిటంటే నరమేధం, నరహత్య! కేవలం మనిషి యొక్క ప్రాణహత్య మాత్రమే. జీవులన్నీ 'జీవించే కళ' ను తెలుసుకుని బ్రతుకుతున్నాయి. మనుష్యులకు 'జీవించే కళ' తెలియక, ఈ రోజు ఒకడిని ఒకడు చంపుకుంటున్నాడు. అందుకే మనిషి మారణాయుధాలను తయారు చేస్తున్నాడు. ఎ.కె.47 మీలో అందరూ వినే ఉండాలి. తుపాకి, బాంబ్, గ్రెనైడ్, రసాయన బాంబ్‌లు... ఇవన్నీ ఏమిటనుకుంటున్నారు? మనిషిని చంపడానికి తయారుచేసే ఆయుధాలు. ఒక సింహాన్ని చంపడానికో, ఒక కుక్కను చంపడానికో, ఒక ఎద్దును చంపడానికో వాడే ఆయుధాలు కాదు. మనిషి తయారుచేస్తున్న ఈ మారణాయుధాలన్నీ మనిషిని చంపడానికి మాత్రమే. అవునండీ. ఎక్కువమందిని ఒకేసారి చంపటానికి అదే మనిషి ఆత్మాహుతి బాంబ్‌గా మారిపోతున్నాడు. తన చుట్టూ బెల్ట్ బాంబులు పెట్టుకుని మనుష్యుల మధ్యకు వెళ్ళి, ఒక్క బటన్ లాగగానే అందరిమధ్య ప్రేలిపోయి అందరినీ పేల్చేయడానికి పూనుకుంటున్నాడు. ఇలాంటి వారందరికీ జీవించే కళ తెలుసా? ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ దేశంలోనూ ఇదే సమస్య రాజ్యమేలుతోంది. పరిష్కరించలేని ఒక పెను సవాల్‌గా మారింది. ఇప్పటి వరకూ దాదాపుగా అన్ని దేశాలకూ ఈ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. అప్పట్లో ఆల్‌ఖైదా తీవ్రవాదులు అమెరికా దేశాన్ని మాత్రమే గురి పెట్టారని అనుకున్నారు. ఆ తరువాత ఆ ఆల్‌ఖైదా నుండి ఒక వర్గం విడిపోయింది. దానినే ఐ.ఎస్.ఐ.ఎస్. అన్నారు. ఇస్లామిక్ స్టేట్ ఫర్ ఇరాక్ & సిరియా. ఇరాక్ దేశం మరియు సిరియా దేశం, ఈ రెండు దేశాలలో ప్రాబల్యం ఎక్కువగా ఉన్నటువంటి ఈ ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు ఆల్‌ఖైదా నుంచి విడిపోయి మరింత భయానకంగా తయారయ్యారు. కేవలం అమెరికా మాత్రమే వీరి గురి కాదు. యూరప్ దేశాలన్నీ వారి గురి. ప్రపంచంలో ఉన్న ప్రతీ దేశం వారి గురి అని అంటున్నారు. ఈ రోజు వారి నినాదం ఏమిటో తెలుసా? వారు నమ్మిన దేవున్ని ఎవరు నమ్మకపోయినా వారిని చంపేస్తాం అంటున్నారు. దేవుడన్నవాడు అలాగే చెబుతాడా? నిజమైన 'జీవించే కళ' అలానే ఉంటుందా? ఈ రోజు నేను కూడా వారిలాగే నేను నమ్మిన దేవుని మీరు నమ్మకపోతే మిమ్మల్ని చంపేస్తాను అని అన్నానంటే నేను మంచివాడినా చెప్పండి? అలా చంపమని చెప్పిన దేవుడు మంచివాడా చెప్పండి? నిజంగా దేవుడనేవాడు బైబిల్‌లో యేసుక్రీస్తుకి ఏమని చెప్పి పంపించాడో మీరు ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవాలి. నా కుమారుడా, ఈ భూమిమీద నన్ను నమ్మని వారందరినీ చంపేయ్ అని ఇక్కడకు పంపించాడనుకుంటున్నారా? లేదండి. దేవుని నమ్మని వారందరి దగ్గరకు ఆయనొక వైద్యునిగా వెళ్ళి, వారికి వైద్యమందించి, వారి చేతుల్లో చచ్చిపో అని చెప్పి పంపించాడు. అవును. దేవుడంటే, చంపమనేవాడు కాడు. అవసరమైతే నీ సహోదరులకొరకు చనిపోమనేవాడే దేవుడు. ఆయనను నమ్మకపోతే చంపేయ్ అనేవాడు దేవుడవుతాడా? ప్రపంచ దేశాలు ఉగ్రవాదుల్ని మొట్టమొదట అడగవలసిన ప్రశ్న ఇదేనండీ. ఉగ్రవాదులందరి మనసులో ముందుగా ఈ ప్రశ్నను రేకెత్తించండి. అప్పుడు వారు ఆలోచిస్తారు. మారే అవకాశముంటుంది. అంతేగాని, నీవు నన్ను చంపావు గనుక నేను కూడా నిన్ను చంపుతాను అంటే, ఇలా ఒకడినొకడు చంపుకుంటూ వెళ్ళిపోతే, ఈ ఉగ్రవాదానికి ముగింపు(ఫుల్‌స్టాప్) పడుతుందా? ఇక ఎప్పటికీ వారు వినరు. ఉగ్రవాదుల చేతిలో భయంకరమైన మారణాయుధాలు ఉన్నాయి. ఇక వారెక్కడ మారతారు? వారికి రహస్యంగా ధనము అందుతోంది. వారెక్కడ మీ మాటలు అంగీకరిస్తారు. అందుకే వారి మనస్సులో మనము దేవుని వాక్యము అనే బీజమును వెయ్యాలి. అపవాదిని సులువుగా ఎక్కడ కొట్టాలో అక్కడే కొట్టాలి. ఈ రోజు ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు ఏమంటున్నారు? ప్రపంచ దేశాలలో ఉన్నవారందరిని చంపేస్తానంటున్నారు. అలా ఎందుకంటున్నారు? దేవుడే చంపమన్నాడు గనుక మేము అందరినీ చంపేస్తున్నాము అంటున్నారు. వారు అమాయకులు, పిచ్చివారు, మూర్ఖులు. అప్పుడు వారికి దేవుని గూర్చి చెప్పాలి. బిడ్డా! దేవుడనేవాడు మనిషిని చంపమంటాడా? తనను నమ్మనంత మాత్రాన మనిషిని చంపమని నీకు చెబుతాడా? చెప్పడు. అసలు అలాంటివాడు దేవుడే అవ్వడు. ఇలాంటి వారికి మొట్టమొదట దేవుని జ్ఞానమును చాలా యుక్తిగా నేర్పించాలి. వాడికి ముందుగా 'జీవించే కళ'ను తెలియజేయాలి. నా అంచనా ప్రకారం ప్రపంచంలో ఎవ్వరికీ ఇటువంటి జ్ఞానము లేకపోవడం చేతనే ఎవ్వరూ ఉగ్రవాదులకు ఈ రహస్యాలను, ఈ జ్ఞానమును తెలియచేయ లేకపోయారు. ఇది నిజం! 2016 మార్చి నెలలో మన దేశంలో శ్రీశ్రీ రవిశంకర్ గారు 'జీవించే కళ'(ఆర్ట్ ఆఫ్ లివింగ్) కార్యక్రమాన్ని జరిగించారని చెప్పానుగా! ఈ రవిశంకర్ గారికి కూడా ఒక ఆలోచన వచ్చింది. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులను తాను కూడా మార్చాలి అనుకున్నాడాయన.

మార్చాలి అనుకుని వారికొక సందేశమును(లెటర్) పంపించాడు. ఏమనంటే, మనిషి సంస్కృతిని మనిషి తెలుసుకుంటున్నాడు, ఈ విధంగా మేము చాలా ఆనందిస్తున్నాము. నృత్యాలు, ధ్యానం, సంగీతం, ఫ్లూట్ వాయించటం, పాటలు, గాన కచేరీలు.. ఇవన్నీ చాలా బాగున్నాయి. మీరు కూడా ఇందులోకి వచ్చేయరాదా? నేను నా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా మిమ్మనందరిని నా సంస్కృతిలోనికి తీసుకొస్తాను. అనగా మనిషి సంస్కృతిలోకి తీసుకువస్తాను అని సందేశాన్ని పంపించాడు. ఇదే మేము నేర్పించే జీవించే కళ అని ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులకు రవిశంకర్‌గారు ఒక ఇ-మెయిల్ పంపించాడు. అప్పుడు ఏమి జరిగిందో తెలుసా? *న్యూస్: ఐఎస్ఐఎస్‌తో శాంతి చర్చలకు శ్రీశ్రీ రవిశంకర్ ప్రయత్నం! ఆ ప్రయత్నంలో ఏమి జరిగిందో చూడండి. తలలేని ఒక మృతదేహము యొక్క ఫోటోను పంపి తిరస్కరణ తెలిసిన ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు!* చూసారా.. రవిశంకర్‌గారు ఆయన చెప్పాలనుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను ఐఎస్ఐఎస్ తీవ్రవాదులకు చెబుతామనుకొని ఒక లెటర్ తయారుచేసి పంపించారు. దానికి ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు ప్రత్యుత్తరాన్ని ఏమి పంపించారో తెలుసా? తల తీసేసినటువంటి ఒక మొండెము యొక్క ఫొటోను పంపించారు. వారు ఇంకేమీ వ్రాయలేదు. ఇదిగో ఇదే మా సమాధానం అన్నారు. తల నరికిన మొండెము ఫొటో తనకు తిరిగి వచ్చేసరికి ఈ రవిశంకర్ ఏమన్నాడో తెలుసా? వీళ్లని మార్చటం నావల్ల కాదు. ప్రభుత్వాధికారులు, సైనికులూ మీ పనేదో మీరు చేయండన్నాడు. ఇక నేను వీరిని మార్చలేను అని చేతులెత్తేసాడు. ఎందుకంటే తల నరికిన మొండెమును తనకు పంపించారు. అంటే దానర్థం, తనను కూడా ఇలాగే నరికేస్తారన్నమాట. ఇది వారియొక్క తిరుగు సమాధానమన్నమాట. అవును. వారికేమి చెప్పాలో అది చెప్పాలి తప్ప, నాట్యాలు, ధ్యానాలు, ఫ్లూటు వాయించడం వారికి చెబితే ఎకె.47ను ఒకసారి ఇలా, అలా త్రిప్పుతాడు. అంతే కదా. సింహం ముందు ఫ్లూట్ ఊదొద్దు అంటాడు. అందుకే ఈ ఐఎస్ఐఎస్ తీవ్రవాదికి వేటగాడే సరి. వాడి ముందు ఫ్లూట్ ఊదకూడదు. వాడికి కరెక్ట్ వేటగాన్ని వాడి దగ్గరకు పంపిస్తే అప్పుడు దానికి పునాది లేకుండా చేస్తాడు. అవును! వారు ఏ పిచ్చితో అయితే ఉన్నారో, ఏ భ్రమలో ఉన్నారో ఆ దేవునిని వారు తప్పుగా అర్థం చేసుకున్నారు. గనుకనే ఆ దేవుని నిజ స్వరూపాన్ని వారికి చూపించాలి. వారు నమ్మిన ధర్మశాస్త్రమే, వారు అనుకరిస్తున్నటువంటి పాత నిబంధన గ్రంథమే ఈ రోజు నా దగ్గర కూడా ఉంది. అందులో దేవుడు ఏమి చెప్పాడో దేవుడు ఏమి వ్రాయించాడో ఈ రోజు దానిని ఈ పాఠంలో మీకు చెబుతాను. ఈ పుస్తకాన్ని వారు కూడా చదివితే వారికి కూడా మనము ఈ పాఠాన్ని చెబుదాం. వారికి ఇంత వరకు దేవుని గూర్చి ఎవరో తప్పుగా చెప్పారు. ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు గాని, ఆల్‌ఖైదా తీవ్రవాదులు గాని, పాకిస్తాన్ నుండి మన దేశములోనికి జొరబడుతున్న అనేకమంది తీవ్రవాదులకు గానీ ఎవరో ఇప్పటి వరకు తప్పుడు సంకేతాలు ఇచ్చారు. చిన్ననాటి నుండి వారి మనస్సులను పాడుచేసారు. వారి చేతికి తుపాకులిచ్చారు, గ్రెనేడ్‌లు ఇచ్చారు. అనేకమంది అమాయకులను విచక్షణంగా చంపమంటున్నారు. ఇలా చేస్తే వారికి పరలోకము వస్తుందని చెబుతున్నారు. తప్పు తప్పు! అసలు వారు చదువుతున్నటువంటి గ్రంథము ఏమి చెబుతోందో వారికి అర్థం కావాలి. దాదాపుగా బైబిల్‌లోని పాత నిబంధన గ్రంథమే వారి చేతుల్లో ఉన్న గ్రంథము. అవును. వారు ఆదామును నమ్ముతారు, అబ్రాహామును నమ్ముతారు. గనుక అదే గ్రంథములో దేవుడు వ్రాయించిన చక్కని సంగతులు చెబుతాను వినండి. ఎందుకంటే మీకు పరలోకం కావాలి, నాకు పరలోకం కావాలి ఐఎస్ఐస్ తీవ్రవాదులకూ పరలోకం కావాలి. వారు చంపబడటం నా లక్ష్యం కాదు. అమెరికా గవర్నమెంట్ అనుకున్నట్టుగా, యూరప్ దేశాలన్నీ అనుకున్నట్టుగా ఐఎస్ఐఎస్ తీవ్రవాదులను నేలమట్టం చేయటం నా అభిమతం కాదు. వారు కూడా మన తండ్రికి పుట్టిన వారే. నల్ల దుస్తులు ధరించినంత మాత్రాన వారు రాక్షసులు కారు. కానీ వారిలో ఉన్నది మాత్రం రాక్షసత్వం. అలాగని వారు దేవుని పిల్లలు కాకుండా పోరు. వారేదో తెలియక ఆవేశంలో పొరపాట్లు చేస్తున్నారు. అనేకమంది తలలు తెగ నరుకుతున్నారు. అనేకమందిని తుపాకులతో, బాంబులతో సంహరిస్తున్నారు. అయితే ఇప్పుడు మనమేమి చేయాలి? పగ తీర్చుకుందామా? కాదు. వారికి జ్ఞానాన్ని నేర్పిద్దాం, వారికి దేవుడు తెలిసేలా చేద్దాం. వారు కూడా నమ్ముతున్న మొట్టమొదటి పుస్తకమైన ఆదికాండము దగ్గరకు వెళితే, అక్కడ ఆదాము ఉన్నాడు. ఆ ఆదాముకు ప్రథమ సంతానమైన కయీను ఆనాడు ఏంచేసాడో చూడండి.

**ఆదికాండము 4 : 8 'కయీను తన తమ్ముడైన హేబెలుతో మాటలాడెను. వారు పొలములో వున్నప్పుడు కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతనిని చంపెను.'** ఈ భూమి మీద అప్పటికి అది మొట్టమొదటి నరహత్య. ఆనాటికి ఆల్‌ఖైదా ఇంకా పుట్టలేదు. ఐఎస్‌ఐఎస్ ఇంకా ఊపిరి పోసుకోలేదు. అప్పటికింకా ఏ నక్సలైట్ గ్రూపూ లేదు. మావోయిజం ఛాయలు ఆనాడు లేవు. అసలు భూమి మీద నరహత్య అనేది ఆనాటికి ఎవ్వరికీ తెలియదు. అప్పుడు ఎ.కె 47 లేదు, గ్రెనేడ్ లేదు, బాంబు లేదు, ఆంత్రాక్స్ లేదు. ఏమీ లేనప్పుడే కయీను మొట్టమొదట జీవించే కళను కోల్పోయాడు. తన అన్నయైన కయీను తమ్ముడైన హేబెలుతో మాటలాడి ఆ తర్వాత హేబెలు మీద పడి అతని చంపెను. ఒక మనిషి మరొక మనిషిని చంపటం వల్ల, నరహత్య జరగటం వల్ల ఏం జరుగుతుందో దేవుడు చెబుతున్నాడు చూడండి.

**ఆదికాండము 4 : 10 'అప్పుడాయన, నీవు చేసిన పని యేమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలోనుండి నాకు మొఱపెట్టుచున్నది.'** ఐఎస్‌ఐఎస్ ఉగ్రవాదులు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తీవ్రవాదులు జాగ్రత్తగా ఆలకించాలి. మీరు ఇదేదో మనిషిని చంపటం చాలా చిన్న పని అనుకుంటున్నారు. మీ దృష్టిలో ఆ మనిషి దుర్మార్గుడు కావచ్చు, మీ దృష్టిలో ఆ మనిషి అతి భయంకరమైన కార్యక్రమాలు చేసినవాడు కావచ్చు. ఆ మనిషి నీవు నమ్మిన దేవునిని నమ్మకపోవచ్చు. అలాగని అతని చంపేస్తారా? అప్పుడు దేవుడు ఏమంటున్నాడో చూడండి. మీరు నమ్మిన దేవుడు ఏమంటున్నాడో చూడండి. దేవుడు ఆనాడు కయీనుతో, నీవు చేసిన పని ఏమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొఱపెట్టుచున్నది. చిందింపబడిన మనిషి యొక్క రక్తము ఊరకనే ఊరుకుంటుంది అనుకుంటున్నారా? ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక నరుని మరొక నరుడు చంపితే, అలా చిందింపబడిన రక్తము ఊరుకోదు. ఎందుకంటే, ఆ రక్తములో ప్రాణం ఉంటుంది. అది ఊరకనే పోదు. అందుకే దేవుడు మొట్టమొదట నాకు ఈ జీవించే కళను తెలియజేసాడు. జీవించే కళను కలిగియుండటం అంటే, మీ తోటి సహోదరులను ప్రేమించాలి తప్ప వారికి కీడు తలపెట్టకూడదు. అదే 'జీవించేకళ' (ఆర్ట్ ఆఫ్ లివింగ్). అందుకే కయీను తమ్ముని యొక్క రక్తము నేలలోనుండి దేవునికి మొఱపెట్టుచున్నది. ఆ రక్తము యొక్క స్వరము మనిషికి వినబడకపోవచ్చు. పరలోకమందున్న దేవునికి మాత్రం తప్పక వినిపిస్తుంది. చంపబడిన హేబెలు దేవుని కొరకు జీవించి, నీతిమంతుడయ్యాడు. చంపిన కయీను దేవునికి ఎదురు తిరిగి నరహంతకుడయ్యాడు. కయీను ఇక తన బ్రతుకును ముగించుకుని నిత్యనరకాగ్నికి జారిపోవాలి. కయీను ఇలాగే నాశనమవుతాడని దేవుడు మొట్టమొదట తెలియచేసాడు. ఇప్పుడు ఐఎస్‌ఐఎస్ తీవ్రవాదులు కూడా ఇదే పని చేస్తున్నారు. వారు చంపుతున్న ప్రతి మనిషి యొక్క రక్తము ఆ సిరియా, ఇరాక్ దేశాల నేల నుండి దేవునికి ఇలాగే మొఱపెడుతుంది. వారు చదువుతున్నది కూడా ఇదే పుస్తకం కదా. మరి వారికి ఈ జ్ఞానము ఏనాడైనా అర్థమయిందా? ఇకపోతే వారు నమ్మిన మోషే, ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రాన్ని ఇచ్చినప్పుడు ఆనాడు ధర్మశాస్త్రంలో ఒక ప్రధానమైన ఆజ్ఞను తెలియజేసాడు.

**నిర్గమకాండము 20 : 13 'నరహత్య చేయకూడదు'.** ఇది దేవుడు వ్రాయించిన మాట. నరహత్య చేయకూడదు అని వ్రాయించిన తరువాత, వాడు దుష్టుడైతే నరహత్య చేయవచ్చు అని దేవుడు ఎక్కడైనా వ్రాయించాడా? నన్ను నమ్మని వారినందరినీ నరహత్య చేయవచ్చు అని ఎక్కడైనా వ్రాయించాడా? అలాగైతే ఎంతమంది, ఎంతమందిని చంపేయొచ్చు చెప్పండి. దేవుడు ఆయనను నమ్మకపోతే వారిని సంహరించే పని మనిషికి ఎన్నడూ ఇవ్వలేదు. సంహరిస్తే దేవుడే సంహరించాలి తప్ప, మనిషి మరో మనిషిని చంపే ప్రయత్నం చేయకూడదు. మీరు ఈ విషయాన్ని జాగ్రత్తగా ఆలోచించాలి. అందుకే దేవుడేమన్నాడో చూడండి. 'నరహత్య చేయకూడదు.' ప్రపంచంలో ఉన్న అనేకమంది ఉగ్రవాద సోదరులారా, నామాట ఆలకించండి. మీరు చదివిన నిత్య జీవగ్రంథమైన బైబిల్ ఏమి చెబుతుందంటే, నరహత్య చేయకూడదు. మనిషిని మరొక మనిషి చంపకూడదు. ఒకవేళ చంపిన పక్షంలో మీకు 'జీవించే కళ' తెలియదు. మీరు సరాసరి పోయేది నరకానికే తప్ప, పరలోకం వస్తుందని అనుకోకండి. దానికి మీరు పెట్టుకున్న పేరు జీహాద్ కావచ్చు. దేవుని పేరిట ఒక వ్యక్తిని చంపి దానిని జీహాద్ అంటున్నారు. మనిషిని మరొక మనిషి చంపటం పవిత్ర యుద్ధమా? అది

ఎంత కళంకమైనటువంటి మాట చెప్పండి. దేవుని పేరు పెడుతూ, దేవుడు చంపమన్నాడని చెబుతూ, ఇందులో మా ప్రమేయం ఏమీ లేదని చెబుతూ, ఇది పవిత్ర యుద్ధమంటూ ఈ ఉగ్రవాదులంతా ఒక భయంకరమైన ముసుగులో ఉన్నారు. అందుకే ఈ నిజాలు వారికి తెలియాలి. అందరూ దీనిని అంగీకరించలేక పోయినా, వారిలో కొద్దిమంది అయినా మారాలి. వారందరూ దేవుని పిల్లలు.

**సంఖ్యాకాండము 35 : 33 'మీరుండు దేశమును అపవిత్రపరచకూడదు. నరహత్య దేశమును అపవిత్రపరచును గదా. దేశములో చిందిన రక్తము నిమిత్తము చిందించినవాని రక్తమువలననే ప్రాయశ్చిత్తము కలుగునుగాని మరి దేనివలనను కలుగదు.'** మీరుండే దేశాన్ని మీరు అపవిత్రపరచకూడదు అన్నది దేవుని ఆజ్ఞ. అసలు ఈ సంస్థకు పెట్టబడిన పేరేంటో తెలుసా? ఇస్లామిక్ స్టేట్ ఫర్ ఇరాక్ & సిరియా. అంటే, వీరు ఈ నరమేధాలను జరిగించి, ఇరాక్ దేశాన్ని సిరియా దేశాన్ని అపవిత్రపరుస్తున్నారు. జాగ్రత్త! మీరు అలా దేశాలను అపవిత్రపరచకూడదు. ఎంతమంది అభాగ్యులను, ఎంతమంది అమాయకులను వారు చంపుతున్నారో తెలుసా, అసలు వారికి దేవుడంటే ఎవరో అర్థమవుతుందా? దేవుడు చేయమన్నాడని ఎవడో వారికి దుర్బోధ చేసాడు. వారంతట వారికి వచ్చిన జ్ఞానము కాదది. వారికి సొంతంగా తెలిసిన జ్ఞానము కాదది. వారి మధ్యలో ఎవడో ఒకడున్నాడు, వాడు అతిభయంకరుడు. వాడు ప్రతిరోజూ వారికి ఇదే చెడ్డ పాఠాన్ని చెబుతున్నాడు. మనిషిని చంపు, అదే పవిత్రయుద్ధం అంటున్నాడు. అలా చేస్తే దేవుడు నీకు పరలోకాన్నిస్తాడని నూరిపోస్తున్నాడు. ముంబై దాడుల నిమిత్తం మన దేశానికి వచ్చిన కసబ్, ఇంకా మిగిలినటువంటి ఉగ్రవాదులు, తాజ్ హొటల్‌లో దిగినప్పుడు వారు ఏమనుకుంటున్నారో తెలుసా? వారు పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద మత పెద్దలతో ఫోన్‌లో సంభాషిస్తూ, ఒకప్రక్క ముంబై నగరంలో ఉన్న అనేకమందిని సంహరిస్తూ, ఇలా చేస్తే మాకు పరలోకం వచ్చేస్తుంది కదా! అని అక్కడున్న మత గురువుని అడుగుతున్నారు. ఇండియాలో మేము చాలామందిని చంపేస్తున్నాం, కనుక మాకు పరలోకం వచ్చేస్తుంది గదా! అని అడుగుతున్నారు అమాయకులు. వారు కనీసం అక్షరాస్యత లేనివారు. దేవుడు వారికి తెలియదు, దేవుడు వ్రాయించిన గ్రంథాన్ని వారు చదవరు. వారు చేతుల్లో ఎ.కె.47 మాత్రమే ఉంది తప్ప, వారు చదువవలసిన పుస్తకం లేదు. పవిత్ర గ్రంథమైన బైబిల్ వారి చేతులలో లేదు. ఎవడో పనికిమాలిన దౌర్భాగ్యుడు చెప్పిన మాటలు వింటూ, చేయరాని కార్యక్రమాలను వారు గ్రుడ్డిగా చేస్తున్నారు. వారికి దేవునిపై పరిశోధన లేదు. నిజంగా పరిశోధనే ఉంటే వారు చదివే పుస్తకాలలో ఏ మాటలు వ్రాయబడ్డాయో వారికి అర్థమై ఉండేది. ఇదిగో జీవించే కళలో వ్రాయబడిన ఈ మాటలు చూడండి. **సంఖ్యాకాండము 35 : 33 'మీరుండు దేశమును అపవిత్రపరచకూడదు. నరహత్య దేశమును అపవిత్రపరచును గదా!'** అవును, నరహత్య దేశమును అపవిత్రపరుస్తుంది. అది దేవునికి నచ్చని కార్యక్రమము. దానిని దేవుడు సహించడు. ఎందుకంటే, ఒక మనిషి ఈ భూమిమీదకు రావాలంటే, ఎంతో కష్టంతో తల్లి గర్భంలో ప్రతి అవయవాన్ని నిరూపించుచున్న దేవుడు, ఒక మంచి ఆకారాన్ని ఇచ్చి మనిషిని ఈ బాహ్య ప్రపంచంలోనికి తీసుకుని వస్తున్నాడు. అందుకే ఈ దేహము విషయంలో మనిషి చాలా జాగ్రత్తను కలిగి ఉండాలి. ఈ దేహాన్ని కాపాడుకోవడంలో మనిషి జాగ్రత్తపడాలి. ఒకవైపు ఈ దేహాన్ని పూజించకూడదు, మరొకవైపు ఈ దేహానికి బానిసగా మారకూడదు. ఈ దేహముతో దేవుని సేవను జరిగించాలి. ఈ దేహాన్ని పాడుచేయకూడదు. సిగరెట్ త్రాగకపోతే రోజు గడవని స్థితిలో కొంతమంది ఉంటున్నారు. నీ దేహాన్ని పాడుచేసుకొనే హక్కు నీకు ఎవరిచ్చారు? ఒక చిన్న సిగరెట్ ముక్క, లోనున్న నీ దేహమంతటినీ పాడుచేస్తుంది. నీ అంతరింద్రియములను పాడుచేస్తుంది. నీ ఊపిరితిత్తులను పాడుచేస్తుంది. అలాగని ఈ దేహము మీ సొత్తు కాదు. మన శరీర అవయవాలు బజారులో దొరికేవి కాదు, సూపర్ మార్కెట్‌లో లభ్యమయ్యేవి కాదు. ఊపిరితిత్తులంటే ఏమనుకుంటున్నారు? ఇవి దేవుడు నిర్మించినవి. దేవుడు తన కష్టంతో చేసినవి. నీ తల్లి, నీ తండ్రి వీటిని నీకు ఇవ్వలేదు. 9 నెలల పాటు నీ తల్లి గర్భంలో ఉన్న తరువాత బయటకు వచ్చిన నీవు ప్రాణంతో ఉన్నావని, ఆ కేకలు విన్న తరువాత అప్పుడు నీ తల్లి, నీ తండ్రి, చుట్టూ ఉన్న వైద్యులు, నర్సులు నిన్ను చూసారు. అప్పటి వరకూ అసలు నీవు ఆడో, మగో కూడా తల్లిదండ్రులకు తెలియదు, ఏ ఒక్కరికీ తెలియదు. ఈ రోజుల్లో స్కానింగ్ పరికరాలు వచ్చాయి గనుక గర్భము దాల్చిన ఆరు నెలల తరువాత టిఫా స్కాన్ ద్వారా ఆడో, మగో తెలుసుకుంటున్నారు. అది కూడా మన దేశ చట్టరీత్యా నేరం. ఎందుకంటే, ఆడబిడ్డ అని తెలిస్తే భూమి మీదకు

రాకుండానే దేవుడిచ్చే బహుమానాన్ని చంపేసే దారుణమైన మనుష్యులున్నారు గనుక. కానీ, ఆ లింగనిర్ధారణ ఎవరు చేస్తారో ఎవడికీ తెలియదు. తల్లిగర్భములో నుంచి సజీవంగా బయటకు వచ్చిన తరువాత అందరూ ఊపిరి తీసుకుంటున్నారు. హమ్మయ్య, బిడ్డ బ్రతికాడు, బిడ్డ బ్రతికింది అనుకుంటున్నారు. అప్పటి వరకూ అందరికీ ఒకటే టెన్షన్. గర్భంలోనున్న ఈ శరీరాకృతి మనము తయారుచేసుకున్నది కాదు. ఇది మన సొత్తు కాదు. ఇది అక్షరాలా దేవుడిచ్చింది. ఇది దేవుడిచ్చినప్పుడు, దీనిని ఇంత అద్భుతంగా తయారుచేసి మన చేతికి ఆయన ఇచ్చినపుడు, దీనిని ఎంత చక్కగా కాపాడాలి చెప్పండి? మద్యం తీసుకుంటున్నారు కొందరు. ఎవరో ఒకడు లాభం కోసం నాటుసారా అమ్మితే దానిని తీసుకుని నీ ప్రాణాన్ని తీసుకుంటున్నావా? ఎవరు చెబుతారు నీకు మంచిమాటలు? ఎవరు నేర్పిస్తారు నీకు జీవించే కళను? ఈ ప్రభుత్వం చెబుతుందా? వారికి ఆదాయమే కావాలి. ఎక్సైజ్ శాఖ అని పేరు పెట్టి దానికి ఏకంగా ఒక డిపార్ట్‌మెంట్ ఉంది. మద్యమును మనుష్యులకు అమ్మడానికి ఒక డిపార్ట్‌మెంట్ ఉంది. అలాంటి దేశంలో, అలాంటి రాష్ట్రంలో, అలాంటి ప్రాంతంలో మనము ఉన్నాము. మన చుట్టూ ఉన్న సమాజం భయంకరంగా ఈ మత్తును మన తోటివారికి ఎక్కిస్తుంది. ఈ మీడియా దానికి సహకరిస్తోంది. ఒక సినీ హీరో ఏం చేస్తాడు? వచ్చి స్టైల్‌గా దమ్ము కొడుతుంటాడు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం, పొగత్రాగుట ఆరోగ్యానికి హానికరం అని క్రింద చిన్న అక్షరాలతో వ్రాస్తారు. అసలు ఆ అక్షరాలు భూతద్దం పెట్టి చూచినా సరే కనబడవు. ఎంత చిన్న అక్షరాలో.. అసలు మనము వాటిని చదువుదాము అనుకుంటే, భూతద్దం పెట్టుకొని టి.వి. దగ్గరకో లేక తెర దగ్గరకో వెళ్లాలి. అయినా అసలు అవి మీకు కనిపించవు. అంత చిన్న నలకలలాంటి ఆ అక్షరాలలో త్రాగమని వ్రాసాడో, త్రాగొద్దని వ్రాసాడో కూడా తెలియదు. అసలు ఇంతకీ, అక్కడేదో వ్రాయబడిందని, దానిని చదవాలని సినిమా చూచేవారిలో ఏ ఒక్కరైనా అనుకుంటారా? లేక డబ్బు చెల్లించి టిక్కెట్ కొనుక్కున్నారు గనుక జరిగిపోతున్న సినిమాలో లీనమైపోతారా? ఒకవైపు హీరో చేస్తున్నది మాత్రం వచ్చినవారందరికీ అర్థమైపోతుంది. ముఖ్యంగా యువత, మా అభిమాన హీరో ఒక సిగరెట్ త్రాగితే నేను పది సిగరెట్‌లు త్రాగాలి అనుకుంటారు. వారిది వేడి రక్తం కదా. వాడు ఒక మద్యం బాటిల్ ఎత్తేస్తే, నేను మొత్తం కేస్ అంతా ఎత్తేయాలి అనుకుంటాడు. ఈ మధ్య హీరోయిన్ కూడా మద్యం త్రాగేస్తుందా? అయ్యో నేను మాత్రం తక్కువేంటి? నేనూ త్రాగేస్తాను అనుకునే ఆడవారు లేరనుకుంటున్నారా! ఈ రోజు మన మధ్య ఉన్న కల్చర్ చూసారా? ఎలా మారిపోయిందో గమనించండి. దేవుని సంస్కృతి (గాడ్స్ కల్చర్) తెలియక అభాగ్యులవుతున్నారు.

ప్రియులారా! మీకివ్వబడిన దేహము చాలా విలువైనది. దీనిని దేవుని కొరకు మాత్రమే మీరు వినియోగించాలి. భూమిమీద బ్రతుకుతున్నంత కాలం దీనిని మీరు దేవునికి ఇవ్వగలగాలి. అలాంటి విలువైన దేహాన్ని హత్య చేస్తే దేవుడు ఊరుకుంటాడా? అందుకే ఈ దేశం పాడైపోతుంది జాగ్రత్త అన్నాడు దేవుడు. ఈ రోజు ఇరాక్ దేశంలో కాని, సిరియా దేశంలో కాని అసలు పంటలే లేవు. అక్కడి పరిస్థితి అతి దయనీయంగా మారిపోయింది. ఇక ఈ ఐఎస్ఐఎస్ పరిస్థితి కూడా ఎలా మారిపోయిందో తెలుసా? భూమిలో నుంచి వచ్చే ఆ క్రూడ్ ఆయిల్ మరియు సహజవాయువులు కూడా క్షీణించిపోయాయి. ఎందుకంటే దేవుడు ఆ దేశాలకు శాపమును విధించాడు. ఈ ప్రాంతంలో ఇక నేచురల్ గ్యాస్, క్రూడ్ ఆయిల్ రాకూడదని దేవుడు నిర్ణయించాడు. ఐఎస్ఐఎస్ పరిస్థితి ఎలా ఉందో చూడండి. దేవుడు ఆ దేశాలను శపిస్తున్నాడు. వారేమి చేస్తున్నారో తెలుసా? ఐఎస్ఐఎస్ వారు చికెన్ అమ్ముతున్నారు. ఎంత దయనీయకరమైన స్థితికి దిగజారిపోయిందో చూడండి. ఐఎస్ఐఎస్ ప్రారంభం అయినపుడు వీరు వైభవం ఏమిటో తెలుసా? కోట్ల రూపాయల ఆస్తులు వీరి వెనుక ఉన్నాయి. కానీ ఇప్పుడు చికెన్ అమ్ముకునే పరిస్థితి వచ్చేసింది. ఎందుకంటే, వారికి వచ్చే ఆదాయాన్ని దేవుడు నిలుపుదల చేసాడు. నరహత్యల వలన దేశం శపింపబడుతుంది. దేశాలను దేవుడు శపిస్తున్నాడు. ఆ తరువాత అవయవాల వ్యాపారంలో ఐఎస్ఐఎస్ అనే మరో వార్త వచ్చింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు చికెన్ అమ్ముకుంటున్నారు, అవయవాలను అమ్ముకుంటున్నారు. ఇంకా చాలా చిన్న చిన్న పనులు చేస్తున్నారు. ఆకలి చావులు చస్తున్నారు. ఎందుకంటే వారికి ఆదాయం రావడం లేదు. వారిలోవున్న సభ్యుల యొక్క అవయవాలను వారే అమ్మేసుకుంటున్నారు. నల్ల బజారులో కళ్ళు అమ్ముకుంటున్నారు, కిడ్నీలు అమ్ముకుంటున్నారు. ఇది ఎందుకో తెలుసా? దేవుడు వ్రాయించిన మాటను బట్టి ఇవన్నీ జరుగుతున్నాయి. వారు చదువుతున్న గ్రంథంలోనే

దేవుడు ఏమన్నాడో చూడండి. 'మీరుండు దేశమును అపవిత్రపరచకూడదు. నరహత్య దేశమును అపవిత్రపరచును గదా. దేశములో చిందిన రక్తము నిమిత్తము చిందించినవాని రక్తమువలననే ప్రాయశ్చిత్తము కలుగునుగాని మరి దేనివలనను కలుగదు.' ఇది వారికి తెలియాలి, ఇది వారికి అర్థం కావాలి. నరహత్య దేవునికి అసహ్యమైన కార్యక్రమం.

**కీర్తనలు 5 : 6 'అబద్ధమాడువారిని నీవు నశింపచేయుదువు. కపటము చూపి నరహత్య జరిగించువారు యెహోవాకు అసహ్యులు.'** ఈ రోజు ప్రపంచమంతటిని ఏ దేవునిని నమ్మమని వారు అడుగుతున్నారో, ఏ దేవునిని నమ్మకపోతే అందరినీ చంపేస్తున్నారో, వారు నమ్మిన ఆ దేవుడు ఏమంటున్నాడో తెలుసా! 'కపటము చూపి నరహత్య జరిగించువారు యెహోవాకు అసహ్యులు' అంటే దేవుని నమ్మించడానికి, మనుష్యులను హత్య చేస్తే ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులందరూ దేవునికి అసహ్యులన్నమాట. ఇప్పుడు ఈ మాట వారికి మింగుడు పడుతుందా? ఏ దేవుని కొరకు మేము పవిత్ర యుద్ధం చేస్తున్నామని వారంటున్నారో ఆ దేవునికి వారు అసహ్యము అయిపోయారు. ముందుగా ఇదంతా వారికి వివరించి చెప్పాలి. వీరొక భయంకరమైన మాయలో ఉన్నారన్న సంగతి వారికి తెలియజేయాలి. మా తండ్రి, మా దేవుడు మాకు పరలోకం ఇవ్వడా? ఈ నల్లగుడ్డలు కట్టుకుని, ఈ నల్లని దుస్తులతో మేము ఎడారిలో ఈ తుపాకీలు పట్టుకుని ఎప్పుడు చచ్చిపోతామో తెలియక, ఏ బాంబు దాడితో ప్రాణమును కోల్పోతామో తెలియక, కుటుంబాలను, సమాజాన్ని విడిచి వచ్చి, ఇంత భయంకరమైన పరిస్థితులను మేము అనుభవిస్తున్నది ఆ పరలోకం కోసమే కదా! మా తండ్రికి మేము అసహ్యులమా? మా దేవుని దృష్టికి మేము నీచులమా? అని వారు అడిగితే, అవును అని చెప్పాలి! వారు చదువుతున్న గ్రంథాన్ని తెరవాలి. ఆ గ్రంథములో వ్రాయబడిన ప్రకారము ప్రతిరోజు ప్రార్థనలు చేస్తున్నారు, ఆ ప్రార్థనలు చేసేముందు దేవుడు వ్రాయించిన పుస్తకాన్ని చదవాలి. ఆ పుస్తకంలో ఈ మాట ఉంది. నరహత్య చేస్తే మీ దేశం పాడవుతుంది. మీకు కనీసం తిండి కూడా దొరకదు. మీ దేవునికి మీరు అసహ్యులు అయిపోతారు. నరహత్యను చేసి ఒకరిని ఒకరు చంపుకుందాము అనుకుంటున్నారు. ఇస్లామిక్ స్టేట్ ఫర్ ఇరాక్ & సిరియా ద్వారా ఈ రెండు పట్టణాలను ప్రపంచానికి చూపించాలి అనుకుంటున్నారు. ఆ రెండు పట్టణాల ద్వారా ఈ ప్రపంచాన్ని భయపెట్టాలి అనుకుంటున్నారు. దేవుడు వీరి యొక్క భవిష్యత్‌ను ముందే చెప్పేశాడు. ఇలాంటి వారు పుడతారని, ఇలాంటివారు మన మధ్య ఉంటారని దేవుడు ఏనాడో వ్రాయించాడు. ఆయన గ్రంథము జీవించే కళను కలిగిన గ్రంథము.

**హబక్కూకు 2 : 12 'నరహత్య చేయుటచేత పట్టణమును కట్టించువారికి శ్రమ. దుష్టత్వము జరిగించుటచేత కోటను స్థాపించువారికి శ్రమ.'** ఈ రోజు నరహత్య చేయుట చేత పట్టణాలను కట్టిస్తున్నారా? అవును. ఇస్లామిక్ స్టేట్ ఫర్ ఇరాక్ & సిరియా ద్వారా ఈ రెండు పట్టణాలను ఐఎస్ఐఎస్ వారు కట్టిద్దాం అనుకుంటున్నారు. చూసారా? దేవుడు కొన్ని వేల సం॥ల క్రితమే ఈ మాటను తన గ్రంథములో వ్రాయించాడు. హబక్కూకు గ్రంథములో ఈ మాట ఎంత భద్రముగా నిక్షిప్తమయిందో చూడండి. నరహత్య చేయుట చేత పట్టణములు కట్టువారికి శ్రమ. దుష్టత్వము జరిగించుట చేత కోటను స్థాపించువారికి శ్రమ. వారికి పరలోకం లేదు. వారు చనిపోతే వారికేదో ఆనందం, వారికేదో నిత్యజీవం అనుకుని వారు భ్రమ పడుతున్నారంతే. అనేకమందిని చంపేస్తున్న వారి కొరకు ఎదురుచూస్తుంది శ్రమలే తప్ప, ఆనందము కాదు. ఉగ్రవాదులందరినీ, తీవ్రవాదులందరినీ, నక్సలైట్లు అందరినీ, మావోయిస్టులందరినీ నా సహోదరులుగా భావించి, వారి భవిష్యత్తును కోరి వారిని ప్రేమించి ఈ మాటలు నేను చెబుతున్నాను. ఈ మాటల ద్వారా ప్రతి మనిషికి 'జీవించే కళ' తెలియాలి. సాటి సహోదరుని చంపాలి అని ఎన్నడూ అనుకోకూడదు. అవసరమైతే నీ ప్రాణమిచ్చి అతనిని బ్రతికించాలి.

ఇప్పటి వరకు పాత నిబంధన గ్రంథములో దేవుడు చెప్పిన మాటలను విన్నారు. ఈ మాటలన్నీ వారియొద్ద కూడా ఉన్నాయి. కానీ, వారి దగ్గర లేని పరిపూర్ణమైన మాటలు ఇంకా క్రొత్త నిబంధనలో ఉన్నాయి. ఇప్పుడు అసలైన కథానాయకుడు వస్తున్నాడు. ఆయనే యేసుక్రీస్తు. యేసుక్రీస్తు జీవించే కళ చెప్పాడంటే వినే ప్రతీ ఒక్కడికి మైండ్ బ్లాక్ అవుతుంది. పాత నిబంధన గ్రంథంలో ప్రవక్తల ద్వారా దేవుడు చెప్పాడు. ఇప్పుడు స్వయంగా దేవుని కుమారుడు మాట్లాడుతున్నాడు. దేవుని మనస్సును పూర్తిగా విప్పుతున్నాడు. ఇశ్రాయేలీయులకు దేవుడు పూర్తిగా తెలియలేదు. దానియేలుకు తెలియదు, యెషయాకు తెలియదు, దావీదుకు తెలియదు. అందరికీ దేవుడు కొద్ది కొద్దిగానే తెలుసు.

నరహత్య చేయకూడదు అన్నంత వరకే వారందరికీ తెలుసు. అది కూడా ఈ ఐఎస్ఐఎస్ వారికి తెలియదు. ఈ ఆల్‌ఖైదా వారికి అదికూడా అస్సలు తెలియదు. నేడున్న మనిషి పరిపూర్ణమైన జ్ఞానములోనికి వెళ్లాలి. అందుకే యేసుక్రీస్తు దేవుని కుమారునిగా వచ్చాడు. దేవుని మనస్సు పరిపూర్ణంగా తెలియజేయడానికి వచ్చాడు. పరలోకము నుండి భూమి మీదకు ఆయన కుమారుడు రావలసిన అవసరం ఏమిటి చెప్పండి. అప్పటికే దావీదు వచ్చేసాడు, మోషే వచ్చేసాడు, అబ్రాహాము వచ్చేసాడు, ప్రవక్తలందరూ వచ్చేసారు. మరల యేసుక్రీస్తు ఎందుకొచ్చాడు? వీరెవ్వరూ చెప్పలేని దేవుని మనస్సును యేసుక్రీస్తు మాత్రమే తెలియజేయాలి. ఆ తండ్రి జ్ఞానమును పూర్తిగా బయలుపరచగల ఏకైక కథానాయకుడు యేసుక్రీస్తు మాత్రమే. అందుకే ఈ నరహత్యను గూర్చి ఆ యేసు ఏమి చెబుతున్నాడో ఒకసారి చూద్దాం. 'జీవించే కళ'ను మనిషికి ఎలా నేర్పుతున్నాడో చూద్దాం.

**మత్తయి సువార్త 5 : 21- 'నరహత్య చేయవద్దు, నరహత్య చేయువాడు విమర్శకులోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా! మీతో నేను చెప్పునదేమనగా, తన సహోదరుని మీద నిర్నిమిత్తముగా కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును. తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును. ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును.'** చూసారా! నరహత్య చేయవద్దని దేవుడు పూర్వకాలంలో చెప్పిన మాటలే ప్రవక్తలకు, నీతిమంతులకు తెలుసు. వారికి అంతవరకే వచ్చు. నరహత్య చేయవద్దు, నరహత్య చేయువాడు విమర్శకు లోనగును. కానీ, యేసుక్రీస్తు వచ్చిన తరువాత ఈ లోకానికి ఆయన చెప్పునదేమనగా, ఆయన తన తండ్రి దగ్గర విని వచ్చినదేమంటే, తన సహోదరుని మీద నిర్నిమిత్తముగా కోపపడు ప్రతీవాడు విమర్శకు లోనగును. యేసుక్రీస్తు తన తండ్రి మనస్సును, ఆయన మనస్సులోని మాటలను ఉన్నవి ఉన్నట్టుగా చెప్పడానికి వచ్చాడు. అంటే నీవు నీ సహోదరుని నరహత్య చేస్తే, అతడిని చంపేస్తే, నీవు వాని రక్తమును కళ్ల చూస్తే, అది నరహత్య చేసినట్టు, మరియు అది దేవునికి అసహ్యం. అది అప్పటి కాలమునకు అనగా, పాత నిబంధన కాలము, ధర్మశాస్త్ర కాలమునకు సరిపోయిన జ్ఞానము. కానీ, ఇప్పుడు యేసుక్రీస్తు పరిపూర్ణముగా దేవుని మనస్సు చెప్పడానికి వచ్చాడు. జీవించే కళను మనుష్యులకు నేర్పించడానికి వచ్చాడు. ఇప్పుడు దేవుని సంస్కృతి ఏమని చెబుతుందో తెలుసా? నీ సహోదరుని మీద నిర్నిమిత్తముగా, అనగా సరియైన కారణం లేకుండా అసలు నీవు కోపపడకూడదు. ఈ రోజు మనము ఎన్నుకున్న మన ప్రజాప్రతినిధులు, వారి నోట బూతు మాటలను మనము వింటున్నాము. అసెంబ్లీలో నుండి వారిని నిషేధించేస్తున్నారు. ప్రజాప్రతినిధుల నోట బూతులు రావచ్చా. రాకూడదు. రాష్ట్ర అసెంబ్లీలో మనము ఎన్నుకున్న అధికారపక్షమును ఒకవైపు, ప్రతిపక్షాన్ని మరొకవైపు నిలబెట్టి మాట్లాడుకోమంటే వారు కాట్ల కుక్కల్లా పోట్లాడుకుంటున్నారు. అసలు వారు ఒక్కొక్కసారి మనుష్యుల్లానే వుండరు. మరి ఇలాంటి వారికి 'జీవించే కళ' తెలుసా? ఒకరైతే అసెంబ్లీలోనే, నిన్ను చంపేస్తాం అంటున్నారు. సి.సి. టివి ఫుటేజ్ తీసుకొస్తే ఒక ఎం.ఎల్.ఎ. మరో ఎం.ఎల్.ఎ.ని చంపేస్తాను అంటున్నాడు. ఏంటిది? వీరందరూ ముందుగా 'జీవించే కళ' ను నేర్చుకోవాలి. నీ సహోదరుని మీద నీవు నిర్నిమిత్తముగా కోపపడకూడదు. 'జీవించే కళ'ను ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులందరూ నేర్చుకోవాలి. దేవుడు మీకు పరలోకాన్ని ఇవ్వాలంటే, మీరు 'జీవించే కళ'నే నేర్చుకోవాలి తప్ప మనిషిని చంపడానికి మీకు హక్కులు లేవు. ప్రతి దేశానికి ఐఎస్ఐఎస్ ఒక పీడ కలలా మారిపోయింది. ఏ నిమిషంలో ఏ దేశంలో ఎవరి మీద ఎలా విరుచుకు పడుతుందో ఎవ్వరికీ తెలియదు. ఇందులో మన భారత దేశమేమైనా తప్పించుకుందనుకుంటున్నారా? వారు మన భారతదేశం మీద కూడా కన్నేసారు. ఇక్కడ ఉన్నటువంటి నిరుద్యోగ యువతను వారు ఆకర్షిస్తున్నారు. వారికి ఐఎస్ఐఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపిస్తున్నారు. సిరియా దేశంలో, ఇరాక్ దేశంలో, వారి చుట్టుప్రక్కల ఉన్న దేశాలలో ఉద్యోగాలను, వసతిని, విలాసవంతమైన జీవితాన్ని కల్పిస్తాము అని మభ్యపెడుతున్నారు. పైగా ఇది దేవుని యొద్దకు పరలోకమార్గం అంటూ కొంతమంది అమాయకపు యువతను భారతదేశం నుండి కూడా వారు ఆకర్షిస్తున్నారు. దీనిని మన దేశపు ఇంటిలిజెన్స్ సంస్థ బట్టబయలు చేసింది. మనవారు అక్కడకు వెళ్లారంటే ఖచ్చితంగా ఇక్కడ కూడా మారణకాండను వారు సృష్టిస్తారు. ప్రియులారా! ఇప్పుడు ఇలాంటి పరిస్థితులలో కూడా మనము భజన చేసుకుందామా? ఇప్పుడు కూడా మనము గోల, గొడవలలో ఉందామా? ఇప్పుడు కూడా దేవుని అడ్డుపెట్టుకుని ఒక దండుకునే కార్యక్రమంలో ఉందామా? ఒక సహోదరుని మీద కారణం

ఉంటేనే, అది కూడా దైవకారణమైతేనే కోపపడాలి. ఒకానొక సందర్భంలో యేసుక్రీస్తు కూడా పేతురు మీద కోపపడ్డాడు. సాతానా, నా వెనుకకు పొమ్మన్నాడు. యేసుక్రీస్తు దేవాలయంలో రూకలమ్మే వారిమీద కోపపడ్డాడు. ఎందుకని? దైవికంగా వారిని మార్చడానికి, వారిని దేవుని క్రమశిక్షణలో పెట్టడానికి మాత్రమే వారి మీద కోప పడ్డాడు. వారు వింటే మారతారు, వినకపోతే పోతారు. అంతే కానీ, నిర్నిమిత్తముగా ఒక సహోదరుని మీద అస్సలు కోపపడకూడదు. అలాచేస్తే నీవు నరహత్య చేసినట్టే అన్నాడు. ఆయన ఎంత మహోజ్ఞానమును చెప్పాడో చూడండి. అసలు ఇప్పుడు నీవు నరహత్య చేయాలంటే, ఎ.కె.47 పట్టుకోనక్కరలేదు. నీవు గ్రెనేడ్‌ల వరకు వెళ్లనక్కరలేదు. కేవలం నీ సహోదరుని మీద కోపపడితే చాలు. నీవు పరలోకం వెళ్ళకుండా, నీవు నిత్యజీవానికి వారసుడవు కాకుండా పోవాలంటే, నిర్నిమిత్తముగా నీ సహోదరుని మీద కోపపడితే చాలు. దేవుడు నిన్ను ఆ నీతిమంతుల జాబితాలోనుంచి తీసేస్తాడు. ఇప్పుడు చెప్పండి. ఐఎస్ఐఎస్ వారు ఎంతగా మార్పుచెందాలో, వారు దేవునిని ఎంత గొప్పగా అర్థం చేసుకోవాలో! వారి ఆగడాలు ఇన్నీ, అన్నీ కాదండి. ఈ రోజు ప్రపంచానికే వారు టెర్రర్ పుట్టించారు. బ్రెజిల్‌లో మారణకాండలు, ఇటలీ దేశంలో రక్తపాతం, ఫ్రాన్స్ దేశంలో దాడులు,... ఇలా దేశాలన్నీ రక్తమోడటాన్ని ఇటీవల వార్తలలో మీరు చూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అమాయకులందరూ ప్రాణాలు కోల్పోతున్నారు. కానీ ఏమి చెయ్యాలో ఎవ్వరికీ అర్థంకావడం లేదు. వీరినెలా అదుపు చేయాలో ఎవ్వరికీ తెలియడం లేదు. కాబట్టి, ఇక మాకు తెలిసిన చివరి ప్రయత్నంగా మనము కూడా ఐఎస్ఐఎస్ వారిని చంపేద్దాం అనుకుంటున్నారు. వారు మనల్ని చంపుతున్నారు గనుక మనము కూడా వారిని చంపేద్దాం అంటున్నారు. వారి మీద ఉక్కు పాదం మోపుదామంటున్నారు. ఎన్ని రోజులని ఇలా చేస్తారు? ఇది శాశ్వత పరిష్కారమా? ఆ రోజు ఆల్‌ఖైదా మీద ఉక్కు పాదాన్ని మోపారు. ఆ తరువాత ఐఎస్ఐఎస్ పుట్టింది. ఐఎస్ఐఎస్ మీద ఉక్కుపాదాన్ని మోపుతున్నారు. ఆ తరువాత మరొకటి పుట్టదా? శాశ్వతమైన వైద్యం చేయలేరా? శాశ్వతమైన పరిష్కారాన్ని ఈ లోకానికి చెప్పరా? జీవించే కళను కలిగిన యేసుక్రీస్తు మాటలు మత్తయి సువార్తలో ఒక మతంగా ఉండిపోవాలి అనుకుంటున్నారా? యేసుక్రీస్తు చెప్పింది మతం కాదు. ఇది కేవలం దేవుని సంస్కృతి. నీ సహోదరుని మీద నిర్నిమిత్తముగా కోపపడకూడదు, అవసరమైతే ప్రతి వ్యక్తిని రక్షించాలి. ఇందులో ఎవ్వరూ అతీతులు కారు. ఒక ఉగ్రవాదికి భయపడటం ఎందుకు చెప్పండి. దేవుడు ఎవరికి భయపడమన్నాడో తెలుసా? భూమి మీద మిమ్మును చంపేవారికి మీరు భయపడవద్దు, దేహమును చంపేవారికి భయపడవలసిన అవసరత లేదు. ఇది దేవుడు పలికిన మాట. అందుకే నేను దానిని మాత్రమే నమ్మాను. దేహమును చంపువారికి మీరు భయపడకుండా, మీ ఆత్మను, దేహమును కూడా నరకంలో నశింపచేయగలవారికి మీరు మిక్కిలి భయపడుడి అన్నాడు యేసుక్రీస్తు. మనము మిక్కిలి భయపడవలసినది ఎవరికి అంటే, ఆయనే 'ది గాడ్'. ఆయన అనుకుంటే ఎవ్వరినీ భూమిమీద లేకుండా చేస్తాడు. ఏ ఒక్కరికీ పరలోకము రాకుండా చేస్తాడు. ఆత్మ నిత్య నాశనానికి వెళ్ళిపోతుంది. ఇక భూమి మీద బ్రతుకంటారా 70, 80 యేళ్ల తరువాత నిన్నూ, నన్నూ ఎవ్వరూ చంపక పోయినా మనము వెళ్ళిపోవాలి. 70 యేళ్ళ తర్వాత ఎవ్వరూ మనలను చంపనక్కరలేదు. మనంతట మనమే వెళ్ళిపోవాలి. ఇక్కడ మనము శాశ్వతంగా నిత్యమూ ఉండిపోతామా? యేసుక్రీస్తు వెళ్లిపోయాడు, అబ్రాహాము వెళ్లిపోయాడు, దావీదు వెళ్లిపోయాడు, నీతిమంతులందరూ వెళ్లిపోయారు. మనము కూడా ఆ జాబితాలో వెళ్లిపోవాలి. భూమిమీద మరణానికి మనము భయపడకూడదు. మనము దేవుని వాక్యాన్ని ప్రకటిస్తూ, బ్రతుకు పరమార్థాన్ని అనేకులకు తెలియజేయాలి. మనం ఉన్నది అందుకే. ఉగ్రవాదులను నాశనం చేయడం మన పని కాదు. వారితో శత్రుత్వం పెట్టుకోవటం మన నైజం కాకూడదు. మనము వారికి దేవుని మాటలను నేర్పించాలి. ఖచ్చితంగా దేవుని మాట ప్రతి ఒక్కరికీ వైద్యం చేస్తుంది. మీరు చూస్తూ ఉండండి. ఖచ్చితంగా దేవుని మాట మనిషిని బ్రతికిస్తుంది. ఐఎస్ఐఎస్‌లో ఉన్న కొంతమంది తీవ్రవాదులైనా ఈ దేవుని మాటలకు మారతారు. ఈ మాటలు విన్న తరువాత వారు మారి ఆ ఉగ్రవాద సంస్థను కూడా మార్చాలి. 'జీవించే కళ' ను దేవుడే నేర్పించాడు. ఒకరిని ఒకరు చంపుకోవటం జీవించే కళ కాదు. దానిని చూచిన మన దేవుడు హర్షించడు, ఆనందించడు. అది దేవుని కార్యక్రమం కాదు. నరమేధం దుష్టుని కార్యక్రమం. దుష్టుడే ఒకని మీద ఒకడిని పగపెట్టుకొనేలా చేసి, ఒకడిని ఒకడు చంపుకొనేలా చేస్తున్నాడు. అది సాతాను కార్యక్రమం! కానీ దేవుడు ఏనాడూ మనిషిని చంపమని చెప్పలేదు. మీరు బైబిల్‌ను పూర్తిగా చూడండి. ఆదికాండము నుంచి ప్రకటన గ్రంథం

వరకూ మీరు ఎక్కడ చూచినా, ఏ మనిషీ మరో మనిషిని ఏ పరిస్థితిల్లోనూ చంపకూడదని దేవుడు చెప్పాడు. మనిషిని మనిషి చంపకూడదు. కనీసం ఆ వ్యక్తి మీద నిర్నిమిత్తముగానైనా కోపపడకూడదని యేసుక్రీస్తు పరిపూర్ణమైన జ్ఞానాన్ని అనుగ్రహించాడు. మరల అదే యేసు, తన శిష్యులతో ఏమి చెబుతున్నాడో తెలుసా? జీవించే కళలో భాగముగా, రెండు వేల సం॥ల క్రితం ఆయన ఉగ్రవాద రహస్యాన్ని చెబుతున్నాడు. ఉగ్రవాదాన్ని గూర్చి ఆయన పలికిన మాటను చూడండి.

**యోహాను సువార్త 16 : 2- 'వారు మిమ్మును సమాజ మందిరములలో నుండి వెలివేయుదురు. మిమ్మును చంపు ప్రతివాడు తాను దేవునికి సేవ చేయుచున్నానని అనుకొను కాలము వచ్చుచున్నది. వారు తండ్రిని, నన్నును తెలుసుకొనలేదు గనుక ఈలాగు చేయుదురు. అవి జరుగు కాలము వచ్చినప్పుడు నేను వాటిని గూర్చి మీతో చెప్పితినని మీరు జ్ఞాపకము చేసుకొనులాగున యీ సంగతులు మీతో చెప్పుచున్నాను.'** వారు తాము దేవుని కొరకే బ్రతుకుతున్నాము అనుకుంటున్నారు. వారు మిమ్మును సమాజ మందిరములలో నుండి వెలివేయుదురు. మిమ్మును చంపు ప్రతివాడు, అనగా ప్రతి ఉగ్రవాది, ఈ చంపటం వలన తాను దేవునికి సేవ చేయుచున్నానని అనుకొను కాలము వచ్చుచున్నది అన్నాడు యేసుక్రీస్తు. అంటే ఆయన భవిష్యత్తును చెప్పాడు. మిమ్మును చంపిన తర్వాత వాడేమనుకుంటాడో తెలుసా? నేను దేవునికి సేవ చేసాననుకుంటాడు. అవును. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా మారణకాండను సృష్టిస్తున్న ఉగ్రవాదులందరూ అదే అనుకుంటున్నారు. భారత దేశానికి వచ్చిన ఉగ్రవాదులందరూ అదే అనుకున్నారు. ఫ్రాన్స్ దేశానికి వెళ్లిన ఉగ్రవాదులందరూ అదే అనుకున్నారు. డబ్ల్యు.టి.సి. టవర్స్‌ని కూల్చడానికి విమానాన్ని హైజాక్ చేసిన ఉగ్రవాదులంతా అదే అనుకున్నారు. హైజాక్ చేయబడినటువంటి ఆ విమానంలో ప్రయాణించిన ఆత్మాహుతులందరూ ఆనాడు అదే అనుకున్నారు. మేము చనిపోతే దేవునికి సేవ చేసినట్టు గనుక మేము పరలోకం వెళ్ళిపోతున్నాము అనుకుంటున్నారు. యేసుక్రీస్తు చెప్పినదే అక్షరాలా జరుగుచున్నది చూడండి. మిమ్మును చంపు ప్రతివాడు తాను దేవునికి సేవ చేయుచున్నాననుకొను కాలము వచ్చుచున్నది. వారు తండ్రిని, నన్నును తెలుసుకొనలేదు గనుక ఈలాగు చేయుదురు. వారికి దేవుడు అర్థం కాలేదన్నమాట. వారికి యేసుక్రీస్తు తెలియలేదన్నమాట. వారు ఒక భయంకరమైన ముసుగులో ఉన్నారు. తండ్రికి సేవ చేస్తున్నాం అనుకుంటున్నారు, మేము ఆ తండ్రికి పిల్లలము అనుకుంటున్నారు. కానీ, వారు నిజంగా ఆ తండ్రిని తెలుసుకొనలేదు. అంటే పాతనిబంధనలో వ్రాయబడిన ఏ ఒక్క మాటా వారికి అర్థం కాలేదు. ఇదిగో, దేవుని కుమారునిగా వచ్చి, తండ్రి మనస్సును పూర్తిగా చెప్పిన యేసుక్రీస్తును కూడా వారు సరిగా అర్థం చేసుకోలేదు. ఇదిగో ఇప్పుడు యేసుక్రీస్తు చెప్పినవన్నీ జరుగుతున్నాయి చూడండి. యేసు ఆనాడు చెప్పాడు, ఈనాడు మన మధ్య జరుగుచున్నాయి చూడండి. ఇవన్నీ జరుగుకాలము వచ్చినప్పుడు నేను వాటిని గూర్చి మీతో చెప్పితినని మీరు జ్ఞాపకం చేసుకొనులాగున యీ సంగతులు మీతో చెప్పుచున్నాను అన్నాడాయన. యేసుక్రీస్తు ముందుగా ఉగ్రవాదానికి సంబంధించిన భవిష్యత్తును చెప్పేసాడు. ఉగ్రవాద రహస్యాన్ని చెప్పేసాడు. ఉగ్రవాదులు ఎందుకు పుడతారో, ఉగ్రవాదులు ఎందుకు మనుష్యులను సంహరిస్తారో ఆయన ముందే చెప్పాడు. ఇప్పుడు మనమేమి చెయ్యాలి? వారికి ఈ జ్ఞానమును నేర్పించాలి. వారికి వారి అసలైన తండ్రిని పరిచయం చేయాలి. ఆ తండ్రికి కుమారుడుగా వచ్చిన యేసుక్రీస్తును వారికి పరిచయం చేయాలి. అప్పుడు వారు మారి తీరాలి. ఏ పరలోకం కోసమైతే వారు ఇంతటి నరమేధాన్ని సృష్టిస్తున్నారో, ఆ పరలోకమును ఇవ్వటానికి దేవుడు వ్రాయించిన మాటలను వారు చదవాలి. వారందరూ మారాలి. సమాజమంతటినీ ఈ జీవించే కళ కలిగిన మార్గములో మనమే పెట్టాలి.

కేవలం ఉగ్రవాదులే కాదు. మన మధ్య కూడా అలాంటి వారున్నారు చూడండి. చిన్న స్థలం ముక్క కోసం ఒకడిని ఒకడు పొడుచుకుంటున్నారు. శరీర కోరికలను తీర్చుకోవడానికి భార్య భర్తను పొడిచేస్తుంది, భర్త భార్యను పొడిచేస్తాడు. ఏమిటండీ ఇది? ఒకడిని ఒకడు చంపుకునే ఒక దౌర్భాగ్యపు సమాజంలో ఉన్నాము మనం. సాటి వ్యక్తి ఎంత భయంకరుడైనా సరే, వానిని చంపే హక్కు, అధికారం మనకు లేదు. ఒక కోడిని చంపుకోండి, చికెన్ బిర్యాని తినండి. ఒక మేకను చంపుకోండి, మటన్ బిర్యాని తినండి. మనిషిని ఎందుకండీ చంపుతున్నారు? ఒక చిన్న పదవి కోసం ఒకడిని మరొకడు చంపేస్తాడు. ఒక చిన్న బిల్డింగ్ కోసం ఒకడిని మరొకడు చంపేస్తాడు. కరెన్సీ కాగితాల కోసం ఒకడిని మరొకడు చంపేస్తాడు. తీవ్రవాదులే భయంకరులు అనుకుంటున్నారా? ఇక్కడ మన మధ్య వారి కంటే భయంకరులు

ఉన్నారు. వీరందరూ మన మధ్యనే తిరుగుతున్న తీవ్రవాదులు. నల్లగుడ్డ కట్టుకోకుండానే సమాజంలో దర్జాగా తిరుగుతున్నారు. వీరేదో పవిత్రులు అనుకుంటున్నారా? వీరేదో గొప్పవారనుకుంటున్నారా? వీరు అంతకంటే భయంకరులు. ఒక రకంగా నల్లగుడ్డలేని ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు వీరే. వీరు మారాలి. వీరికి 'జీవించే కళ' తెలియాలి. నీ చుట్టూ ఉన్న మనుష్యజాతిని నీవు కాపాడాలి. దేవుడు నీకిచ్చిన ఆయుష్కాలంలో నీవు చక్కగా బ్రతకాలి. నీవు 'జీవించే కళ'ను తెలుసుకుని బ్రతకాలి. ఎందుకంటే మీ దేవుడు ఎలాంటివాడో తెలుసా? పరలోకమందున్న మన తండ్రి మనసేంటో తెలుసా? ఆయన మనస్సు చూడండి. ఆయన మనస్సు చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. అసలు మీకు ఎవరినీ ద్వేషించాలి అని అనిపించదు. మీకు ఎవరి మీద కోపపడాలి అని అనిపించదు. ఎందుకంటే ఆయనది అంత గొప్ప మనస్సు.

**మత్తయి సువార్త 5 : 45 'ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపచేసి, నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు.'** ఆయన ఎవరిమీద తన సూర్యుని ఉదయింప చేస్తున్నాడు? కేవలం మంచి వారి మధ్యే సూర్యరశ్మి పడుతుంది అనుకుంటున్నారా? మిగిలిన వారి మీద చీకటి పడుతుందనుకుంటున్నారా? లేదండి. ఆయన అందరికీ మంచిని చేస్తున్నాడు. అలాగని ఆయన మంచివారి మీదను, చెడ్డవారి మీదను అనకుండా, ముందుగా చెడ్డవారిమీద, ఆ తరువాత మంచి వారి మీద అని వ్రాయించాడు చూడండి. అంటే, మొట్టమొదట ఎవరు పేరు పెట్టాడు? చెడ్డవారు! చెడ్డవారిని మొదట ప్రయోగిస్తూ ఆయన చెడ్డవారిమీదను, మంచివారి మీదను, నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను, తన సూర్యుని ఉదయింపజేసి, తన వర్షమును కురిపించుచున్నాడు. అంటే ఆయనకి పక్షపాతం ఉందా? నిజంగా మాట్లాడుకుంటే భూమిమీద ఆయనకి వ్యతిరేకంగా, మూర్ఖంగా, విరుద్ధంగా బ్రతుకుతున్నవారిని ఈ భూమిమీద నుండి ఆయన తీసేయాలి. అలాంటి వారినందరినీ సంహరించాలి అనుకుంటే ఆయనకి ఒక్క నిమిషం చాలు. చంపడానికి మనమెందుకండీ ముందుకెళ్లిపోతున్నాము? మనమెందుకండీ మన సహోదరులను చంపి ఆ పాపాన్ని మనకు కట్టుకుంటున్నాము? నరహత్య అనేటువంటి పాపాన్ని మన మీద వేసుకుంటున్నాము. అలా వేసుకోకూడదు. ఎందుకంటే మన తండ్రి ఎలాంటి వాడో తెలుసా? భూమి మీద ఉన్న జీవితకాలంలో అందరికీ ఉష్ణోగ్రతను, వేడిని, కాంతిని, వర్షమును, బ్రతుకును, తిండిని ఆయన సమానంగా అనుగ్రహిస్తున్నాడు. చెడ్డవారికి ఆయన తన శిక్షను తరువాత అమలు చేస్తాడు. భూమి మీద ఆయన యిచ్చిన ఆయుష్కాలములో దేవుడు అందరినీ కాపాడుతున్నాడు. దేవుని నమ్ముకుంటే నేను బిల్డింగ్ కట్టుకుంటానేమో, దేవున్ని నమ్ముకుంటే నేను పొలం కొనుక్కుంటానేమో, దేవున్ని నమ్ముకుంటే నాకు అష్టఐశ్వర్యాలు వచ్చేస్తాయేమో అని ఒకవేళ మీరనుకోవచ్చు. అలా అయితే దేవుని నమ్మని వాడు మీకంటే ఎక్కువ బిల్డింగ్‌లు కడుతున్నాడు. ఎందుకని? వాడు బాప్తిస్మము తీసుకోలేదు, వాడు కానుకలివ్వడం లేదు, వాడు మోకాళ్ళ ప్రార్థన ఎప్పుడూ చేయలేదు, వాడు ఎన్నడూ బైబిల్ చదువలేదు. మరి వాడెందుకు బిల్డింగ్‌లు కడుతున్నాడు? వాడెందుకు ధనవంతుడవుతున్నాడు? మీకంటే చాలా గొప్పవాడవుతున్నాడు. మీకంటే బోలెడు బంగారం కేజిల లెక్కన వాడిదగ్గరే ఉంది. దేవుని నమ్ముకుంటే ఇవన్నీ వస్తాయి అనుకుంటే పొరపాటు. దేవుడు అందరినీ సమానంగా చూస్తున్నాడు. ఈ భూమి మీద బంగారమో, కరెన్సీ కాగితమో, ఒక చిన్న భూమి ముక్కో,.. ఇవి దేవునికి లెక్కలేదు. సమస్త భూమి ఆయనదే. భూమి మీద మనుష్యులు బ్రతుకుతున్నారా, లేదా? అనేది ఆయనకు కావాలి. మేడలు, మిద్దెలు మీకు ఇవ్వడం వలన ఆయనకేమైనా ఒరుగుతుందా? అలా ఇచ్చిన పక్షంలో నీవు దేవుని నుంచి దూరమైపోతావు. నీ ఆస్తి ఎక్కువ అవటం చేత నీవు దేవునికి కాకుండాపోతావు. దేవునిని ఎప్పుడూ మీరు ఇలాంటి వాటి కొరకు ప్రేమించకండి. ఇలాంటి వాటి కొరకు ఆయనను నమ్ముకోకండి. ఆయన భూమిమీద చెడ్డ వారిని, మంచివారిని, నీతిమంతులను, అనీతిమంతులను అందిరినీ ప్రేమిస్తున్నాడు. ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు ఆయన మనస్సును తెలుసుకోవాలి. ఒకవేళ వారికే దేవునిని ప్రేమించని చెడ్డవారినందరినీ చంపాలి అనే మనసుంటే, వారు నమ్మిన దేవునికి ఆ మనస్సు వారికంటే గొప్పగా ఉండాలి కదా. కానీ, దేవుని మనస్సు అలా లేదే? ఆయన అందరినీ ప్రేమిస్తున్నాడు. ఆయన అందరికి బ్రతుకును ఇస్తున్నాడు. ఆయన అందరినీ కాపాడుతున్నాడు. ఇక చెడ్డవారికి శిక్ష విధించటం అంటారా? ఎలాగూ చివరిలో తీర్పు జరుగుతుంది. అప్పుడు ఆయన శిక్ష విధిస్తాడు. అది మామూలు చిన్న శిక్ష కాదు. దేవుని కొరకు బ్రతకనందుకు, జీవించే కళను కలిగి లేనందుకు అది నిత్య శిక్ష. భూమిమీద

కొంతకాలం మాత్రమే ఆయన అందరినీ వదిలి పెడుతున్నాడు. కానీ, దానికి తగిన ఫలితాన్ని పొందడానికి మాత్రం ప్రతి ఒక్కరినీ ఎదురుచూడమని ఆయన హెచ్చరిస్తున్నాడు.

లూకా సువార్త 6 : 35- **'మీరైతే ఎట్టివారిని గూర్చియైనను నిరాశ చేసికొనక మీ శత్రువులును ప్రేమించుడి, మేలు చేయుడి, అప్పు ఇయ్యుడి, అప్పుడు మీ ఫలము గొప్పదైయుండును. మీరు సర్వోన్నతుని కుమారులైయుందురు. ఆయన కృతజ్ఞత లేనివారియెడలను దుష్టులయెడలను ఉపకారియై యున్నాడు. కాబట్టి మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు మీరును కనికరముగలవారై యుండుడి.'** ఈ అమూల్యమైన మాటలను ఐఎస్ఐఎస్ తీవ్రవాదులు నేర్చుకోవాలి, అల్‌ఖైదా తీవ్రవాదులు నేర్చుకోవాలి, ప్రపంచ జనులందరూ నేర్చుకోవాలి. మీ పరలోకమందున్న తండ్రి ఏమంటున్నాడో చూడండి. మీరు సర్వోన్నతుని కుమారులై ఉండాలంటే, ఆయన కృతజ్ఞత లేనివారియెడలను, దుష్టులయెడలను ఉపకారియై యున్నాడు గనుక మీరు కూడా అలాగే ఉండాలి. ఆయన కృతజ్ఞత లేనివారియెడల అనగా, దేవుడు ఈ ప్రకృతినంతటినీ వారికిస్తున్నా వారికి ఏ మాత్రం కృతజ్ఞత లేదు. అలాంటి వారియెడల కూడా ఆయన ఉపకారిగా ఉన్నాడు. అది ఆయన గొప్పతనం. అది ఆయన మనస్సు. అది ఆయన ఔన్నత్యం. ఆయనను నమ్మకపోయినా భూమిమీద వారి బ్రతుకును ఆయన కాపాడుతున్నాడు. వారు తెలుసుకుంటారనే ఉద్దేశ్యంతో వారియెడల దీర్ఘశాంతముతో ఉన్నాడు. మరి వారియెడల నీవు దీర్ఘశాంతంతో ఉండలేవా? ఎందుకు ఎ.కె.47 పట్టుకుని అందరినీ చంపేస్తున్నావు? చంపినంత మాత్రాన వాడు మారతాడా? మెడమీద తుపాకి పెట్టినంత మాత్రాన, కత్తి పెట్టినంత మాత్రాన, వాడి బ్రతుకును 25 యేళ్లకే బాలునిగా, యవ్వనస్తునిగా ఉన్నప్పుడే నీవు అంతమొందించినంత మాత్రాన వాడు మారతాడా? చేతనైతే వాడికి దేవుని వాక్యమును చెప్పాలి. సాధ్యమైతే వానిని దేవునిలోనికి తీసుకుని రావాలి. నీకున్న దాన్ని ఖర్చు చేసి అనేకమందిని దేవుని కొరకు బ్రతికించు. అనేకమందిని దేవుని మార్గములో నడిపించు. నీ జీవితకాలమంతా జీవించే కళను నేర్పించు. తీవ్రవాదికి దేవుడు చెప్పిన పాఠమిదే. తీవ్రవాది బ్రతకాలి అంటే, వాడు ఇక నరమేధాన్ని ఆపేయాలి. తుపాకులన్నీ ప్రక్కన పెట్టేయాలి. దేవుని గ్రంథాన్ని చేతబట్టాలి. ఆ గ్రంథములో ఉన్న దేవుని మాటలను నేర్చుకోవాలి. ఆ తరువాత వాటిని ప్రకటించాలి. అనేకమందికి జీవవాక్యాన్ని తెలియజేసి బ్రతికించాలి. అంతే తప్ప వారిని చంపకూడదు. అపొస్తలుడైన పౌలు గారు రోమీయులకు వ్రాసిన పత్రికలో అందరికీ 'జీవించే కళ'ను నేర్పిస్తున్నాడు చూడండి.

రోమీయులకు 12 : 17- **'కీడుకు ప్రతి కీడెవనికి చేయవద్దు. మనుష్యులందరి దృష్టికి యోగ్యమైనవాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి. శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా యుండుడి. ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. పగ తీర్చుట నా పని. నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము. ఆలాగు చేయుట వలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు.'** మీ సహోదరులు దేవుని నమ్మలేదని చంపేస్తారా? మనిషిని చంపడమే దేవునికి సేవ అనుకుంటున్నారా? తప్పు తప్పు. కీడుకు ప్రతి కీడు ఎవనికి చేయవద్దు అన్నాడు చూడండి. ఎవనికినీ చేయవద్దు. అతడు మంచివాడా, చెడ్డవాడా, వాడు ఎలాంటివాడు అనేది తరువాతి విషయం. కీడుకు ప్రతీకీడు ఎవనికిని చేయవద్దు. యేసుక్రీస్తు 'జీవించే కళ'ను నేర్పిస్తూ, నిన్ను కుడి చెంపమీద కొట్టువానికి నీ ఎడమ చెంప కూడా త్రిప్పుము అన్నాడాయన. నీ పొరుగు వానిని ప్రేమించాలి అన్నాడాయన, నీ శత్రువును ప్రేమించాలి అన్నాడాయన. ఇదే 'జీవించే కళ'. ఇదే రియల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్. శ్రీశ్రీ రవిశంకర్ దీనిని చెప్పలేకపోయాడు. ఆయన కేవలం యోగా చేయించాడు. ధ్యానం చేయించాడు. పాటలు పాడించాడు. 35 లక్షల మంది ప్రజలు దేశవిదేశాలనుండి వచ్చినప్పుడు, ప్రజలందరూ ఆయన కార్యక్రమానికి ఆహ్వానింపబడినప్పుడు, మీడియా అంతా అతనిని గూర్చి మాట్లాడుతున్నప్పుడు, అతడు వారందరికీ చక్కని జ్ఞానాన్ని నేర్పించి పంపేస్తే ఆ దేశాలన్నీ బాగుపడును. ఫ్లూట్ ఊదించి పంపించాడు. తప్పు కదా. దేవుడేమన్నాడో చూడండి. కీడుకు ప్రతికీడెవనికి చేయవద్దు. మనమైతే మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగియుండాలి. శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండాలి. ప్రియులారా! మీకు మీరే పగతీర్చుకొనకండి. ఐఎస్ఐఎస్

తీవ్రవాదులారా, నా సహోదరులైన అల్‌ఖైదా తీవ్రవాదులారా, నా తండ్రికి పుట్టినవారలారా, నా తండ్రే మిమ్మల్ని కూడా పుట్టించాడు. భూమి మీద మీరు కూడా మనుష్య జాతిలో ఉన్నారు. నాకు వలె 2 చేతులు, 2 కాళ్ళు ఇలాంటి దేహమే ఐఎస్ఐఎస్ తీవ్రవాదులకు కూడా ఉంది. మీరెందుకయ్యా నచ్చలేదని మరో వ్యక్తిని చంపుతున్నారు? చేతిలో మారణాయుధం ఉంది కదా అని ఎందుకయ్యా నరహత్య చేస్తున్నారు? మీ దేవుడు వ్రాయించిన సిద్ధాంతం ప్రకారం, మీ దేవుడు వ్రాయించిన కట్టడ ప్రకారం అది పెద్ద తప్పు. దేవుని చట్టంలో మీరు దోషులయిపోతున్నారు. ఇవన్నీ మీకెవ్వరూ చెప్పడం లేదు. మీ మనోనేత్రాలు మసకబారుతున్నాయి, మాయబడ్డాయి. అపవాది మీలో ఉండి ప్రతి ఒక్కరినీ చంపించి, చివరికి మిమ్మల్ని కూడా చంపేస్తున్నాడు. మీరేమైనా బ్రతికి బట్టకట్టగలుగుతున్నారా? చివరకు మీరు కూడా చస్తున్నారు. దుష్టుడు చివరకు మిమ్మల్ని కూడా చంపేస్తున్నాడు. అందుకే మీరు ఆలోచించండి. నరహత్య చేసే వారందరూ ఒక్కసారి ఆగి ఆలోచించాలి. భూమి మీద మీరు మీ కళను మార్చుకోవాలి. 'జీవించే కళ'ను మీరు కలిగి ఉండాలి. సహోదరుని మీద నిర్నిమిత్తముగా కోపపడే వారు కూడా ఈ జాబితాలోనికి వస్తారు. వారు కూడా జాగ్రత్తగా ఆలోచించాలి. కీడుకు ప్రతి కీడు ఎవనికి చేయవద్దు. మరి ప్రతికీడు ఎవరు చేస్తారు? శిక్షను ఎవరు విధిస్తారో చెబుతున్నాడు చూడండి. **రోమీయులకు 12 : 19 'ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి'** ఒకవేళ భూమి మీద మిమ్మును ఎవరైనా కష్టపెడుతున్నారా? మీరు దేవుని కొరకు బ్రతుకుతుంటే మిమ్మును హింసిస్తున్నారా? మీ మీద చెడ్డమాటలు చెబుతున్నారా? మిమ్మల్ని అడ్డగిస్తున్నారా? అలాంటప్పుడు దేవునికి అవకాశం ఇవ్వండి. నన్నెవరైనా హింసిస్తే, నన్నెవరైనా అడ్డగిస్తే, నా గురించి తప్పుడు మాటలు చెబితే నేను దేవునికే అవకాశమిస్తాను తప్ప ఎవరి మీదా నేను ప్రత్యక్షంగా యుద్ధం చేయను. నాకు ఎవరి మీదా శత్రుత్వం ఉండదు. ఎవరి మీదా నేను చెడుమాటలు, తప్పుడు మాటలు చెప్పను. ఎందుకంటే, నేను నా దేవునికి చోటివ్వాలి. ఇది నా దేవుడు నా కొరకు వ్రాయించిన 'జీవించే కళ'. మీ దేవుడు, మన దేవుడు మనందరి కొరకు వ్రాయించిన 'జీవించే కళ' ఇదే! ఈ విషయంలో మన దేవునికి మనము అవకాశమును ఇవ్వాలి. ఉగ్రవాదులారా మీరు కూడా మీ దేవునికి అవకాశం ఇవ్వండి. మీరెందుకు చంపుతున్నారు? మీ దేవుడు చంపితే ఇంకా చాలా గొప్పగా ఉంటుంది. మీరు చంపితే కొద్దిగా చంపుతారు. 2015, 2016 ఈ రెండేళ్ళలో ఐఎస్ఐఎస్ వారెంతమందిని చంపారు? మహా అయితే 4వేల మందిని. అది దేవుని దృష్టికి చాలా తక్కువ. అదే దేవుడైతే ఎంతమందిని చంపేస్తాడో తెలుసా? దేవుడెంతమందిని చంపేయగలడో తెలుసా? 2004వ సం॥లో ఇండియాలో సునామి వచ్చింది. అది మీ అందరికి తెలుసు. అది దేవుడు తీర్చుకున్న పగ. అవును. సునామి అంటే ఎక్కడినుంచో వచ్చింది అనుకుంటున్నారా? అర్థాంతరంగా పుట్టుకొచ్చింది అనుకుంటున్నారా? అది దేవుడు పంపిన సునామి. నీలం తుఫాన్, హుద్‌హుద్ తుఫాన్, భూకంపాలు, వరదలు, కరువులు, ఎయిడ్స్, ఎబోలా, కేన్సర్ వంటి రోగాలు,... ఇవన్నీ దేవుని చేతిలో ఆయుధాలు. దేవుడు మనిషిని తీసెయ్యాలి అనుకున్నాడంటే క్షణానికి లక్షల్లో పోతారు. 2సం॥లలో ఐఎస్ఐఎస్ వారు చంపింది కేవలం 4వేల మందిని మాత్రమే. అందుకే, దేవుని ఉగ్రతకు చోటివ్వండి. మీ పగను దేవునికి విడిచి పెట్టండి. కానీ మీరు మాత్రం అందరి యెడల ప్రేమ కలిగిన వారై యుండుడి. మీ పనేమిటి? దేవుని పనేమిటి? అనేది మీరు బాగా తెలుసుకోవాలి. దేవుని పనిని మీరు తీసుకోకూడదు. అప్పుడు మీరు నరహంతకులు అవుతారు. ఆయన చట్టంలో మీరు దోషులవుతారు. అప్పుడు మీరు నరకానికి వెళ్ళిపోతారు. అపవాదియైనవాడు మిమ్మును భ్రమపరుస్తున్నాడు. మిమ్మును దేవునికి కాకుండా చేస్తున్నాడు. చివరికి ముగింపు మాటలలో **రోమీయులకు 12 : 19- 'ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. పగ తీర్చుట నా పని. నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము. ఆలాగు చేయుట వలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు.'** ఐఎస్ఐఎస్ వారికిగాని, అల్‌ఖైదా వారికిగాని ఉన్న ఆలోచన ఒక్కటే. వారు నమ్ముకున్న దేవునిని అందరికీ చెప్పాలి అనుకుంటున్నారు వారు. మంచిదే. వారి ఆలోచన మంచిదే. మరి అలా చెయ్యాలంటే వారేమి చెయ్యాలో తెలుసా? కీడును జరిగించకూడదు. మేలు చెయ్యాలి. ఆ మేలు చేత కీడును జయించాలి. ఆ మేలు చేత అనేకమంది మారేలా దేవుని వాక్యమును చెప్పాలి. దేవుని వాక్యముమీద వారికి నమ్మకం లేదా? ఎ.కె.47 మీద నమ్మకం ఉందా? గ్రెనేడ్

వారికి ముఖ్యమా? దేవుని వాక్యాన్ని వారు పట్టించుకోరా? వారికి ఇలా ఎవ్వరూ చెప్పలేదా? అందుకే ఇకనుంచి వారు పట్టుకోవలసింది తుపాకీని కాదు, గ్రెనేడ్ కాదు, బాంబ్ కాదు. దేవుని మాటలను పట్టుకోవాలి. అది వారిని బ్రతికిస్తుంది, వారిచుట్టూ ఉన్నవారందరినీ రక్షిస్తుంది. ఎవరినీ ఎవరూ చంపకూడదు. మనము నరహత్య చేయకూడదు. నీవు నరహత్య చేస్తే దేవుడు నీకు పరలోకాన్నివ్వడు. నా ప్రియ సోదర, సోదరీమణులారా ఇంత వరకు మీరు 'జీవించే కళ'ను చదువుతున్నారు. మొదటి భాగము నుండి చివరి భాగము వరకు పూర్తిగా చదివిన వారికి మాత్రమే ఇది బాగా అర్థమవుతుంది. అందుకే నేను ఈ విషయమును మొదటి భాగములోనే చెప్పాను. రోగికి వైద్యము చేసిన తరువాత, ఆ రోగి బాగుపడిన తరువాత, ఈ వైద్యుడు మంచివాడని, ఈ వైద్యం మంచిదని ఆ రోగి చెబుతాడు. ఇప్పుడు మీరందరూ మీ మనస్సులో ఇదే భావముతో ఉన్నారని నేను అనుకుంటున్నాను. ఒక మంచి వైద్యం లభించినదని నేను తలుస్తున్నాను. ఇది మీకు పూర్తిగా అర్థమైతే మీరు ఆరోగ్యవంతులైనట్టే. ఈ పుస్తకమును చదువకముందు, జీవించే కళ తెలియని మీరందరూ 'జీరో'లే అని నాకు తెలుసు. కానీ, ఇప్పుడు మీరు హీరోలయ్యారు. మీరందరూ యేసుక్రీస్తును నిజంగా తెలుసుకున్నారు. దీనిని మీరు నిష్ప్రయోజనం చేయకండి. మంచి నేలను విత్తబడిన విత్తనముగా దీనిని ఫలింపజేయండి. ముప్పదంతలుగా, అరువదంతలుగా, నూరంతలుగా ఫలింపచేయండి. దీనివలన నాకేమాత్రం గొప్పతనం అక్కరలేదు. నన్ను మీరు పొగడనక్కరలేదు. నన్ను మీరు జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం లేదు. మీరు మీ ప్రాంతాలకు వెళ్లి అనేకమందిని వెలిగించండి. జీవించే కళ తెలియని వారిని కూర్చోబెట్టి ఈ పాఠ్యాంశాలన్నీ మీకు తెలిసినంత వరకూ వారికి చెప్పండి. అదే మీరు నాకిచ్చే గురు దక్షిణ. మీరు నాకు ఒకవేళ కానుక ఇవ్వాలి అనుకుంటే, దేవునికి చందా ఇవ్వాలి అనుకుంటే, మీ దేవునికి మీరు ఇవ్వాలి అనుకుంటే, మీ దగ్గరున్న ధనముతో అనేకమంది మనుష్యులను బ్రతికించండి. అనేకమంది ఆత్మలను కాపాడండి. ఈ భూమిమీద మన తరంలో ఎంతోమంది కోకొల్లలుగా మనుష్యులు ఉన్నారు. వారిలో ఈ జీవించే కళ ఎవ్వరికీ తెలియదు. ఈ రహస్యమంతా ఇప్పుడు మీకే తెలిసింది. మీ దేవుడు మీకే ఇచ్చాడు. మిమ్మల్ని నమ్మి మీకు అనుగ్రహించాడు. మిగిలిన వారెవ్వరి చేతిలోనూ దీనిని ఆయన పెట్టలేదు. ఆయన చాలా నమ్మకంతో భద్రంగా మీ చేతుల్లో ఈ వాక్యమును, మీ హృదయంలో ఆయన మనస్సును పెట్టాడు. మీరు దీనిని గ్రహించి, దీనివలన రక్షింపబడుతూ, అనేకమందికి దీనిని తెలియజేసి ఒక విప్లవాన్ని తీసుకుని రండి. మిమ్మును చూచిన ఈ సమాజానికి జీవించే కళ మాత్రమే గుర్తొచ్చేలా, మీరు బ్రతకాలన్నది నా కోరిక! ఇదే మన దేవుని ఆకాంక్ష!!

-------x-------

<u>ప్రశ్నలు</u>

**1. దేవుని విప్లవాలు ఎలా ప్రారంభింపబడతాయి? వాటి వైభవాన్ని వివరించండి.**

**2. దేవుడు నేర్పించే జీవించే కళకు, మనిషి నేర్పించే జీవించే కళకు వ్యత్యాసమును చర్చించండి.**

**3. పాతనిబంధన కాలములో నరహత్యను దేవుడు ఏ విధంగా ఖండిస్తున్నాడు? వివరించండి.**

**4. క్రొత్త నిబంధన కాలములో నరహత్య విషయములో యేసుక్రీస్తు ప్రకటించిన మహాజ్ఞానమును వివరించండి.**

**5. ఉగ్రవాదులు మనుష్యులను చంపుటయే దేవుని సేవ అని ఎందుకు అనుకుంటున్నారు? సహేతుకముగా వివరించండి.**

**6. ఉగ్రవాదానికి ప్రపంచ మేధావులు నిలువరించలేకపోయారు కాబట్టి, దానికి జీవించే కళ చేయగలిగే చక్కని వైద్యమును వివరించండి.**

**7. ఉగ్రవాదులకు మనిషిని చంపడం కంటే, మనిషిని బ్రతికించడంలో ఉన్న మాధుర్యమైన జీవించే కళను మీరెలా నేర్పగలరో వివరించండి.**

-------x-------

## జీవించే కళ ఎలా ? (ముగింపు)

ప్రభువైన క్రీస్తు యేసునందు నా ప్రియులారా! జీవించే కళ ఎలా? అనే పుస్తకమును ఇప్పటివరకు చదివిన మీ అందరికీ నా కృతజ్ఞతలు. దేవుడు నాకనుగ్రహించిన ఈ గొప్ప సంగతుల వివరణను నేను దాచిపెట్టకుండా, నిస్వార్థంతో అందరికీ చేరువచేయడానికి యత్నించి, ఆయన మహా వాత్సల్యముచేత సఫలీకృతుడనవుతున్నాను. ఈ పుస్తకమునందు రచించబడిన ఉపోద్ఘాతము మొదలుకొని, ఐదు భాగములలో నేటి సమాజానికి అత్యవసరముగా తెలియవలసిన జీవించే కళలోని ప్రాముఖ్యమైన అంశములను మీకు తెలియజేసాను. అయితే, జీవించే కళ అనగానే కేవలం మునుపు పేర్కొనబడిన ఐదు భాగములకు మాత్రమే సంబంధించినది అని అనుకోవద్దు. ఆ ఐదు భాగములు నేడున్న మనుష్య సమాజానికి ప్రాథమికంగా తెలియవలసిన సంగతులు గనుక ముందుగా వాటిని తెలియజేయడం జరిగినది. జీవించే కళను ఇంకా పరిపూర్ణముగా తెలుసుకోవాలంటే, ఈ ముగింపు సంగతులను కూడా జాగ్రత్తగా పఠించి, నేర్చుకొనగలరని మనవి చేస్తున్నాను. మనిషి తల్లిగర్భములోనుండి బయటకు వచ్చినది మొదలుకొని మరల ఈ దేహాన్ని విడిచిపెట్టేంత వరకు ప్రతి క్షణం కలిగియుండవలసినదే 'జీవించే కళ'. ఎన్ని విషయాలలో మనిషి తన నడవడికను దేవుని జ్ఞానానికి అనుగుణముగా మార్చుకోవాలో చెబుతాను వినండి.


**1. అన్నపానములు అనే విషయము (87 - 90)**

**2. వస్త్రధారణ / అలంకరణ అనే విషయము (91 - 95)**

**3. ఆటలు / వ్యాయామము అనే విషయము (96)**

**4. అంగవైకల్యము / లోపము అనే విషయము (97)**

**5. మాట్లాడుట / సంభాషణ అనే విషయము (98)**

**6. వినుట అనే విషయము (99)**

**7. చూచుట అనే విషయము (100)**

**8. సమయపాలన అనే విషయము (101)**

**9. స్వనిగ్రహము అనే విషయము (102)**

**10. భావోద్వేగములు (నవ్వుట / ఏడ్చుట) అనే విషయము (103)**

**11. నడచుట అనే విషయము (104)**

**12. నిద్రపోవుట అనే విషయము (105)**

**13. పాడుట అనే విషయము (106)**

**14. నృత్యము చేయుట అనే విషయము (107)**

**15. పని చేయుట / ఉద్యోగము విషయము (108)**

**16. కొనుగోలు చేయుట అనే విషయము (109)**

**17. తల్లిదండ్రుల విషయము (110)**

**18. వివాహము విషయము (111 - 113)**

**19. సహచరిణితో జీవితము విషయము (114)**

**20. పిల్లల పెంపకము విషయము (115)**

**21. బంధువుల విషయము (116)**

**22. లోక విద్యాభ్యాసము విషయము (117)**

**23. సినిమా / టి.వి. / మొబైల్ / ఇంటర్‌నెట్ / మీడియా విషయము (118)**

**24. పుట్టిన రోజు / పెళ్లి రోజు / విందుల విషయము (119)**

**25. దేశ సేవ / ప్రజా సేవ విషయము (120)**

**26. ప్రభుత్వముతో ప్రవర్తన విషయము (121)**

**27. ప్రజలతో ప్రవర్తన విషయము (122)**

**28. ప్రకృతితో ప్రవర్తన విషయము (123)**

**29. అదృశ్యమైనవాటిని పరిశీలించుట విషయము (124)**

**30. ఓర్పు / నిరీక్షణ విషయము (125)**

వీటన్నింటి విషయములలో మనిషి తన ప్రవర్తనను పరమందున్న తండ్రికి అనుకూలముగా మార్చుకొన్నచో, దాదాపుగా ఆ మనిషి జీవించే కళను కలిగియున్నట్టే. కనుక చదువరులారా, వీటిని పూర్తిగా నేర్చుకొని మీ బ్రతుకు విధానమును మార్చుకుంటారని, మా ప్రయత్నానికి మరియు శ్రమకు తగిన ఫలితాన్ని మీ జీవితాలలో చూపిస్తారని మనసారా కోరుకుంటూ... వీటి వివరణ లోనికి వెళదాం.

## 1. అన్నపానములు

మనము మన శరీరములోనికి తీసుకునే ఏ పదార్థమైనా అది మన శరీరమునకు మేలు చేసేదై యుండాలి. దాని ద్వారానే మన ఆరోగ్యము పరిరక్షించబడి, దేవుడిచ్చిన ఆయుష్కాలములో ఆయాసము/ప్రయాస లేకుండా నెమ్మదితో జీవించగలము. దేవుని పనిని ఈ శరీరముద్వారా జరిగించుట కొరకు మన శరీరము యొక్క సహకారము ఎంతైనా అవసరము. అందువలన జీవించే కళలో భాగముగా ఆహారము మరియు పానము విషయములో చాలా జాగ్రత్త అవసరము. కాలాన్ని బట్టి, నివసిస్తున్న ప్రాంతాన్ని బట్టి, కొన్ని ఆహార పదార్థాలను తినాలి, మరికొన్నింటిని తినకూడదు. దీనికి తగ్గట్టుగానే దేవుడు ఈ ప్రకృతిని తయారుచేసాడు. యే కాలములో దొరికే పదార్థమును ఆ కాలములో; యే ప్రాంతములో దొరికే పదార్థమును ఆ ప్రాంతములో నివసించినంత కాలము మనము స్వీకరించాలి. శరీరానికి మనము తీసుకొనవలసిన ఆహార పదార్థములను గూర్చి దేవుడు వ్రాయించిన సంగతులేవనగా:-

■ఈ భూమిపై ఆహారమును దయచేయుచున్నది కేవలం పరలోకపు తండ్రియైన దేవుడు. దానినిబట్టి మనము ఆయన యెడల కృతజ్ఞత కలిగి యుండి, ప్రభువైన యేసుక్రీస్తు నందు సంతోషింపవలెను.

♦ **అన్నపానములు పుచ్చుకొనుటకంటెను, తన కష్టార్జితముచేత సుఖపడుటకంటెను నరునికి మేలుకరమైనదేదియు లేదు. ఇదియును దేవునివలన కలుగునని నేను తెలిసికొంటిని. ఆయన సెలవు లేక భోజనము చేసి సంతోషించుట ఎవరికి సాధ్యము? (ప్రసంగి 2 : 24, 25)**

♦ **మరియు ప్రతివాడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితమువలన సుఖమనుభవించుట దేవుడిచ్చు బహుమానమే అని తెలిసికొంటిని. (ప్రసంగి 3 : 13)**

♦ **మరియు కోరదగినదిగాను, చూడముచ్చటయైనదిగాను నాకు కనబడినది ఏదనగా, దేవుడు తనకు నియమించిన ఆయుష్కాల దినములన్నియు ఒకడు అన్నపానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితమంతటివలన క్షేమముగా బ్రదుకుచుండుటయే, ఇదియే వానికి భాగ్యము. మరియు దేవుడు ఒకనికి ధనధాన్యసమృద్ధి ఇచ్చి దానియందు తన భాగము అనుభవించుటకును, అన్నపానములు పుచ్చుకొనుటకును, తన కష్టార్జితమందు సంతోషించుటకును వీలు కలుగజేసినయెడల అతనికి ఆ స్థితి దేవుని ఆశీర్వాదమువలన కలిగినదనుకొనవలెను. అట్టివానికి దేవుడు హృదయానందము దయచేసియున్నాడు గనుక అతడు తన ఆయుష్కాల దినములను జ్ఞాపకము చేసికొనడు. (ప్రసంగి 5 : 18 - 20)**

♦ **అన్నపానములు పుచ్చుకొని సంతోషించుటకంటె మనుష్యులకు లాభకరమైనదొకటియు లేదు గనుక నేను సంతోషమును పొగడితిని; బ్రదికి కష్టపడవలెనని దేవుడువారికి నియమించిన కాలమంతయు ఇదియేవారికి తోడుగానున్నది. (ప్రసంగి 8 :15)**

♦ **మన మీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసుకొనిపోలేము. కాగా, అన్నవస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తి పొందియుందుము. (1 తిమోతి 6 : 7, 8)**

■దేవుడు మనకు దయచేయుచున్న ఆహారమును బట్టి, ఆయనను ప్రార్థించి మాత్రమే ఈ ఆహారమును మనము స్వీకరించాలి. మనము దేవునికి కృతజ్ఞత కలిగి ఉండాలి.

♦ **యెహోవాకు/దేవునికి ప్రార్థన చేయక ఆహారము మ్రింగునట్లు నా ప్రజలను మ్రింగుచు పాపము చేయువారికందరికిని తెలివిలేదా? (కీర్తనలు 14 : 4 / 53 :4)**

♦ **పశువులకు గడ్డిని, నరుల ఉపయోగమునకు కూరమొక్కలను ఆయన మొలిపించుచున్నాడు. అందుమూలమున**

భూమిలోనుండి ఆహారమును నరుల హృదయమును సంతోషపెట్టు ద్రాక్షారసమును, వారి మొగములకు మెరుగునిచ్చు తైలమును, నరుల హృదయమును బలపరచు ఆహారమును ఆయన పుట్టించుచున్నాడు. (కీర్తనలు 104 : 14, 15)

♦ అయినను ఆయన(దేవుడు) ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన ఋతువులను దయచేయుచు, ఆహారము ననుగ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు, మేలుచేయుటచేత తన్నుగూర్చి సాక్ష్యములేకుండ చేయలేదని బిగ్గరగా చెప్పిరి. (అపొస్తలుల కార్యములు 14 : 17)

■దేవుని నుండి మనము తగినంత మాత్రమే కోరుకొనవలెను. అలాగే, మన శరీరమునకు కూడా తగినంత ఆహారమును మరియు పానమును మాత్రమే ఇయ్యవలెను. లేనిచో, అజీర్తి చేసి, మొత్తమంతా కక్కివేయవలసివచ్చును. ఒకవేళ అత్యాశతో ఎక్కువగా కోరుకుని ఆహారమును మరియు పానమును నిల్వ చేద్దామనుకుంటే అది క్రుళ్లిపోయి, పనికి రానిదగును. దీనంతటినిబట్టి ఎప్పటికప్పుడు చాలినంత ఆహారమును మాత్రమే ఇయ్యమని దేవుని ప్రార్థించవలెను.

♦ వ్యర్థమైనవాటిని, అబద్ధములను నాకు దూరముగా నుంచుము. పేదరికమునైనను ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము. తగినంత ఆహారము నాకు అనుగ్రహింపుము. (సామెతలు 30 : 8)

♦ మా అనుదినాహారము నేడు మాకు దయచేయుమని పరలోకపు తండ్రిని ప్రార్థింపవలెను.
(మత్తయి సువార్త 6 : 11)

♦ వారు(ఇశ్రాయేలీయులు) తమ ఆశకొలది ఆహారము నడుగుచు తమ హృదయములలో దేవుని శోధించిరి.
(కీర్తనలు 78 : 18)

■భూమిమీద మన శరీరమును పోషించుకొనుటకొరకు మనకు దేవుని వలన దయచేయబడుచున్న ఈ అన్నపానములు, ఆత్మ సంబంధమైన ఆహారమునకు సూచనగా లేక పోలికగా ఉన్నవి. శరీరము తాత్కాలికము మరియు ఆత్మ నిత్యము గనుక మనమెల్లప్పుడూ ఆత్మ సంబంధమైన ఆహారమునే కోరుకొనవలెను. అది అన్నింటినీ మించినది మరియు మనలను ఎట్టి పరిస్థితులలోనైనను బ్రతికింపజేసేది.

♦ ఆహారమువలననేగాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాటవలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగజేసి, నీవేగాని నీపితరులేగాని యెన్నడెరుగని మన్నాతో నిన్ను పోషించెను.
(ద్వితీయోపదేశకాండము 8 : 3)

♦ అందుకాయన మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను. (మత్తయి సువార్త 4 : 4)

■శరీర సంబంధమైన ఆహారమును లేక పానమును మనము ఎప్పుడు తీసుకొన్ననూ, అది దేవుని నిమిత్తము మాత్రమే తీసుకొనవలెను. అనగా, మనము అన్నపానములు స్వీకరించిన ప్రతిసారి దేవుని పనిని కలిగియుండవలెను. నిత్యమూ మనము అన్నపానములను భుజించినట్టయితే, నిత్యమూ మనము దేవుని పనులను జరిగించవలెను.

♦ మరియు మీరు ఆహారము పుచ్చుకొనినప్పుడు స్వప్రయోజనమునకే గదా పుచ్చుకొంటిరి; మీరు పానము చేసినప్పుడు స్వప్రయోజనమునకే గదా పానము చేసితిరి. (జెకర్యా 7 : 6)

♦ కాబట్టి మీరు భోజనము చేసినను, పానము చేసినను, మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి. (1 కొరింథీయులకు 10 : 31)

■<u>నాశనమునకు సిద్ధముగా ఉన్న శరీర సంబంధమైన భోజన పదార్ధములకొరకు ఎక్కువగా ఆలోచించక, నిత్య వైభవమును అనుగ్రహించే ఆత్మ సంబంధమైన ఆహారము కొరకు మనిషి ఆలోచన కలిగియుండవలెను.</u>

♦ భోజనపదార్ధములు కడుపునకును కడుపు భోజన పదార్ధములకును నియమింపబడియున్నవి; దేవుడు దానిని వాటిని నాశనము చేయును. (1 కొరింథీయులకు 6 : 13)

♦ క్షయమైన ఆహారము కొరకు కష్టపడకుడి గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమైన ఆహారము కొరకే కష్టపడుడి; మనుష్యకుమారుడు దానిని మీకిచ్చును, ఇందుకై తండ్రియైన దేవుడు ఆయనకు ముద్రవేసియున్నాడని చెప్పెను. (యోహాను సువార్త 6 : 27)

♦ అందుకాయన - భుజించుటకు మీకు తెలియని ఆహారము నాకు ఉన్నదని వారితో చెప్పగా, శిష్యులు - ఆయన భుజించుటకు ఎవడైన నేమైనను తెచ్చెనేమో అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి. యేసు వారిని చూచి - నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది అనెను. (యోహాను సువార్త 4 : 32 - 34)

■<u>ఆత్మ సంబంధమైన ఆహారమనగా దేవుని వాక్యమే; ఆ వాక్యమే 2000 సం॥ల క్రితం యేసుక్రీస్తు రూపంలో శరీరాన్ని ధరించుకుని మనుష్యుల మధ్య నివశించెను. శరీర సంబంధమైన ఆహారము ఎలాగైతే తిని, శరీరమును బ్రతికించుకుంటున్నామో, ఆత్మ సంబంధమైన ఆహారమును అంతకంటె ఎక్కువగా తిని ఆత్మను బ్రతికించుకోవాలి.</u>

♦ కాబట్టి యేసు - పరలోకమునుండి వచ్చు ఆహారము మోషే మీకియ్యలేదు; నా తండ్రియే పరలోకమునుండి వచ్చు నిజమైన ఆహారము మీకనుగ్రహించుచున్నాడు. పరలోకమునుండి దిగివచ్చి, లోకమునకు జీవమునిచ్చునది దేవుడనుగ్రహించు ఆహారమైయున్నదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో చెప్పెను. కావున వారు - ప్రభువా, యీ ఆహారము ఎల్లప్పుడును మాకు అనుగ్రహించుమనిరి. అందుకు యేసు వారితో ఇట్లనెను - జీవాహారము నేనే; నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు; నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు. (యోహాను సువార్త 6 : 32 - 36)

♦ అందుకు యేసు, విశ్వసించువాడే నిత్యజీవముగలవాడు. జీవాహారము నేనే. మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి. దీనిని తినువాడు చావకుండునట్లు పరలోకము నుండి దిగివచ్చిన ఆహారమిదే. పరలోకమునుండి దిగి వచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును; మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవము కొరకైన నా శరీరమే అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. యూదులు - ఈయన తన శరీరమును ఏలాగు తిననియ్యగలడని యొకనితో ఒకడు వాదించిరి. కావున యేసు ఇట్లనెను - మీరు మనుష్యకుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితేనే కాని, మీలో మీరు జీవము గలవారు కారు. నా శరీరమును తిని, నా రక్తమును త్రాగువాడే నిత్యజీవము గలవాడు; అంత్యదినమున నేను వానిని లేపుదును. నా శరీరము నిజమైన ఆహారమును, నా రక్తము నిజమైన పానమునై యున్నది. నా శరీరము తిని, నా రక్తము త్రాగువాడు నాయందును నేను వానియందును నిలిచియుందుము. జీవముగల తండ్రి నన్ను పంపెను గనుక నేను తండ్రి మూలముగా జీవించుచున్నట్టే, నన్ను తినువాడును నా మూలముగా జీవించును. ఇదే పరలోకమునుండి దిగివచ్చిన ఆహారము; పితరులు మన్నాను తినియు చనిపోయినట్టు కాదు; ఈ ఆహారము తినువాడు ఎల్లప్పుడును జీవించునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను. (యోహాను సువార్త 6 : 48 - 58)

♦ దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది. (రోమీయులకు 14 : 17)

■<u>అన్నపానములను గూర్చిన ఈ రహస్యములు మనిషికి తెలియకపోతే ప్రశ్నలతోనే మిగిలిపోతాడు; తీర్పులోనికి వెళ్లిపోతాడు.</u>

♦ కాబట్టి అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములోనైనను,

మీకు తీర్పు తీర్చనెవనికిని అవకాశమియ్యకుడి. ఇవి రాబోవువాటి ఛాయయేగాని నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది. (కొలస్సయులకు 2 : 16, 17)

■విగ్రహములకు బలిగా అర్పించినవాటిని తినుట విషయములో పాటింపవలసిన జాగ్రత్తలు, నేర్చుకొనవలసిన జ్ఞానము రోమీయులకు 14వ అధ్యాయము మరియు 1 కొరింథీయులకు 8వ అధ్యాయములలో గల దేవునిమాటలలో విశదీకరించబడినది. మన భోజనము నిమిత్తము విశ్వాసమందు అల్పుడైనవాడు క్రీస్తులోనుండి తొలగిపోకూడదు. మనము తినుట వలన దేవుని యెదుట మనకు మెప్పు రాదు; తినక పోవుట వలన మనకు తక్కువ కాదు. కానీ, ఏ సందర్భములోనైనను దేవుని పనిని మన భోజనము నిమిత్తము పాడుచేయకూడదు.

♦ (1 కొరింథీయులకు 8 : 1 - 13) (రోమీయులకు 14 : 1 - 23) పై వివరణ పూర్తిగా అర్థం కావాలంటే ఈ వాక్యభాగములను బైబిల్‌లో చదవండి.

■మంచి వారికి ఉదాహరణ: మోషే మరియు యేసుక్రీస్తు - దేవుని పని కొరకు ఆకలిని సహించారు, అన్నపానములను ముట్టుకోలేదు.

♦ ఆ రాతిపలకలు, అనగా యెహోవా మీతో చేసిన నిబంధనసంబంధమైన పలకలను తీసికొనుటకు నేను కొండెక్కినప్పుడు, అన్నపానములు మాని ఆ కొండమీద నలువది పగళ్లు, నలువది రాత్రులుంటిని. (ద్వితీయోపదేశకాండము 9 : 9)

♦ మీరు యెహోవా దృష్టికి ఆ చెడునడత నడిచి చేసిన మీ సమస్త పాపములవలన ఆయనకు కోపము పుట్టింపగా చూచి, మునుపటివలె అన్నపానములు మాని నలువది పగళ్లు, నలువది రాత్రులు నేను యెహోవా సన్నిధిని సాగిలపడితిని. (ద్వితీయోపదేశకాండము 9 : 18)

♦ నేను మునుపటివలె నలువది పగళ్లును, నలువది రాత్రులును కొండమీద ఉండగా యెహోవా ఆ కాలమున నా మనవి ఆలకించి నిన్ను నశింపజేయుట మానివేసెను. (ద్వితీయోపదేశకాండము 10 : 10)

♦ అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడెను. నలువది దినములు నలువది రాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా, అపవాది ఆయనను శోధించుచుండెను.
(మత్తయి సువార్త 4 : 1 - 2)

■చెడ్డ వారికి ఉదాహరణ: ఏశావు - దేవుని కొరకు ఆకలిని తట్టుకోలేకపోయాడు.
చిక్కుడుకాయల వంటకముకొరకు తన జ్యేష్టత్వపు హక్కునే పోగొట్టుకున్నాడు.

♦ మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలిచి కలవరపరచుటవలన అనేకులు అపవిత్రులైపోవుదురేమో అనియు, ఒక పూట కూటి కొరకు తన జ్యేష్టత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండునేమో అనియు, జాగ్రత్తగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్లు విడుచుచు దానికోసరము శ్రద్ధతో వెదకినను, మారుమనస్సు పొందనవకాశము దొరకక విసర్జింపబడెనని మీరెరుగుదురు. (హెబ్రీయులకు 12 : 15 - 17)

## 2. వస్త్రధారణ

ఆదికాలములో ప్రారంభపు మనిషి యొక్క దేహమునకు అసలు వస్త్రముల ప్రస్తావనే లేదు.

**అప్పుడు ఆదామును అతని భార్యయు వారిద్దరును దిగంబరులుగా నుండిరి; అయితే వారు సిగ్గు ఎరుగక యుండిరి. (ఆదికాండము 2 : 25)**

ఆజ్ఞాతిక్రమము ద్వారా లోకములో పాప ప్రవేశము జరిగినప్పుడు, వారు సిగ్గు తెలుసుకొనిరి.

**అప్పుడు వారిద్దరి కన్నులు తెరువబడెను; వారు తాము దిగంబరులమని తెలిసికొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములను చేసికొనిరి. (ఆదికాండము 3 : 7)**

**దేవుడైన యెహోవా ఆదామునకును, అతని భార్యకును చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించెను. (ఆదికాండము 3 : 21)**

ఇక్కడ పాఠకులు తెలుసుకోవలసిన ప్రాముఖ్యమైన విషయమేమిటంటే, దైవస్వరూపులైన మొదటి మనుష్యులు (దైవ స్వరూపమనగా ఆత్మరూపము; శరీరరూపము కాదు), వారు దిగంబరులుగా సృష్టింపబడినాగాని, వారు శరీర విషయములపై మనస్సుంచకపోవడం వలన దిగంబరులమనే దిగులు వారికి లేదు. వారెప్పుడైతే దైవాజ్ఞను అతిక్రమించి పాపము చేసారో, అప్పుడు ఆత్మీయముగా వారు మరణించారు. అప్పుడిక శరీర విషయములు తప్ప వేరొకటి వారి కంటికి కనిపించడం లేదు. అందుకే, దేవుడు తినవద్దని తమకాజ్ఞాపించిన మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తిన్న తరువాత వారు ఒకరి శరీరాన్ని మరొకరు చూసుకుంటూ దిగంబరులని తెలిసి సిగ్గుపడుతున్నారు. వాటిని తినకముందు కూడా వారు ఇదే విధంగా ఒకరిని ఒకరు చూసుకున్నా వారి చూపులో తేడా లేదు. అంటే, పాపము చేసిన తరువాత వారిద్దరి చూపు చెడిపోయింది. ఈ దేహాన్ని మరొకరికి చూపించకుండా కప్పుకోవాలనే లోక సంబంధమైన తెలివి వారికి వచ్చింది. మంచి చెడ్డల తెలివికి ఇదొక ఉదాహరణ. బట్టతల వస్తే అది కనిపించకుండా విగ్గు పెట్టుకోవడం, తెల్ల జుట్టుకు రంగు వేసుకోవడం, మెల్లకన్ను ఉంటే అది అందరికీ కనిపించకుండా నల్లరంగు కళ్లద్దాలు పెట్టుకోవడం లాంటివి కూడా ఇలాంటి కోవకు చెందిన మరికొన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. మనిషి పాపము చేసిన తరువాత, దాని ద్వారా తెచ్చుకునే పర్యవసానమును గూర్చి దేవుడు ఈ సందర్భములో తెలియజేస్తున్నాడు. ఆదాము హవ్వలు పాపము చేసిన తరువాత తాము దిగంబరులమని తెలుసుకుని అంజూరపు ఆకులు కుట్టి తమ దేహములను కప్పుకొనుటకు కచ్చడములను చేసుకున్నారు. ఈ ఆకులు ఎంత వరకు తమ తమ దేహములను మరుగుచేస్తాయి? ఎండ కాస్తే ఆకులన్నీ వాడిపోతాయి! మళ్లీ దేహము బహిర్గతమే కదా. ఇక వారి ద్వారా రాబోయే అనేక మంది మనుష్యుల సంగతేంటి? వారు పుట్టిన తరువాత ఈ పాపపు ప్రపంచమును చూచి ఆకర్షితులై పాపమును చేసి పాపాత్ములుగా మారిన తరువాత వారి పరిస్థితీ ఇంతే! అయితే ఈ కోట్లాది మంది మనుష్యులకోసం ప్రతి రోజూ ఎన్ని ఆకులు కావాలి? వారి దేహములను కప్పుకోవడానికి ఆకులతో సరిపెట్టుకోవడం అవివేకమైన ఆలోచన. అసలు అది జరగని పని! అందుకే దేవుడు మరల వారి పాప పర్యవసానానికి ఉపసమనాన్ని కలిగిస్తున్నాడు. వారిద్దరికీ చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించాడు. ఇక్కడ మీకు ఒక సందేహము రావచ్చు. అసలు దేవుడు వారిద్దరినీ సృష్టించినప్పుడే చర్మపు చొక్కాయిలను తొడిగించవచ్చు కదా. ఇదంతా ఎందుకు జరిగినట్టు అని అనుకుంటున్నారా? అయితే ఇక్కడ మీరు తెలుసుకోవలసిన విషయమొకటి ఉంది!

- **శరీరానుసారులు శరీరవిషయములమీద మనస్సునుంతురు; ఆత్మానుసారులు ఆత్మవిషయములమీద మనస్సునుంతురు; శరీరానుసారమైన మనస్సు మరణము; ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది. ఏలయనగా, శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది; అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు, ఏ మాత్రమును లోబడనేరదు. కాగా, శరీర స్వభావముగలవారు దేవుని సంతోషపరచనేరరు. (రోమీయులకు 8 : 5 - 8)**

దేవుడు మనుష్యులందరినీ ఆత్మానుసారులుగా జీవించాలనే కోరుకున్నాడు. వారు జీవించే కళను తప్పిపోకుండా, పరిశుద్ధతతో మహిమ లోకానికి ప్రవేశించాలని ఆశించాడు. కానీ, ఏదెను తోటలో అది జరగలేదు. దీనిని బట్టి దేవుడు వారిని దిగంబరులుగా ఎందుకు సృష్టించాడో అర్థమవుతుంది. వారిని మాత్రమే కాదు. నేటికీ ఈ లోకములో పుడుతున్న ప్రతి మనిషీ దిగంబరిగానే పుడుతున్నాడు; దిగంబరిగానే ఈ లోకాన్ని విడిచి పోతున్నాడు. ఇక్కడ మీరు గమనించవలసిన మరొక విషయమేమిటంటే, ఈ సకల చరాచర సృష్టిలో మానవునికి తప్ప ఇక ఏ జీవికీ వస్త్రములను గూర్చిన చింత లేదు. ఎందుకంటే, అవి ఏనాడూ తమ జీవించే కళను తప్పలేదు.

కాలక్రమేణా, పాపముతో పూర్తిగా నిండిపోయిన ఈ లోకములో మన ప్రవేశము జరిగినప్పుడు మన దేహములకు వస్త్రములను ధరించాలనే ఆలోచన మనకు ఈ లోకమే నేర్పింది. ఇది పూర్తిగా ఈ లోకానికి సంబంధించిన విషయము. అలాగని, ఇప్పుడు మనము వస్త్రములను ధరించుట దేవుని దృష్టికి అపరాధమని కాదు. అది మన పూర్వికులు చేసిన పాపము యొక్క పర్యవసానము. పాపకారణములచే శపించబడిన ప్రకృతిలో మన జీవితము ప్రారంభమైంది. చెప్పాలంటే నీతిమంతులు, ప్రవక్తలు మొదలుకొని యేసుక్రీస్తు వరకు అందరూ అప్పటికే పాపము రాజ్యమేలుతున్న కాలములో పుట్టినవారే! పూర్వమందున్న మనుష్యులు చేసిన పాపఫలితమును అనుభవిస్తూ, ఇప్పుడు కూడా పాపాత్ముల మధ్యలోనే జీవిస్తూ, మనము పారహితులు మార్పునొంది పరిశుద్ధులుగా జీవించాలన్నదే పరలోకపు తండ్రియైన దేవుని అభీష్టము.

ఈ లోకములో మనుష్యుల మధ్య మనము నివశించిన కాలమంతా వస్త్రముల విషయములో తప్పకుండా దేవుని జ్ఞానమును కలిగి జీవించాలి. దేవుని వాక్యము ద్వారా అదెలాగో చూద్దాం.

♦ **అందువలన నేను మీతో చెప్పునదేమనగా - ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవికావా? (మత్తయి సువార్త 6 : 25)**

వస్త్రముకంటె దేహమును గొప్పది అనుటకు ప్రయోగింపబడిన ఒక చక్కని మాట!

♦ **మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యములు గలవాడును, శాంతమూర్తియు, అత్యంతకృప గలవాడునైయుండి, తాను చేయనుద్దేశించిన కీడును చేయక పశ్చాత్తాపపడును గనుక మీ వస్త్రములను కాక మీ హృదయములను చింపుకొని ఆయనతట్టు తిరుగుడి. (యోవేలు 2 : 13)**

♦ **వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములను ధరింపజేయును గదా. కాబట్టి ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకుందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. రేపటిని గూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును; ఏనాటి కీడు ఆనాటికి చాలును. (మత్తయి సువార్త 6 : 28 - 34)**

♦ **కాబట్టి అన్నిటికంటె తక్కువైనవి మీచేత కాకపోతే తక్కినవాటిని గూర్చి మీరు చింతింపనేల? పువ్వులేలాగు ఎదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, వడుకవు; అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సయితము వీటిలో ఒకదానివలెనైనను అలంకరింపబడలేదని మీతో చెప్పుచున్నాను. నేడు పొలములో ఉండి, రేపు పొయిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల, అల్ప విశ్వాసులారా, మీకు మరి ఎంతో నిశ్చయముగా వస్త్రములనిచ్చును. ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో అని విచారింపకుడి, అనుమానము కలిగియుండకుడి. ఈ లోకపు జనులు వీటినన్నిటిని వెదకుదురు; ఇవి మీకు కావలసియున్నవని మీ తండ్రికి తెలియును. మీరైతే ఆయన రాజ్యమును(దేవుని రాజ్యమును) వెదకుడి, దానితో కూడ ఇవి మీకనుగ్రహింపబడును. (లూకా సువార్త 12 : 26 - 28 - 31)**

అలాగని మనము వస్త్రములను ద్వేషించవలెనా? వస్త్రములతో మన దేహములను కప్పుకోకుండా దిగంబరత్వముతో తిరుగవలెననా? అది దేవుని ఉద్దేశ్యం కానే కాదు.

♦ నోవహు వ్యవసాయము చేయనారంభించి, ద్రాక్షతోట వేసెను. పిమ్మట ద్రాక్షారసము త్రాగి మత్తుడై తన గుడారములో వస్త్రహీనుడుగా నుండెను. అప్పుడు కనానుకు తండ్రియైన హాము తన తండ్రి వస్త్రహీనుడై యుండుట చూచి బయటనున్న తన యిద్దరు సహోదరులకు ఆ సంగతి తెలిపెను. అప్పుడు షేమును యాపెతును వస్త్రమొకటి తీసికొని తమ యిద్దరి భుజములమీద వేసికొని వెనుకకు నడిచివెళ్లి తమ తండ్రి దిసమొలను కప్పిరి; వారి ముఖములు వెనుకతట్టు ఉండుట వలన తమ తండ్రి దిసమొలను చూడలేదు. అప్పుడు నోవహు మత్తునుండి మేలుకొని తన చిన్న కుమారుడు చేసినదానిని తెలిసికొని కనాను శపించబడినవాడై తన సహోదరులకు దాసానుదాసుడగును అనెను. మరియు అతడు షేము దేవుడైన యెహోవా స్తుతింపబడునుగాక; కనాను అతనికి దాసుడగును. దేవుడు యాపెతును విశాలపరచును, అతడు షేము గుడారములలో నివశించును, అతనికి కనాను దాసుడగును అనెను. (ఆదికాండము 9 : 20 - 27)

♦ అష్షూరు రాజు చెరపట్టబడిన ఐగుప్తీయులను, తమ దేశమునుండి కొనిపోబడిన కూషీయులను, పిన్నలను పెద్దలను, దిగంబరులనుగాను చెప్పులు లేనివారినిగాను పట్టుకొనిపోవును. ఐగుప్తీయులకు అవమానమగునట్లు పిరుదులమీది వస్త్రమును ఆయన తీసివేసి వారిని కొనిపోవును. (యెషయా 20 : 4)

♦ వారి చేతికి నిన్ను అప్పగించెదను, నీవు కట్టిన గుళ్లను వారు పడద్రోసి నీవు నిలువబెట్టిన బలిపీఠములను ఊడబెరికి నీ బట్టలను తీసివేసి నీ సొగసైన ఆభరణములను తీసికొని నిన్ను దిగంబరిగాను వస్త్రహీనురాలుగాను చేయుదురు. (యెహెజ్కేలు 16 : 39)

♦ ఆయన ప్రభువని సీమోను పేతురు విని, వస్త్రహీనుడైయున్నందున పైబట్టవేసి సముద్రములో దుమికెను. (యోహాను 21 : 7)

♦ తాను దిగంబరుడుగా సంచరించుచున్నందున జనులు తన దిసమొలను చూతురేమో అని మెలకువగా ఉండి తన వస్త్రము కాపాడుకొనువాడు ధన్యుడు. (ప్రకటన గ్రంథము 16 : 16)

మన దేహమును వస్త్రములు లేకుండా మనమే చూచుకుంటే అందులో సిగ్గు లేదు. అదే పరాయి వ్యక్తులు చూస్తే సిగ్గు కలుగుతుంది. ఎందుకంటే, మన దేహమును మనము చెడు చూపుతో చూడలేము. అదే, మిగిలిన వారి దేహములను చూస్తే మన చూపు చెడిపోతుంది. అందుకే, ఇక్కడ వస్త్రము యొక్క ప్రాధాన్యత ఏర్పడింది. దీనినిబట్టి ప్రస్తుతకాలమందున్న మన దేహము వస్త్రహీనముగా ఉంటే అది మనకు అవమానము. అలాగని శరీర అలంకరణ 'అతి'గా ఉండకూడదు.

♦ మరియు స్త్రీలును అణుకువయు స్వస్థబుద్ధియు గలవారై యుండి, తగు మాత్రపు వస్త్రములచేతనేగాని జడలతోనైనను బంగారముతోనైనను ముత్యములతోనైనను మిగుల వెలగల వస్త్రములతోనైనను అలంకరించుకొనక, దైవభక్తిగలవారమని చెప్పుకొను స్త్రీలకు తగినట్టుగా సత్క్రియలచేత తమ్మునుతాము అలంకరించుకొనవలెను.
(తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 2 : 9, 10)

♦ జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము (అంతరంగ పురుషుడు) మీకు అలంకారముగా ఉండవలెన; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది.
(పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 3, 4)

ఇక మన హృదయపు అంతరంగ స్వభావము ఏలాటి లక్షణములను వస్త్రములుగా ధరించుకోవాలో చూద్దాం. దేవునికి తన ప్రభావమే తన వస్త్రము. (కీర్తనలు 93 : 1)

ఈ భూమిపై జీవించుచున్న మనిషి ఈ క్రింది వాటినన్నిటినీ వస్త్రములవలె ధరించుకోవాలి!

- **నీతిని వస్త్రముగా ధరించుకోవాలి (కీర్తనలు 132 : 9) (యోబు 29 : 14)**
- **రక్షణను వస్త్రముగా ధరించుకోవాలి (కీర్తనలు 132 : 16) (యెషయా 61 : 10)**
- **దీన మనస్సును వస్త్రముగా ధరించుకోవాలి (పేతురు వ్రాసిన మొదటి పత్రిక 5 : 5)**
- **దేవుడిచ్చు సర్వాంగ కవచమును (అనగా.. సత్యము, నీతి, సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సను జోడు, విశ్వాసము, రక్షణ, దేవుని వాక్యములను) వస్త్రముగా ధరించుకోవాలి (ఎఫెసీయులకు 6 : 11 - 17)**

- **ఉపమాన భావములో తెల్లని వస్త్రములను (అనగా.. దేవుని క్రియలను), కన్నులకు కాటుకను (అనగా.. మంచి దృష్టితో లోకమును చూడగలుగుటకు) ధరించుకోవాలి. (ప్రకటన 3 : 4 - 5) (ప్రకటన 3 : 18) (ప్రకటన 6 : 11) (ప్రకటన 7 : 14) (ప్రకటన 19 : 13) (ప్రకటన 22 : 14)**

మనిషి ధరించుకోగూడని వస్త్రములు కూడా ఉన్నాయి సుమా!

- **గర్వము, బలాత్కారములను వస్త్రమువలె ధరించుకోకూడదు. (కీర్తనలు 73 : 6) (మలాకీ 2 : 16)** కేవలం ఇవి మాత్రమే గాక, దేవుని వాక్యమునకు విరోధమైనది ఏదియు మనిషి ధరించుకోకూడదు.

దీనినిబట్టి ఆలోచిస్తే, దేవుడు మనిషి ధరించుకున్న పై వస్త్రములకు కాక, తన అంతరంగ స్వభావానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, వాటినే వస్త్రములుగా చూచుచున్నట్టు అర్థమవుతోంది. అందుకే యేసుక్రీస్తు వస్త్రములను నాటి సైనికులు చీట్లువేసి పంచుకున్నా, ఆయన అంతరంగ స్వభావము దేవుని దృష్టికి మంచి వస్త్రములను ధరించుకున్నట్టుగా కనిపించుచున్నది. **(మత్తయి సువార్త 27 : 35) (మార్కు సువార్త 15 : 24) (లూకా సువార్త 23 : 34) (యోహాను సువార్త 19 : 24)**

**కనుక వెలుపటి అలంకారమును కాక, అంతరంగపు అలంకారమునకు ప్రాముఖ్యతనిస్తే మీరు రక్షింపబడతారు.**

వస్త్రముల విషయమై మరికొన్ని ప్రాముఖ్యమైన సూచనలు:

మీకు వస్త్రములకు కొదువ లేనప్పుడు, కొదువ కలిగినవారికి ఇయ్యవలెను.

- మిక్కిలి అల్పులైన మీ పొరుగువారిలో ఒకనికైనను మీరు సహాయము చేస్తే అది ప్రభువుకు చేసినట్టు అని గుర్తుంచుకోగలరు. **(యోబు 31 : 16 - 22) (యెషయా 58 : 7 - 8) (మత్తయి సువార్త 25 : 34 - 36, 45)**

పాత నిబంధన కాలములో కొన్ని సందర్భములలో ఏదైనా విచారకరమైన వార్తను విన్నప్పుడు తమ వస్త్రములను చింపుకొనుట / గోనెపట్టను ధరించుకొనుటను మనము గమనించవచ్చు.

**(ఆదికాండము 37 : 29 - 35) (ఆదికాండము 44 : 13) (సంఖ్యాకాండము 14 : 6 - 9) (యెహోషువ 7 : 6 - 9) (2 సమూయేలు 3 : 31) (2 సమూయేలు 13 : 29 - 31) (2 రాజులు 19 : 1 - 2) (2 దినవృత్తాంతములు 34 : 18 - 20)**

**(ఎజ్రా 9 : 3 - 6) (ఎస్తేరు 4 : 1 - 2) (యోబు 1 : 20) (యోనా 3 : 4 - 9)**

కానీ, చింపుకొనవలసినది మీ వస్త్రములను కాదు; మీ మనస్సును చింపుకోవాలని దేవుడు సూచిస్తున్నాడు. **(యోవేలు 2 : 13 - 14)**

చివరిగా, మనము దేవుని కొరకు అనుకూలమైన ప్రవర్తనను కలిగి, వస్త్రముల విషయములో ఈ జ్ఞానమును కలిగి జీవిస్తే మరణము తరువాత నిత్యజీవపు కొనసాగింపులో కూడ మనము దేవుడిచ్చు మహిమ వస్త్రమును తప్పక పొందగలము.

♦ **భూమి మీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము. మనము దిగంబరులముకాక వస్త్రము ధరించుకొనినవారముగా కనబడుదుము. కాబట్టి పరలోకమునుండి వచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొన నపేక్షించుచు దీనిలో మూల్గుచున్నాము. ఈ గుడారములోనున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదు గాని మర్త్యమైనది జీవముచేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును దీనిపైని ధరించుకొనగోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మన కనుగ్రహించియున్నాడు. (కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 5 : 1 - 5)**

# 3. క్రీడలు / వ్యాయామము

జీవించే కళలో భాగముగా శరీరమందున్న ప్రతి ఒక్కరూ ఆ శరీరమును దేవుని కొరకు ఒక నీతి సాధనముగా ఉపయోగించాలి గనుక ఆ శరీరమును పరిమితి మేర ఆరోగ్యముగా ఉంచుకోవాలి.

♦ **శరీర సంబంధమైన సాధకము కొంచెముమట్టుకే ప్రయోజనకరమవును గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును. (తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 4 : 8)**

కనుక, ఒక పరిమితిలో శరీర సంబంధమైన సాధకమును చేయాలి. ఏదైనా దైవభక్తికి అడ్డువస్తే దానిని వెంటనే ప్రక్కన పెట్టాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అనుకుంటున్న ఈ మానవజాతి నేటికీ సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందకపోగా, అతి ప్రాముఖ్యమైన నిత్యజీవమును కోల్పోవుచున్నది. అందుకే, మొదట అన్ని విషయములలో దేవునిని ఉంచుతూ, ఈ శరీరమును కూడా దేవుని పని నిమిత్తము ఆరోగ్యకరముగా ఉంచాలన్నదే దేవుని అభీష్టము. మన శరీర బలహీనత దేవుని కుమారుడైన క్రీస్తు సువార్త ప్రకటనకు ఆటంకము కానివ్వకుండుట కొరకు తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి.

♦ **ఇక మీదట నీళ్లే త్రాగక నీ కడుపు జబ్బు నిమిత్తము తరచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము. (తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 5 : 23)**

♦ **త్రోఫిము రోగియైనందున అతని మిలేతులో విడిచి వచ్చితిని. (తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 4 : 20)**

అయితే, అన్నిటికంటె ప్రాముఖ్యముగా ఆత్మ యొక్క ఆరోగ్యమును మాత్రం కాపాడుకోవాలి. ఎందుకంటే, ఆత్మారోగ్యమే మహాభాగ్యం. ఆత్మ రక్షింపబడితే పైనున్న శరీరము నశించినా ఏమీ కాదు. అది గొప్ప భాగ్యమే.

♦ **కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్యపురుషుడు దినదినము నూతనపరచబడుచున్నాడు. (కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 4 : 16)**

కనుక, ఆత్మ రక్షణకు ఇబ్బంది లేనంత వరకు శరీరమును ఆరోగ్యముగా ఉంచుకొనుటకు క్రీడలు/ వ్యాయామమును చేయవచ్చు. వాటిని కూడా క్రీస్తు సువార్త ప్రకటన కొరకు మాత్రమే చేయవలెనని గుర్తుంచుకోవాలి.

# 4. అంగ వైకల్యం / శరీర లోపం

ఈ జీవితంలో కొన్ని అనుకోని సంఘటనల వల్ల మన శరీరములో కొన్ని అవయవాలను కోల్పోవచ్చు; లేదా, పుట్టుకతోనే అంకవైకల్యముతో పుట్టవచ్చు. అలాంటివారు తమ జీవితమును ఏలాగు ముందుకు నడిపింపవలెనో పరిశోధిద్దాం. దేవుని వాక్యమును బట్టి, అంగవైకల్యము నిత్యజీవానికి ఏ మాత్రము ఆటంకము కాదు. అయితే, అంగవైకల్యముతో కూడా దేవుని కొరకు బ్రతికే మనుష్యులంటే ఆయనకు ఎంతో ప్రీతి. దీని విషయమై దేవుని కుమారుడైన యేసు పలికిన అద్భుతమైన వాక్యములను చూడండి.

- **కాగా నీ చెయ్యియైనను నీ పాదమైనను నిన్ను అభ్యంతరపరచినయెడల, దానిని నరికి నీ యొద్దనుండి పారవేయుము; రెండు చేతులును రెండు పాదములును కలిగి నిత్యాగ్నిలో పడవేయబడుట కంటె కుంటివాడవుగనో, అంగహీనుడవుగనో జీవములో ప్రవేశించుట నీకు మేలు. నీ కన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల, దాని పెరికి నీ యొద్దనుండి పారవేయుము; రెండు కన్నులు కలిగి అగ్నిగల నరకములో పడవేయబడుటకంటె ఒక కన్ను గలిగి జీవములో ప్రవేశించుట నీకు మేలు. (మత్తయి సువార్త 18 : 8 - 9) (మార్కు సువార్త 9 : 45 - 47)**

అవయవాలన్నీ సరిగానే ఉన్నా అవి దేవునికి ఉపయోగపడనప్పుడు అవి వ్యర్థమే కదా! కనుక ధైర్యము తెచ్చుకొని, ఉన్న అవయవాలతోనే దేవుని కొరకు బ్రతికి ఆయన్ను సంతోషపెట్టడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నించాలి.

- **కాబట్టి వడలిన చేతులును, సడలిన మోకాళ్లను బలపరచుడి. మరియు కుంటికాలు బెణకక బాగుపడునిమిత్తము మీ పాదములకు మార్గములను సరళము చేసికొనుడి. (హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 12 : 12 - 13)**

ఒకడు పుట్టుకతోనే అంగవైకల్యముతో పుట్టుటను పాప ఫలితముగా భావింపక, దేవుని క్రియలు ఆ మనుష్యుని యందు ప్రత్యక్ష పరచబడుటకేనని గుర్తెరిగి దేవుని పనిని చేయాలి. **(యోహాను సువార్త 9 : 1 - 5) ఈ పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 5. మాట్లాడుట / సంభాషణ

ఒక ప్రత్యేకమైన కారణము నిమిత్తము దేవుడు మానవునికి మాటలను ఇచ్చాడు. ఈ మాటలు దేవుని ఆలోచనను నెరవేర్చేవిగా ఉండాలి. ఒక మనిషి తన నోరు విప్పితే దేవునిని గూర్చి మాత్రమే మాట్లాడాలన్నట్టుగా దేవుడు నాలుకను అనుగ్రహించాడు. కనుక, ఆ నోటిని దుర్భాష మాటలాడుటకు వినియోగింపకూడదు; ఒకవేళ అట్లైనచో ఆ మనిషికి జీవించే కళ తెలియనట్లే. దేవుని కార్యములను గూర్చి సంభాషించాలన్నట్టుగా ఈ క్రింది వాక్యభాగములో చూడండి.

♦ **యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన నామమును ప్రకటన చేయుడి. ఆయన కార్యములను జనములలో తెలియజేయుడి. ఆయనను గూర్చి పాడుడి. ఆయనను కీర్తించుడి. ఆయన అద్భుత క్రియలన్నిటిని గూర్చి సంభాషణ చేయుడి. (దినవృత్తాంతములు మొదటి గ్రంథము 16 : 9) (కీర్తనలు 105 : 2)**

అలాగే, మన సంభాషణ ఒకరిని వ్యక్తిగతముగా నొప్పించేదిగా ఉండక, ప్రభువును ఘనపరిచేదిగా మరియు ఆత్మలు రక్షింపబడేటట్లుగా ఉండాలి. అటువంటి సంభాషణ దేవుని దృష్టికి రుచి కలిగిన సంభాషణ!

♦ **ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమియ్యవలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పు వేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను కృపాసహితముగాను ఉండనియ్యుడి. (కొలస్సయులకు 4 : 6)**

ఏ పరిస్థితులలోనైనా సరే విషయమును వినకుండా, గ్రహించకుండా ఆవేశముతో ముందే మాట్లాడకూడదు; మరియు ఎంత కొద్దిగా మాట్లాడితే అంత మంచిది. ఎక్కువగా మాట్లాడితే తప్పకుండా దోషము దొర్లుతుంది.

♦ **విస్తారమైన మాటలలో దోషముండక మానదు. తన పెదవులను మూసికొనువాడు బుద్ధిమంతుడు. (సామెతలు 10 : 19) (సామెతలు 17 : 27)**

♦ **చెడ్డ మాటలు పలుకకుండ నీ నాలుకను, కపటమైన మాటలు పలుకకుండ నీ పెదవులను కాచుకొనుము. (కీర్తనలు 34 : 13)**

భక్తిహీనులకు దేవుడు నేర్పించిన జీవించే కళ తెలియదు కనుక, వారి మాటలు భయంకరముగా మరియు నాశనమును కోరేవిగా ఉంటాయి. అలాంటి వారి మాటలను విన్నప్పుడు బహు జాగ్రత్తగా ఉండాలి.

♦ **నాలుక అగ్నియే! (యాకోబు 3 : 2 - 14) ఈ పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

♦ **పాము నాలుకవలె వారు తమ నాలుకలు వాడి చేయుదురు. వారి పెదవుల క్రింద సర్ప విషమున్నది. (కీర్తనలు 140 : 3)**

♦ **వారి గొంతుక తెరచిన సమాధి, తమ నాలుకతో మోసము చేయుదురు; వారి పెదవుల క్రింద సర్ప విషమున్నది. వారి నోటి నిండ శపించుటయు, పగయు ఉన్నవి. (రోమీయులకు 3 : 13, 14)**

## 6. వినుట

అనేక సందర్భాలలో మనిషికి ఏమి వినాలో తెలియక తన జీవించే కళను కోల్పోతున్నాడు. ఆది కాలమునుండి మనము పరిశీలిస్తే, ఆదాము హవ్వలు అపవాది మాటలను విన్నంతగా దేవుని మాటలను వినలేదు. అందుకే వారు పాపాత్ములయ్యారు. కనుక, మనము మన చెవితో వినే విషయములో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ జాగ్రత్తలను దేవుడు తన పరిశుద్ధ గ్రంథములో తెలియజేసాడు. మనము వినే ప్రతి మాటను చెవి పరీక్షించాలి. అది మంచిదా కాదా? మేలు చేసేదా కాదా? అని పరీక్షించేటంత గొప్ప చెవులను మనము కలిగి యుండాలి.

♦ **అంగిలి ఆహారమును రుచి చూచునట్లు చెవి మాటలను పరీక్షింపదా? (యోబు 12 : 11)**

♦ **అంగిలి ఆహారమును రుచి చూచునట్లు చెవి మాటలను పరీక్షించును. (యోబు 34 : 3)**

ఏదైనా నిర్ణయానికి వచ్చేముందు కూడా సంగతిని పూర్తిగా క్షుణ్ణంగా వినాలి.

♦ **సంగతి వినకముందు ప్రత్యుత్తరమిచ్చువాడు తన మూఢతను బయలుపరచి సిగ్గునొందును. (సామెతలు 18 : 13)**

ధర్మశాస్త్రము కూడా ఒక మనుష్యుని మాట వినకముందు తీర్పు తీర్చకూడదని చెప్పింది.

♦ **ఒక మనుష్యుని మాట వినకమునుపును, వాడు చేసినది తెలిసికొనక మునుపును, మన ధర్మశాస్త్రము అతనికి తీర్పు తీర్చునా? (యోహాను సువార్త 7 : 51)**

దేవుని మాటలు వినకపోవుట వలననే మనుష్యజాతిలో ప్రతి ఒక్కరూ దుష్టునికి బలౌతున్నారు. అందువలననే మనిషి దేవుని ఆశీర్వాదమును అనుభవించలేకపోతున్నాడు.

♦ **దేవుని మాటలను అనుసరించకపోతే కలిగే పర్యవసానము - (లేవీయకాండము 26 : 14, 27) (యెహోషువ 5 : 6)**

మనిషి దేవుని మాటలను పెడచెవిని పెడతాడని ఆయన ముందుగా తెలియజేసిన సమాచారము. **(సామెతలు 1 : 24)**

కొందరు మనుష్యులు దేవుని మాటలనుపైకి విన్నట్టు నటిస్తారేగాని వారి జీవితాలు దేవునికి దూరంగానే ఉంటాయి. **(యెషయా 6 : 9) (మత్తయి సువార్త 13 : 12) (యెషయా 42 : 20) (యిర్మీయా 5 : 21) (యిర్మీయా 25 : 3) (జెకర్యా 7 : 12) (యిర్మీయా 22 : 21)**

మనుష్యులు దేవుని మాటలను వినకపోవుటనుబట్టి ఆయన తన గోడును భూలోకానికి, ఆకాశమండలానికి చెప్పుకుంటున్నాడంటే, ఈ భూమిపై భక్తులున్నారంటారా? **(యిర్మీయా 6 : 19)**

మనిషి దేవుని మాటలను విననందున పశ్చాత్తాపపడి, తిరిగి ఆయన మాటలను వినే మనస్సును తెచ్చుకోవాలి. **(యిర్మీయా 3 : 25) (యెషయా 50 : 5)**

ఈ విషయాలన్నీ తెలుసుకున్న తరువాత మీరు వినే మాటలు మిమ్మును రక్షించునట్లుగా క్రీస్తును గూర్చిన మాటలను మాత్రమే మీరు వినాలి. అదే దేవునియందు విశ్వాసానికి ప్రారంభము.

♦ **కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును. (రోమీయులకు 10 : 17)**

♦ క్రీస్తు కాలములో సామాన్య జనులు ఆయన మాటలను సంతోషముతో వింటున్నారు. **(మార్కు సువార్త 12 : 37 / లూకా సువార్త 10 : 39) ఈ పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 7. చూచుట

మానవ జీవితములో మనిషికి చూపు చాలా అవసరం. దేవుని సృష్టిని చూడాలంటే మనకు చూపు ముఖ్యమైనది. కొంతమంది గ్రుడ్డివారికి మినహాయిస్తే, దేవుడు ఈ భూమిపై దాదాపుగా అందరికీ రెండు కళ్లనిచ్చి చూడమన్నాడు. అయితే ఈ కళ్లతో ఏమి చూడాలి? ఏమి చూడకూడదు? జీవించే కళను తెలిపిన దేవుడు మాత్రమే దీనికి సమాధానమును చెప్పగలడు. ఇక వివరణలోనికి వెళదాం.

క్రీస్తు తన మాటలలో మానవ నేత్రాలకున్న చూపును గూర్చి విశేషమైన సంగతులను చెప్పాడు. నీ కన్ను నీ దేహమునకు దీపము. నీ కన్ను తేటగా ఉంటే, నీ దేహమంతా వెలుగుమయమై ఉంటుంది. నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు చీకటిమయముగా ఉంటుంది. **(మత్తయి సువార్త 6 : 22 - 23)**

ఇక్కడ కన్ను తేటగా ఉండుటయనగా, మన చూపు(దృష్టి) మంచిదిగా ఉండాలని అర్థము. అంతే తప్ప, పైపైన కళ్లను శుభ్రపరచుకోవడం కాదు. మనము చూసే చూపు తేటగా, కపటము లేనిదిగా, వాక్య సంబంధమైనదిగా, దైవదృష్టికి అనుకూలమైనదిగా ఉండాలి. ఉదాహరణకు: ఒక స్త్రీని చూడగానే ఒకని చూపు సహోదర భావముతో ఉండాలి. మోహపు చూపుతో చూస్తే అప్పుడే తన హృదయమందు వ్యభిచరించినవాడగును. **(మత్తయి సువార్త 5 : 28 - 30)** ధనమును చూడగానే లంచమును తీసుకోవాలనిగాని, అతిగా ఆస్తిని కూడబెట్టాలనిగాని అనుకోకూడదు. **(నిర్గమకాండము 23 : 8)**

ఒకవేళ కన్నులు చెడిపోతే దుష్టత్వములోనికి వెళ్లిపోవాలి. ఉదాహరణకు, ఆదాము, హవ్వలు దేవుడు తినవద్దని ఆజ్ఞాపించిన వృక్షఫలమును తిని అపరాధము చేయుటకు ప్రారంభము వారి కనుదృష్టి చెడిపోవడమే. **(ఆదికాండము 3 : 6)**

యోబు తన కనుదృష్టి పాడవ్వకుండా ఉండు నిమిత్తము ఆయన తన కన్నులతో నిబంధన చేసుకున్నాడు. **(యోబు 31 : 1 - 3)**

మన కన్నుల యెదుట నిరంతరము దేవుని వాక్యము కనబడుతూ ఉండాలి. **(సామెతలు 4 : 20, 21)** **(ద్వితీయోపదేశకాండము 6 : 6 - 8)** అప్పుడు మాత్రమే మన అడుగులు దేవుని మార్గములో ఉంటాయి.

జ్ఞానికి కన్నులు తలలో ఉంటాయి. (ప్రసంగి **2 : 14)** తలలో ఉన్న కన్నును తెరచి చూస్తే, అనగా మనస్సుతో గ్రహిస్తే దేవుని వాక్యము అర్థమవుతుంది.

దేవుని వాక్యమును గ్రహించని కన్నులెందుకు చెప్పండి? అవి ఉన్నా లేనట్టే కదా. **(యోహాను సువార్త 12 : 39 - 40)**

తన సహోదరుని ద్వేషించువాడు చీకటిలో నడచుచున్నాడు. అనగా, బాహ్యసంబంధమైన చీకటి కాదు. ఆత్మసంబంధమైన చీకటి అని అర్థము. కనుక, ఆత్మీయ జీవితంలో చీకటి ఉండకుండా చూచుకోవాలి. దేవుని వాక్యమును కన్నులతో చదివి, మనస్సుతో గ్రహించి, జీవితములో అన్వయించుకున్నవానికే జీవించే కళ తెలుస్తుంది. **(యోహాను వ్రాసిన మొదటి పత్రిక 2 : 11)**

ఇందు నిమిత్తమే నీ కన్నులకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు కాటుకను నాయొద్ద కొనుమని ప్రభువు తెలియజేస్తున్నాడు. (ప్రకటన **3 : 18)** కనుక త్వరపడి మీ కన్నులను వెలుగుమయముగా చేసికొనుటకు దేవుని వాక్యమును పరిపూర్ణముగా నేర్చుకోండి.

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 8. సమయపాలన

జీవించే కళ కలిగియుండాలంటే, సమయపాలన తప్పనిసరి. సమయపాలన అనగా, సమయమును సద్వినియోగపరచుకొనుటకు ప్రణాళికా బద్ధముగా దేవుని పనిని చేయుట అని అర్థము. దేవుడు మనిషికిచ్చిన సమయము ఒక నిర్ణీత కాలము. అనగా, పరిమితి కలిగిన కాలము. **(యోబు 14 : 5)** ఈ కాలములో దేవుని కొరకు అత్యున్నతమైన బ్రతుకును కలిగి ఆయనకు ఇష్టులుగా జీవించాలి.

బద్ధకముగా పని చేస్తే వాడు దరిద్రుడైపోతాడు. **(సామెతలు 10 : 4)**

ప్రకృతిలో అతి చిన్న ఆకారములో ఉన్న చీమలను, వాటి సమయపాలనను చూపిస్తూ.. సోమరీ, ఎందాక నీవు పండుకొనియుందువు? ఎప్పుడు నిద్ర లేచెదవు? అని దేవుడు మనిషిని తన వాక్యము ద్వారా హెచ్చరిస్తున్నాడు. **(సామెతలు 6 : 6 - 11)**

మనిషి తనకున్న బద్ధకము మరియు అజాగ్రత్తలచే తనకు దేవుడిచ్చిన సమయమును పోనియ్యకూడదు. దానిని జాగ్రత్తగా వినియోగించి జ్ఞానులుగా నడచుకోవాలి. **(ఎఫెసీయులకు 5 : 15 - 17) (కొలస్సయులకు 4 : 5)**

ఈ విషయములో సాతాను ఎంతో జాగ్రత్తగా ఉంది. మనుష్యులను తానుండే లోకమునకు ఈడ్చుకొని పోవాలని ఆ ప్రయత్నంలో వాడు అలుపెరుగని పోరాటమును చేస్తున్నాడు. దేవుడు తనకు ఇచ్చిన సమయము కొంచెమే అని తెలుసుకొని బహు క్రోధము గలవాడై మనుష్యుల యొద్దకు దిగివచ్చియున్నాడు. **(ప్రకటన 12 : 12)**

కాలమునెరిగి, నిద్రమేలుకొను వేళయైనదని తెలిసికొని దేవుని పనులను నెరవేర్చాలి. **(రోమీయులకు 13 : 11)**

కనుక, జీవించే కళ కలిగిన ప్రతి ఒక్కరూ దేవుని కుమారుడైన క్రీస్తు వలె తమ సమయమును సద్వినియోగము చేసికొనుచు, దేవుని కొరకు అహోరాత్రులు కష్టపడి పనిచేసి జీవకిరీటమును దక్కించుకుంటారు.

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 9. స్వనిగ్రహము

స్వనిగ్రహమనగా, మనిషి తన్ను తాను నియంత్రించుకోవడం. ఈ భూమిపై అనేక విషయములలో మనిషికి శోధన కలుగుతుంది. అటువంటి పరిస్థితులలో తన్ను తాను నిగ్రహించుకోవాలి. ఇలా జరగాలంటే, మొదటగా మనిషి దేవుని కుమారుడైన క్రీస్తును వెంబడించడం నేర్చుకోవాలి. **(మత్తయి సువార్త 16 : 24) (మార్కు సువార్త 8 : 31) (లూకా సువార్త 9 : 23)** ఈ విధముగా క్రీస్తును వెంబడించుట నేర్చుకుంటే, జీవితములో ప్రతి గడ్డు కాలములోను మనిషి తన్ను తాను ఖచ్చితంగా నిగ్రహించుకుంటాడు.

పరలోకరాజ్యములో గొప్పవాడెవడనగా, ఈ లోకములో తన్ను తాను తగ్గించుకొనువాడే. **(మత్తయి సువార్త 18 : 4) (మత్తయి సువార్త 23 : 12) (లూకా సువార్త 14 : 11)**

చరిత్రలో ఇశ్రాయేలీయుల రాజైన మనష్షే శ్రమలలో ఉన్నప్పుడు దేవుని యెదుట తన్ను తాను తగ్గించుకొనెను గనుక అతడు అంగీకరింపబడెను. **(దినవృత్తాంతముల రెండవ గ్రంథము 33 : 12, 13)**

తన్నుతాను ఎంచుకొనతగిన దానికంటె ఎక్కువగా ఎంచుకొనకూడదు. **(రోమీయులకు 12 : 3)**

క్రీస్తు ఏనాడూ తన్ను తాను సంతోషపరచుకొనలేదు. **(రోమీయులకు 15 : 3)**

క్రీస్తు మనుష్యులమైన మన కొరకు తన్ను తాను అప్పగించుకొనెను; మరియు సిలువ మరణమును పొందునంతగా తన్ను తాను తగ్గించుకొనెను. **(గలతీయులకు 1 : 4) (ఎఫెసీయులకు 5 : 2, 27) (ఫిలిప్పీయులకు 2 : 8) (పేతురు వ్రాసిన మొదటి పత్రిక 2 : 23)**

మనము కూడా క్రీస్తువలె జీవించుచు మన జీవితములలో అన్ని విషయములలోను నిగ్రహమును కలిగియుండాలి. **(గలతీయులకు 2 : 20)**

ఆశానిగ్రహమనేది ఒకానొక ఆత్మ ఫలము. కనుక, మనలను మనము నిగ్రహించుకొనుటయనేది చాలా ముఖ్యమైన విషయము. **(గలతీయులకు 5 : 22)**

దేవుని యందు ఆశానిగ్రహమును మనము మనలో అమర్చుకోవాలి. **(పేతరు వ్రాసిన రెండవ పత్రిక 1 : 5 - 7)**

దేవుడు మనకు అనుగ్రహించిన పరిశుద్ధాత్మ కూడా ఇంద్రియ నిగ్రహముగల ఆత్మ అని మరిచిపోకండి. **(తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 1 : 7)**

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 10. భావోద్వేగములు (నవ్వుట / ఏడ్చుట)

సహజంగా మనిషికి సంతోషము కలిగినప్పుడు నవ్వుతాడు; బాధ కలిగినప్పుడు ఏడుస్తాడు. ఇది మానవ శరీరములో సహజము. అయితే, ఈ నవ్వు మరియు ఏడుపు ఒక పరిమితిని కలిగి ఉండాలి. సంతోషము కలిగినప్పుడు ఇక నాకు నవ్వే జీవితము అన్నట్టుగా దేవుని కొరకైన బ్రతుకును మరచిపోయి జీవితమంతా నవ్వుతూనే ఉండకూడదు. అలాగే, ఏదైనా బాధ కలిగినప్పుడు తాత్కాలికముగా ఏడ్చినా, తరువాత అనతి కాలములోనే ఆ బాధను మరచిపోవాలి. ఎందుకంటే, ప్రశస్తమైన దేవుని కొరకైన జీవితము మన కొరకు ఎదురుచూస్తోంది.
**(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 30, 31)**

అన్ని విషయములలో మితముగా ఉండుటకు మనలను మనమే సాధకము చేసుకోవాలి. ఎందుకంటే, మనము నిత్యజీవమనే ఒక లక్ష్యముతో బ్రతకడానికి ఈ భూమిమీదకు వచ్చాము.
**(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 30, 31) (కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9 : 25)**
**(తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 4 : 5)**

ఒక రకముగా చెబితే నవ్వుట కంటె ఏడ్చుటయే మేలు. ఎందుకనగా, ఖిన్నమైన ముఖము హృదయమును గుణపరచును. బాధలోనే దేవుని బోధ మనస్సుకు బాగా దగ్గరవుతుందనేది స్పష్టము. **(ప్రసంగి 7 : 3, 4)**

సాధారణముగా, కుటుంబములో ఎవరైనా మరణించినప్పుడు ఎక్కువగా బాధ కలుగుతుంది. కానీ ఆ బాధ ఎన్ని రోజులుండాలి? వీలైనన్ని తక్కువ రోజులలో ఆ బాధను మరచిపోవాలి. ఆ మరణమును పదే పదే గుర్తు చేసుకుంటూ ఏడ్వటం మంచిది కాదు. చరిత్రలో దావీదు చేసిన అతిక్రమమునుబట్టి బత్షెబ ద్వారా అతనికి పుట్టిన కుమారుడు ఏడవ దినముననే చనిపోతాడు. ఆ బిడ్డను దేవుడు బ్రతికిస్తాడేమోనని, ఆయన్ను బ్రతిమిలాడుతూ ఉపవాసముండి దావీదు వేడుకుంటాడు. అయినా దాబీదు బిడ్డ చనిపోవడంతో దావీదు వెంటనే తన బాధను మరచి, తరువాత వెంటనే తాను దేవుని కొరకు ఏలాగు బ్రతకవలెనో అని ఆలోచిస్తాడు. ఇది మనిషికుండవలసిన లక్షణం.
**(సమూయేలు రెండవ గ్రంథము 12 : 16 - 23)**

కనుక, ఏదీ శాశ్వతము కాదు. నవ్వుట, ఏడ్చుటయనే ఈ భావోద్వేగములను అదుపులో ఉంచుకొని దేవుని కొరకైన జీవితమును మాత్రము ఉన్నతముగా జీవిస్తే తగిన బహుమానము దేవుని యొద్దనుండి పొందగలము.

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 11. నడచుట

మనిషి జీవితములో నడక చాలా ప్రాముఖ్యమైనది. ఆరోగ్యముగా ఉండటానికి కూడా ఈ రోజు వైద్యుల సలహా ఏమిటంటే - 'రోజూ నడవాలి'. నడిస్తే మన శరీరములోని అవయవాలన్నీ దేవుడిచ్చిన ఆయుష్షు మేరకు చక్కగా పని చేస్తాయి. నడచుట కొరకు దేవుడు మనకు రెండు కాళ్లనిచ్చాడు. కాళ్లతో నడచినా, వాహనంపై వెళ్లినా మన మార్గము సత్యసంబంధమైనదై ఉండాలి. అనగా, క్రీస్తు సువార్తను ప్రకటించుటకు మనము నడవాలి. ఆత్మలను రక్షించుటకు మనము నడవాలి. మన పాదములకు సమాధాన సువార్త వలనైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలుబడాలి. **(ఎఫెసీయులకు 6 : 15)**

ఎవరితోనైనా కలిసి త్రోవను నడచునప్పుడు దేవుని వాక్యమునుగూర్చి మాట్లాడుకోవడం, ఏకాంతముగా నడచుచున్నప్పుడు దేవుని వాక్యమును మననం చేసుకోవడం మరువవద్దు. నీ రాకపోకలయందు దేవుడు నిన్ను కాపాడాలంటే ఆ రాకపోకలు దేవుని నిమిత్తమై ఉండాలి. **(ద్వితీయోపదేశకాండము 6 : 6 - 7) (కీర్తనలు 121 : 8)**

ఈ రోజు ఎందరో ఎన్నో ప్రయాణాలు నిరంతరము చేస్తున్నారు. కానీ అవన్నీ దేనికొరకు? తమ ఆత్మలను రక్షించే దేవుని వాక్యము కొరకు ఎవరైనా ప్రయాణాలను చేస్తున్నారా? లేదు. అన్నీ జానెడు పొట్టను నింపుకునే ప్రయత్నాలే. దేవుని కుమారుడైన క్రీస్తు తన నడకను ప్రతి సందర్భములో తండ్రి పని కొరకు జరిగించాడు. **(మార్కు సువార్త 1 : 38)**

అందుకే చక్కని జీవించే కళను కలిగియుండాలంటే నడవాలి! కానీ ఆ నడక ఈ భూసంబంధమైన జీవితములో గుండె జబ్బు రాకుండా ఉండటానికో లేక మధుమేహము రాకుండా ఉండటానికో కాకుండా, దేవుని వాక్య ప్రకటనల కొరకు చేయండి. అప్పుడు ఈ జీవితములో ఆరోగ్యముతో పాటుగా నిత్యజీవ సంబంధమైన ఫలభరితమైన బహుమానమును పరలోకమునందు పొందగలరు. **(తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 4 : 8)**

దేవుని వాక్యపు వెలుగులో మనము నడచినయెడల జీవితములో ఎన్నటికీ తొట్రుపడము. **(కీర్తనలు 119 : 105)**

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 12. నిద్రపోవుట

మంచి నిద్ర దేహమునకు ఆరోగ్యమునిస్తుంది; అనవసరమైన నిద్ర, కలత కలిగిన నిద్ర ఆరోగ్యమును పాడుచేస్తుంది. కనుక, నిద్ర విషయములో కూడా ఒక మంచి కళను కలిగి ఉండాలి.

చరిత్రలో నెబుకద్నెజరనే ఒక బబులోను రాజు తాను కనిన కలకు భావము తెలియకపోవుట వలన కలత చెంది నిద్రపోయేవాడు కాదు. అందును బట్టి అతడు దాని భావమును తెలుసుకొనేంత వరకు ఊరుకోలేదు. **(దానియేలు 2 : 1)**

సుఖముగా నిద్రపోవాలంటే తగినంత ధనము మాత్రమే ఉండాలి. ధనసమృద్ధి అధికమైతే దాని వలన నిద్ర పట్టదు. **(ప్రసంగి 5 : 12)**

ఎంత నిద్రపోయినా ఇంకా నిద్రపోవాలనే ఆశ ఉంటే దారిద్ర్యము మీదికి వస్తుంది. **(సామెతలు 6 : 10 - 11)**

నిరంతరాయముగా దేవుని పనిచేయవలసిన వారు నిద్రాసక్తులైతే దేవుని కోపము వారిపై రగులుకొంటుంది. **(యెషయా 56 : 10)**

పనిని మరచి పగటి వేళ నిద్రపోవువారు దరిద్రులే. పగలున్నంత వరకు మనము మనలను పంపినవాని క్రియలు చేయుచుండవలెను. రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పని చేయలేడు. **(యోహాను సువార్త 9 : 4)**

క్రీస్తు శ్రమపడి, సిలువ వేయబడుటకు సిద్ధపడుచుండగా శిష్యులు నిద్రాసక్తులై దేవుని కుమారుని కొరకు ఒక్క గడియయైనను మేల్కొని యుండలేకపోయారు. అప్పుడాయన తన శిష్యులతో - మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగానుండి ప్రార్థన చేయుడి; ఆత్మ సిద్ధమేగాని శరీరము బలహీనమని చెప్పెను. **(మార్కు సువార్త 14 : 37 - 39) (లూకా సువార్త 22 : 46, 47)**

దేవుని కొరకు బ్రతికి ఆయన పనిని మానవ ఆయుష్కాలములో పూర్తి చేయగలిగితే, ఆ తరువాత ఆత్మకు కావలసినంత విశ్రాంతి ఉంది. ఇప్పటి కాలములో మాత్రం దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచి యున్నది. నీతిమంతులు జీవించుచున్నప్పుడు దేవుని పనిని చేయాలి; వారు మరణించిన వారు విశ్రాంతిని పొందాలి. అందుకే, మరణించినవారిని గూర్చి పరిశుద్ధ గ్రంథములో నిద్రించుచున్నారు అని తెలియజేయబడినది. **(హెబ్రీయులకు 4 : 9, 10) (యోహాను సువార్త 11 : 11 -13)**

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 13. పాడుట

ఏదైనా విషయమును మనిషికి వినసొంపుగా చెప్పాలంటే ఆ విషయమును కీర్తన రూపములో మలచి, దానికి సంగీతమును జోడించి చెప్పవచ్చు. దేవుని వాక్యమును ఈ ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటే కీర్తనలు/పాటలు ఒకానొక సాధనము. కీర్తనలు కంఠపాఠముగా చేసుకొనుటకు ఎంతో ఉపయోగకరము.

**(ద్వితీయోపదేశకాండము 31 : 19)**

అయితే, ఈ కీర్తనలను ఎలా పాడాలి? పాడే కీర్తనలు ఎలా ఉండాలి? అనే వాటిని నేర్చుకుని, కీర్తనలు పాడితే దానివలన ప్రభువు నామమునకు కీర్తి కలుగుతుంది. కీర్తనలలో ఆనంద కీర్తనలు, స్తుతి కీర్తనలు, జయ కీర్తనలు, శోక కీర్తనలు.. మున్నగునవి ఉంటాయి.

దేవుని గూర్చిన కీర్తనలను పాడాలనుకునేవారు అర్థవంతముగా మరియు వినేవారి దృష్టి వాక్యమువైపు మలిచేలా పాడాలి. దానికొరకు వారు ముందుగా సాధన చేసుకోవాలి. పేరు ప్రఖ్యాతల కోసమో లేక గాత్రమును నిరూపించుకొనుట కొరకో కీర్తనలను పాడి వచ్చే ఫలితమును పోగొట్టుకొనకూడదు. కీర్తనలను రమ్యముగా పాడవలెను. **(కీర్తనలు 47 : 7)**

లోకసంబంధమైన పాటలు, సంగీతముల విషయములో తగు జాగ్రత్తలను వహించాలి. అవి దేవుని పిల్లల నోటికి రానే కూడదు. వాటిలో దుర్వ్యాపారము మరియు శరీరమును అపవిత్రపరచుకొనే భావజాలము ఉంటుంది గనుక వాటికి దూరముగా ఉండాలి.

దైవ సంబంధమైన కీర్తనలైతే దేవుని వాక్యముతో రంగరింపబడాలి. పాటలో ప్రాస కోసం దాని అర్థమును మార్చే దౌర్భాగ్యపు పరిస్థితి ఉండకూడదు. శరీరమును ఉత్తేజపరిచే పాటలు కాక, ఆత్మను దేవుని కొరకు రగిలింపజేసే పాటలే దేవునికి బహు ఇష్టమని గుర్తించాలి.

దేవుని కొరకు కీర్తనలు వ్రాసి, పాడి వాటిని దేవుని ప్రజలకు వినిపించినవారిలో ముఖ్యులు మోషే, మిర్యాము, దెబోరా, బారాకు, దావీదు, ఆసాపు కుమారులు, కోరహు కుమారులు, హేమాను, ఏతాను, సొలొమోను, ప్రవక్తలు, యేసు మరియు తన శిష్యులు, అపొస్తలులు మొదలైనవారు.)

సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించాలి; బుద్ధి చెప్పాలి; కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయాలి; సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి. **(కొలస్సయులకు 3 : 16) (ఎఫెసీయులకు 5 : 19 - 21)**

పాటలు ఏ సందర్భములో పాడవచ్చు? - **ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను. (యాకోబు 5 : 13)**

**తనకు స్తోత్రరూపమగు క్రొత్తగీతమును మన దేవుడు నా నోట నుంచెను. (కీర్తనలు 40 : 3)**

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 14. నృత్యము చేయుట

ఎవనికైనను సంతోషము పరిధిదాటి అమితముగా కలిగితే అతడు/ఆమె నాట్యము చేయాలనుకుంటారు. అయితే నాట్యమాడుట వలన ఆ నాట్యమును చూచి ఎవరికీ మార్పు కలుగదు. అందువల్ల, నాట్యము వ్యక్తిగతమే తప్ప బహిరంగ వాక్య ప్రకటనకు ఉపయోగపడదు. ఎవరైనా దేవునియందు అమితమైన ఆనందమును పొంది, తమ వ్యక్తిగతముగా నాట్యమాడుచుంటే వారిని చూచి అసహ్యపడకూడదు. అలాగని దేవుని కొరకు ఖచ్చితముగా నాట్యమాడవలెనన్నది ఆయన ఆజ్ఞ కాదు.

ఇశ్రాయేలీయుల ధర్మశాస్త్ర కాలములో దేవుని పిల్లలు నాట్యమాడిన కొన్ని సందర్భాలు:

♦ **నిర్గమకాండము 15 : 20** (ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బయలుదేరి వచ్చుచున్నప్పుడు)

♦ **న్యాయాధిపతులు 11 : 34** (యెఫ్తా అమ్మోనీయులను ఓడించి తిరిగి తన యింటికి వచ్చినప్పుడు)

♦ **న్యాయాధిపతులు 21 : 19 - 21** (ఏటేట ఇశ్రాయేలీయులు యెహోవాకు ఆచరించే పండుగలో)

♦ **సమూయేలు మొదటి గ్రంథము 18 : 6** (దావీదు ఫిలిష్తీయుడైన గొల్యాతును హతము చేసి తిరిగి వచ్చుచున్నప్పుడు)

♦ **సమూయేలు రెండవ గ్రంథము 6 : 5** (దేవుని మందసమును గిబియాలోని అబీనాదాబు యింటినుంచి తీసుకొని వచ్చుచున్నప్పుడు)

♦ **సమూయేలు రెండవ గ్రంథము 6 : 13 - 14** (దేవుని మందసమును దావీదు పురములోనికి తీసుకొని వచ్చినప్పుడు)

♦ నాట్యముతో వారు ఆయన నామమును స్తుతించుదురు గాక. తంబురతోను నాట్యముతోను ఆయనను స్తుతించుడి. **(కీర్తనలు 149 : 3 / కీర్తనలు 150 : 4)**

ఇక క్రొత్త నిబంధనలో దైవసంబంధులెవరూ నాట్యమాడినట్టుగా మనకు కనిపించదు. ఎందుకంటే, ప్రభువు రాకడ సమీపించేకొద్దీ ఆయన పిల్లలకు అమితముగా ఆనందించే కాలమెక్కడిది? ఇప్పుడు మనము జీవించుచున్న కాలమంతా సువార్త పనిలో, ఆత్మల భారముతో ముందుకు కొనసాగిపోవలసినదే! అందుచేత, ఇప్పుడు మనకు నాట్యమాడే సమయము, సందర్భము లేవు. కేవలం దేవుని కొరకు పని చేసే కాలము మాత్రమే ఉన్నది.

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 15. పని చేయుట / ఉద్యోగము విషయము

ఈ భూమిపై మనము ఎవరిమీదనూ ఆధారపడకుండా, కేవలం దేవునిపై ఆధారపడుతూ మన చేతుల కష్టమును అనుభవించాలంటే ఎవరి ఉద్యోగమును వారు చేసుకోవాలి. అది ప్రభుత్వోద్యోగమైనా, ప్రైవేటు ఉద్యోగమైనా, వ్యాపారమైనా, కూలి పనియైనా.. ఏదైనా సరే మనము మంచి ఉద్యోగమును కలిగి ఉండాలి. మనకు, మనమీద ఆధారపడిన కుటుంబపువారికి పోషణ జరిగి, అన్నవస్త్రములకు లోటు లేకుండా ఉండాలంటే తగిన పనిని మనము కలిగి ఉండాలి.

పౌలు గారు తన స్వహస్తములతో కష్టపడి పని చేసెనని చెప్పిన సందర్భములు:

- **అపొస్తలుల కార్యములు 20 : 34**
- **థెస్సలోనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 9**
- **థెస్సలోనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక 3 : 8**

ప్రారంభ శతాబ్దపు సంఘములో విశ్వాసులు, దేవుని సేవకులు తమ తమ స్వహస్తములతో కష్టపడి పని చేయవలెనని, పరుల జోలికి పోకూడదని చెప్పబడిన సందర్భములు:

- **థెస్సలోనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక 4 : 10 – 12**
- **థెస్సలోనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక 3 : 10 – 12**

కనుక జీవించే కళ కలిగిన ప్రతి ఒక్కరు, ఒకవైపు క్రీస్తు సువార్త పనికి ఆటంకము కలుగకుండా, మరొకవైపు ధన సంపాదనలో మునిగిపోకుండా మంచి పనిని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి.

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 16. కొనుగోలు చేయుట

ఈరోజుల్లో జనులకు కొనుట/అమ్ముట ఒక ముఖ్యమైన వ్యాపకముగా మారిపోయింది. అవసరమున్నా, అవసరములేకున్నా నిరంతరం ఏదో ఒకటి కొనుగోలు చెయ్యాలనే వారు చాలా ఎక్కువమంది. ఇందుకోసమే, ఈరోజు కొనుగోలును సులభతరం చేయడానికి వస్తువులను మరియు సేవలను 'ఆన్ లైన్' లో ఉంచుతూ, వాటిని నేరుగా ఇంటియొద్దకే 'డోర్ డెలివరి' చేస్తున్నారు. ఈ షాపింగ్ అనే అలవాటు అవసరాలకు తగినట్టుగా ఉంటే ఫరవాలేదు. అంతేతప్ప, ఇది ఒక వ్యసనంగా మారితే మాత్రం చాలా ప్రమాదం. తద్వారా జీవించే కళను కోల్పోయే ప్రమాదం ఎంతైనా ఉంది.

చరిత్రలో లోతు దినములలోని సొదొమ మనుష్యులు పాపములో చిక్కుకుపోవడానికి ఈ కొనుగోలు/అమ్మకాలు కూడా ఒకానొక కారణమని దైవ గ్రంథము సెలవిచ్చింది. **(లూకా సువార్త 17 : 28)**

అందుకే ప్రకటన గ్రంథములోని క్రూరమృగము యొక్క క్రియలను దేవుడు వివరింపజేస్తూ, ఆ మృగము యొక్క పేరైనను దాని పేరిటి సంఖ్యయైనను గలవాడు తప్ప, క్రయ విక్రయములు చేయుటకు మరి యెవనికిని అధికారము లేకుండునట్లును అది వారిని బలవంతము చేయుచున్నదని తెలియజేసాడు. అంటే అపవాది, మనుష్యులను దేవుని కొరకు బ్రతకనివ్వకుండా కొనుగోలు/అమ్మకాలు అనే మత్తులో ఉంచుతాడన్నమాట. **(ప్రకటన 13 : 16, 17)**

కనుక, మనకు అవసరమైతేనే తప్ప దేనినీ కొనకూడదు; ఆ అవసరము కూడా ప్రభువు నిమిత్తమై ఉండాలని మరచిపోకూడదు. తిండిని, వస్త్రములను, వస్తువులను.. ఇలా వేటిని కొన్నా అని ప్రభువు సువార్త సేవ నిమిత్తము మీకు అవసరమనుకుంటేనే కొనాలి. లేదంటే కొనకూడదు.

ఇక ఏ వస్తువును కొన్నా గాని దానిని కొన్నంత వరకే దానిని గూర్చి ఆలోచించాలి. ఆ తరువాత దానిని తగిన పనికి ప్రభువు నిమిత్తము వినియోగించాలి. కొన్న వస్తువును చూచుకొని మురిసిపోతూ, ప్రతిరోజూ దాని ఆరాధనలో/సేవలో ఉండిపోతే దేవునికి తప్పకుండా దూరమైపోతారు. అందుకే అపొస్తలుడైన పౌలుగారు ఏమంటున్నారో చూడండి. ఎవరైనా తాము కొనినది తమది కాదు అన్నట్టుగా ఉండాలని బోధిస్తున్నారు.
**(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 29 - 31)**

కనుక ఇక మీదట ఏది కొనాలనుకున్నా, ప్రభువు నిమిత్తము దేవుని జ్ఞానమును కలిగి కొనండి. దాని వలన మీరు, మీ కుటుంబము ఆర్థికముగా అన్నవస్త్రములకు లోటు లేకుండా దేవుని దయ వలన జీవిస్తారు.

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 17. తల్లిదండ్రులు

ఈ భూమి మీద (ఆదాము, హవ్వలను మినహాయిస్తే) ప్రతి మనిషి రాకకు దేవుడు ఉపయోగించే సాధనాలు తల్లిదండ్రులు. దేవుడు ప్రతి మనిషికి మొదట బాల్యమును, ఆ బాల్యములో తల్లిదండ్రులను ఎందుకిచ్చాడంటే, పిల్లలు తమ తల్లిదండ్రులకు ప్రభువునందు విధేయులుగా ఉండాలని మరియు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచడానికి ఇచ్చాడు. ఈ విధముగా ఎదిగిన ప్రతి కుమారుడు/కుమార్తె చక్కని బుద్ధితో సత్యమునందు ప్రతిష్ఠింపబడే అవకాశము కలుగుతుంది. కానీ, జీవించే కళ తెలియని తల్లిదండ్రులు మరియు పిల్లలతో ఈ సమాజము నిండిపోవడం వల్ల వారి మధ్య విలువలు సమాధిలో కలిసిపోయాయి. చిన్ననాడే వారిని నిర్లక్ష్యము చేస్తూ ప్రేమానురాగాలను పంచక, దేవుని జ్ఞానమును ఆసక్తితో నేర్పింపని తల్లిదండ్రులు ఒకవైపు ఉంటే, మరొకవైపు పెద్దవారైన తమ తల్లిదండ్రులను పట్టించుకోకుండా వారి వృద్ధాప్యంలో వారికి గుప్పెడు మెతుకులు కూడా పెట్టకుండా వారిని సన్మానించడానికి బదులు వారి వలన ఆస్తులను/లాభమును ఆశించే పిల్లలే మనకు కనిపిస్తున్నారు. కనుక, దీనికంతటికీ పరిష్కారం దేవుని వాక్యము మాత్రమే.

♦ **ఎఫెసీయులకు 6 : 1 - 4** పిల్లలు తమ తల్లిదండ్రులకు ప్రభువైన క్రీస్తునందు విధేయులై ఉండాలి; తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభువైన క్రీస్తు శిక్షలోను బోధలోను పెంచాలి. ఒకవేళ తల్లిదండ్రులు ప్రభువునకు అవిధేయులై, పిల్లలను ప్రభువునుండి దూరము చేయువారైతే వారికి లోబడి నరకానికి వెళ్లిపోవలసిన అవసరము లేదు. అట్టి పరిస్థితులలో కేవలం దేవుని వాక్యమునకు మాత్రమే విధేయులుగా ఉండాలి. అయితే, తల్లిదండ్రులు ప్రభువునందు తమ పిల్లలను ప్రోత్సహించే వారైతే ఆ తల్లిదండ్రులను పిల్లలు తప్పక సన్మానించాలి.

ధర్మశాస్త్రము కూడా నీ తల్లిదండ్రులను సన్మానించాలని, దాని వలన నీవు దీర్ఘాయుష్మంతుడవగుదువని సెలవిచ్చింది. **(నిర్గమకాండము 20 : 12)**

దేవుని కుమారుడైన క్రీస్తు కూడా దేవునియందు తన తల్లిదండ్రులకు లోబడి జీవించెను. **(లూకా సువార్త 2 : 51)**

కనుక ప్రభువైన క్రీస్తునందు తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారి శిక్షలోను బోధలోను ఎదిగితే అట్టివారు జీవించే కళను తెలుసుకున్నట్టే!

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 18. వివాహము

వివాహమనే ఘట్టం ప్రతి మనిషి జీవితంలో అతి ప్రాముఖ్యమైనది. దాదాపుగా ప్రతి మనిషి, తన వివాహమును ఘనముగా జరిపించుకోవాలని, ఆ తరువాత తమ పిల్లల వివాహాలను వైభవంగా జరిపించాలని కోరుకుంటారు. పేదవారు మొదలుకొని ధనవంతులవరకు తమ స్థోమతకు మించి ఖర్చుచేసినవారు కొందరైతే, రిజిస్టర్డ్ మ్యారేజ్ చేసుకొని తమ వివాహపు ఖర్చును సమాజంలో ఒక మంచి పనికి వినియోగిస్తున్నవారు మరికొందరు. ప్రతి ఒక్కరి జీవితంలో వివాహమనేది ఒక మరుపురాని సంఘటనగా ఉండాలని, అందరినీ ఆహ్వానించి, వారికి ఆతిథ్యమిచ్చి, వారి దీవెనలతో దేవుని సమక్షంలో జీవిత భాగస్వాములవుతున్నారు. ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఏ వర్గానికి చెందినవారైనా, వారి వారి సాంప్రదాయాలలో వివాహములు చేసుకొని కుటుంబములుగా ఏర్పడుతున్నారు.

ఇదిలా ఉండగా, వివాహమును గూర్చి పరమందున్న మన తండ్రి ఆలోచన ఏమిటి? తన పరిశుద్ధాత్మ ప్రేరణతో నీతిమంతులు, ప్రవక్తల చేత వ్రాయబడిన బైబిల్‌లో ఈ వివాహమును గూర్చి దేవుడు వ్రాయించిన సంగతులేమిటి? అనే వాటిని గూర్చి కొద్దిగా ఈ సందర్భంలో ఆలోచిద్దాం.

♦ **ఆదికాండము 2 : 20 - 24** లో, దేవుడు తన సృష్టి కార్యక్రమంలో భాగంగా మొదట ప్రకృతిని, ఆ తరువాత మొదటి మనిషియైన ఆదామును చేసాడు. ఆ ఆదాముకు సాటియైన సహాయముగా హవ్వను తయారుచేసాడు. ఆ విధముగా ఆదాము-హవ్వలు పరిశుద్ధమైన వివాహముద్వారా భార్యాభర్తలయ్యారు. ఈ సందర్భములో ఆదాము ఒక పెండ్లి కుమారునిగా, హవ్వ ఒక పెండ్లి కుమార్తెగా, దేవుడు ఆ వివాహకర్తగా మనకు కనిపిస్తున్నారు. ఈ వివాహాన్ని జరిగించిన దేవుడు ఆ దంపతులను ఆశీర్వదిస్తూ, మీరు ఫలించి, అభివృద్ధిపొంది, విస్తరించి, భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి అన్నాడు.**(ఆదికాండము 1 : 28)** ఈ విధంగా తన ఆరు దినాల కష్టాన్ని మనిషి చేతిలో పెట్టి, పుట్టుకొస్తున్న మనుష్యులందరినీ తన అనాది సంకల్పాన్ని నెరవేర్చమన్నాడు. ఇంతకీ నెరవేర్చవలసిన ఆ దేవుని సంకల్పమేమిటా అనుకుంటున్నారా? దేవుని స్వరూపముతో యేసుక్రీస్తు ద్వారా అనేకమంది కుమారులు తన పరలోక రాజ్యానికి రావాలన్నదే ఆయన సంకల్పము.

♦ **ఎఫెసీయులకు 1 : 4 - 6** 'తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులము, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను యేర్పరచుకొనెను.' అనేకమంది కుమారులు తన స్వరూపాలుగా తనకు కావాలని దేవుడు ఈ జగత్తుకు పునాది వేయకముందే కోరుకున్నాడు. అంతటి గొప్ప ప్రణాళికను మనుష్యులయెడల కలిగియున్నాడు గనుకనే ఈ ప్రకృతినంతా మనకు లోబడేలాచేసి మనకు దానిని ధారాదత్తం చేసాడు.

ఇక వివాహమైన దంపతుల దగ్గరకు వస్తే, పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకుని, వారు ఏక శరీరముగా ఈ భూమిపై జీవించాలి. వారిరువురు ఆలోచనలలో ఏకమై, ఒకరికి ఒకరు దేవుని పనిలో సహకారులుగా జీవించాలి. భార్యను అన్ని విషయములలో కాపాడే భర్తగా, భర్తకు అన్ని విషయములలో సాటియైన సహాయమునందించే భార్యగా వీరిరువురూ ప్రభువుకు ఇష్టులుగా జీవించాలి. తద్వారా, దేవుడు ఆశీర్వదించి వారికిచ్చే గర్భఫలాలను చిన్ననాటనుండి దేవునిలో పెంచి, ఆయన కుమారులుగా మలచాలి. ఈ విధంగా భూమిమీద కుటుంబములు ఏర్పడాలి.

♦ **ఎఫెసీయులకు 3 : 14** 'ఈ హేతువుచేత పరలోకమందును, భూమిమీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రినిబట్టి కుటుంబమని పిలువబడుచున్నదో, ఆ తండ్రియెదుట నేను మోకాళ్లూని...' అనగా, ఈ భూమిమీదనున్న అన్ని కుటుంబాలకు తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన ద్వారానే మనము ఉనికి కలిగియున్నాము. తన పిల్లలను మన పిల్లలుగా, మన గర్భముల ద్వారా రప్పిస్తున్నాడు. దీనిని జరిగించడానికే వివాహమనే ఒక పరిశుద్ధమైన కార్యక్రమము ద్వారా దేవుడు భార్యాభర్తలను జతపరుచుచున్నాడు.

♦ **కీర్తనలు 127 : 2, 3** 'తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చుచున్నాడు. కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయనయిచ్చు బహుమానమే.'

♦ **కీర్తనలు 71 : 6** 'తల్లిగర్భమునుండి నన్ను ఉద్భవింపచేసినవాడవు నీవే.'

కాబట్టి ప్రియులారా, మీరు, నేను ఈ భూమిమీదకు రావడానికి ఏర్పాటుచేయబడిన ఒక గొప్ప కార్యక్రమమే వివాహం. మన కన్నతండ్రియైన దేవుని ప్రణాళికను నెరవేర్చడానికి ఈ భూమిమీదకు వచ్చాము. దానిని పరిశుద్ధముగా, పవిత్రముగా నెరవేర్చాలి.

♦ **హెబ్రీయులకు 13 : 4** 'వివాహము అన్ని విషయములలోను ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనదిగాను ఉండవలెను.' ఘనముగా, నిష్కల్మషముగా ఉండవలసిన ఈ మహా కార్యక్రమాన్ని నేటి అసభ్యకర సమాజం అపహాస్యం చేసింది. అసలు నేటి సమాజంలో వివాహానికి దేవుని వాక్యపరంగా విలువ ఉందంటారా? వారిష్టప్రకారం జరిగించుకున్న ఈ వివాహాలలో ఎన్ని కడవరకూ నిలబడుతున్నాయి? వివాహపు పరమార్థం తెలియని ఎందరో అభాగ్యులు ఇక తాము కలిసి జీవించలేమంటూ విడాకులకోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అటువైపు లోకమందున్న న్యాయస్థానాలు కూడా భార్యాభర్తలు విడిపోవడానికి కొన్ని ప్రత్యేక కారణాలతో వెసులుబాటును కల్పిస్తున్నాయి. కలిసి జీవించలేనప్పుడు విడిపోవడమే మంచిది అంటుంది నేటి లోకం!

దేవుడు ఆదాము హవ్వలను జతపరచినప్పుడు, ఆయన ఒక పురుషునికి ఒక స్త్రీని మాత్రమే ఇచ్చాడు. దేవుని ప్రణాళికను నెరవేర్చడానికి ఇదొక కట్టడ. ఇది అర్థమైతే నేడున్న పురుషులు పరాయి వారి జోలికి పోరు. ఆదాముకు దేవుడిచ్చిన భార్య ఒక్కతే, ఆమె హవ్వ! హవ్వకు దేవుడిచ్చిన భర్త ఒక్కడే, అతడు ఆదాము. వారిద్వారా సంతానాభివృద్ధి జరిగింది. ఇక ఇశ్రాయేలీయుల కాలము వచ్చేసరికి ధర్మశాస్త్రములో నియమ నిబంధనలు ఇవ్వబడ్డాయి. యేసుక్రీస్తు ఈ భూమిమీదకు వచ్చి ఆ ధర్మశాస్త్రమును నెరవేర్చి, కొట్టివేసేంత వరకు ఆ ధర్మశాస్త్రము అమలులో ఉంది. దాని ప్రకారము, ఇశ్రాయేలీయులలో కొందరు అవసరతను బట్టి బహుభార్యత్వాన్ని కలిగియున్నారు. మరియు ఒకవేళ ఇశ్రాయేలీయులలో భార్యాభర్తలెవరైనా విడిపోవాలనుకుంటే వారు ఒక పరిత్యాగ పత్రికను ఇచ్చి విడిపోయేవారు. అప్పటికి ఇంకా బైబిల్ పరిపూర్ణము చేయబడలేదు. మహాజ్ఞానియైన యేసుక్రీస్తు ఈ భూమిమీదకు ఇంకా రాలేదు. అందుకే ఆ అజ్ఞానకాలమును దేవుడు చూచిచూడనట్టుగా ఉన్నాడు. కానీ, ఇప్పుడు బైబిల్ పరిపూర్ణమైనదిగా మన చేతుల్లోఉంది. మన పూర్వికులకు జరిగిన సంగతులన్నీ, వారికి దృష్టాంతములుగా సంభవించి, మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడ్డాయి తప్ప మనము ఆచరింటానికి మాత్రము కాదని ఈ సందర్భములో మీరు నిర్ధారించుకోవాలి.

♦ **కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 10 : 11** యుక్త వయస్సుకు వచ్చిన వారు వివాహము చేసుకుని, దేవుని కొరకు పిల్లలను కని, వారిని దేవుని కుమారులుగా తీర్చిదిద్దాలన్న జ్ఞానము నేటి తరములో లేకపోవుట వలన అనేకులు అపవాది సంబంధులుగా మారిపోతున్నారు.

♦ **యెషయా 1 : 2, 3** 'ఆకాశమా, ఆలకించుము. భూమీ చెవియొగ్గుము. నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని. వారు నా మీద తిరుగబడియున్నారు.' దేవుని సంకల్పమును నెరవేర్చవలసిన మనము ఆయనమీదే తిరుగుబాటు చేసేవారిగా మారిపోతున్నాము. ఈ భూమిమీద భౌతిక సంబంధమైన తండ్రిని ప్రేమించే మనము, పరలోకపు తండ్రిని కనీసం గుర్తించలేకపోతున్నాము. ఆత్మతండ్రికి చివరకు పుత్రశోకాన్నే మిగిల్చాము. వివాహము యొక్క పరమార్థాన్ని గ్రహించుటలో ఈ ప్రపంచం పూర్తిగా విఫలమైంది. కనుకనే దీనినంతటినీ గుర్తు చేయడానికి తన కుమారుడైన యేసుక్రీస్తును దేవుడు మన దగ్గరకు పంపించాడు. ఒక చక్రవర్తిగా రావలసిన యేసుక్రీస్తు, మన నిమిత్తము ఒక పరిచారకునిగా వచ్చాడు. మన పాపముల నిమిత్తము తాను శిక్షను అనుభవించాడు. తన శరణుజొచ్చిన వారికి ఆశ్రయమయ్యాడు. అర్థం చేసుకున్న వారికి మార్గమయ్యాడు. ప్రజల ప్రయాసను తేలిక చేసి దేవుని జ్ఞానమును అనుగ్రహించాడు. ప్రతి మనిషి రెండవ మరణాన్ని ఎలా జయించాలో తన ద్వారా నిరూపించాడు. అందుకే ఆ యేసుక్రీస్తువారి మాటలలోని పరమార్థాన్ని ఈ జీవించే కళ ద్వారా మీకు పరిచయం చేస్తున్నాను.

వివాహము నిశ్చయమైన తరువాత వధువు యొక్క మనస్సు, తన ఆలోచనలన్నీ కాబోయే భర్తమీదే ఉంటాయి. అలాగే వరుని ఆలోచనంతా వధువు కొరకే ఉంటుంది. అలా ఉంటేనే వారిరువురు పవిత్రమైనవారని చెప్పగలము. బైబిల్‌లో పరిశుద్ధుడైన పెండ్లికుమారునిగా యేసుక్రీస్తు పోల్చబడ్డారు. పవిత్రురాలైన కన్యకగా ఆయనను ఎదుర్కొనబోయే సంఘము(అనగా మనము) ఉండాలి. యేసుక్రీస్తు ఆలోచనంతా ఈ ప్రపంచ మానవాళిని గూర్చి మాత్రమే ఉంది. మన ఆలోచనలు కూడా క్రీస్తు కార్యములవైపు మళ్లించగలిగితే అది అమోఘము. దేవుడు ఘనమైనదిగా యెంచిన వివాహ కార్యక్రమాన్ని చివరివరకు పవిత్రముగా ఉంచాలి. వివాహమును జరిగించడానికి చూపించే శ్రద్ధ మన బ్రతుకును సరిదిద్దుకోవడంపై కూడా పెట్టాలి. దేవుడిచ్చే బహుమానమైన గర్భఫలాన్ని అతి జాగ్రత్తగా ఆ దేవునికొరకు పెంచాలి. కేవలం తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్లనే ఈరోజు ఎందరో మనుష్యులు వారి చిన్ననాటినుంచే దొంగలుగా, వ్యభిచారులుగా, మత్తుబానిసలుగా, నరహంతకులుగా, దేవునికి పనికిరానివారుగా మారిపోతున్నారు. అందుకే ఈ మాటలు చదివిన తరువాత అయినా మీ మనస్సులను మార్చుకోండి. మీరు యేస్థితిలో ఉన్నా సరే, ఒక మంచి నిర్ణయం తీసుకోండి. వివాహాన్ని దేవుడనుకున్న రీతిలో ఘనమైనదిగా మలచండి. యేసుక్రీస్తు(గొఱ్ఱెపిల్ల) వివాహ మహోత్సవానికి ఒక పవిత్రురాలైన కన్యకగా సిద్ధమవ్వండి. తండ్రి ఉన్న ఆ మహాలోకములో పరిశుద్ధులుగా, నిర్దోషులుగా అడుగుపెట్టండి.

# <u>19. భార్యాభర్తల జీవితము</u>

వివాహ బంధముతో ముడిపడిన భార్యాభర్తలిరువురూ దేవుని వాక్య ప్రకారము జీవించే కళను కలిగి ఉండాలి. దాంపత్య జీవితంలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే విషయము ఉండకూడదు. ఇద్దరూ ఒకరికి ఒకరు గౌరవమిచ్చుకుంటూ దేవుని పనిని ముందుకు కొనసాగించాలి. ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు ఒకరిని ఒకరు క్షమించగలగాలి. ఒకరి తప్పును మరొకరు భరిస్తూ వారిలో మార్పు కొరకు ప్రయత్నించాలి.

వివాహమనేది జీవితంలో ఒక్కసారే జరగాలి. ఒకవేళ దేవునికి ఆటంకముగా మారి, సత్యమును విననొల్లని వారు తమ బంధమును విడనాడిన విడనాడవచ్చు. అటువంటి పరిస్థితులలో ఎవరికీ అభ్యంతరము లేదు. భార్యాభర్తలిద్దరూ ప్రభువునందు మాత్రమే కలిసి ఉండాలి తప్ప, లోకసంబంధమైన కోరికలను తీర్చుకొనుట కొరకు మాత్రమే కాదు. పరలోకరాజ్యమునకు ఆటంకమైన పరిస్థితులలో ఒకరు మరొకరికి లోబడవలసిన పరిస్థితి అక్కరలేదు. అయితే ఈ విషయములో ఎంతో ఓర్పు ఉండాలి. ఒకటికి పది సార్లు ఆలోచించి, సమయమును కేటాయించి, దేవునికి ప్రార్థించి తగు నిర్ణయమును తీసుకోవాలి. ఏదేమైనప్పటికీ దాంపత్య జీవితమునుబట్టి నిత్యజీవానికి అర్హతను మాత్రం కోల్పోకూడదు. **(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 1 - 40)**

♦ అబ్రాహాము - శారా, ఇస్సాకు - రిబ్కాలవలె తాము బ్రతికినంతకాలము ఒక కుటుంబముగా దేవునికి లోబడి జీవించాలి.

♦ మోషే - మిర్యాము, హన్నా -ఎల్కానాలవలె ఒకరికి ఒకరు సహాయము చేసుకుంటూ దేవుని కొరకు తమ బిడ్డలను అర్పించగలగాలి. **(నిర్గమకాండము 4 : 25, 26)** **(సమూయేలు మొదటి గ్రంథము 1 : 19 - 28)**

చెడు ఆలోచనలను చెప్పే భార్య గాని, భర్తగాని ఉన్నప్పుడు వారి మాటలను ప్రక్కన పెట్టాలి. ఎందుకంటే, ఒకరు తన పూర్ణ హృదయముతో / పూర్ణ మనస్సుతో / పూర్ణ బలముతో ప్రేమింపవలసినది దేవునినే తప్ప తన భార్యనో భర్తనో కాదు. కనుక, దేవునికి అడ్డు తగిలిననాడు వారెంతటివారైనను సరే లెక్క చేయకూడదు. ఉదాహరణకు, యోబు తన భార్య మాట దేవునికి భిన్నముగా ఉన్నప్పుడు అతడు ఆమె మాటలను వినలేదు. **(యోబు 2 : 9 - 10)** **(యోబు 19 : 17)**

♦ చరిత్రలో రాజులు కూడా తమ భార్యల మాటలు విని చెడిపోయారు.

ఉదాహరణకు: సొలొమోను **(రాజులు మొదటి గ్రంథము 11 : 1 - 8)**, ఆహాబు **(రాజులు మొదటి గ్రంథము 21 : 25)**

♦ ప్రారంభ శతాబ్దపు క్రీస్తు సంఘములో కూడా అననీయ, సప్పీర అను భార్యా భర్తలు పేతురుతో అబద్ధమాడి పరిశుద్ధాత్మను మోసపుచ్చి అక్కడికక్కడే చనిపోయారు. కనుక ఇలాంటి వారుగా భార్యాభర్తలు ఉండకూడదు. **(అపొస్తలుల కార్యములు 5 : 1 - 11)**

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 20. పిల్లల పెంపకము

వివాహమైన దంపతులకు దేవుడిచ్చే బహుమానమే పిల్లలు! **(కీర్తనలు 127 : 3)** ఈ పిల్లలు తమ చిన్ననాటనుంచి తమ తల్లిదండ్రుల ఒడిలో పెరుగుతారు. తమ బాల్యదశలో వారి తల్లిదండ్రులే వారి మొదటి గురువులు. లోకము వారికి పరిచయము కాక మునుపు వారు తమ తల్లిదండ్రులు చెప్పే పాఠాలనే నేర్చుకుంటారు. కనుక, తమ పిల్లల విషయములో ఈ గొప్ప అవకాశమును ప్రతి తల్లి, ప్రతి తండ్రి అంది పుచ్చుకోవాలి. అందుకే దేవుడు బాలుడు/బాలిక నడువవలసిన త్రోవను వారికి బాల్యదశయందే నేర్పమంటున్నాడు. అలాంటప్పుడు వారు పెద్దవారైనా గాని ఆ మార్గమునుండి తొలగిపోరు. **(సామెతలు 22 : 6)** (లోకమందు కూడా ఒక సామెత ఉంది: 'మొక్కైవంగనిది మ్రానై వంగునా?')

ఒక్కొక్కసారి తల్లిదండ్రులు ఎంత చెప్పినా పిల్లలు మాట వినరు. అలాంటప్పుడు వారికి కోపము రేపక ప్రభువు బోధను వారు ఇష్టపడేలా చేయాలి. దానికి తగిన బోధనా విధానమును తల్లిదండ్రులు అలవర్చుకోవాలి. అయినాగాని వినని పిల్లలైతే వారికి బెత్తము వాడైనా సరే దేవుని మార్గములో ఉంచాలి. **(సామెతలు 13 : 24)**
**(సామెతలు 23 : 13, 14)**

తల్లిదండ్రులు తమ పిల్లలకు జీవించే కళను తమ చిన్ననాటనుంచి అలవాటు చెయ్యాలి. దేవుని వాక్యమును చదువుట (వీలైతే వారికంటూ ఒక ప్రత్యేకమైన బైబిల్/నోట్‌బుక్ ఇవ్వాలి), దేవునికి ప్రార్థించుట, దేవుని కీర్తించుట, దేవునికి ఇచ్చుటను నేర్పించాలి.

బాలబాలికలను చెడు స్నేహము పట్టనివ్వకుండా కాపాడాలి. వారి స్నేహితులంతా దేవుని మార్గములో నడిచేవారై ఉండాలి. చెడును అసహ్యించుకునే గుణము, సత్యమును ప్రేమించే గుణము, దేవుని కొరకు బ్రతికే గుణములను వారి బాల్యమునుండే అలవాటు చెయ్యాలి.

ప్రతి బాలుని/బాలికను చిన్ననాటనుంచి జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును ఎదగనివ్వాలి. **(సమూయేలు మొదటి గ్రంథము 2 : 26)** **(లూకా సువార్త 2 : 52)**

♦ బాలలకు దేవుని వాక్యమును ప్రారంభ దశలో నేర్పించడానికి స్క్రిప్చర్ యూనివర్సిటి వారు చక్కని ప్రణాళికను రూపొందించారు. 'బాలబోధిని' అనే పుస్తకమందు కావలసినన్ని వివరములున్నవి. కనుక ఆ పుస్తకమును కూడా చదువగలరు.

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 21. బంధువులు

మనకు నిజమైన బంధువులు ఎవరు? దేవుని యొద్దకు మనలను నడిపించి, దేవునిలో మన హితముకోరే వారే మనకు నిజమైన బంధువులు. మనకు రక్త సంబంధీకులైనా సరే, వారికి జీవించే కళ తెలియకపోతే వారితో మనకు బంధుత్వము అవసరము లేదు. అయితే, వారిని దేవునిలోనికి నడిపించుటకు బంధుత్వము ఉపయోగపడితే అది మేలే.

కపటము కలిగిన బంధువులు మన దుర్దశలో మనతో కూడ ఉండరు. **(యోబు 19 : 14) (కీర్తనలు 38 : 11)**

మన బంధువులు కూడ ప్రభువు సేవలో కొనసాగిననాడు అదెంతో మనోహరమైన విషయము. అపొస్తలుడైన పౌలుగారి యొక్క బంధువులు కూడా క్రీస్తు విశ్వాసులుగా కనిపిస్తున్నారు. **(రోమీయులకు 16 : 7, 11, 21)**

కనుక దేవుని మార్గములో కష్టములలోను, ఇబ్బందులలోను మనతోపాటు నడిచేవారే మన బంధువులు.. కాని వారు జీవించే కళ తెలియని వారు!

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 22. లోక విద్యాభ్యాసము

ఒక మనిషి ఈ లోకములోనున్న విద్యను అభ్యసించవచ్చా? లేదా? ఒకవేళ అభ్యసిస్తే ఎంతవరకు? ఎలా? అనేది తెలుసుకుందాం. దేవుని జ్ఞానము లిఖితమై ఒక పుస్తకరూపములో అందుబాటులోనికి వచ్చి నేటికి సుమారు రెండు వేల సంవత్సరాలైంది. నేడు మనకు దేవుని మనస్సు అర్థం కావాలంటే మన యొద్దనున్న పరిశుద్ధ గ్రంథమును అధ్యయనం చేయాలి. అలా చేయాలంటే, మొదట వ్రాయబడిన పరిశుద్ధ గ్రంథమును చదువగలిగి ఉండాలి. ఆ తరువాత ఆ గ్రంథము వ్రాయబడిన భాష మీద పట్టు ఉండాలి. ప్రతి భాషకు వ్యాకరణము ఉంటుంది. ఉదాహరణకు, తెలుగు భాషను తీసుకుంటే - ఇందులో **అక్షరాలు** (అచ్చులు, హల్లులు, వత్తులు, గుణింతాలు), **వ్యాకరణము** (భాషాభాగాలు, వాక్య కూర్పు, సంధులు, సమాసాలు, అలంకారాలు, పదము - అర్థములు, జాతీయములు, పద దోషములు, విభక్తులు, వ్యతిరేకార్థాలు, ప్రకృతి - వికృతి, ఛందస్సు.. మొదలగునవి) నేర్చుకోవాలి. ఇవన్నీ పూర్తిగా అర్థమైతేనేగాని తెలుగు భాషలోని బైబిల్ మనకు సవివరముగా అర్థం కాదు. కనుక, బైబిల్ నేర్చుకోవడానికి లోక విద్యలో భాగమైన భాషను నేర్చుకోవాలి. మిగిలిన ప్రథమ/ద్వితీయ/తృతీయ భాషలు, గణితము, సామాన్య శాస్త్రము, సాంఘిక శాస్త్రము, వారి వారి అభిరుచిని బట్టి, ఉద్యోగ అవసరతను బట్టి, లోకపోకడను తెలిసికొనుటకు, మిగిలిన సమాజముతో పోటీపడి అన్ని విషయములలో దేవుని వాక్యమును అందరికీ ప్రకటింపగల సామర్థ్యమును తెచ్చుకొనుటకు లోక విద్యను అభ్యసించవచ్చు.

అయితే దీనికి ఒక పరిమితి ఉంది. లోక విద్యపై అవగాహన లేకుండా, అవసరం లేకపోయినా చదువుకుంటూ పోతే చివరకు ఆయాసము తప్ప మిగిలేది ఏమిటి? ఈ లోక విద్యను ఎంత చదివినా తరగదు. ఈలోపు మన ఆయుష్కాలము గతించిపోతుంది. **(ప్రసంగి 1 : 18)**

దేవునియందు భయభక్తులు లేకుండా ఎంత విద్యను సంపాదించినా అది 'అవిద్య'గా మారుతుంది. **(యెషయా 44 : 25)**

నీ విద్య నీ జ్ఞానము నిన్ను చెరిపివేయకూడదు. అటువంటి విద్య అనవసరం. **(యెషయా 47 : 10)**

ప్రారంభ శతాబ్దములో పేతురు, యోహానులు విద్యలేని పామరులైనా క్రీస్తు వారిలో ఉన్నప్పుడు వారు లోకపు జ్ఞానులను ఆశ్చర్యపరచిన సంగతిని గుర్తుంచుకోవాలి. **(అపొ. కార్య. 4 : 13)**

క్రీస్తు అపొస్తలులు, దేవుని యెడల భయభక్తులు కలిగినవారై పరిపూర్ణులైన వారిమధ్య జ్ఞానమును బోధించారు. **(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2 : 6 - 16)**

ఒకానొక సందర్భములో ప్రారంభ శతాబ్దపు క్రైస్తవులు - 'భూమిని తలక్రిందులు చేయువారిగా' పిలువబడ్డారు. **(అపొ. కార్య. 17 : 1 - 6)**

కనుక, మహోన్నతుని విద్యను నేర్చుకుంటే ఆత్మ రక్షింపబడి నిత్యజీవమును సంపాదించుకుంటారు. **(సంఖ్యాకాండము 24 : 16)**

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 23. సినిమా / టి.వి. / మొబైల్ / ఇంటర్‌నెట్ / మీడియా

ఎలక్ట్రానిక్ విప్లవంలో భాగంగా, ఈ రోజు మన మధ్య కనిపిస్తున్న రంగు రంగుల మీడియా మనిషిని నేటి కాలములో ఎంతగానో ఆకర్షించింది. వీటిద్వారా 'మంచి' కంటె 'చెడే' ఎక్కువగా ప్రబలుతోంది అనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే వీటి విషయములో జీవించే కళను కలిగినవారు ఎటువంటి విధానమును అనుసరించాలో చూద్దాం.

దేవుని వాక్యమును నేర్చుకొనుటకు, దానిని పరిశోధించుటకు, ఆ వాక్యమును ప్రకటించుటకు నేడున్న ఎలక్ట్రానిక్ సాంకేతిక పరిజ్ఞానము ఉపయోగపడితే అది మంచిదే. అయితే, అది మనిషిని ప్రక్కదారి పట్టించకూడదు. దాని వలన మనిషి వినాశపు అంచుకు వెళ్లిపోకూడదు.

బుల్లితెర, వెండితెర, చరవాణి, ఇంటర్‌నెట్, ఎలక్ట్రానిక్ మీడియాలో చాలా వరకు అశ్లీలత, అసాంఘికత, దుష్టత్వం చోటుచేసుకుంది. కనుక, వాటికి ఎంత దూరముగా ఉంటే అంత మంచిది. వాటిని దేవుని పనిలో ఉపయోగించదలిచితే, వాటికి బానిసలైపోకుండా ఎంతవరకు వినియోగమో అంతవరకే వినియోగించి వెంటనే వాటిని ప్రక్కన పెట్టాలి. లేదంటే, ఈ లోకమందున్న మనుష్యులు 24 గంటలూ వాటి మత్తులో మనలను ముంచి, మన వలన లాభమును సంపాదించుకొనుటకు వాటిని మనకు అలవాటు చేస్తారు. గనుక, వీటి విషయములో ముఖ్యముగా యువత చాలా జాగ్రత్తలను పాటించాలి. లేదంటే, జీవించే కళను కోల్పోయి మిమ్మును మీరే పాడుచుకునే పరిస్థితి తప్పక వస్తుంది.

మాటచేత గాని, క్రియచేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరిట చేయుడనే వాక్యమును ఎల్లప్పుడూ మీ జ్ఞాపకములలో ఉంచుకోవాలని జీవించే కళ తెలియజేయుచున్నది. **(కొలస్సయులకు 3 : 17) / (ఎఫెసీయులకు 5 : 20)**

# 24. పుట్టిన రోజు / పెళ్లి రోజు / విందు

ఈ విషయమును గూర్చి చర్చింప మొదలుపెట్టే ముందు ఒక్కమాట! **ఈ లోకపు నటన గతించుచున్నది. (కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7 : 31)**అతి త్వరలో మనము ప్రభువు సన్నిధికి వెళ్లవలెనన్న ఉద్దేశ్యముతో ఉంటే, వేడుకలకు మనము ప్రాధాన్యతను ఇవ్వము. అయితే, లోకమందు మనుష్యుల మధ్య జీవించుచున్న మనము వారందరినీ రక్షింపవలెనన్న ఉద్దేశ్యముతో జీవిస్తున్నాము గనుక, ఇలాంటి వేడుకల విషయములో సరైన జ్ఞానమును కలిగి ప్రవర్తించాలి. ఎందులోనూ అతిగా ఉండకూడదు. కుటుంబములో ఏదైనా వేడుక జరిగితే, అందులో ఏ విధముగా క్రీస్తు సువార్తను ప్రకటించగలనన్న ఆలోచన మనకుండాలి.

ఏదైనా వివాహ వేడుకను ఖచ్చితముగా జరుపవలెననుకుంటే, కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించవలెను. అవేవనగా, అతి ఖర్చు, ఆడంబరాలు, వృధా ఖర్చులను సాధ్యమైనంతవరకు నిర్మూలించాలి. ఆ వేడుకలో పేదలకు పట్టెడన్నం పెట్టడానికి యత్నించాలి. నిరాడంబరముగా కార్యక్రమమును జరిపించాలి.

పుట్టిన రోజు, పెళ్లి రోజు, రజస్వల వేడుక, పెళ్లైన కొన్నేళ్లకు వృద్ధ దంపతులకు వేడుకలు, చనిపోయిన వారికి సంవత్సరీకము, ఉద్యోగ విరమణ వేడుక... ఇవన్నీ వాక్య విరుద్ధమైన కార్యక్రమాలు. ఎందుకంటే, వీటి వలన మనుష్యులు శారీరకముగా ఆనందించగలరే తప్ప వారి ఆత్మలకు ఎటువంటి ప్రయోజనము ఉండదు. దేవుడు వీటిని తన వాక్యములో ఖండించాడు. బైబిల్‌లో భక్తులైనవారెవ్వరూ ఇట్టి వేడుకలను ఆచరించినట్టుగా, వాటికి ప్రాధాన్యతనిచ్చినట్టుగా కనిపించదు. కనుక, ఎవరో చేస్తున్నారని మీరు కూడా వాటిని చేసి మీ కన్న తండ్రియైన దేవుని బాధకు కారకులవ్వకూడదు.

మన ముందు మన కొరకు ఎదురు చూచుచున్నది ఒకే ఒక్క వేడుక! అదే మన ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడ. ఆయన సంఘమనే వధువును ఎదుర్కొనుటకు వేవేల కొలది పరిశుద్ధ దూతల సమూహముతో త్వరలో రాబోవుచున్నాడు. ఆ వేడుకను ఎదుర్కొనుటకు ఒక పవిత్రమైన కన్యకవలె సిద్ధపడండి. నిత్యజీవార్ధమైన ఆ వేడుకలో పాలిభాగస్తులవ్వండి. ఏ వేడుకనైనా జరుపుకోవడానికి ముందు ఒక్క క్షణం ఆగి ఆలోచించి, ఆ వేడుకకు అయ్యే ఖర్చుతో క్రీస్తు సువార్త ప్రకటనను చేసి పరలోకమందు మీ ధనమును వృద్ధి చేసుకోండి. ఇదే వేడుకలను గూర్చిన జీవించే కళ.

# 25. దేశ సేవ / ప్రజా సేవ

చాలా మందికి తెలియని ఒకానొక చిక్కు ప్రశ్న ఏమిటంటే, దేవుని కొరకు బ్రతుకుచున్నవారు దేశ సేవ చెయ్యవచ్చా? వారు ప్రజాసేవ చేయవచ్చా? దీనికి ఈ సందర్భములో వివరణను పరిశీలించండి.

♦ ఈ భూమిపై మనుష్యులను పరిపాలించడానికి దేవుడు ఎన్నుకునే మనుష్యులు 'అత్యల్పులు' **(దానియేలు 4 : 17)**

♦ ఈ భూమియందున్న సింహాసనములుగాని, ప్రభుత్వములుగాని, ప్రధానులుగాని, అధికారముగాని, సర్వము క్రీస్తుయేసు ద్వారాను ఆయననుబట్టియు సృష్టింపబడ్డాయి. **(కొలస్సయులకు 1 : 16)**

♦ పరలోకమందు ఆయన సన్నిధిలో అధికారమును, సింహాసనమును పొందు వారు అత్యున్నతులు **(మత్తయి సువార్త 19 : 28) (ప్రకటన 3 : 21)**

కనుక, లోక సంబంధమైన ఒక చిన్న రాజ్యము/దేశమునకు మీరు సేవ చేస్తారో, పరలోక సంబంధమైన నాశనము లేని రాజ్యము కొరకు మీరు సేవ చేస్తారో నిర్ణయించుకోవాలి. జీవించే కళ కలిగినవారైతే, వారు నిరంతరము నివసించు నిమిత్తము పరలోక సంబంధమైన రాజ్యము కొరకే సేవ చేస్తారు.

అయితే కొందరు, ఈ దేశము కొరకు సేవ చేయకపోతే శత్రు దేశాలు మనలను ముట్టడి వేస్తాయి కదా అనుకోవచ్చు. అలాగే, ప్రజా సేవ చేయకపోతే దొంగలు రాజ్యమేలుతారు కదా అనుకోవచ్చు. ఒక దేశములో నివసిస్తున్న ప్రజలందరూ దేవుని పరలోకము నిమిత్తము బ్రతికితే ఆ దేశము మీదికొచ్చే శత్రువెవడు? దేవుని మహా సైన్యమైన దేవదూతల పహారా ఆ దేశము చుట్టూ ఉంటుంది. కానీ, అంతటి అవకాశం ఏ దేశమైనా దేవునికి ఇస్తుందా? ఇచ్చి చూడండి. శత్రువొస్తే ముందు నన్నడగండి! ఏ శత్రువూ సరిహద్దు దాటడానికి వీలులేదు. అయితే, ప్రజలంతా నిత్యజీవ పరిశోధనలో ఉండాలి. ప్రజా సేవ విషయములో కూడా అంతే. ప్రజలంతా దేవుని మార్గములో నడిస్తే వారికి దేవుడే అధినాయకుడౌతాడు. వారికి శారీరక సంబంధమైన ప్రతి అవసరత ఆయన తీరుస్తాడు. కానీ, దేవునికి అంతటి భయభక్తులను చూపి అవకాశమునిచ్చిన ప్రజానీకమేది? ఇవన్నీ జరగని పరిస్థితులు. కనుక, జీవించే కళ తెలిసినవారైతే సమయమును పోనియ్యక, ప్రభువు సేవలోనికి రండి. మీ మట్టుకు మీరైనా రక్షింపబడతారు.

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 26. ప్రభుత్వముతో ప్రవర్తన

ఈ భూజీవితకాలములో మనము జీవించే కళను కలిగియుండాలి; ప్రభువు నిమిత్తము మనపైయున్న అధికారులకు లోబడియుండాలి.

- ప్రభువైన క్రీస్తు కూడా కైసరుకు 'పన్ను' చెల్లించాడు. **(మత్తయి సువార్త 22 : 15 - 22)**

- ప్రతివాడును తన పై అధికారులకు లోబడియుండవలెను. అయితే దేవుని వాక్యమును మాత్రము అతిక్రమించకూడదు. మనమేమి చేసినా మన ఆత్మను మనము కాపాడుకోవాలి. **(రోమీయులకు 15 : 1 - 7)**

- ఒకవేళ మన పై అధికారి దేవున్ని ధిక్కరించమని, క్రీస్తును ఎడబాయమని చెబితే వారి మాటను వినక, మరణమునకైనా వెనుకాడకూడదు. ఎందుకంటే, అన్ని పరిస్థితులలో అందరు అధికారులు మంచివారే ఉంటారనుటకు వీలు లేదు. కనుక, దేవుని వాక్యమునకు భంగము వాటిల్లితే దుర్మార్గులైన అధికారుల మాటలను పాటించవలసిన అవసరము లేదు. **(యోహాను సువార్త 19 : 10 - 11)**

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 27. ప్రజలతో ప్రవర్తన

ఈ సందర్భములో యేసుక్రీస్తువారు పలికినట్టుగా - **'మనుష్యులను గూర్చి జాగ్రత్తపడుడి'** అనే వాక్యమును గుర్తు చేసుకోవాలి. మనుష్యులు తోడేళ్లవంటి స్వభావము కలిగినవారు. అటువంటి వారి మధ్య గొఱ్ఱెలవంటి స్వభావము కలిగిన మనము దేవుని వాక్యమును ప్రకటించాలి. ఇది చాలా యుక్తితో కూడిన పని. అందుకే ఆయన తన శిష్యులకు ఇచ్చిన సలహా ఏమిటంటే, మీరు పాములవలె వివేకులు, పావురములవలె నిష్కపటులునై యుండాలి.
**(మత్తయి సువార్త 10 : 16, 17)**

♦ అందరికీ అన్ని విధములవారమై యుండాలి. అలాగని పాపము చేయకూడదు.
**(కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9 : 19 - 23)**

♦ పాపిని ప్రేమించాలి; పాపమును ద్వేషించాలి. క్రీస్తు యేసు పాపులను రక్షించుట కొరకే ఈ లోకానికి వచ్చాడు.
**(తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 1 : 15)**

♦ సహోదరులను ప్రేమించుటలోనే దేవుని ప్రేమ ఇమిడియున్నది.
**(యోహాను వ్రాసిన మొదటి పత్రిక 2 : 9 - 11 / 3 : 13 - 16 / 4 : 20, 21)**

♦ సాధ్యమైనంత వరకు సమస్త మనుష్యులతో సమాధానముగాను, పరిశుద్ధముగాను ఉండుటకు ప్రయత్నించాలి.
**(రోమీయులకు 12 : 18) (హెబ్రీయులకు 12 : 14)**

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 28. ప్రకృతితో ప్రవర్తన

మన చుట్టూ మనలను ఆవరించియున్న ప్రకృతి అంతా దేవదూతల సమూహము. అవన్నీ దేవుని ఆజ్ఞానుసారం మానవాళికి లోబడి సేవ చేస్తున్నాయి. అవి జీవులైనా, పదార్థాలైనా, వాయువులైనా, అగ్ని జ్వాలలైనా అన్నీ దేవదూతలే. వివిధ స్వరూపాలలో ఉన్న వీటి విషయమై మనుష్యులంతా అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే జీవించే కళ సాధ్యమవుతుంది.

ప్రకృతిలోని దేవదూతలన్నీ మనకు సేవ చేస్తున్నాయి కదా అని వాటిని మనము ఆరాధించకూడదు. అవి ఆరాధనకు పాత్రులు కావు. అవి దేవుని కుమారులకు సేవలందించే దూతలు మాత్రమే. ఈ వ్యత్యాసమును మరిచి, దేవుని నెరుగని అనేకమంది మనుష్యులు తమ చుట్టూ ఉన్న ప్రకృతిని పూజిస్తున్నారు. ఇది భయంకరమైన తప్పు. ప్రకృతిని నాశనమవ్వకుండా కాపాడాలి; అంతే తప్ప దానిని పూజించకూడదు. అది మనలను నిత్యజీవములోనికి నడిపించదు. **(హెబ్రీయులకు 1 : 1 - 14)**

ప్రకృతి నీతిమంతులైన దేవుని కుమారులకు మాత్రమే సేవ చేయాలన్న ఆశ కలిగియున్నను, కేవలం దేవుని మాటనుబట్టి మానవులందరికీ (వారు నీతిమంతులైనా, అనీతిమంతులైనా) సేవ చేయుచున్నది.
**(రోమీయులకు 8 : 19 - 22) (మత్తయి సువార్త 5 : 45)**

ప్రభువు రెండవ రాకడలో ప్రస్తుతమందున్న భూమ్యాకాశములు గతించిపోతాయి. లయమైపోవుటకు ఇవి సిద్ధముగా ఉన్నాయి గనుక వీటియందు మక్కువ మాని, పరసంబంధమైన క్రొత్త భూమి, క్రొత్త ఆకాశము కొరకు కనిపెట్టువారే నిజమైన జీవించే కళను కలిగినవారు. **(పేతురు వ్రాసిన మొదటి పత్రిక 3 : 10 - 13)**

- **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

# 29. అదృశ్యమైన వాటిని పరిశీలించుట

గాలి కనిపించదు; కానీ ఉనికిలో ఉంది; అది మనకు ప్రాణ వాయువు. మానవ నేత్రాలకు కనిపించే వాటిని మాత్రమే నమ్మితే మోసపోయినట్టే. జీవించే కళను కలిగినవారైతే వారి కంటికి కనిపించే వాటినే కాక కనిపించని వాటిని కూడా దేవుని వాక్యమును బట్టి విశ్వసిస్తారు. **(హెబ్రీయులకు 11 : 1 - 3)**

♦ ఎందుకంటే, కనిపించేవన్నీ నిత్యమైనవి కాదు. కంటికి కనిపించకపోయినా, దేవుని వాక్యమందు కనిపించేవన్నీ నిత్యమైనవి. వాటిని దేవుని వాక్యములో నిదానించి చూచువాడే జీవించే కళ కలిగినవాడు.
**(కొరింథీయులకు రెండవ పత్రిక 4 : 16 - 18)**

♦ దేవుని లక్షణములైన నిత్యశక్తి, దేవత్వము కూడా అదృశ్యమైనవే. వాటిని తలలో ఉన్న కన్నులతో చూచినవానికే ఆయన ప్రత్యక్షమవుతాడు. **(రోమీయులకు 1 : 20)**

మన ఆత్మ అదృశ్యడు - నమ్ముతున్నాము

దేవుడు అదృశ్యడు - నమ్ముతున్నాము

పరిశుద్ధాత్మ అదృశ్యుడు - నమ్ముతున్నాము

దేవదూతలు అదృశ్యము - నమ్ముతున్నాము

లోకములు అదృశ్యము - నమ్ముతున్నాము

ఈ నమ్మిక అంతా కేవలం దేవుని వాక్యమున్నది గనుక సాధ్యమైనది. ఆ దేవుని వాక్యమే మన ప్రభువైన యేసుక్రీస్తు.

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

## 30. ఓర్పు / నిరీక్షణ

ఓర్పు మానవ విశ్వాస జీవితానికి ఎంతో అవసరమైనది. ఇక్కడ నీతి నిమిత్తము ఎంత ఓర్పును కలిగి ఉంటే అంత మంచి బహుమానము మన కొరకు ఎదురు చూస్తుంది. ఓర్పు నశించిననాడు అప్పటి వరకు మనము దేవుని కొరకు పడిన కష్టమంతా వృధా అయిపోతుంది. ఓర్పు వెంబడి నిరీక్షణ వస్తుంది. మనలో ఓర్పు పెరిగిన కొద్దీ నిరీక్షణ కూడా బలపడుతుంది. **(రోమీయులకు 5 : 3)**

♦ అబ్రాహాము ఎంత ఓర్పు కలిగినవాడో చూడండి. అందుకే దేవుని వాగ్దాన ఫలమును పొందాడు. **(హెబ్రీయులకు 6 : 11 - 15)**

♦ ఓర్పు విషయములో ప్రభువైన యేసుక్రీస్తు మనకు మాదిరి. **(హెబ్రీయులకు 12 : 1 - 13)**

♦ మనము ఓర్పు కలిగినవారమైతేనే మన ప్రాణములను దక్కించుకుంటాము. **(లూకా సువార్త 21 : 19)**

♦ నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము. (వెంటాడుము) **(తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 6 : 11)**

♦ దేవుని యందలి ప్రేమయు, క్రీస్తు చూపిన ఓర్పును మీకు కలుగునట్లు ప్రభువు మీ హృదయములను ప్రేరేపించునుగాక. **(థెస్సలోనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక 3 : 5)**

♦ **పైన పేర్కొనబడిన పూర్తి వాక్యభాగములను పరిశుద్ధ గ్రంథమును తెరిచి ఇప్పుడే తప్పక చదవండి.**

11/03/2016 Eenaadu Paper

# సంస్కృతి ఉత్సవానికి సన్నాహాలు పూర్తి



గురువారం దిల్లీలో ప్రపంచ సంస్కృతి ఉత్సవాల ప్రాంగణాన్ని తిలకించేందుకు వచ్చిన జనం

- నేటి నుంచి మూడు రోజులపాటు వేడుకలు
- భారీ ఏర్పాట్లు చేసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్
- జైలుకైనా వెళ్తా... జరిమానా కట్టను: శ్రీశ్రీ రవిశంకర్
- పిటిషన్ స్వీకారానికి సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ

'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు దిల్లీలో జరిగే 'ప్రపంచ సంస్కృతి ఉత్సవాని'కి శరవేగంగా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి 37 వేల మంది కళాకారులు తమ ప్రతిభను ఇక్కడ ప్రదర్శించనున్నారు. వివిధ దేశాధినేతలతో సహా సుమారు 190 దేశాల నుంచి 35 లక్షల మంది ప్రతినిధులు హాజరయ్యే ఈ భారీ వేడుకలో ఎలాంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా చూడడానికి నిర్వాహకులు ప్రాధాన్యమిస్తున్నారు. ఉగ్రవాద దాడుల ముప్పు పొంచి ఉండడంతో పోలీసులూ పెద్దఎత్తున రంగంలో దిగారు. యోగా, ధ్యానం, సంప్రదాయ నృత్యాలు వంటివి అనేకం చోటు చేసుకునే ఈ వేడుక కోసం తీర్చిదిద్దిన ప్రధాన వేదికను చూస్తే ఇది ఎంత పండుగో ఇట్టే అర్థమయిపోతుంది. యమునా నది వరదనీరు ప్రవహించే ప్రదేశంలో ఇంత పెద్ద ఉత్సవాన్ని నిర్వహిస్తున్నందుకు రూ.5 కోట్లు జరిమానా చెల్లించాలని 'జాతీయ హరిత ట్రైబ్యునల్' (ఎన్.జి.టి.) ఆదేశాలిచ్చినా ఒక్కపైసా కూడా చెల్లించేది లేదని ఎ.ఒ.ఎల్. వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ విస్పష్టంగా ప్రకటించారు. అవసరమైతే జైలుకైనా వెళ్తానే గానీ ఆ మొత్తాన్ని మాత్రం చెల్లించేది లేదని చెప్పారు. ఇంకోపక్క ఈ ఉత్సవం జరగకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. పనులన్నీ ముగిశాక ఈ తరుణంలో తమ గడప తొక్కడమంటే అది ప్రచారం కోసమేనా (మిగతా 2లో)

11/03/2016 Eenaadu Paper

## సంస్కృతి ఉత్సవానికి సన్నాహాలు పూర్తి

(మొదటి పేజీ తరువాయి) అని నిలదీసింది.

ప్రపంచంలోనే భారీ వేదిక!.. సంస్కృతి ఉత్సవాల కోసం వినియోగిస్తున్న వెయ్యి ఎకరాల స్థలంలో ఏడెకరాల్లో తీర్చిదిద్దిన వేదిక ప్రపంచంలోనే భారీది అవుతుందని భావిస్తున్నారు. ఈ వేదిక పొడవు 1200 అడుగులు. వెడల్పు 200 అడుగులు. ఎత్తు 40 అడుగులు. ఈ అతిపెద్ద వేడుకకు రమారమి 8 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థల పరిశీలన అనంతరం ఎక్కడెక్కడ లోపాలున్నాయో గుర్తిస్తూ దిల్లీ పోలీసులు ఒక స్థాయీ నివేదిక రూపొందించారు. వాహనాలను నియంత్రించే ప్రణాళికను ఖరారు చేశారు. ఏయే మార్గాల్లో వస్తే సులభంగా ఉంటుందో, ఎక్కడ రద్దీ నెలకొనవచ్చో ప్రకటించారు. 24 గంటలూ బందోబస్తు చూడడానికి ప్రత్యేకంగా నియంత్రణ కార్యాలయాన్ని అక్కడే నెలకొల్పారు. నోయిడా అనుసంధాన రహదారి, లేదా మయూర్‌విహార్ వైపు నుంచి వచ్చే ప్రజల కోసం భారత సైన్యం.. నీటిపై తేలే మూడు వంతెనల్ని సిద్ధం చేసింది. అతిథులకు స్వాగతం చెప్పడానికి ఘనమైన ఏర్పాట్లు చేశారు.


**ఎన్.జి.టి.నే ఆశ్రయించండి..** అనుమతులు పొందకుండానే ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని భారతీయ కిసాన్ మజ్దూర్ సమితి అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్.ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. చాలారోజులుగా ఏర్పాట్లు జరుగుతుంటే ఈ చివరి క్షణంలో తమవద్దకు రావడంలో ఔచిత్యాన్ని ప్రశ్నించింది. ఎన్‌జీటీనే ఆశ్రయించాలని సూచించింది. కార్యక్రమానికి ఆహ్వానితుల్లో ఒకరైన జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే తాను హాజరు కావడం లేదని ప్రకటించారు.

**మేం తప్పేమీ చేయలేదు: ఎ.ఒ.ఎల్..** యమునా తీరంలో ఉత్సవాన్ని నిర్వహించడంలో తాము ఎలాంటి తప్పులు చేయలేదని ఎ.ఒ.ఎల్. సంస్థ స్పష్టం చేసింది. 'మేం ఇంతవరకు నిష్కళంకులుగా ఉన్నాం. ఇకపైనా అలాగే ఉంటాం. కారాగారానికి వెళ్తామే గానీ ఒక్క పైసా జరిమానా కూడా కట్టం' అని శ్రీశ్రీ రవిశంకర్ తేల్చి చెప్పారు. యమునా తీరంలో ఒక్క చెట్టునూ తాము కూల్చలేదనీ, కొన్ని కొమ్మల్ని కత్తిరించామనీ తెలిపారు. తీరంలో భూమిని చదును చేసే పని మాత్రమే తాము చేశామని గురువారం ఆయన వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము చేపట్టిన కార్యక్రమం సాంస్కృతిక ఒలింపిక్స్ వంటివని చెప్పారు.

ఎన్.జి.టి.లో తొలుత పిటిషన్ దాఖలు చేసిన పర్యావరణవేత్త మనోజ్ మిశ్ర గురువారం మరోసారి ధర్మాసనాన్ని ఆశ్రయించి, ఎ.ఒ.ఎల్. ఇప్పటికీ అనుమతులు తీసుకోలేదని చెప్పారు. జరిమానా చెల్లించేది లేదంటూ ఆ సంస్థ చెబుతోందనీ జస్టిస్ స్వతంత్రకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. జరిమానా చెల్లించడానికి శుక్రవారం వరకు గడువు ఉందనీ, లేని పక్షంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని న్యాయమూర్తి అన్నారు. మరోవైపు దిల్లీలో శుక్రవారం దాదాపు 20,000 వివాహాలు జరుగుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

12/03/2016 Eenaadu Paper

# గర్వకారణం మన వారసత్వం



- మనల్ని మనం కించపరుచుకుంటే ప్రపంచం మన వైపు చూస్తుందా?
- విశ్వాన్ని మానవ విలువలతో జోడిద్దాం
- జీవించే కళ దేశ సంస్కృతిలో భాగం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- ఇది కళాకారుల కుంభమేళా అని ప్రశంస



ప్రపంచ సంస్కృతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్, ప్రధాని మోదీ ★ వేడుకలో భాగంగా నృత్య ప్రదర్శన

ఈనాడు - దిల్లీ

'మనం మన సుసంపన్నమైన వారసత్వాన్ని చూసి గర్వించాలి. దాన్ని అభిమానించాలి. అప్పుడే మనం అనుకున్న కార్యం చేయగలం. మనల్ని మనం కించపరుచుకుంటే.. మన పనులను మనం చెడుగా చూపుతూ వెళ్తే ప్రపంచం మనవైపు ఎందుకు చూస్తుంది? జీవించే కళ మనకు అందిన వారసత్వం. ఇది మన సంస్కృతిలో భాగం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దిల్లీలోని యమునా నది తీరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవిశంకర్ నిర్వహించిన ప్రపంచ సాంస్కృతిక ఉత్సవం తొలిరోజు సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. వైవిధ్యాలతో నిండిన ఈ దేశానికి ప్రపంచానికి ఏదైనా ఇవ్వగలిగే శక్తిసామర్థ్యాలున్నట్లు చెప్పారు. సాంస్కృతిక ఉత్సవాన్ని ఆయన కళాకారుల కుంభమేళాగా అభివర్ణించారు. 'వేదికపై ఆసీనులైన ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వచ్చిన మహానుభావులకు, దేశంతోపాటు ప్రపంచ నలుమూలల నుంచి వచ్చి ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్న మహనీయులందరికీ ఈ భారత భూమి తరఫున హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నా. ఈ దేశం ఎన్నో వైవిధ్యాలతో నిండి (మిగతా 6లో)

# గర్వకారణం మన వారసత్వం


12/03/2016 Eenaadu Paper

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. ప్రపంచానికి ఇవ్వడానికి భారత్ వద్ద లేనిదే లేదు. ప్రపంచం కేవలం ఆర్థిక సంబంధాలతో ముడిపడి లేదు. ఈ ప్రపంచాన్ని మానవ విలువలతో కూడా అనుసంధానించవచ్చు అలా జోడించాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది. మనకు ఎంతో సమున్నతమైన సాంస్కృతిక వారసత్వం ఉంది. ప్రపంచానికి దీని అవసరం ఎంతో ఉంది. అందువల్ల ఎంతో కొంత, ఏదో ఒక రూపంలో ఈ సమున్నత వారసత్వాన్ని ప్రపంచానికి అందించినప్పుడే మన పనిని పరిపూర్ణం చేయగలుగుతాం. మనం మన సుసంపన్నమైన వారసత్వాన్ని చూసి గర్వించినప్పుడు, దాన్ని అభిమానించినప్పుడే మనం అనుకున్న కార్యం చేయగలం. మనల్ని మనం కించపరుచుకుంటే.. మన పనులను మనం చెడుగా చూపుతూ వెళ్తే ప్రపంచం మనవైపు ఎందుకు చూస్తుంది? 35 ఏళ్ల క్రితం చిన్నగా మొదలుపెట్టి, భారత్ ఘనమైన సాంస్కృతిక వారసత్వం ఆధారంగా 155 దేశాల ప్రతినిధులతో ఇంతపెద్ద కార్యక్రమాన్ని నిర్వహించినందుకు రవిశంకర్‌ను అభినందిస్తున్నా. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా ప్రపంచంలో భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు తేవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడింది. నేను మంగోలియా వెళ్లినప్పుడు అక్కడ ఒక స్టేడియంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ బంధువులు నాకు స్వాగత సభ ఏర్పాటు చేయడం చూసి ఆశ్చర్యపోయా. అందులో భారతీయులు తక్కువే. స్టేడియం మొత్తం మంగోలియన్లతో నిండిపోయింది. వాళ్లు భారతీయ త్రివర్ణపతాకాన్ని చేతబట్టి మన సంస్కృతిని చాటారు. అది నాకు ఎంతో ప్రేరణ ఇచ్చింది. రాజశక్తి వెళ్లలేని చోట కూడా అంతర్జాతీయ సంబంధాలపై ఆలోచనా శక్తి ఎంతో ప్రభావం చూపుతుంది. ఈరోజు నాకిక్కడ కళాకారుల కుంభమేళా కనిపిస్తోంది. భారత్‌వద్ద సమృద్ధమైన కళాసంపద ఉంది. ఈ భూమిలో ప్రతి సమయానికి ఓ ప్రత్యేక సంగీతం ఉంటుంది. ఉదయ, సాయంత్రాల్లో ప్రత్యేక సంగీతాలు వినిపిస్తాయి. బజారులో సంగీత్ ప్రపంచాన్ని వెతకడానికి వెళ్తే.. మనుషులను ఊపే సంగీతం అంతటా కనిపిస్తుంది. కానీ మనసులను ఓలలాడించే సంగీతం మాత్రం భారత్‌లోనే దొరుకుతుంది. ఈ రోజు జరిగిన సంగీత కార్యక్రమాల ద్వారా ప్రపంచ మనసులను ఓలలాడించింది. ఏదేశాన్నయినా కళల ఆధారంగా చూస్తే.. దాని అంతర్‌శక్తిని కూడా గుర్తిస్తారు. నేడు ప్రపంచం భారతీయుల కళాకారులను, శతాబ్దాలుగా వారు చేస్తున్న సాధనను గుర్తించింది. ఈ కార్యక్రమ ప్రారంభ సమయంలో ప్రకృతి కొంత ఇబ్బంది పెట్టింది. ఇది కూడా ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్. సౌకర్యవంతంగా, సరళంగా జీవించవచ్చు దానికి ఇబ్బందులేమీ ఉండవు. కానీ మన బాధ్యతలను తలకెత్తుకొని ముందుకెళ్లేటప్పుడు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కావాలి. మన కలలను సాకారం చేసుకోవడానికి ముందుకెళ్తున్నప్పుడు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కావాలి. కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నప్పుడు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కావాలి. మన కోసం కాకుండా పరుల కోసం జీవించేటప్పుడు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కావాలి. అహం బ్రహ్మాస్మితో మొదలుపెట్టి వసుధైక కుటుంబకంతో యాత్రను పూర్తిచేయడమే ఆర్ట్ ఆఫ్ లివింగ్. మనవాళ్లు ఉపనిషత్‌ల నుంచి ఉపగ్రహ యాత్రవరకు వెళ్లారు. ఈ 'జీవించే కళను మనకు మునులు, రుషులు, జ్ఞానులు నేర్పారు. కష్టాల్లో కొట్టుమిట్టాడే మనుషులు, వ్యక్తిగత సమస్యలతో సతమతమయ్యే వ్యక్తులు వాటి నుంచి బయటపడే కళను ఎప్పటి నుంచో నేర్చుకున్నారు. ఇది శతాబ్దాలుగా మన సంస్కృతిలో భాగంగా ఉంది. ఈ కళలో ఏవైనా లోపాలుంటే వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది' అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమం ద్వారా ప్రపంచం ముందు భారత్ శక్తిని చాటిన రవిశంకర్‌కు ప్రధానమంత్రి మోదీ అభినందనలు తెలిపారు. ప్రధాని ప్రసంగానికి ఉపక్రమించినప్పుడు సభాంగణమంతా మోదీమోదీ అంటూ మారుమోగింది. ప్రధాని ఈ సమావేశానికి కేవలం అతిథిగా వచ్చి వెళ్లలేదు. సభ ప్రారంభమైన వెంటనే ప్రసంగించి వెళ్లిపోయే సంస్కృతిని చాటలేదు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటలవరకు అందరితోపాటే కూర్చొని ప్రపంచ కళలను ఆస్వాదించారు. మనసుకు నచ్చిన సంగీతం వినిపించినప్పుడు లయబద్ధంగా చేతులు కదిపారు. అందరి ఆట, పాటలను చూసిన తర్వాతే తిరిగి వెళ్లారు.



సంస్కృతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో శ్రీశ్రీ రవిశంకర్



శనివారం దిల్లీలో ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల్లో కళా ప్రదర్శన. అంతర చిత్రంలో శ్రీశ్రీ రవిశంకర్, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
13/03/2016 Eenaadu Paper

## స్పందించే హృదయమే దేవుని నిలయం

2లో

- మానవ విలువల పెంపే అన్ని ధర్మాల సారాంశం
- వైరుధ్యాలను పక్కన పెట్టాలి
- దురభిప్రాయాలు లేని ప్రపంచం కావాలి
- అందరి సంతోషమే ఈ ఉత్సవ నినాదం
- శ్రీశ్రీ రవిశంకర్ శాంతి సందేశం

# స్పందించే హృదయమే దేవుని నిలయం

13/03/2016 Eenaadu Paper

ఈనాడు – దిల్లీ

'దేవుడు ఎక్కడో లేడు. స్పందించే హృదయాల్లోనే ఉన్నాడు. వారి నుంచే ఉబికి వస్తాడు. ప్రతి ఒక్కరూ అంతరాత్మలోకి తొంగిచూసుకుంటే ఆనందతాండవం కనిపిస్తుంది. తద్వారా శాంతి నినాదం వినిపిస్తుంది' అని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవిశంకర్ అన్నారు. దిల్లీలోని యమునా నది తీరంలో జరుగుతున్న ప్రపంచ సాంస్కృతిక ఉత్సవంలో రెండో రోజైన శనివారం ఆయన దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రజలు, ప్రతినిధులకు శాంతి సందేశం వినిపించారు. 'అన్ని మతాలు, అన్ని దేశాల నుంచి వచ్చిన వారంతా ఒక్క కుటుంబమే. మనిషి నిరంతరం ఎదుగుతూపోవాలి. ప్రాంతం నుంచి దేశానికి, దేశం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి. విభిన్న దేశాలు, మతాలు, భాషలను అనుసరించే వేలమంది ప్రపంచానికి ప్రేమ, సంతోషాన్ని పంచడానికి ఇక్కడికొచ్చారు. మతాల మధ్య విద్వేషాలు పెరిగితే మనుషులకు సుఖశాంతులు దూరమవుతాయి. అందుకే అందరూ సంతోషంగా ఉండాలన్న నినాదం ఇవ్వడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఈ భావన ప్రతి హృదయంలో ఉంటుంది. కాకపోతే దాన్ని మరింత గట్టిగా వినిపించాలి. ఇక్కడ మనమంతా కలవడమే ఒక పెద్ద సందేశం. సమాజంలో సానుకూల దృక్పథం తీసుకురావడానికి మనం కట్టుబడి ఉండాలి. వైవిధ్య భావాలున్న వారు ఒక వేదికపైకి వచ్చి వైరుధ్యాలను పక్కనపెట్టి ఒక్క అంశంపై ఒకే అవగాహనకు రావాలి. 161 దేశాల్లో 108 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చూశారు. ప్రపంచ వ్యాప్తంగా 8 కోట్ల మంది ఈ కార్యక్రమాన్ని చూసినట్లు అంచనా వేశాం. ఇప్పుడు నా కుటుంబం 700 కోట్లు. ఎవరైనా నా కుటుంబాన్ని ఆహ్వానించాలనుకుంటే ఇన్ని కోట్ల మందినీ ఆహ్వానించాలి. పాకిస్థాన్, నేపాల్, బూటాన్, సిరియా, లెబనాన్‌లాంటి దేశాల నుంచి ఇక్కడికి ప్రతినిధులు రావడం సంతోషకరం. మనమంతా మానవతా విలువలను పెంపొందించాలి. మానవ విలువలను కాపాడటమే అన్ని ధర్మాల భావన అని చాటాలి. అయిదు అంశాలు ప్రపంచాన్ని కలుపుతాయని చెప్పాను. ఆ అయిదువర్గాలకు చెందినవారు ఇక్కడికొచ్చి వసుధైక కుటుంబక సిద్ధాంతాన్ని గట్టిగా చాటిచెబుతున్నారు. సూఫీసంత్‌లు, పాకిస్థాన్ ఇమామ్, జైన్ గురు, అమెరికా నుంచి చర్చి రెవరెండ్‌లు ఇక్కడికి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వందేళ్లు పైబడిన కేరళ క్రైస్తవ మతగురువు ఇక్కడికి రావడం సంతోషకరం. ఇది ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజల సమాహార సభ. దేవుడు ఆకాశంలో లేడు. మన మధ్యలోనే ఉన్నాడు. స్పందించే హృదయాల నుంచి ఉబికి వస్తాడు. మన అంతరాత్మలోకి తొంగిచూసుకుంటే ఆనంద తాండవం బయటికొస్తుంది. యమున తీరంలో కృష్ణుడు కాళింది నాట్యం చేశాడు. ఆ కాళిందికి మోక్షం కల్పించి యమునను పవిత్రం చేశాడు. ఇప్పుడు సాద్, సంత్‌ల రూపంలో ఆ కాళింది ఇక్కడికొచ్చింది. యమున శుభ్రతను అత్యంత తొందరగా చేస్తాం. పర్యావరణం మా ప్రాణం. శరీరాన్ని శుభ్రం చేసుకున్నప్పుడే మనం ముందుకెళ్లగలుగుతాం. పర్యావరణాన్ని కాపాడుకుంటూ ముందుకెళ్తాం. ప్రజలు కులాలు, మతాలు, లింగాల ఆధారంగా ముందస్తు అభిప్రాయాలను ఏర్పరుచుకోవడమే ఇప్పుడు అత్యంత సమస్య. దురభిప్రాయాలు లేని ప్రపంచం రావాలి' అని అన్నారు.

**ఈ మూడు రోజులూ దిల్లీ విశ్వనగరం..** కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ దిల్లీని మూడు రోజులపాటు విశ్వనగరంగా మార్చిన రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మన దేశ రాజధాని ఈ మూడురోజులు విశ్వనగరంగా మారిపోయింది. ముఫ్తీ, బిషప్, సూఫీసంత్, శంకరాచార్యులంతా ఒకేచోట సమావేశమయ్యారు. ఎవ్వరు ఏ భాషలో మాట్లాడినా ఆ భావన ఒక్కటే. దాని శక్తి ఒక్కటే. భారత్ లౌకిక దేశం. ఇక్కడ అన్ని మతాలూ సమానం. హిందూ మంచి హిందూగా, ముస్లిం మంచి ముస్లింగా, క్రైస్తవుడు మంచి క్రైస్తవుడిగా మెలగడమే మనం ఇచ్చే గౌరవం. ఎవరైనా తమ ఇష్టమైన మతాన్ని ఆచరించవచ్చు. ఇష్టరీతిన ప్రార్థనలు చేస్తూనే పరస్పరం గౌరవించుకోవాలనే లౌకిక సిద్ధాంతాన్ని ఈ సభ చాటింది. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చూసి నేను అనుభూతికి గురయ్యాను తప్పితే ఆశ్చర్యానికి లోనుకాలేదు. ఇలాంటి పెద్ద కార్యక్రమాన్ని శ్రీశ్రీరవిశంకర్ ఏ దేశంలో నిర్వహించాలనుకున్నా ఘనంగా స్వాగతిస్తారు. కానీ ఆయన భారత్‌లో నిర్వహించడం మనకిచ్చిన గౌరవం. గత జూన్ 21న ఐక్యరాజ్య సమితి సమావేశం కోసం న్యూయార్క్‌కు వెళ్లినప్పుడు అక్కడి టైం స్క్వేర్ శ్రీశ్రీరవిశంకర్‌ను ప్రశంసిస్తూ చేసిన జయజయధ్వానాలతో మారుమోగింది. అలాంటి గురుదేవ్ భారత్‌లో జన్మించడం మన అదృష్టం. భారతీయ శక్తిని విశ్వవ్యాప్తంగా చాటే అతిపెద్ద సంగమాన్ని ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు' అని అన్నారు.



ఉత్సవాల్లో వివిధ దేశాల ప్రతినిధుల ఉత్సాహం

**విశాల హృదయమే భారత సంస్కృతి: రాజ్‌నాథ్‌సింగ్..** కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ శాంతి కోసం ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వారందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. 'విశాల హృదయమే భారతీయ సంస్కృతికి ఆధారం. ప్రపంచాన్నంతా కుటుంబ సభ్యులుగా భావించే సంస్కృతి భారత్ సొంతం. ప్రపంచంలోని అన్ని ధర్మాల ప్రతినిధులు భారత్‌కు నమస్కరిస్తారు. ప్రపంచంలో తమను అన్నింటికంటే ఆదరించిన దేశం భారత్ ఒక్కటే అని ఇరాన్‌కు చెందిన పారసీలు చెప్పుకొన్నారు. ఇజ్రాయిలీలు కూడా దేశం ఏర్పడిన తర్వాత రాసుకున్న చరిత్రలోనూ ఇదే చెప్పారు. ప్రపంచంలోని పురాతన చర్చిల్లో ఒకటైన సెయింట్ థామస్ చర్చి కేరళలో ఉంది. ఇంత పెద్ద సాంస్కృతిక ఉత్సవం నిర్వహించడం కంటే పెద్ద పూజ ఇంకోటి ఉండదు'.



సోమవారం 10 ఏప్రిల్ 2017

# ఆ క్షణం.. కన్నీటి చిత్రం!

ఈనాడు తూర్పుగోదావరి



మానేపల్లి పుష్పావతి



మానేపల్లి అంజన్



మానేపల్లి మాన్విత

ఇంకాసేపట్లో ఎంచక్కా సినిమా చూస్తామన్న ఆనందం మాది... ఈ రోజు సాయంత్రం థియేటర్‌కు వెళదామని అమ్మ చెప్పినప్పటి నుంచి ఎంతో సంబరపడి పోయాం... ఎప్పుడెప్పుడు అక్కడికి చేరుకుంటామా.. అని ఆటోలో కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణిస్తున్నాం... అన్నట్టు మీకు చెప్పలేదుగా... మేం ముగ్గురం... మా అమ్మలిద్దరూ సొంత అక్కాచెల్లెళ్లు... అందరం కలసి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాం... ఇప్పుడు ఇదిగో ఇలా షికారుకు బయలు దేరాం... ఇంతలో మధ్యలోనే ఆటో ఆపి... మమ్మల్ని అమ్మలిద్దరూ కాలువ వద్దకు తీసుకురావడం ఎందుకో అర్థం కాలేదు... కాసేపటికి అందరం సుడులు తిరుగుతున్న నీటిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నామని తెలియడంతో మా చిట్టి గుండెలు బిక్కచచ్చిపోయాయి... తేరుకొని ఎందుకమ్మా... మనం చచ్చిపోవాలని గట్టిగా అడగాలనుకున్నాం... మీకు మేమున్నాం కదమ్మా... మీకేం కష్టం రాకుండా చూసుకుంటాం... చెప్పేలోపే అందరం నీటిలో పడిపోయాం...



ఆసుపత్రిలో రోదిస్తున్న నల్లమిల్లి ప్రమీల

**పలివెల వద్ద ఆదివారం సాయంత్రం ఇద్దరు అక్కాచెల్లెళ్లు వారి నలుగురు సంతానంతో అమలాపురం కాలువలోకి దూకి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది.**

-పూర్తి వివరాలు 12లో

# క్షణికావేశం కన్నీరు మిగిల్చింది

ఈనాడు తూర్పుగోదావరి

సోమవారం 10 ఏప్రిల్ 2017

- ముగ్గురు పిల్లలతో సహా అక్కాచెల్లెలి ఆత్మహత్యా యత్నం
- పలివెల లాకుల వద్ద కాలువలోకి దూకిన వైనం
- బాలుడి మృతి, మరో ముగ్గురు గల్లంతు, ఒకరు సురక్షితం
- కొనసాగుతున్న గాలింపు చర్యలు



ప్రమాద సంఘున జరిగిన ప్రాంతం

కొత్తపేట, న్యూస్‌టుడే: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కా చెల్లెల్లు తమ భర్తలతో ఉన్న ఘర్షణ కారణంగా పిల్లలతో సహా కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కొత్తపేట మండలంలో ఆదివారం విషాద ఛాయలు నింపింది. కొత్తపేటకు చెందిన వెత్సా బుచ్చిరాజుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్దకుమార్తె మానేపల్లి పుష్పావతిని విజయవాడలోని రణదీర్‌కి ఇచ్చి గతంలో వివాహం చేశారు. వారికి కుమారుడు అంజన్(12), కుమార్తె మాన్విత(10) ఉన్నారు. చిన్న కుమార్తె నల్లమిల్లి ప్రమీలను రాజమహేంద్రవరానికి చెందిన వెంకటరత్నంకు ఇచ్చి వివాహం చేయగా వారికి కుమార్తె శ్రీగోద(13) ఉంది. రాజమహేంద్రవరానికి చెందిన నల్లమిల్లి ప్రమీల భర్తతో వివాదం కారణంగా నాలుగు నెలలుగా కొత్తపేటలోని పుట్టింటి వద్దే ఉంటోంది. భార్యాభర్తల వివాదంపై కేసు కూడా నడుస్తున్నట్లు సమాచారం. విజయవాడకు చెందిన పుష్పావతి భర్తతో వివాదం నెలకొని తన ఇద్దరు సంతానంతో కలిసి ఆదివారం కొత్తపేటలోని పుట్టింటికి వచ్చినట్లు సమాచారం. దాంతో ఆమె తండ్రి బుచ్చిరాజు పెద్ద అల్లుడు రణధీర్‌తో మాట్లాడేందుకు విజయవాడకు వెళ్లారు. తరువాత ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో అక్కా చెల్లెల్లు ఇద్దరు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. వారితో పాటు చిన్నారులను తీసుకు వెళ్లి అందరూ ఒకేసారి పలివెల లాకుల వద్ద నుంచి అమలాపురం కాలువలోకి దూకారు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించగా ప్రమీల సురక్షితంగా బయటపడింది. అంజన్(12) విగతజీవిగా బయటపడ్డాడు. అయితే పుష్పావతి(32), ఆమె కుమార్తె మాన్విత(10), ప్రమీల కుమార్తె శ్రీగోద(13) ఆచూకీ కోసం కాలువలో గాలిస్తున్నారు. కాలువలోనుంచి సురక్షితంగా బయటపడిన ప్రమీలను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యసేవలు అందించగా ఆమె కోలుకుంది. ప్రమాదానికి కారణాలపై ఆమెను ప్రశ్నించినా ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.



విగత జీవిగా అంజన్(12)



బాధితురాలిని పరామర్శిస్తున్న శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

## సినిమాకి అని చెప్పి..

చిన్నారులను సినిమాకి తీసుకెళ్తాం అంటూ ఆటో ఎక్కించుకుని పలివెల లాకు వద్దకు తీసుకువెళ్లారు. లాకుల సమీపంలో ఆటో దిగి అక్కడి నుంచి చిన్నారులను నడిపించుకుని కాలువ వద్దకు తీసుకుని వెళ్లి అందరూ ఒకేసారి కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడటంతో కొత్తపేటలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రముఖుల పరామర్శలు


ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు కాలువలోకి దూకిన సమాచారం బయటకు పొక్కడంతో కొత్తపేటలో తీవ్ర కలకలం నెలకొంది. కాలువలో నుంచి ప్రాణాలతో బయటపడిన ప్రమీలను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వివరాలు అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించారు. శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ శాసనసభ్యుడు బండారు సత్యానందరావు, తహసీల్దారు శ్రీధర్, సి.ఐ బి.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

# విద్యాకుసుమాల విషాదం

రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం విజయవాడ, విశాఖ పట్నం నగరాల్లోనే చోటుచేసుకుంటున్నాయి.

- **రెండేళ్లలో 693 మంది విద్యార్థుల బలవన్మరణం**
- **మొత్తం ఆత్మహత్యల్లో 5.62 శాతం వారివే**

ఈనాడు – అమరావతి



**ఆం**ధ్రప్రదేశ్‌లో నెలకు సగటున 28 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాతీయ నేర గణాంక సంస్థ నివేదిక ప్రకారం.. గత రెండేళ్లలో మొత్తం 693 మంది ఇలా బలవన్మరణాలకు పాల్పడ్డారు. తీవ్ర ఒత్తిడికి తాళలేక, ర్యాంకుల పరుగుల్లో చతికిలపడి కొందరు, తల్లిదండ్రులు మందలించారని మరికొందరు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో ఇంకొందరు ఇలా బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ధోరణి గత కొంత కాలంగా బాగా పెరుగుతోంది. గత రెండేళ్లలో రాష్ట్రంలో సంభవించిన మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల ఆత్మహత్యలు 5.62శాతంగా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థుల్లో. . ఎక్కువ మంది ఇంటర్ చదువుతున్నవారేనని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. మార్కులు, ర్యాంకుల సాధనలో తోటి విద్యార్థులతో పోలిస్తే తాము వెనుకబడిపోతున్నామన్న భావనతో కుంగిపోవడం వంటి కారణాలు చాలా సందర్భాల్లో ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని మానసిక విశ్లేషకుడు టీ.ఎస్.రావు తెలిపారు. ఇవి కాక ర్యాగింగ్ బారిన

విజయవాడ 10-4-2017 సోమవారం

పడి రిషితేశ్వరి వంటి విద్యార్థినులు ప్రాణాలు తీసుకున్న ఘటనలూ ఉన్నాయి.

## ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు...

- 2014లో రాష్ట్రంలో 333 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడగా 2015లో ఆ సంఖ్య 360కు పెరిగింది. బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలోనూ అబ్బాయిలే ఎక్కువగా ఉంటున్నారు. గత రెండేళ్లలో 363 మంది విద్యార్థులు, 330 మంది విద్యార్థినులు బలవంతంగా తనువు చాలించారు. 2014లో మొత్తం 6,101 మంది ఆత్మహత్య చేసుకోగా...అందులో విద్యార్థుల ఆత్మహత్యలు 5.41 శాతంగా ఉన్నాయి. 2015లో మొత్తం 6,226 మంది ఆత్మహత్య చేసుకుంటే.. వారిలో విద్యార్థుల ఆత్మహత్యల శాతం 5.78గా ఉంది.
- దేశవ్యాప్తంగా చూస్తే 2014లో (మిగతా 2లో)

# విద్యాకుసుమాల విషాదం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 7,753 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. అందులో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు 333 (4.29 శాతంగా) ఉన్నాయి. 2015లో దేశం మొత్తం మీద 8,645 మంది విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకోగా వాటిలో 360 (4.16 శాతం) ఏపీలోనే నమోదయ్యాయి.

## ఆ రెండు నగరాల్లోనే అధికంగా..

రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోనే చోటుచేసుకుంటున్నాయి. 2014, 2015 సంవత్సరాల్లో ఈ రెండు నగరాల్లోనే మొత్తం 73 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల్లో 10.53 శాతం ఆత్మహత్యలు ఈ రెండు నగరాల్లోనే చోటు చేసుకున్నాయి. 2015లో విజయవాడలో 30 మంది, విశాఖలో 23 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడగా.. 2014లో విశాఖపట్నంలో 17 మంది, విజయవాడలో ముగురు విద్యారులు ఆత్మహత్య చేసుకున్నారు. విజయవాడ 10-4-2017

# ఈజిప్ట్‌లో ఐఎస్ ఘాతుకం



- రెండు చర్చిల్లో బాంబు పేలుళ్లు
- 45 మంది మృత్యువాత

కైరో: ఈజిప్ట్‌లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) మారణహోమం సృష్టించింది. క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని రెండు నగరాల్లో శక్తిమంతమైన పేలుళ్లకు పాల్పడి 45 మందిని పొట్టనబెట్టుకుంది. టాంటా, అలెగ్జాండ్రియా నగరాల్లోని చర్చిల్లో జరిగిన ఈ జంట పేలుళ్లలో దాదాపు 120 మంది గాయాలపాలయ్యారు. వారం రోజుల్లో ఈస్టర్ పండుగ రానున్న నేపథ్యంలో. . ఆదివారం ఇక్కడి కాప్టిక్ చర్చిల్లో జరిగిన కార్యక్రమాల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టాంటాలోని సెయింట్ జార్జ్ చర్చిలో ఐఎస్ మొదటి పేలుడుకు పాల్పడింది. ఘటనలో 27 మంది మృతి చెందగా.. 78 మంది గాయపడ్డారు. చర్చి హాల్‌లోని ముందు వరుసల వద్ద ఈ పేలుడు జరిగింది. మృతుల్లో టాంటా కోర్టు అధిపతి శామ్యూల్ జార్జ్ కూడా ఉన్నారు. గుర్తు తెలియన వ్యక్తి చర్చి లోపల బాంబును అమర్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని భద్రత వర్గాలు తెలిపాయి. అయితే ఇది ఆత్మాహుతి దాడేనని వార్తలు వస్తున్నాయి. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల తర్వాత అలెగ్జాండ్రియాలోని సెయింట్ మార్క్స్ చర్చి సమీపంలో ఓ ముష్కరుడు ఆత్మాహుతి బాంబు పేలుడుకు పాల్పడ్డాడు. ఈ దాడిలో 18 మంది ప్రాణాలు కోల్పోగా.. 41 మంది (మిగతా 2లో)

ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో గల చర్చిలో ఆత్మాహుతి దాడి అనంతరం క్షతగాత్రులు, మృతదేహాలను అంబులెన్సులోకి ఎక్కించడానికి సహకరిస్తున్న స్థానికులు

విజయవాడ 10-4-2017 సోమవారం ఈనాడు




ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో గల సెయింట్ మార్క్స్ కాప్టిక్ క్యాథడ్రల్ చర్చి గేటు వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడుతున్న దృశ్యం

2 విజయవాడ ఈనాడు

# ఈజిప్ట్‌లో ఐఎస్ ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

క్షతగాత్రులయ్యారు. అయితే విధ్వంసక పదార్థాలు నడుముకు ధరించిన ముష్కరుడు చర్చి లోపలికి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని భద్రత సిబ్బంది అడ్డుకున్నారని.. అదే సమయంలో పేలుడు జరగడంతో కొంత మంది పోలీసులు మృతి చెందారని ఈజిప్ట్ అంతర్గత మంత్రిత్వశాఖ పేర్కొంది. ఘటన జరిగిన సమయంలో చర్చి లోపల అలెగ్జాండ్రియా పోప్ కూడా ఉన్నారని.. అయితే ఆయనకు ఏ హానీ జరగలేదని తెలిపింది. ఇటు ఈ రెండు పేలుళ్లకూ పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ ప్రకటించుకుంది. మరోవైపు టాంటాలోని ఓ మసీదు సమీపంలో రెండు విధ్వంసక పరికరాలను భద్రత దళాలు నిర్వీర్యం చేశాయి. ఘటనల నేపథ్యంలో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా ఎల్-సీసీ జాతీయ రక్షణ మండలి సమావేశానికి ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, ప్రఖ్యాత కట్టడాలకు రక్షణగా సైన్యాన్ని మోహరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల చివర్లో పోప్ ఫ్రాన్సిస్ ఈజిప్ట్‌లో పర్యటించనున్న నేపథ్యంలో తాజా పేలుళ్లు జరగడం గమనార్హం. 8.5కోట్ల ఈజిప్ట్ జనాభాలో పది శాతం కాప్టిక్ క్రైస్తవులే. వీరిని లక్ష్యంగా చేసుకుని తరచూ ఇస్లామిస్ట్ ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారు. ఇటు తాజా ఐఎస్ దాడులను భారత ప్రధాని నరేంద్ర మోదీ ఖండించారు. ' 'ఈజిప్ట్‌లో జరిగిన పేలుళ్లు ఎంతో బాధ కలిగిస్తున్నాయి. బాధితుల కోసం ప్రార్థిస్తున్నా" అంటూ ట్వీట్ చేశారు.

## మద్యానికి డబ్బులు ఇవ్వలేదని

# భార్యను హతమార్చిన భర్త

సోమవారం 10 ఏప్రిల్ 2017 | 12

ఈనాడు తూర్పుగోదావరి

**మోతుగూడెం, న్యూస్‌టుడే:** మద్యం తాగడానికి డబ్బులివ్వడం లేదని ఓ వ్యక్తి భార్యను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన చింతూరు మండలం మోతుగూడెం మసీదు వీధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. చింతూరు సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై వాడపల్లి కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామల రాజు నిత్యం మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. మద్యం కోసం డబ్బులివ్వకపోతే భార్య గంగమ్మను తరచూ చిత్రహింసలకు గురిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటలకు వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాజు కర్రతో కొట్టిన బలమైన దెబ్బకు తలపై 5 సెంటీమీటర్ల మేర గాయం కావడంతో గంగమ్మ(30) అక్కడికక్కడే మృతిచెందింది. శనివారం ఉదయం ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లి మృతి చెందడం, తండ్రి పరార్ కావడంతో పదేళ్ల రమ్య, ఆరేళ్ల సంతోష్ అనాథలయ్యారు. స్థానిక ఎస్సై వాడపల్లి కిషోర్ ఆధ్వర్యంలో మృతదేహానికి శవపంచనామా జరిపి కేసు నమోదు చేయగా, సీఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హతమైన గంగమ్మ